
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పశ్చిమగోదావరి
16
బుధవారం 2 ఆగస్టు 2017



ముగిసిన టీచర్ల కౌన్సెలింగ్

ఉపాధ్యాయులకు బదిలీ ఇక్కట్లు

■3లో

చైనా వస్తువులను బహిష్కరిద్దాం

మంత్రి మాణిక్యాలరావు

3లో

18 మంది ఎస్ఐల బదిలీ

■7లో

గో వ్యథ

తరలింపులో పట్టని నిబంధనలు



■6లో

అ..క్రమ కట్టడాల సంగతి తేల్చండి

తణుకులో ప్రభుత్వ విచారణ - అధికారులపై చర్యలకు ఆదేశం

ఒకటే వ్యాక్సిన్.. రెండు వ్యాధులు దూరం



పిల్లల్లో వచ్చే తట్టు, రుబెల్లా వ్యాధుల నివారణకు జిల్లా అంతటా మంగళవారం ఎంఆర్ వ్యాక్సిన్లు వేశారు. ఏలూరులో జరిగిన కార్యక్రమంలో మంత్రి పితాని, కలెక్టర్ భాస్కర్ తదితరులు పాల్గొని పిల్లలకు వ్యాక్సిన్ వేయించారు.

గ్యాస్ సబ్సిడీకి పొగ



కేంద్రం కీలక నిర్ణయం.. నెలవారీ బాదుడు - మధ్యతరగతిపై మోతే

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :
ఇప్పటి వరకూ గ్యాస్ కనెక్షన్లపై ఇస్తున్న సబ్సిడీకి కేంద్రం మంగళం పాడింది. గ్యాస్ బుక్ చేసిన ప్రతిసారి నగదు ఖాతాలో పడే బడ్జెట్ కాస్తా ఆవిరైపోయింది. సబ్సిడీని పూర్తిగా ఎత్తివేసే క్రమంలో ఈ చర్య తీసుకుంటూనే, తోడుగా ఇక నెలవారీ ప్రతి సిలిండర్‌పై నాలుగు రూపాయలు అదనంగా వడ్డిస్తారు. లక్షలాది మంది మధ్య తరగతి కుటుంబాలు టార్గెట్‌గా కేంద్రం ఇలా కొరడా ఝుళిపించింది. సబ్సిడీలను క్రమంగా తగ్గిస్తూ వస్తున్న కేంద్రం కన్ను ఈసారి గ్యాస్ సబ్సిడీపై పడింది. పార్లమెంటు సాక్షిగా ఈ నిర్ణయం తీసుకుంది. ఈలెక్కన రోజువారి గ్యాస్ వాడకంపై ఆధారపడిన లక్షలాది కుటుంబాలపై ఈ నిర్ణయం ప్రభావం పడనుంది. జిల్లా వ్యాప్తంగా 11 లక్షల మందికిపైగా గ్యాస్ వినియోగదారులు ఉన్నారు. వీరిలో నాలుగు లక్షల మందికి పైగా డబుల్ సిలిండర్ ఉంది. కుటుంబ అవసరాల దృష్ట్యా సంవత్సరం క్రితం రెండో సిలిండర్ ఇచ్చేందుకు కేంద్రం అనుమతించడంతో అత్యధికులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకున్నారు. గతేడాదితో పోలిస్తే గ్యాస్ సిలిండర్ ధర ఈ మధ్యన కొంచెం తగ్గినా ఇప్పుడు ఉన్న సబ్సిడీని పూర్తిగా ఎత్తివేయడంతో ఆ భారమంతా వినియోగదారులపై పడుతుంది. చాలా కాలంగా గ్యాస్ ■ మిగతా 15వ పేజీలో..

నీరు పారని తాడిపూడి



ఉంగుటూరు మండలం వద్ద తాడిపూడి కాల్వ

- పెరుగుతున్న అంచనా వ్యయం
- చేతులెత్తేస్తున్న కాంట్రాక్టర్లు
- పాత అంచనాలతో గిట్టుబాటు కాదని వెనకడుగు
- కొత్త అంచనా రూ.500 కోట్లు
- ఏజెన్సీ మార్పునకు అధికారుల కసరత్తు

(తాడేపల్లిగూడెం - ఆంధ్రజ్యోతి)
మెట్టప్రాంతంలో 2 లక్షల ఎకరాల ఆయకట్టుకు తాడిపూడి ఎత్తిపోతల పథకం సాగునీరందించే లక్ష్యం చేరడంలేదు. ఎత్తిపోతల పథకం పూర్తయ్యేందుకు లెక్కకు మిక్కిలి కష్టాలు ఎదురవుతుండడంతో రైతులు నీటిపారుదల శాఖ అధికారులపై విమర్శలు గుప్పిస్తున్నారు. రైతుల సమన్వయ లోపంతోనే ఎత్తిపోతల పథకం పూర్తిస్థాయిలో సద్వినియోగంలోకి రావడం లేదంటూ మరోవైపు నీటిపారుదల శాఖ అధికారులు వేలెత్తి చూపుతున్నారు. ఇదిలా ఉంటే సందడిలో సడేమియాలా ఎత్తిపోతల నిర్మాణంలో కీలకమైన ఏజెన్సీ ముఖం చాటేస్తోంది. కాలువ తవ్వకాలకు అవసరమైన చోట నిర్మాణాలు చేపట్టేందుకు ముందుకు రావడం లేదు. 13 ఏళ్ళ కిందట రూపొందించిన అంచనాలతో ప్రస్తుతం ఉన్న ధరలకు పొంతన లేదంటూ కాంట్రాక్ట్ దక్కించుకున్న ఏజెన్సీ వాదిస్తోంది. అంతిమంగా ఇది ఎత్తిపోతల పథకం నిర్వహణపై ప్రభావం ■ మిగతా 15వ పేజీలో..

రైతు లేని బజార్లు!

- రైతు బజార్లను వదలని వ్యాపారులు
- కూరగాయలు విక్రయించేది 25 శాతం మంది రైతులే
- భవనాల్లో అరకొర వసతులు... విద్యుత్ సమస్యలు.
- మూణ్ణాళ్ళ ముచ్చటగా ఎత్తేసిన నిడదవోలు రైతు బజారు
- జంగారెడ్డిగూడెం, తాడేపల్లిగూడెంలలో కొత్త రైతు బజార్లకు స్థలాల ఎంపిక..
- రైతుబజార్ల వైపు దృష్టి పెట్టని ఏఎంసీ పాలకవర్గాలు

భీమవరం : కూరగాయలు పండించిన రైతులే నేరుగా తమ ఉత్పత్తులను అమ్ముకునే సౌకర్యం ఉన్న రైతుబజార్లు ఇప్పటికీ అరకొర వసతులతో ఇబ్బందులు పడుతున్నాయి. ఇక్కడకు వచ్చే రైతులు, కొనుగోలుదారులు అసంతృప్తిగానే ఉంటున్నారు. పైగా ఈ బజార్లలో కూరగాయలు విక్రయించే రైతులు 25 శాతం మంది మాత్రమే ఉండడంతో ■ మిగతా 15వ పేజీలో..



భీమవరంలోని రైతుబజారు



వస్త్ర దుకాణంలో మహిళలు

లక్ష్మీ కళొచ్చింది!

- మార్కెట్‌లో శ్రావణ సందడి
- కిటకిటలాడుతున్న షాపులు

3లో

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ interview

ఈ ఏడాది 12 చోట్ల
టెన్నిస్ టోర్నమెంట్‌లు

ఆలిండియా సీనియర్స్ టెన్నిస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు, రెడ్డప్ప చిన్న దవేజి



టెన్నిస్ క్రీడను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కూడా సాయం అందించాలి. క్రీడాభివృద్ధికి ఒక అసోసియేషన్‌ను ఏర్పాటు చేసి పలు చోట్ల క్రీడలు నిర్వహిస్తున్నాం.. దేశమంతటా అసోసియేషన్ తరపున క్రీడలు నిర్వహిస్తూ టెన్నిస్‌ను ప్రోత్సహిస్తున్నాం.. యువత టెన్నిస్ పట్ల మక్కువ చూపాలంటున్న ఆలిండియా సీనియర్స్ టెన్నిస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రెడ్డప్ప చిన్న దవేజీతో చిట్‌చాట్..

ఈ ఏడాది ఎన్ని చోట్ల టోర్నమెంట్లు నిర్వహిస్తున్నారు?

ఆలిండియా సీనియర్స్ టెన్నిస్ అసోసియేషన్(అయిస్టా) ఆధ్వర్యంలో ఈ ఏడాది 12 చోట్ల టెన్నిస్ టోర్నమెంట్లు నిర్వహిస్తున్నాం. అందులో నరసాపురంతో పాటు తిరుపతి, జోద్‌పూర్, సూరత్, నాసిక్, బెంగళూరు, పుణె, కాకినాడ, విజయవాడ, విశాఖ, కడప, ముంబై వంటి ప్రదేశాలు ఉన్నాయి.

అయిస్టాను ఎప్పుడు ఏర్పాటు చేశారు?

1995లో ఏర్పాటు చేశాం.ప్రముఖ వ్యాపారి జి.వి.కె.కృష్ణారెడ్డి ప్రారంభించారు. ప్రస్తుతం అయిస్టాలో 200మంది సభ్యులున్నారు. వీరిలో ఎక్కువ మంది జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులే. వారిలో నరేంద్రనాథ్, ఎ.జి.రమేష్, పీటర్ విజయకుమార్, అర్ముగం, నితిన్‌కిర్తన్, మయూరి వసంత్ వంటి క్రీడాకారులు ఉన్నారు.

అయిస్టా లక్ష్యం ఏమిటి?

టెన్నిస్ క్రీడను అభివృద్ధి చేయడమే లక్ష్యం.. తరచూ పోటీలు నిర్వహించాలన్నదే అయిస్టా లక్ష్యం. ప్రస్తుతం 45 ఏళ్ల దాటిన క్రీడాకారులను అయిస్టాల్లో సభ్యులుగా చేర్చుకుంటున్నాం. ఏడాదికి కనీసం 10 టోర్నమెంట్లుకు తగ్గకుండా నిర్వహిస్తున్నాం. ప్రధాన కార్యాలయం ముంబై, హైదరాబాద్‌లో ఉంది.

విజేతలకు ప్రోత్సాహక బహుమతులేమిటి?

ఏడాదికి సుమారు రూ.30 లక్షల వరకు విజేతలకు బహుమతులుగా అందిస్తున్నాం. ఇందులో జీవీకే సంస్థ ప్రతి ఏటా రూ.12 లక్షలు క్రీడాకారుడిగా నేను రూ.15 లక్షలు, మిగిలిన మొత్తం కొన్ని కంపెనీలు స్పాన్సర్స్ చేస్తున్నాయి. ఈ మొత్తాన్నే ప్రతి టోర్నమెంట్‌లలో విన్నర్‌గా నిలిచిన వారికి అందిస్తున్నాం..

క్రీడను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఏం చేయాలి?

టెన్నిస్ అంటే ఖరీదైన ఆట అన్న భావన చాలా మందిలో ఉంది. ప్రస్తుతం చాల టెన్నిస్ కోర్టులు ప్రైవేట్ సంస్థల ఆదీనంలో ఉన్నాయి. దీనివల్ల కొంత మంది మాత్రమే ఈ ఆటను నేర్చుకోగల్గుతున్నారు. ప్రతి జిల్లాలో ప్రభుత్వం టెన్నిస్ కోర్టులు ఏర్పాటు చేయాలి. శిక్షణ ఇస్తే చాల మంది క్రీడాకారులు తయారవుతారు.

రాష్ట్రంలో ఏ జిల్లాలో ఎక్కువ క్రీడాకారులున్నారు?

విశాఖ, విజయవాడ, తిరుపతి, గుంటూరు జిల్లాల్లో మాత్రమే ఎక్కువ యువ క్రీడాకారులున్నారు. మిగిలిన చోట్ల సంఖ్య తక్కువ, ఏదో కొన్ని క్లబ్‌లు మాత్రమే కోర్టులను ఏర్పాటు చేసుకున్నాయి.

అయిస్టాకు ప్రభుత్వ సహకారం ఉందా?

ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఎటువంటి సహాయ సహకారాలు లేవు. టెన్నిస్ అసోసియేషన్ తరపున కూడా ప్రోత్సాహం తక్కువే. టోర్నమెంట్ నిర్వహిస్తున్నప్పుడు ఎటువంటి ఆర్థిక సహకారం అందించడం లేదు. ఇటీవల అసోసియేషన్‌కు స్థలం కేటాయించమని ప్రభుత్వాన్ని కోరాం. **- నరసాపురం**

మద్ది క్షేత్రంలో ప్రత్యేక పూజలు



జంగారెడ్డిగూడెం : గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయ స్వామిని మంగళవారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం చుట్టూ 108 ప్రదక్షిణలు, తలనీలాలు, వాహన పూజలు నిర్వహించి తమ మొక్కులను తీర్చుకున్నారు. స్వామి వారికి అత్యంత ప్రీతికరమైన తమలపాకులతో అష్టోత్తర పూజను ఆలయ ప్రధానార్చకుడు వేదాంతం వెంకటాచార్యులు నిర్వహించారు. మంగళవారం ఒక్కరోజే మద్ది ఆంజనేయ స్వామి ఆలయానికి రూ. లక్షా 32వేల 68 ఆదాయం వచ్చినట్టు ఆలయ కార్యనిర్వాహణాధికారి పెన్మెత్స విశ్వనాథరాజు, చైర్మన్ ఇందుకూరి రంగరాజు తెలిపారు.

గతంలో ఎంత ఎక్కువగా జుట్టు పెంచితే అంత గొప్ప అన్నట్టు.. ఇప్పుడు ట్రెండ్ మారింది.. కొత్త ఒక వింత.. పాత ఒక రోత అన్న చందాన నెత్తిన ఉన్న జుట్టంతా గోకేస్తున్నారు.. ఇప్పుడు జుట్టు ఎంత తగ్గిస్తే అంత హ్యాపీ అన్నట్టు.. అక్కడక్కడ జుట్టు ఉంచి మిగతాది శుభ్రంగా గోకితే సరి.. అబ్బో ఏం స్టైల్‌రా బాబూ అన్నట్టు అంతంత కళ్లేసుకుని చూస్తారు.. ఇక ఆ హెయిర్ స్టైల్ సక్సెస్ అయినట్టే.. అది మరో నలుగురి తలలపై దర్శనమివ్వడం ఖాయం.. అలా నేటి యువత హెయిర్ స్టైల్స్‌ను వింత పుంతలు తొక్కిస్తున్నారు..

- తాడేపల్లిగూడెం అర్బన్



కుర్రాడా.. అదిరింది..



పట్టణాల్లో విస్తరిస్తున్న న్యూ హెయిర్ స్టయిల్ కల్చర్ - యువత అభిరుచిని క్యాష్ చేసుకుంటున్న సెలూన్ షాపులు

● అడ్వాన్స్‌కట్

● దీనిలో ఆరు రకాలు ఉన్నాయి. హార్ట్ కట్, ఓవెల్ కట్, రౌండ్‌కట్, రెక్టాంగ్యులర్ కట్, లాంగ్ కట్, స్క్వేర్‌కట్‌లు ఉన్నాయి. ఇవి వారి ఫేస్‌ను ఆధారంగా ఎంపిక చేసు కోవాల్సి వస్తుంది. ముందుగా ఏ ఫేస్‌కు ఏ కట్ అవసరమో ఎం పిక చేసుకోవాలి. కటింగ్‌ను బట్టి ధర ఉంటుంది.

● మల్టీలేయర్ కటింగ్

● ఇది కట్ చేసే టప్పుడు ఎగుడు దిగు డుగా ఉన్నా చూడటానికి మాత్రం సమానంగా ఉన్నట్టు కనిపిస్తుంది. దీన్నే యువత ఎక్కువగా ఎంపిక చేసుకుంటారు.

● స్లైజింగ్ కట్

● వెంట్రుకల చివర మాత్రమే కత్తిరిస్తారు. ఇది వెస్ట్రన్ స్టైల్లో ఉంటుంది. దీన్ని కూడా యువత ఎక్కువగా చేయించుకుంటారు.

● మష్రూమ్ కట్

● ఇది పుట్టగొడుగు ఆకారంలో కటింగ్ చేయించుకుంటారు. పుట్టగొడుగు బొమ్మను పోలిన విధంగా ఈ కటింగ్ ఉంటుంది.

● హార్స్‌షూకట్(గుర్రపునాడ)

● గుర్రపునాడ ఆకారంలో కటింగ్ ఉంటుంది. దీన్ని ఉత్తర భారత దేశంలోని యువత ఎక్కువగా అనుసరిస్తున్నారు. ప్రస్తుతం ఇంజనీరింగ్, మెడికల్ కళాశాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వీటిని వినియోగిస్తున్నారు.

● కాన్‌కేవ్‌కట్(గుహకట్)

● యువత ట్రెండ్‌కు అనుకూలంగా ఇలాంటికటింగ్‌లు పుట్టుకొచ్చా యి. గుహ ఆకారంలో కటింగ్ చేయించుకుంటున్నారు. దీని ధర కూడా రూ.150 నుంచి 300 వరకు ఉంటుంది.



మహిళల కోసం అనేక రకాల ట్రీట్‌మెంట్లు..

మహిళల కోసం ప్రత్యేకంగా బ్యూటీపార్లర్లు గతంలో ఉండేవి. ఇప్పుడు ఒకే చోట వేరు వేరు విభాగాలుగా విడగొట్టి ట్రీట్‌మెంట్ ఇస్తున్నారు. ప్రస్తుత ట్రెండ్‌కు అనుగుణంగా నేడు మహిళలకు ఎదురైయ్యే సమస్యల పరిష్కారం కోసం చికిత్సలు ఇస్తున్నారు. చుండ్రుపోయే ట్రీట్‌మెంట్, ఎంట్రుకలు విరిగిపోవడం, రాలిపోవడం వంటి వాటిని అరికట్టడానికి ప్రత్యేక విభాగాలున్నాయి. హెయిర్‌స్పాలో ఆరురకాల ట్రీట్‌మెంట్లు అందిస్తున్నారు. హైడ్రేటింగ్, స్మూథింగ్, కలరింగ్, డీప్‌స్మూథింగ్, సైటింగ్‌స్పా, ఆల్‌థెరపీ అనే విధంగా చికత్సను అందిస్తున్నారు. ఇవి కాకుండా పింపుల్ ట్రీట్‌మెంట్, ఫిగ్మంటేషన్, స్టీమ్‌బాత్, బాడీస్క్రబ్, బాడీ పాలిషింగ్ వంటి మహిళల కోసం ఇస్తున్నారు. ప్యాకేజీని బట్టి రూ.1500 నుంచి రూ.2500 వరకు తీసుకుంటున్నారు.



ట్రెండ్‌ను ఫాలో అవుతా : బి.హేమంత్, బీటెక్

నేను రెండేళ్లు కొత్తరంగా కటింగ్ చేయించుకుంటున్నా.. ట్రెండ్‌ను ఫాలో అవుతా. యూత్ ఐకాన్‌గా ఉండేందుకు హెయిర్ స్టయిల్ దోహదపడుతుంది.

ఎం.మధురామ్, వాసవీ ఇంజనీరింగ్ కళాశాల

నేను రెండేళ్లుగా షేడ్‌కట్స్ వేయించుకుంటున్నా. నా ఫేస్‌కు అదే బాగుంది. దీంతో దీన్నే ఎక్కువగా ఇష్టపడతా. నా స్నేహితులు కూడా మెచ్చుకుంటారు.

పంక్స్ స్టైల్ అంటే ఇష్టం : కె.గుణ, బీటెక్

మూడేళ్లుగా కటింగ్ చేయించుకుంటున్నా.. పంక్స్ స్టైల్ అంటే నాకు ఇష్టం. దీనికోసం అనుభవం ఉన్న జీఅండ్‌జీ వద్దకు వస్తాను. యువతకు ఆఫర్లు కూడా ఉన్నాయి..

మాకు ఉపాధి కలుగుతోంది..



ఈ న్యూ ట్రెండ్ వల్ల మాకు ఉపాధి కలుగుతోంది. నా దగ్గర ఇద్దరు జంట్స్ హెయిర్ కట్టర్స్, ఇద్దరు ఫిమేల్ ఫేషియర్స్ ఉన్నారు. రెండు విభాగాలకు వేర్వేరుగా కేటాయించాం. యువత ఎక్కువగా మక్కువ చూపుతున్నారు. ఆదరణ బాగుంది.

మురళీ, జీఅండ్‌జీ బ్యూటీపార్లర్ ప్రతినిధి

పెళ్లికూతుళ్లు, పెండ్లికొడుకుల అలంకరణ..

పెళ్లికూతురు మేకప్ కోసం సింగిల్ సిట్టింగ్ కోసం రూ.1500 నుంచి 4వేలు తీసుకుంటున్నారు. నాలుగు సిట్టింగ్‌ల కోసం రూ.15 వేలు వసూలు చేస్తున్నారు.

ఫ్యామిలీ ప్యాకేజ్‌లు కూడా ఉంటాయి..

మ్యారేజ్ సందర్భంగా ఫ్యామిలీ ప్యాకేజ్‌లు కూడా ఆఫర్ చేస్తున్నాయి. పెళ్లికొడుకు లేక పెళ్లికుమార్తె వారి బంధువులు నలుగురు కలిసి ఈ ప్యాకేజ్ కిందకు వస్తారు. వీరంతా 30 రోజుల పాటు వీరి అండర్‌లో ఉండాలి. ఆహార నియమాలు పాటిస్తూ వారిచ్చే సిట్టింగ్స్‌లో పాల్గొనాలి. దీనికి గాను రూ. 16వేల నుంచి 35వేల వరకు వసూలు చేస్తారు.

కలర్ టాటూస్ ఒక ఫ్యాషనే..

కలర్ టాటూస్‌పై డిస్కౌంట్‌లు కూడా ఉంటాయి.. టెంపరరీ టాటూస్‌కు రూ.100 అవుతుంది.. పర్మినెంట్ టాటూస్ అయితే అంగుళం రూ.400 చొప్పున చార్జ్ చేస్తారు..

సిలికాన్ హెయిర్ సిస్టమ్..

జుట్టు రాలడం పట్ల యువత మానసికంగా ఇబ్బందులు పడుతుంటారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని సిలికాన్ సిస్టమ్‌లో జుట్టును అతికిస్తున్నారు. ఇవి రెండు రకాలుగా ఉన్నాయి. ఇండియన్, అమెరికన్ స్టైల్లో ఉన్నాయి.ఇండియన్ స్టయిల్‌కు రూ.15వేలు నుంచి 20వేలు, అమెరికన్ స్టయిల్‌కు రూ.30 వేల వరకు వసూలు చేస్తారు.

రుణ పరిమితి



పట్టించుకోరే..

వ్యవసాయానికి పూర్తిస్థాయిలో అందని రుణాలు

కౌలు రైతు పరిస్థితి అధ్వానం

ఏలూరు సిటీ: పంట రుణాల పంపిణీ విషయంలో రిజర్వుబ్యాంకు ఎప్పటికప్పుడు మార్గదర్శకాలు విడుదల చేస్తూనే ఉంది. ఖరీఫ్, రబీ పంటలకు సంబంధించి ఏ పంటకు ఏవిధంగా రుణాలు ఇవ్వాలనే విషయంపై ఏటా బ్యాంకు అధికారుల సమావేశాల్లో నిర్ణయాలు తీసుకుంటారు. కౌలు రైతులకు రుణాలు అందజేయడంలో పరిమితిని పట్టించుకున్న దాఖలాలే లేవు. పరిమితికి బాగా దిగవకే రుణాలు అందుతాయి.. లేదా అందకపోవచ్చు. పంట రుణ పరిమితి (స్కేల్ ఆఫ్ ఫైనాన్స్)కి సంబంధించి తాజాగా 2017-18 మార్గదర్శకాల ఆధారంగా బ్యాంకులు పంటరుణాలను రైతులకు అందజేయాల్సి ఉంది. ఈ ఏడాది పంట రుణపరిమితిని పెంచుతూ డీఎల్‌టీసీ సమావేశంలో నిర్ణయం తీసుకోవడం జరిగింది.

పంటరుణ పరిమితి ఇలా..

వరి సాగకు ఖరీఫ్‌లో ఎకరాకు రూ.27 వేల నుంచి రూ.29 వేల వరకు, రబీలో రూ.28 వేల నుంచి రూ.30 వేల వరకు రుణం అందించాలి. చెరకు మొక్కతోటకు ఎకరాకు ఖరీఫ్, రబీలకు రూ.60 వేల నుంచి రూ.62 వేలు, చెరకు కార్శి తోట ఎకరాకు ఖరీఫ్, రబీల్లో రూ.45 వేల నుంచి రూ.50 వేల రుణం అందించాలి. అపరాల పంటలకు ఖరీఫ్, రబీల్లో ఎకరానికి రూ.9,450 నుంచి రూ.10,500 వరకు రుణం అందించాలి. వర్జీనియా పొగాకు పంటకు ఎకరాకు రూ.70 వేలు, నాటు పొగాకుకు ఎకరాకు రూ.40 వేలు పంట రుణ పరిమితి ఉంది. వేరుశెనగ పంటకు ఖరీఫ్, రబీల్లో ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.22 వేలు, ఎండు మిర్చి పంటకు ఖరీఫ్, రబీలో ఎకరాకు రూ.45 వేల నుంచి రూ.50 వేలు, మొక్కజొన్న పంటకు ఖరీఫ్, రబీల్లో ఎకరాకు రూ.23 వేల నుంచి రూ. 25 వేలు, మొక్కజొన్న విత్తనతోటకు ఎకరాకు రూ. 26 నుంచి రూ.28 వేలు, పత్తి వాణిజ్య పంటకు ఖరీఫ్‌లో ఎకరాకు రూ.29 వేల నుంచి రూ. 30 వేలు, ప్రత్తి విత్తనతోటకు రబీలో ఎకరాకు రూ. 60 వేల నుంచి రూ.62 వేలు, అరటి రాటూన్ పంటకు ఖరీఫ్, రబీలో ఎకరానికి రూ.40 వేల నుంచి రూ.45 వేలు, టిష్యూకల్చర్ అరటికి ఖరీఫ్, రబీల్లో ఎకరాకు రూ.70 వేల నుంచి రూ. 75 వేలు, అరటి మొక్కతోటకు ఖరీఫ్, రబీల్లో ఎకరాకు రూ.55 వేల నుంచి రూ.60 వేలు, పచ్చిమిర్చికి సంబంధించి ఖరీఫ్, రబీల్లో ఎకరానికి 40 వేల నుంచి 45 వేలు, కూరగాయల తోటలకు ఖరీఫ్, రబీలో ఎకరాకు రూ.50 వేల నుంచి రూ.55 వేలు పంట రుణ పరిమితి నిర్ణయించారు.

రుణ పరిమితి ఉందా..

పంట రుణ పరిమితి ప్రకారం రుణాలు అందడం లేదని కౌలు రైతులు వాపోతున్నారు. పరిమితి నిబంధన ఎలాఉన్నా కనీసం సాగుకు సరిపడా రుణం కూడా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కౌలు రైతుల పరిస్థితి మరింత దయనీయం. రుణ అర్హత కార్డు తీసుకుని బ్యాంకుకు వెళ్తే సవాలక్ష కారణాలు చెప్పి పూర్తిస్థాయిలో రుణాలను అందించడం లేదని, బ్యాంకు అధికారులు నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్నారని కౌలురైతులు విమర్శిస్తున్నారు. జిల్లాలో కౌలు రైతులకు అందించిన రుణాల్లో రుణపరిమితి మార్గదర్శకాలను పాటించ లేదని జిల్లా కౌలు రైతుసంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ వాపోయారు.

గడియపెట్టి.. ఇల్లు దోచేశారు..

నగలు, నగదు, మోటార్ సైకిల్ అపహరణ

ఏలూరు క్రైం: సాధారణంగా తాళం బద్దలు గొట్టి.. తలుపులు విరగ్గొట్టి.. కిటికీ ఊచలు వంచి దొంగలు ఇళ్లలో చొరపడి దోచుకుపోతారు. ఏలూరులో ఇంటి యజమానులు గడియ వేయకుండా నిద్రిస్తుంటే బెడ్‌రూమ్ బయటి నుంచి దొంగలు గడియ పెట్టేశారు. తీరుబడిగా సామగ్రి, నగదు, నగలు దోచుకుపోయారు. ఏలూరు కొత్తపేటలోని కూనిశెట్టివారివీధికి చెందిన లారీ మెకానిక్ సబ్బవరపు సుబ్రహ్మణ్యం(42) కుటుంబ సభ్యులతో గత నెల 30న రాత్రి 12.30 గంటలకు టివి చూస్తూ నిద్రించారు. తలుపులు దగ్గరకు వేశారే తప్ప గడియపెట్టలేదు. తెల్లవారేటప్పటికి వారి బెడ్‌రూమ్‌కు బయట గడియ పెట్టి ఉంది. స్నేహితుడికి ఫోన్ చేసి గడియ తీయించారు. పక్క బెడ్‌రూమ్‌లోని వస్తువులన్నీ చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. రెండు కాసుల ఉంగరం, కొంత నగదు, గుమ్మంలో ఉంచిన మోటారు సైకిల్‌ను దొంగ అపహించుకుపోయాడు. ఈ సంఘటనపై టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ జి.మధుబాబు ఆధ్వర్యంలో ఎస్‌ఐ ఎస్.ఎస్.ఆర్.గంగాధర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నంద్యాల ప్రచారానికి అంబికా కృష్ణ

ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి:
నంద్యాలలో జరిగే ఉప ఎన్నికల ప్రచారంలో పాల్గొనాల్సిందిగా ఆంధ్రప్రదేశ్ చలన చిత్రాభివృద్ధి సంస్థ చైర్మన్ అంబికా కృష్ణను తెలుగుదేశం పార్టీ ఆదేశించింది. కాస్తంత సినిమా ఇమేజ్, ఆర్యవైశ్య సంఘాలతో పూర్తి స్థాయి పరిచయం ఉండడంతో అంబికా కృష్ణకు ఈ బాధ్యత అప్పగించారు. మంగళవారం పార్టీ కార్యాలయం నుంచి ఈ మేరకు వర్తమానం అందింది. నంద్యాల ఉప ఎన్నికల్లో ప్రచారం నిమిత్తం ఒకటి, రెండు రోజుల్లోనే అక్కడకు వెళ్ళనున్నట్టు అంబికా కృష్ణ తెలిపారు. నంద్యాలలో పార్టీ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

సెప్టెంబర్ 9న లోక్ అదాలత్

జిల్లా జడ్జి గంధం సునీత

ఏలూరు క్రైం: రాజీ చేసుకోదగిన కేసులను పరిష్కరించడానికి సెప్టెంబర్ 9న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు జిల్లా జడ్జి గంధం సునీత తెలిపారు. జాతీయ న్యాయసేవ అధికార సంస్థ, రాష్ట్ర న్యాయసేవ అధికార సంస్థల ఆదేశాల మేరకు రాజీ చేసుకోదగిన అన్నిరకాల కేసులను జాతీయ లోక్‌అదాలత్‌లో పరిష్కరించనున్నట్టు తెలిపారు. కోర్టులలో పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల సివిల్, కోర్టుల ముందుకురాని బ్యాంకు రుణాలు, టెలిఫోన్ బకాయిలు, మునిసిపాలిటీలు, పంచాయతీలకు చెల్లించాల్సిన ఇంటిపన్ను, నీటిపన్ను బకాయి కేసులు, వివాహ సంబంధ కేసులు, రెవెన్యూ, ఎలక్ట్రిసిటి, మోటరు వాహన ప్రమాద నష్టపరిహార కేసులు, చట్టప్రకారం రాజీ చేసుకోదగిన అన్నిరకాల క్రిమినల్ కేసులు పరిష్కరించనున్నట్టు తెలిపారు. ఏలూరు, భీమవరం, నరసాపురం, కొవ్వూరు, తణుకు, తాడేపల్లిగూడెం, చింతలపూడి, పాలకొల్లు, జంగారెడ్డిగూడెం, నిడదవోలు, భీమడోలు కోర్టుల ఆవరణలో సెప్టెంబర్ 9న జాతీయ లోక్ అదాలత్ బెంచ్‌లు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కేసు రికార్డులను సంబంధిత లోక్ అదాలత్‌లకు పంపించుకోవాల్సి ఉంటుందన్నారు. కేసుల రాజీ పరిష్కారంలో కక్షిదారులు సూచనలు, సహకారం నిమిత్తం సంబంధిత కోర్టులు, పోలీసు, ఎక్సైజ్‌శాఖల సిబ్బందిని సంప్రదించాలన్నారు. కేసుల స త్వర పరిష్కారానికి కక్షిదారులు లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాల్సిందిగా జిల్లా న్యాయ అధికార సంస్థ చైర్మన్ సునీత తెలిపారు.



బదిలీ ఇక్కట్లు

- కౌన్సెలింగ్ ముగిసింది
- క్షేత్రస్థాయి, సాంకేతిక సమస్యలు
- బదిలీ టీచర్లకు నమోదుకాని ఈ హాజరు

ఏలూరు అర్బన్: టీచర్ల బదిలీల కౌన్సెలింగ్ అనంతరం క్షేత్రస్థాయి ఇబ్బందులు, సాంకేతిక అవరోధాల పరిష్కారంలో జిల్లా విద్యాశాఖ తలమునకలైంది. జిల్లాలో 4,452 మంది ఉపాధ్యాయులు బదిలీ అయినప్పటికీ ఆయా పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత వెంటాడుతోంది. మిగులు (సర్‌ప్లస్) వేకెన్సీలను సైతం కౌన్సెలింగ్‌లో భర్తీ చేసేశారు. మరోవైపు కొత్తగా బదిలీ టీచర్ల హాజరుకు బయోమెట్రిక్ మిషన్లలో సంబంధిత ఉపాధ్యాయుల వివరాలు నమోదు లేకపోవడం వల్ల ఈ-హాజరుకు ఇక్కట్లు ఎదురవుతున్నాయి.

టీచర్ల కొరత

చినకాపవరం స్కూలు, టి.నరసాపురం, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో పలు పాఠశాలలకు కౌన్సెలింగ్ అనంతరం కూడా టీచర్ల కొరత వెంటాడుతోంది. ఈ పరిస్థితిపై క్షేత్రస్థాయి సమాచారాన్ని జిల్లా విద్యాశాఖ సేకరించడం ప్రారంభించింది. సంబంధిత ఖాళీల్లో తాత్కాలిక ప్రాతిపదికన విద్యావలంటీర్లను నియమించే అవకాశం ఉంది. ఈ మేరకు సమగ్ర సమాచారంతో పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలను కొద్దిరోజుల్లో పంపనున్నారు.

జిల్లాలో కొన్నిచోట్ల సర్‌ప్లస్ వెకెన్సీలు ఉన్నప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా ఆయాస్థానాలను కూడా క్లియర్ వెకెన్సీలుగా చూపి కౌన్సెలింగ్‌లో భర్తీ చేసేశారు. క్షేత్రస్థాయి నుంచి ఎంఈఓలు, డీవైఈఓలు సరైన సమాచారం ఇవ్వకపోవడం వల్లే ఇటువంటి సమస్యలు తలెత్తాయి. ఒకే పేరుతో ఉన్న ఇద్దరు ప్రధానోపాధ్యాయులు కౌన్సెలింగ్ సీనియార్టీ జాబితాలో ఒకరివెంట ఒకరు బదిలీ స్థానం కోరుకోవాల్సి వచ్చింది. వారిద్దరూ ఒకరికి బదులు ఒకరు స్థానాలను ఎంచుకుని ఫ్రీజ్ చేసిన తర్వాతగాని బదిలీలు ఉల్టాగా జరిగాయని నిర్ధారణ కాలేదు. కౌన్సెలింగ్‌లో కొందరు టీచర్లకు బదిలీ జరిగినా ఆన్‌లైన్‌లో గైర్హాజరు, అయిష్టత (అన్‌విల్లింగ్)గా నమోదయ్యాయి. వారికి మాన్యువల్ ఆర్డర్లు ఇస్తున్నారు.

ఈ హాజరుకు బ్రేక్

జిల్లావ్యాప్తంగా దాదాపు అన్ని పాఠశాలల నుంచి టీచర్లు బదిలీ కోరుకున్నారు. వారంతా మంగళవారం నుంచి కొత్తస్థానాల్లో విధులు చేపట్టడానికి వెళ్ళారు. కొత్తగా బదిలీ అయిన టీచర్లు హాజరు నమోదుకు బయోమెట్రిక్ యంత్రాలలో వారి వివరాలు లేకపోవడంతో ఇ-హాజరుకు బ్రేక్ పడింది. పాఠశాలల వారీగా యు-డైస్ కోడ్ ప్రకారం టీచర్ల వివరాలు బయోమెట్రిక్ యంత్రాల్లో నమోదు చేసి ఉన్నాయి. బదిలీస్థానాలకు వెళ్లిన ఉపాధ్యాయులకు బయోమెట్రిక్ హాజరు నమోదు చేయడానికి సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేయడంతోపాటు, బదిలీ టీచర్ల వివరాలను కూడా సంబంధిత పాఠశాలల ఐరిస్/తంబ్ మిషన్లలో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

రేపు మునిసిపల్ టీచర్ల ధర్నా

ఏలూరు అర్బన్: మునిసిపల్ టీచర్ల సమస్యల పరిష్కారం కోరుతూ జాక్టో-ఫ్యాప్టో ఆధ్వర్యంలో మునిసిపల్ కార్యాలయాల వద్ద ధర్నా కార్యక్రమాలను గురువారం చేపడుతున్నట్లు ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఐ.రాజగోపాల్ తెలిపారు. మునిసిపల్ టీచర్లకు కూడా ఏకీకృత సర్వీసు రూల్స్ వర్తింపజేయాలని, అంతర్ మునిసిపల్ బదిలీలను చేపట్టాలని, అప్‌గ్రేటెడ్ పోస్టులను పదోన్నతులతో భర్తీ చేయాలని, జీపీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.


జిల్లా యూనిట్‌గా తీసుకుని పరస్పర బదిలీలు నిర్వహించాలని కోరారు. ముఖ్యంగా మునిసిపల్ పాఠశాలల్లో ఆంగ్లమాధ్యమంతో పాటు తెలుగు మాధ్యమాన్ని కూడా కొనసాగించాలన్నారు. మున్సిపల్ కార్యాలయాల వద్ద చేపట్టే ధర్నాకు అధిక సంఖ్యలో టీచర్లు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

అర్హులందరికీ పింఛన్లు

ఏలూరు రూరల్: డివిజన్‌లో అర్హులైన వారందరికీ పింఛన్లు అందిస్తామని కార్పొరేటర్ కర్రి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక 12వ డివిజన్‌లో కొత్తగా మంజూరైన 17 మంది లబ్దిదారులకు పింఛన్లను మంగళవారం ఆయన అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ డివిజన్‌లో 120 మంది వరకు పింఛన్ల కోసం ఆన్‌లైన్ చేసుకున్నారని, వారిలో తాజాగా 17 పింఛన్లు ఏలూరు ఎమ్మెల్యే బడేటి బుజ్జి, మేయర్ నూర్జహాన్ ఆదేశాల మేరకు మంజూరయ్యాయన్నారు. త్వరలో మిగతా వారందరికీ పింఛన్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి పింఛన్ వచ్చే విధంగా చర్యలు తీసుకుంటానని శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

గోతులు.. బురద..





వర్షాలకు అధ్వానంగా మారిన ఏలూరు - కైకలూరు రహదారి

ఏలూరు సిటీ: ఎక్కడచూసినా గోతులు.. రహదారిపై బురద.. ఎక్కడ ఎంత లోతు ఉందో తెలియదు. సాధారణంగా ఆ రహదారిపై ప్రయాణమే ఇబ్బంది. వర్షం వస్తే పడరాని పాట్లే. ఏలూరు నగరాన్ని ఆనుకుని కైకలూరు వెళ్ళే రహదారి దుస్థితి ఇది. రహదారిపై ప్రయాణించాలంటే పాదచారులు, ద్విచక్రవాహనదారులు గగ్గోలు పెడుతున్నారు. అడుగడుగునా గోతులుమయం కావడంతో వర్షపునీటితో ఆ గోతులు నిండిపోయి ద్విచక్రవాహనదారులు తరుచూ ఆ గోతుల్లో పడి ప్రమాదాలను కొని తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ రహదారి గురించి పట్టించునే నాధుడే లేరని ఆ ప్రాంత ప్రజలు వాపోతున్నారు. ఏలూరు నుంచి శ్రీపర్రు వంతెన వరకు ఇదే పరిస్థితి కనిపిస్తోంది. కేవలం పశ్చిమగోదావరిజిల్లాలో ఉన్న రహదారి మాత్రమే ఇంత దుస్థితిని ఎదుర్కోంటోందని, శ్రీపర్రు నుంచి కైకలూరు వెళ్ళే రహదారి బాగానే ఉందని చెబుతున్నారు. ఆర్ అండ్‌బి ఈ రహదారి దుస్థితిపై దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎన్నో నెలల నుంచి ఈ పరిస్థితి ఉన్నా కనీసం గోతులు పూడ్చిన దాఖలాలు ఎక్కడాలేవు. ఈ రహదారిపై పాదచారులు ప్రయాణించాలంటేనే భయపడుతున్నారు. ఇక బస్సుల్లో ప్రయాణం కూడా ఈ రహదారిపై కష్టతరంగా తయారైంది. గోతుల్లో ప్రయాణించే బస్సులుగాని, కార్లు, ఇతరవాహనదారులు నానాఅవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ఈ రహదారి దుస్థితిపై దృష్టిసారించి మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉంది. వర్షాకాలం కావడంతో ఎప్పటికప్పుడు గోతులు వర్షపునీటితో నిండిపోవడంతో ప్రమాదాలు ఎక్కువవస్థాయిలో జరిగే అవకాశం ఉన్నందున అధికారులు సత్వరమే రహదారి మరమ్మతులు చేపట్టాలి.

డాక్టర్ సలహా



పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి

ఎం.పద్మ, చీఫ్ గైనకాలజిస్ట్, జిల్లా ఆసుపత్రి

‘ పుట్టిన బిడ్డకు వెంటనే తల్లీబిడ్డల విభాగంలో జీరో డోస్ వ్యాక్సిన్లను వేస్తున్నాం. వీటి వలన పోలియో, టిబి, హెపటైటిస్-బి వ్యాధులు రాకుండా కాపాడతాయి. ప్రస్తుతం ప్రత్యేక కార్యక్రమంగా ప్రభుత్వం చేపట్టిన తట్టు, రుబెల్లా వ్యాధులు రాకుండా టీకా ఇస్తున్నాం. టీకాను సెప్టెంబర్ 8 వరకు తొమ్మిది నెలల నుంచి 15 ఏళ్ళలోపు వయస్సు గల చిన్నారులకు వేయడం జరుగుతుంది. గర్భంతో ఉన్నప్పుడు రుబెల్లా సోకిన మహిళకు పుట్టబోయే శిశువుకు జనన లోపాలు ఏర్పడవచ్చు. అంధత్వ, వినికిడిలోపం, బుద్ధి మాంద్యం, గుండె సంబంధిత వ్యాధులు రావచ్చు. ప్రతీ ఒక్కరూ తమ పిల్లలకు టీకాను వేయించాలి. ’

● ఏలూరు క్రైం

సుంకర మృతి తీరనిలోటు

ఏలూరు ఫైర్‌స్టేషన్: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, వామపక్షవాది సుంకర చంద్రమౌళీశ్వరరావు (102) అనారోగ్యంతో మంగళవారం భీమడోలులో మృతి చెందారు. ఆయన భౌతికకాయాన్ని సీపీఐ నాయకులు, ప్రజాసంఘాల నాయకులు సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. భౌతిక కాయంపై సీపీఐ పతాకాన్ని కప్పి జిల్లా కార్యదర్శి డేగా ప్రభాకర్ ఘనంగా నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి ప్రగాడ సానుభూతి ప్రకటించారు. భౌతికకాయాన్ని సందర్శించినవారిలో బి.వెంకటేశ్వరరావు, పి.కన్నబాబు, సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

సౌభాగ్యలక్ష్మికి పూజలు



ధైర్యలక్ష్మిగా సౌభాగ్యలక్ష్మి, పూజలందుకున్న ఆంజనేయుడు

ఏలూరు రూరల్: సత్రంపాడు సౌభాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయ వార్షికోత్సవ, శిఖర కుంభాభిషేక శ్రావణమాస మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం ఉదయం అమ్మవారికి త్రికాల నిత్యార్చన, చక్రార్చన, కుంకుమ పూజలు నిర్వహించారు. అమ్మవారిని ధైర్యలక్ష్మిదేవిగా దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు వారణాశి రాఘవేంద్రశర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. 4న శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని అమ్మవారు గజలక్ష్మిదేవిగా దర్శనమిస్తారని తెలిపారు.

చాటపర్రు ఆంజనేయస్వామి కోవెలలో..

చాటపర్రు జనార్ధనస్వామి ఆలయంలో దాసాంజనేయస్వామికి శ్రావణ మంగళవారం పురస్కరించుకుని ఆలయ అర్చకులు ఫణికుమార్, శోభనాద్రి విశేష పూజలు నిర్వహించారు. తమలపాకులు, సింధూరంతో పూజలు నిర్వహించారు.



చిన్నారులకు టీకాలు వేస్తున్న సర్పంచ్ లక్ష్మి

పిల్లలకు ఎంఆర్ వ్యాక్సిన్ వేయించాలి

ఏలూరు రూరల్: పిల్లల్లో తట్టు, రుబెల్లా వ్యాధులను నిర్మూలించేందుకు వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించాలని కోటేశ్వర దుర్గాపురం సర్పంచ్ లక్ష్మి పేర్కొన్నారు. పీహెచ్‌సీలో మంగళవారం చిన్నారులకు ఎంఆర్ వ్యాక్సిన్ వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు ఈ వ్యాక్సిన్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

ఏలూరు రూరల్: అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఆసరా అని తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు మాగంటి రామ్‌జీ అన్నారు. ఎంపీ కార్యాలయంలో మంగళవారం సీఎం సహాయనిధి చెక్‌లను ఆయన అందించారు. ఎంపీ బాబు లోక్‌సభ సమావేశాల్లో ఉన్నందున రూ.1.16 లక్షలు చెక్‌లు రామ్‌జీ అందజేశారు.



సీఎం సహాయనిధి చెక్ అందిస్తున్న మాగంటి రామ్‌జీ

పేద విద్యార్థులకు బస్ పాస్‌ల పంపిణీ

ఏలూరు రూరల్: పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తామని ఉషాబాల చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ వి.వి. బాలకృష్ణారావు తెలిపారు. ట్రస్టు ఆధ్వర్యంలో కొవ్వలి, దోసపాడు, పోతునూరు హైస్కూలులోని 550 మంది విద్యార్థులకు బస్‌పాస్‌లను మంగళవారం అందించారు. ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ ఎస్.నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థినులకు బస్‌పాస్‌లు అందిస్తున్న ఉషాబాలకృష్ణారావు

వైద్యుల సేవా నిరతి అభినందనీయం

ఏలూరు రూరల్: వైద్యుల సేవా నిరతి అభినందనీయమని డిప్యూటీ మేయర్ నాయుడు పోతురాజు అన్నారు. పాతబస్టాండ్ వద్ద ప్రైవేట్ ఆస్పత్రిలో మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పలు వైద్య పరీక్షలను నిర్వహించడం వలన డబ్బును ఆదా చేసుకోవడంతోపాటు వైద్యం కూడా సులువుగా అందడం రోగులకు ఒక విలువైన కానుక అన్నారు. ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసుపత్రి వైద్యులు సుధాకర్ రోగులను పరీక్షించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ కోయ కాంచనమాల, నగరంలోని పలువురు వైద్యులు, ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులు లక్ష్మీ, ప్రశాంతి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.





● మార్కెట్ ధరలు

ఏలూరు రైతు బజారులో మంగళవారం నాటి కూరగాయల ధరలు

కిలోల్లో..	రూ.
టమాటా	42-00
వంగ	28-00
బెండ	24-00
మిర్చి	34-00
కాకర	30-00
బీర	12-00
క్యాబేజీ	16-00
క్యారెట్	28-00
దొండ	24-00
బంగాళదుంపలు	14-00
ఉల్లిపాయలు	19-00
దోస	18-00
ఆనప	10-00
పొట్లకాయ	10-00
అరటి	4-00
గోరుచిక్కుడు	26-00
చామదుంపలు	30-00
మునగ	4-00
ఆకుకూరలు (కట్ట)	3-00
కంద	28-00
బీట్‌రూట్	34-00
కీరదోస	32-00
ఫ్రెంచ్‌బీన్స్	80-00
రైస్	30-00
కందిపప్పు	63-00
మినపప్పు	72-00
పెసరపప్పు	71-00
చింతపండు	100-00
ఆయిల్	59-00

- ఏలూరు టూటౌన్

తల్లిపాలు బిడ్డకు అమృతం

ఏలూరు రూరల్: తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని నగర మేయర్ షేక్ నూర్జహాన్ అన్నారు. కలెక్టరేట్ ఆవరణలోని అమరావతి కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలను ప్రారంభించారు. గర్భిణులు, బాలింతలకు అందించే పోషకాహారాలను పరిశీలించారు. తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని, పుట్టిన వెంటనే ముర్రిపాలు పట్టించాలన్నారు. తల్లిపాల వలన బిడ్డకు శారీరక, మానసిక ఆరోగ్యంతో పాటు సంపూర్ణ రక్షణ కల్పిస్తుందన్నారు. తల్లిపాలు సంస్కృతిని పెంపొందించడానికి చాలా అవసరమన్నారు. అంగన్‌వాడీలు విశేష ప్రచారం నిర్వహించాలన్నారు. తల్లిపాల వలన పిల్లలకు వ్యాధులు రాకుండా నిరోధిస్తాయన్నారు. ఎమ్మెల్సీ రాము సూర్యారావు మాట్లాడుతూ తల్లిపాల సంస్కృతి, రక్షణ సహకారానికి పిల్లల పోషణ పద్ధతుల ఆచరణకు నిర్దేశించిన ప్రభుత్వ విధి విధానాలను పటిష్టంగా అమలు చేసేందుకు ఐసీడీఎస్ అధికారులు కృషి చేయాలన్నారు. తల్లిపాల వలన బిడ్డకు మెల్లిన ఆరోగ్యం చేకూరుతుందన్నారు. తల్లులందరికీ మాతృత్వ రక్షణ కల్పించేందుకు ఆరోగ్య కార్యకర్తలు ప్రత్యక్షంగా, పరోక్షంగా బాలింతలను కలిసి వారి సంరక్షణను తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్.విద్యావతి, ఏలూరు అర్బన్ సీడీపీవో వై.విజయలక్ష్మి, డీపీహెచ్ఎన్ మీరాపాల్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



పోషకాహారం పరిశీలిస్తున్న మేయర్ నూర్జహాన్

అతి వేగం వద్దు

ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ డీఎస్పీ కౌన్సెలింగ్



ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ డీఎస్పీ శ్రీనివాసరావు

ఏలూరు క్రైం: ఆటోలు అతి వేగంగా నడిపితే ప్రమాదాలు జరుగుతాయని ట్రాఫిక్ డీఎస్పీ ఎ.శ్రీనివాసరావు సూచించారు. ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాన్ని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఉదయం నిర్వహించారు. నగరంలోని ఆటో డ్రైవర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. డీఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు క్రమశిక్షణతో ఉండాలని, ట్రాఫిక్ నిబంధనల ప్రకారం నడుచుకోవాలన్నారు. ప్రయాణికులతో మర్యాదగా నడుచుకోవాలని సూచించారు. నగరంలో కొంతమంది ఆటో డ్రైవర్లు అతివేగంగా ఆటోలు నడుపుతూ ప్రయాణికులు కనిపించగానే అకస్మాత్తుగా బ్రేక్‌లు వేసి వెనుక వస్తున్న వాహనదారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నట్టు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. చాలామంది ఆటో డ్రైవర్లు రాత్రి వేళ ప్రయాణికుల నుంచి ఎక్కువ చార్జీ వసూలు చేస్తున్నారని, ఫిర్యాదు అందితే తీవ్రంగా పరిగణించి చర్యలు తీసుకుంటామన్నారు. తాము కూడా నిఘా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. మద్యం తాగి ఆటోలు నడిపితే సంబంధిత డ్రైవర్‌ను అరెస్టు చేయడమే కాకుండా ఆటోను చట్టప్రకారం సీజ్ చేస్తామన్నారు. ఆటోకు సంబంధించిన సీ బుక్, ఇన్సూరెన్స్ పర్మిట్, డ్రైవర్‌కు డ్రైవింగ్ లైసెన్సు తప్పనిసరిగా ఉండాలని, వీటిలో ఏ ఒక్కటి లేకపోయినా కేసులు నమోదు చేస్తామన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. కొంతమంది ఆటో డ్రైవర్లు ఆటోలకు స్టీరియో బాక్సులను బిగించి ఎక్కువ శబ్దంతో ప్రయాణాలను కొనసాగిస్తున్నారని, స్టీరియో బాక్సులను తొలగించి స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్ల సందేహాలను డీఎస్పీ శ్రీనివాసరావు నివృత్తి చేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐలు ఎం.రాంబాబు, డి.రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

అధ్యాపకేతర సిబ్బంది ఉద్యోగ విరమణ

ఏలూరు అర్బన్: సెయింట్‌థెరిస్సా మహిళా కళాశాల అధ్యాపకేతర సిబ్బంది ఎస్.అంజలి, బి.లూర్థుమేరీ ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. విద్యా సంస్థల మదర్, కరస్పాండెంట్ ఎర్నస్టీన్, ప్రిన్సిపాల్ డాక్టర్ మెర్సీ మాట్లాడుతూ సిబ్బంది అభినందించారు. పీజీ కోర్సుల డైరెక్టర్ సిస్టర్ మరియెట్టా డిమెల్లో, వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ శౌరీ లు, సిస్టర్ సుశీల, సిస్టర్ సునీలారాణి, కంప్యూటర్ హెచ్‌వోడీ బి.అన్నపూర్ణ, తదితరులు పాల్గొన్నారు. అంజలి, లూర్థుమేరీలను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు.

భార్గవరెడ్డికి చెస్ బహుమతులు

ఏలూరు అర్బన్: జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భీమవరంలో జరిగిన అండర్-15 చెస్ టోర్నమెంట్‌లో శాంతినగర్ శ్రీచైతన్య టెక్నోస్కూలు విద్యార్థి పిఎల్ భార్గవరెడ్డి ప్రథమస్థానం సాధించాడని ప్రిన్సిపాల్ కెవిఎస్ మాధవ్ తెలిపారు. అండర్-11 విభాగం పోటీల్లో కూడా 5వ స్థానంలో నిలిచాడని వివరించారు. విజేతను స్కూల్ అకడమిక్‌డీన్ సీహెచ్ ఉదయభాస్కర్, ప్రైమరీ ఇన్‌చార్జి బి.శివకుమారి, తదితరులు అభినందించారు.

చైతన్య విద్యార్థుల వనం-మనం

బాలాజీనగర్ శ్రీచైతన్య టెక్నోస్కూలులో వనం-మనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. చాటపర్రు సర్పంచ్ భాగ్యశ్రీ విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రశాంతతకు మొక్కలే పట్టుకొమ్మలని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలన్నారు. విద్యార్థులు ర్యాలీ నిర్వహించి మొక్కలు పంపిణీ చేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ఏలూరు రూరల్: వట్లూరు 33/11 కెవి సబ్ స్టేషన్ పరిధిలో బుధవారం సరఫరా నిలిపివేయనున్నారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సీఆర్ఆర్ కళాశాల, కలెక్టరేట్ బంగ్లా, ఎస్పీ బంగ్లా, జిల్లా జడ్జి క్వార్టర్స్, టీటీడీ కళ్యాణ మండపం ప్రాంతాల్లో సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆ శాఖ డీఈఈ కె.నాగేశ్వరరావు తెలిపారు.

నేడు ముల్పూరి సంస్మరణ సభ

ఏలూరు టూటౌన్: సీపీఐ సీనియర్ నాయకులు, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ముల్పూరి రామ్మోహనరావు సంస్మరణ సభ బుధవారం నిర్వహించనున్నట్టు సీపీఐ నాయకులు బండి వెంకటేశ్వరరావు తెలిపారు. సంస్మరణ సభకు కార్మికులు హాజరుకావాలని కోరారు.

పరిసరాల పరిశుభ్రతకు స్వచ్ఛ పక్వాడా



ప్రతిజ్ఞ చేస్తున్న ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్, ఆఫీసర్లు

ఏలూరు అర్బన్: పరిసరాల పరిరక్షణ, పరిశుభ్రతకు ఈ నెల 15 వరకు ప్రభుత్వం నిర్వహించతలపెట్టిన స్వచ్ఛ పక్వాడా కార్యక్రమాన్ని మంగళవారం సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలలో డీపీవో దుర్గారావు ప్రారంభించారు. రోజువారీ కార్యక్రమాలకు సాంకేతికతను ఉపయోగించి సులభతరంగా పనులు చేసుకునే విధానాన్ని వివరించారు. పురసేవ యాప్‌ను ఉపయోగించి వీధుల్లో చెత్త తొలగించేందుకు, డ్రైనేజీల్లో వచ్చే సమస్యలను పరిష్కరించేందుకు పురపాలక అధికారులకు, ఉద్యోగులకు సమాచారాన్ని చేరవేయవచ్చునన్నారు. నగర పరిశుభ్రతకు కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ మెర్సీ, సిస్టర్ సునీలారాణి, డాక్టర్ కెవిఎల్ సరస్వతి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ నీరజ, ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ రమ, మరియమ్మ, లుంబినీదేవి, జగదీశ్వరి పాల్గొన్నారు.

హలో 'ఆంధ్రజ్యోతి'

మీ ప్రాంతంలో జరిగే సభలు, సమావేశాలు, సంఘటనలు, ఉత్సవాలు, స్థానిక సమస్యలపై మాకు సమాచారం ఇవ్వండి.

ఏలూరు సిటీ	: 99854 01668
ఏలూరు అర్బన్	: 9848220735
ఏలూరు క్రైం	: 9848238482
ఏలూరు రూరల్	: 9441556656
ఏలూరు టూటౌన్	: 9247855290

సినిమా గైడ్ :

ఏలూరు:

విజయలక్ష్మి (వీ-మాక్స్-1)	ఫిదా
విజయలక్ష్మి (వీ-మాక్స్2)	మాయామాల్
అంబికా స్ర్కీన్ 1	గౌతమ్ నంద
అంబికా స్ర్కీన్ 2	దండుపాళ్యం-2
అంబికా స్ర్కీన్ 3	డిజె దువ్వాడ జగన్నాథం
మినీ సత్యనారాయణ	గౌతమ్ నంద
సత్యనారాయణ	శమంతకమణి
సాయి బాలాజీ	నిన్నుకోరి
బాలాజీ	గౌతమ్ నంద
క్రాంతి	వాసుకి

జీవో 279 రద్దు చేయాలి

మునిసిపల్ కార్మికుల ఆందోళన

నిరవధిక సమ్మె హెచ్చరిక

ఏలూరు టూటౌన్: మునిసిపల్ కాంట్రాక్ట్ కార్మికులకు నష్టం కలిగించే 279 జీవోను రద్దు చేయాలని, జీవో అమలు కోసం పిలిచిన టెండర్లను ఉపసంహరించుకోవాలని మున్సిపల్ కార్మికుల యూనియన్ నాయకులు బి.సోమయ్య డిమాండ్ చేశారు. మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద కార్మికులు ఆందోళన నిర్వహించారు.

కార్మిక నాయకులు మాట్లాడుతూ కార్మికులు, కార్మిక సంఘాలు రాష్ట్రవ్యాప్తంగా పోరాటాలు చేస్తున్నా ప్రభుత్వం 279 జీవో రద్దు చేయకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. అనంతరం వందలాది కార్మికులు మానవహారంగా నిలబడ్డారు. టెండర్లను రద్దుచేయాలని, జీవోను ఉపసంహరించుకోవాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు కె.కృష్ణమాచార్యులు, బండి వెంకటేశ్వరరావు, పోతురాజు, జి.అర్జప్ప సోమరాజు, వివేకవతి, మరియమ్మ, తదితరులు పాల్గొన్నారు.

భోజన విరామ సమయంలో నిరసన

నగరపాలక సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను వీధులపాలు చేసే 279 జీవో రద్దు చేయాలని కోరుతూ జోనల్ మునిసిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ విభాగం సిబ్బంది మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ జీవో నెంబరు 279ని రద్దుచేసి, 151 జీవోను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికుల బకాయి పడిన వేతనాలు తక్షణమే చెల్లించాలన్నారు. రాష్ట్ర జేఏసీ పిలుపులో భాగంగా ఆగస్టు 4న జరిగే మౌన ప్రదర్శనలో కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఎ.అప్పలరాజు, కె.కన్నయ్య, బి.నాగేశ్వరరావు, కె.శ్రీనివాస్, దుర్గారావు, రాంబాబు పాల్గొన్నారు.

మినీ లోకం



సమాచారం..

ఉష్ణోగ్రతలు :	గరిష్ఠం	కనిష్ఠం
ఏలూరు	36	25
భీమవరం	36	26
తణుకు	36	26
తాడేపల్లిగూడెం	36	26
నరసాపురం	35	27
పాలకొల్లు	36	26
నిడదవోలు	36	26
కొవ్వూరు	35	26
జంగారెడ్డిగూడెం	36	26

ద్వారకా తిరుమల గదుల సమాచారం (ఖాళీలు)

టీటీడీసదనం	10
రాణి చిన్నయమ్మారావు సదనం	22
మావులేటి సదనం	5
ఆళ్వార్ సదనం	16
బాలాజీ సదనం	4
ఆండాళ్ సదనం	2
పద్మావతి సదనం	2
ధర్మ అప్పరాయ సదనం	101
కాటేజీలు	15

రాత్రి 8 గంటల వరకు అందిన సమాచారం

ఫోన్ నెంబర్ : 08829 271427

చికెన్ ధరలు	
ఫారం ధర	67.00
లైవ్ రిటైల్	81.00
విత్ స్కిన్	113.00
స్కిన్ లెస్	134.00

గుడ్డు ధర ఒక్కింటికి రూ. 3.08

బంగారం, వెండి ధరలు (నరసాపురం)	
24 క్యారెట్ల బంగారం (10 గ్రాములు)	: 29,630
22 క్యారెట్ల బంగారం (10 గ్రాములు)	: 27,270
వెండి (కేజీ)	: 39,280

రేపు జయ ప్రకాష్ నారాయణ రాక

ఆకివీడు : లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జయ ప్రకాష్ నారాయణ జిల్లా పర్యటనలో భాగంగా గురువారం ఆకివీడు రానున్నారు.లోక్‌సత్తా పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యుడు గొట్టుముక్కల జానకిరామరాజు మాట్లాడుతూ పోలవరం సందర్శించి సాయంత్రం ఆకివీడు చేరుకుంటారని తెలిపారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో పాల్గొని భీమవరం వెళ్తారని అన్నారు.

చైనా వస్తువులను బహిష్కరించాలి

మంత్రి పైడికొండల మాణిక్యాలరావు



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న మంత్రి పైడికొండల

పాలకోడేరు : ఆనాడు మహాత్మాగాంధీ స్వదేశీ వస్తువులకే ప్రాధాన్యం ఇచ్చారని.. నేడు చైనా వస్తువులు మన దేశాన్ని కబళించి ఆర్థిక వ్యవస్థను దెబ్బకొడుతున్నాయని మంత్రి మాణిక్యాలరావు అన్నారు. చైనా వస్తువులను బహిష్కరించాలంటూ ఆర్‌ఎస్‌ఎస్ నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం పాలకోడేరు మండలం కోరుకొల్లులో అవగాహన ర్యాలీని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి పైడికొండల మాణిక్యాలరావు మాట్లాడుతూ చైనా వస్తువులు దేశ ఆర్థిక వ్యవస్థనే కుంగదీస్తున్నాయన్నారు. భారతదేశంలో ఉన్న ప్రతి ఒక్కరూ ఈ నెల ఒకటి నుంచి 15వ తేదీ వరకు గ్రామాల్లోని ఇంటింటికి వెళ్లి చైనా వస్తువులు వాడటం వల్ల వచ్చే అనర్థాల గురించి వివరించాలని కోరారు. నాణ్యత లేని వస్తువులతో దేశాన్ని నింపేసిందని, ఎన్‌ఎస్‌జీలో దేశ సభ్యత్వానికి అడ్డుపడ్డారని అన్నారు. చైనా వస్తువులను కొంటే పాక్ తీవ్రవాదులకు సాయం చేసినట్లేనని పేర్కొన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తూ భారత్‌కు జై కొట్టు.. చైనాకు ఛీ కొట్టు అంటూ నినాదాలు చేశారు. కోరుకొల్లు గ్రామంలో చైనా వస్తువుల దిష్టిబొమ్మలను దహనం చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.రవీంద్రరాజు, భరత్, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కుమారస్వామి,బీజేపీ జిల్లా అధ్యక్షుడు భూపతిరాజు శ్రీనివాసవర్మ, అరసవల్లి సుబ్రహ్మణ్యం, తాతాజీ, మంతెన రామచంద్రరాజు, గాదిరాజు శ్రీనివాసరాజు, చినబాబు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల గుండెల్లో రైళ్లు..

తణుకులో అక్రమ కట్టడాలపై విచారణకు ఆదేశం

తాజాగా ప్రభుత్వ ఉత్తర్వులు జారీ



తణుకు మునిసిపల్ కార్యాలయం

తణుకు : పట్టణాల్లో ఇబ్బడి ముబ్బడిగా అపార్టుమెంట్‌లు, కమర్షియల్ కాంప్లెక్స్‌ల నిర్మాణాల్లో నిబంధనలు ఉల్లంఘించారంటూ ప్రభుత్వం ఆయా సమయాల్లో పని చేసిన అధికారులపై విచారణకు ఆదేశించింది. దీనికి సంబంధించి మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపాల్ సెక్రటరీ కరికాల వల్వన్ సంబంధిత మునిసిపల్ వెబ్ సైట్‌లో అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో తణుకు, విశాఖ జిల్లా నర్శీపట్నం మునిసిపాల్టీల పరిధిలోని అధికారులపై విచారణకు ఆదేశిస్తూ స్పష్టం చేసింది. తణుకు మునిసిపల్ పరిధిలో 29 జనవరి 2014లో పని చేసిన అప్పటి మునిసిపల్ కమిషనర్‌లు కె.సాయిరామ్,బాలస్వామితో పాటు టీపీవో లక్ష్మీనారాయణ, టీపీబీవో రవీంద్రనాథ్, టీవీఎస్ గణేశ్వరరావు(రిటైర్డ్)లపై విచారణకు ఆదేశించారు. విచారణ అధికారులుగా మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజనల్ డైరెక్టర్(గుంటూరు)జి.శ్రీనివాస్‌తో పాటు ప్రస్తుత మునిసిపల్ కమిషనర్ సాంబశివరావు వ్యవహరిస్తారు. అప్పట్లో కమిషనర్‌లుగా పని చేసిన ఇరువురు రాజకీయ ఒత్తిడికి లొంగి నిబంధనలకు విరుద్ధంగా అపార్టుమెంట్‌లు కమర్షికల్ కాంప్లెక్స్‌లకు నిర్మాణాలు చేసిన పట్టించుకోలేదనేది ప్రధానమైన ఆరోపణ. దీనిపై దివంగత కౌన్సిలర్ మునిసిపల్ ఉన్నతాధికారులకు అప్పట్లో ఫిర్యాదు చేసినట్టు కూడా అనేక సందర్భాల్లో చెప్పిన దాఖలాలు కూడా ఉన్నాయి. అధికారులు నిబంధనలు పక్కనపెట్టి ఇష్టాసారం వ్యవహరించారనే ఆరోపణలు కూడా అప్పట్లో బలంగానే వినిపించాయి. అయితే తమకేమీకాదన్న రీతిలో వ్యవహరించడం వల్లే ఈ దుస్థితి వచ్చిందనే ఆరోపణలు కూడా లేకపోలేదు. నిర్మాణాలపై మునిసిపల్ విజిలెన్స్ అధికారులు తనిఖీలు నేపథ్యంలో బయటకు వచ్చిందనే సమాచారం కూడా లేకపోలేదు. ఉన్నతాధికారులు, రాజకీయ నాయకులు చెప్పినట్టు తలాడిస్తూ పబ్బం గడుపుకోవడం వల్లే ఇలాంటి పరిణామాలు జరుగుతున్నాయనే వాదన కూడా వినిపిస్తోంది. పదవీ విరమణ పొందిన అధికారులపై కూడా ప్రభుత్వం విచారణ చేయాలని ఆదేశించడంతో ఒకింత ఆందోళనకలిగించే అంశమే. సాధారణంగా టౌన్‌ప్లానింగ్ విభాగమే కీలకం. ఏభవనం నిర్మించాలన్న సంబంధిత అధికారులే అనుమతులివ్వాలి. అయితే రాజకీయ నాయకుల ఒత్తిడికి తలొగ్గి నిబంధనలకు విరుద్ధంగా అనుమతులిచ్చిన దాఖలాలు అనేకం. కొన్ని రోజుల్లోనే నిబంధనలు ఉల్లంఘించి నిర్మించిన భవనాల వివరాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఏదిఏమైనా ప్రభుత్వ ఉత్తర్వులతో అధికారులు గుండెల్లో రైళ్ల పరుగెడుతున్నాయి.

పాదయాత్రకు అనుమతి ఇవ్వకుంటే ఉద్యమిస్తాం..

కాపు సంఘ నాయకుడు చినమిల్లి రాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న చినమిల్లి రాయుడు

నరసాపురం : కాపు ఉద్యమానికి అధికార పార్టీ నేతల అండదండలు కూడా ఉన్నాయని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చినమిల్లి రాయుడు అన్నారు. టీడీపీ అధిష్ఠానానికి భయపడి వీరు వెనుకనుంచి మద్దతునిస్తున్నారన్నారు. మంగళవారం నరసాపురంలోని తెలగా కల్యాణ మండపంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ముద్రగడ ఆందోళనకు అధికార పార్టీ ముఖ్య నాయకులు పాల్గొనడం లేదని చేస్తున్న ప్రకటనలో వాస్తవం లేదన్నారు. అలాగే ఇతర పార్టీల అండదండలతో కాపులు ఉద్యమించడం లేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేయమని మాత్రమే డిమాండ్ చేస్తున్నామన్నారు. ముద్రగడ పాదయాత్రకు అనుమతి ఇవ్వని పక్షంలో గురువారం నుంచి జిల్లాలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని రాయుడు హెచ్చరించారు. కేసులకు కాపులు భయపడే స్థితిలో లేరన్నారు. తుని ఘటనలో దోషులెవ్వరూ చెప్పకుండా ప్రభుత్వం ముసుగులో గుద్దులాట ఆడటం సరికాదన్నారు. కాలయాపన చేసేందుకే ప్రభుత్వం కమిషన్ వేసిందే తప్ప అమలు చేసే చిత్తశుద్ధి చంద్రబాబుకు లేదన్నారు. గతంలో వేసిన పుట్టుస్వామి కమిషన్ పేరుతో తొమ్మిదేళ్ల కాలయాపన చేసిన చంద్రబాబును కాపులు మరువన్నారు. ముద్రగడ యాత్రపై ఇటు ప్రభుత్వం,అటు హోంమంత్రి, డీజీపీలు చేస్తున్న ప్రకటనలకు పొంతన లేదన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి కోటిపల్లి సురేష్ మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలకు కాపులంతా ఐక్యంగా పోరాడాలన్నారు. సమావేశంలో కాపు సంఘం నాయకులు ఎన్.సోమేశ్వరరావు, ఎం.శ్రీనువాసరావు, బి.సత్యవతి, కొత్తపల్లి సుబ్బలక్ష్మి, నాగు, కృష్టారావు, పి.సూరిబాబు, రామాంజనేయులు, స్థానిక నాయకులు పాలంకి ప్రసాద్, మేడిద రాము, కె.బ్రహ్మానందం, డి.శ్రీనువాస్, గురుజు శ్రీను, వన్నెంరెడ్డి శ్రీను, వీరబాబు, దినేష్ పాల్గొన్నారు.

దినఫలాలు

అదృష్టసంఖ్యలు : 6 7, 9

మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): చిన్నారులు, ప్రియతముల విషయాల్లో ప్రోత్సాహకరం. ఉన్నత విద్యా విషయాలు, సమావేశాలు, చర్చల్లో సత్ఫలితాలు సాధిస్తారు. ప్రయాణాలు, వ్యూహరచనలకు అనుకూలం.

వృషభరాశి: (ఏప్రిల్21-మే20): కుటుంబ సభ్యుల ఆరోగ్యం మెరుగవుతుంది. ఆర్థిక విషయాల్లో సన్నిహితుల సహకారం లభిస్తుంది. ఇంటి అవసరాలకు సకాలంలో డబ్బు చేతికి అందుతుంది. ఇంటి కోసం విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు.

మిథునరాశి:(మే21-జూన్21): శ్రీవారు, శ్రీమతి వైఖరి ఉల్లాసం కలిగిస్తుంది. బంధుమిత్రులతో సమావేశాలు ఫలిస్తాయి. ప్రియతముల నుంచి కీలక సమాచారం అందుకుంటారు. సమావేశాల్లో, బృందకార్యక్రమాల్లో కీలకపాత్ర పోషిస్తారు.

కర్కాటకరాశి:(జూన్22-జూలై23): విందు వినోదాల్లో పాల్గొంటారు. ఆర్థిక విషయాల్లో సహోద్యోగులు సహకరిస్తారు. అదనపు ఆదాయం కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. క్యాటరింగ్, రిటైల్ రంగం, హోటల్, వైద్య రంగాల వారికి ప్రోత్సాహకరం.

సింహరాశి:(జూలై24-ఆగస్ట్23): పెట్టుబడులు, పొదుపు పథకాలు లాభిస్తాయి. విద్యార్థులకు ప్రోత్సాహకరంగా ఉంటుంది. సృజనాత్మక రంగాల వారికి ప్రోత్సాహకరం. చిన్నారుల విషయంలో శుభ పరిణామాలు చోటుచేసుకుంటాయి.

కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): సోదరీసోదరుల విషయంలో శుభపరిణామాలు సంభవం. ప్రయాణాలు ఆనందం కలిగిస్తాయి. అగ్రిమెంట్లపై ఒక నిర్ణయానికి వస్తారు. విలువైన సమాచారం అందుకుంటారు. విద్యార్థులకు శుభప్రదం.

తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): షాపింగ్ ఉల్లాసం కలిగిస్తుంది. ఆర్థికపరిస్థితి ప్రోత్సాహకరంగా ఉంటుంది. ఆర్థిక సంస్థలు, బ్యాంకులతో పనులు పూర్తవుతాయి. విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. ప్రేమానుబంధాలు బలపడతాయి.

వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): సంకల్పం నెరవేరుతుంది. ప్రభుత్వ సంస్థలు, రాజకీయ రంగాల వారు గౌరవ, మన్ననలు అందుకుంటారు. పెద్దల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. వృత్తి, వ్యాపారాల విషయంలో కీలక నిర్ణయాల తీసుకుంటారు.

ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): దూరంలో ఉన్న ప్రియతములను కలుసుకుంటారు. ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాలు, ఉత్సవాలకు నిధులు సమకూరుతాయి. ముఖ్య సమాచారం అందుకుంటారు. సినీ, రాజకీయ రంగాల వారికి ప్రోత్సాహకరం.

మకరరాశి(డిసెంబర్22-జనవరి21): బృందకార్యక్రమాలు, వేడుకలకు అవసరమైన నిధులు సర్దుబాటవుతాయి. షాపింగ్ ఆనందం కలిగిస్తుంది. బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో సమావేశాలు ఫలిస్తాయి. పూర్వ మిత్రులను కలుసుకుంటారు.

కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): ఉన్నత పదవులు అందుకుంటారు. భాగస్వామి సహకారంతో వృత్తి, వ్యాపారాల్లో లక్ష్యాలు సాధిస్తారు. జనసంబంధాలు మెరుగుపడతాయి. వేడుకలు, శుభకార్యాల్లో ప్రముఖులను కలుసుకుంటారు.

మీనరాశి: (ఫిబ్రవరి19మార్చి20): వృత్తిపరమైన సమావేశాలు, ప్రయాణాలకు అనుకూలం. సహోద్యోగులతో చర్చలు ఫలిస్తాయి. ఉద్యోగ, వ్యాపారాల్లో లక్ష్య సాధనకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తారు. సంకల్పం నెరవేరుతుంది.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ


అవపాడు వద్ద ఇటీవల లారీలో మృతి చెందిన ఆవులు (ఫైల్)



గో వ్యథ

అక్రమంగా గోవుల తరలింపు ● నిబంధనలు బేఖాతర్

అక్రమంగా గోవధశాలకు తరలిస్తున్న గోవులను పోలీసులు పట్టుకున్నారు.. ఇటువంటి వార్తలు ఇటీవల తరచుగా వింటున్నాం.. గతనెలలో నల్లజర్ల మండలం ఆవపాడు వద్ద అక్రమంగా లారీలో ఆవులను తరలిస్తుండగా ఆకలి దప్పికలతో 32 మృత్యువాత పడిన హృదయవిదారక సంఘటన పాఠకులకు విదితమే..అలానే జీలుగుమిల్లి మండలం లక్ష్మీపురం వద్ద ఆవులను, ఎద్దులను ఇరుకైన కంటైనర్‌లో తరలిస్తుంగా గో సంరక్షణ సమితి సభ్యులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు.. దేశంలో 23 రాష్ట్రాల్లో గోవధ నిషేధ చట్టం ఉన్నా అమలు మాత్రం శూన్యం... అసలు గోవులను తరలించాలంటే ఎవరి అనుమతులు ఉండాలి... చట్టం ఏం చెబుతుంది. అక్రమ రవాణా చేస్తే ఎవరిని అదుపులోకి తీసుకోవాలి... ఏ కేసులు పెట్టాలి వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.. ప్రతి అధికారి తన విధులను సక్రమంగా నిర్వర్తిస్తే గో అక్రమ రవాణా పూర్తి స్థాయిలో ఆగిపోతుందని జంతు ప్రేమికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

- నల్లజర్ల, జీలుగుమిల్లి

యథేచ్ఛగా చట్టం ఉల్లంఘన

వేదుల జనార్ధరావు, విశ్వహిందూ పరిషత్ జిల్లా ప్రముఖ్, వంకవారిగూడెం



గోవును మాతగా కొలిచే మన దేశంలో గోహత్యలకు అంతేలేకుండా పోతోంది. దేశంలో చట్టబద్ధంగా 2000లు గోవధ శాలలు ఉండగా అనుమతులు లేనివి కొన్ని వేలు ఉన్నాయి. ఆరు ఆవుల్ని ఎక్కించాల్సిన లారీలో 50 ఆవుల్ని ఎక్కించి పశువధ శాలకు రవాణా చేస్తున్నారు. గోవధ నిషేధ చట్టాన్ని యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నా ఇటు ఇండియన్ యానిమల్ బోర్డు గాని ప్రభుత్వం గాని పట్టించుకున్న దాఖలాలు లేవు. బ్లూక్రాస్ వంటి స్వచ్ఛంద సేవా సంస్థల పోరాటాలు ఆరణ్య రోదనగానే మిగిలాయి. రాజ్యాంగంలో 48 అధికరణ ప్రతీ రాష్ట్రం గోవధను నిరోధించాలని గోసంతతిని కాపాడాలని కచ్చితమైన నిబంధనలు చేశాయి. దేశం నుంచి గోవు చర్మాల ఎగుమతి భారీగా జరుగుతోంది. వీటిని నిషేధించాలంటూ అఖిల భారత గో సేవా సంఘం సుప్రీం కోర్టులో వేసిన కేసు పెండింగ్‌లో ఉంది.

ఒక వాహనంలో ఆరింటినే తరలించాలి..

తనికెళ్ల సత్యరవికుమార్, వీహెచ్‌పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జీలుగుమిల్లి



1960 పశువుల క్రూరత్వ నివారణ చట్టం, 1978 ఏపీ గోవధ నిషేధం, పశుసంరక్షణ చట్టాల ప్రకారం పశువుల్ని తరలించే క్రమంలో ఆరు కన్నా ఎక్కువ పశువులను ఒక వాహనంలో ఉంచరాదు. గోవుల్ని తరలించేందుకు పశు వైద్యాధికారి ధ్రువీకరణ అవసరం, వాహనంలోనే వాటికి సరిపడా ఆహారం, నీళ్లు ఉంచాలి. దింపేటప్పుడు ర్యాంపు, సరైన తాళ్లను ఉపయోగించాలి. వాహనంలో తరలించే క్రమంలో ఎంత సమయంలో వాహనంలో వాటిని తరలించేది ఉండాలి. పశు వైద్యం కోసం ప్రథమచికిత్స పెట్టె ఉండాలి. ప్రతీ పశువుకు వాహనంలో స్థలాన్ని కేటాయించి తరలించాలి.

పశువుల తరలింపులో ప్రభుత్వ నిబంధనలు..

- గోవులను ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలించాలంటే పశువుల సంతలో మార్కెట్ కమిటీ ఛైర్మన్, కార్యదర్శి ఆధ్వర్యంలో ఒక కమిటీ ఉంటుంది. ఈ కమీటీ అనుమతి తప్పనిసరి. ఈ కమిటీలో సంత మార్కెట్ ప్రాంతంలో ఉండే పోలీస్ విభాగంలో సీఐ, పశువైద్యాధికారి, తహసీల్దార్,ఎంపీడీవో ఉంటారు.
- కంటైనర్‌లో తరలించే పశువులను ముందుగా వైద్యులు పరీక్షించి ఆరోగ్య పరిస్థితిపై నివేదిక ఇస్తారు.
- వ్యవసాయ పనులకు పనికి రాని, సంతానోత్పత్తికి పనికి రాని, పాడికి పనికి రాని గేదెలను మాత్రమే కంటైనర్‌లో పశువధశాలకు తరలించే అవకాశం ఉంది.
- ఎక్కడ నుంచి ఎక్కడికి తరలిస్తున్నారో అధికార ధ్రువీకరణ పత్రం, ఎన్ని పశువులను ఎక్కించారు, వాటికి పశుగ్రాసం, నీరు ఉన్న ప్రాంతంలో లారీ నుంచి దింపుకోవడానికి ర్యాంప్‌కు సంబంధించి పనిముట్లు ఉండాలి.
- ఆవులను, ముసలి గేదెలను, గిత్తలను, ఆవు దూడలను తరలించడంపై భారత ప్రభుత్వం నిషేధం విధించింది.
- కంటైనర్‌లో చిన్నసైజు గోవులకు 2 మీటర్లు వెడల్పు, 2మీటర్లు పొడవు స్థలం కేటాయించాలి. పెద్ద సైజు గోవులకు 3 మీటర్లు వెడల్పు 3 మీటర్లు పొడవు స్థలం కేటాయించాలి.
- ప్రమాదం జరిగితే గోవులకు ప్రాథమిక చికిత్స కోసం మందులు ఉందుబాటులో ఉండాలి
- ప్రతి 6గంటలకు నీరు మేత ఉన్న చోట వాహనం నుంచి ర్యాంప్ మీదుగా దింపి నీరు మేత పెట్టాలి.
- అక్రమంగా గోవులను తరలిస్తుంటే వాటిని ప్రభుత్వ గుర్తింపు ఉన్న గోశాలకు తరలించారు.
- నిజమైన రైతులకు ఉచితంగా దత్తత (పాలు తీసుకోవడం, వ్యవసాయ పనులకు ఉపయోగించడం) ఇవ్వాలి.
- రైతులు ఉపయోగించుకున్న తరువాత ముసలి తనం వచ్చిన గోవులను తిరిగి గోశాలకు అప్పగించాలి.
- గోవులను అక్రమంగా తరలిస్తున్నట్లు రుజువైతే సెక్షన్ 11, సబ్ క్లజ్ 1ఏ,సెక్షన్ 12 జంతువులును హింసించడం, గాయపర్చాడం హాని చేయడం వంటి నేరంపై అరెస్ట్ చేస్తారు.
- ఆరు నెలల నుంచి రెండు సంవత్సరాల వరకు జైలు శిక్ష ఉంటుంది.

పశువుల సంత..నిబంధనలు

- పశువుల సంతకు వచ్చే పశువులకు సరిపడే స్థలంతో పాటు,నీటి తొట్టెలు,మేత ఉండాలి.
- పశువులను వాహనం ఎక్కించేందుకు ర్యాంప్‌లు, వాటిని పర్యవేక్షంచేందుకు సీసీ కెమెరాలు ఉండాలి.
- నిబంధనల మేరకు మాత్రమే కంటైనర్‌లో పశువులను ఎక్కించాలి.
- మోతాదుకి మించి పశువులను ఎక్కిస్తే మార్కెట్ యార్డు ఛైర్మన్, కార్యదర్శి బాధ్యులు
- రికార్డు తప్పనిసరి. రైతు ఎవరు.? కసాయి ఎవరు? ఆధార్ కార్డుతో వివరాలు పొందుపర్చాలి.

నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తే కేసులు

ఏటీవీ రవికుమార్, డీఎస్పీ, పోలవరం.



సమాజంలో చట్టానికి వ్యతిరేకంగా జరుగుతున్న ప్రతీ అంశంపై దృష్టి సారించడం పోలీసుల కనీస బాధ్యత. పశువుల్ని నిబంధనలకు విరుద్ధంగా తరలించడంపై కేసులు నమోదు చేస్తున్నాం. ఒకే వాహనంలో లెక్కకుమించి పశువులు తరలించటం దారుణమే. గో సంరక్షణ చట్టంలో భాగంగా అందుకు కారకులపై చర్యలు తీసుకుంటున్నాం.

నాన్నమ్మ ఇంటికెళ్లిపోయిన కుమారుడు

తిరిగిరావాలని తల్లి కోరినా నిరాకరణ

మనస్తాపంతో గుళికలు మింగి తల్లి ఆత్మహత్య

ఏలూరుక్రైం : కుమారుడు మాట వినడం లేదని తీవ్ర మనస్తాపానికి గురైన ఒక తల్లి విష గుళికలను మింగి ఆత్మహత్యకు పాల్పడింది. ఏలూరులోని బీడీ కాలనీకి చెందిన బిక్కవోలు లక్ష్మి(34)కు భర్త ఏసురత్నం మూడేళ్ళ క్రితం విడిపోయి వెళ్ళిపోయాడు. ఆమెకు ఇద్దరు కుమారులు ఉండగా తన వద్దే ఉంచుకుని పోషిస్తోంది. పెద్ద కుమారుడైన మణికంఠ (16) తల్లితో విబేధించి అతని నాయనమ్మ ఇంటికి వెళ్ళిపోయాడు. తిరిగి రావాలని ఆ తల్లి కోరినప్పటికి అతను నిరాకరించాడు. తన కుమారుడు మాట వినడం లేదని తీవ్రమనస్తాపానికి గురైన లక్ష్మి గత నెల 31వ తేదీ రాత్రి విష గుళికలను మింగి పడుకుంది. ఆమె వాంతులు చేసుకుంటుండగా చుట్టుపక్కల వారు గమనించి ఏలూరు ప్రభుత్వాసుపత్రికి అర్ధరాత్రి తరలించారు. ఆమె అప్పటికే మృతి చెందిందని వైద్యులు నిర్ధారించారు. ఎంఎల్‌సీగా నమోదు చేసి ఆసుపత్రి అవుట్ పోస్టు పోలీసులకు సమాచారం అందించారు. ఏలూరురూరల్ సీఐ అడపా నాగ మురళీ ఆధ్వర్యంలో ఎస్‌ఐ ఎం.వి.సుభాష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కిరోసిన్ పోసుకుని అంటించుకుంది

తల్లితో గొడవే కారణం.. చికిత్స పొందుతూ మహిళ మృతి

ఏలూరుక్రైం : కాలిన గాయాలతో ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న ఒక మహిళ మంగళవారం ఉదయం మృతి చెందింది. ఏలూరు వాసావారివీధికి చెందిన తమరాన లలితాదేవి (45) తన తల్లివద్దే ఉంటోంది. గతనెల 2వ తేదీన తల్లితో గొడవపడిన ఆమె తనపై కిరోసిన్ పోసుకుని అగ్గిపుల గీసి అంటించుకుంది. తీవ్ర గాయాలకు గురైన ఆమెను ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందింది. వైద్యులు ఎంఎల్‌సీగా నమోదు చేసి ఆసుపత్రి అవుట్ పోస్టు పోలీసులకు సమాచారం అందించారు. ఏలూరుటూటౌన్ సీఐ జి.మధుబాబు ఆధ్వర్యంలో ఎస్‌ఐ ఎస్.ఎస్.ఆర్.గంగాధర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లాలో 18 మంది ఎస్‌ఐల బదిలీ

ఏలూరుక్రైం : జిల్లాలో పనిచేస్తున్న ఎస్‌ఐలలో 18 మందిని బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ ఎం.రవిప్రకాష్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారిలో పాలకొల్లు టౌన్ ఎస్‌ఐ కె.రామకృష్ణను పోడూరుకు, భీమవరం టూటౌన్ ఎస్‌ఐ బి.సురేంద్రకుమార్‌ను యలమంచిలికి, తణుకు టౌన్ ఎస్‌ఐ జి.శ్రీనివాసరావును ఇరగవరంకు బదిలీ చేశారు. వీఆర్‌లో ఉన్న ఎస్‌ఐ డి.ఆదినారాయణను తణుకుటౌన్‌కు, వీఆర్‌లో ఉన్న ఎస్‌ఐ వి.చంద్రశేఖర్‌ను అనంతపల్లికి, అనంతపల్లిలో పనిచేస్తున్న ఎస్‌ఐ వి.వెంకటేశ్వరరావును పాలకోడేరుకు బదిలీ చేశారు. పాలకోడేరు ఎస్‌ఐ వి.రాంబాబును వీఆర్‌కు బదిలీ చేశారు. ఇరగవరం ఎస్‌ఐ కె.వి.వి.శ్రీనివాస్‌ను కుక్కునూరుకు, యలమంచిలి ఎస్‌ఐ పి.అప్పారావును ఏలూరు విఆర్‌కు, ఏలూరు ట్రాఫిక్ ఎస్‌ఐ ఎ.ఫైడిబాబును ఏలూరు త్రీటౌన్‌కు బదిలీ చేశారు. త్రీటౌన్ ఎస్‌ఐ ఎం.సాగర్‌బాబును వీఆర్‌కు, వీఆర్‌లో ఉన్న పి.చిన్నారావును జీలుగుమిల్లికి, భీమవరం వన్‌టౌన్ ఎస్‌ఐ వెంకట రమేష్‌ను తణుకు రూరల్‌కు బదిలీ చేశారు. తణుకు రూరల్ ఎస్‌ఐ వి.జగదీశ్వరరావును వీఆర్‌కు బదిలీ చేశారు. వీఆర్‌లో ఉన్న టి.నాగ వెంకటరాజును చేబ్రోలుకు, అక్కడ పనిచేస్తున్న చావా సురేష్‌ను వీఆర్‌కు, ఏలూరుటూటౌన్ ఎస్‌ఐ ఎస్.శ్రీరామ గంగాధర్‌ను భీమడోలుకు, భీమడోలులో పనిచేస్తున్న బి.వెంకటేశ్వరరావును వీఆర్‌కు బదిలీ చేస్తూ ఎస్పీ రవిప్రకాష్ ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారంతా తమ నూతన పోస్టింగ్‌లలో చేరాలని ఆదేశించారు.

రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఏలూరుక్రైం : వేగంగా వెళ్తున్న రైలు నుంచి ఒక గుర్తు తెలియని వ్యక్తి జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఏలూరు రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలోని దెందులూరు మండలం అలుగులగూడెం రైల్వే గేటు వద్ద ఒక గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని మంగళవారం ఉదయం ఏలూరు రైల్వే పోలీసులు కనుగొన్నారు. సుమారు 30-35 ఏళ్ళ వయస్సు కలిగిన ఆ వ్యక్తి 5.5 అడుగుల ఎత్తు కలిగి చామనఛాయ శరీరంతో ఉన్నాడు. తెలుపు, నలుపు గడులు కలిగిన చేతుల చొక్కా, లేత ఆకుపచ్చ రంగు ప్యాంటు ధరించి ఉన్నా డు. మృతుడు ధరించిన చొక్కాపై ఆరాధన ఎస్‌పిటి అని కాలర్ మార్క్ ఉంది. శ్రీకాకుళం జిల్లా సోంపేటకు చెందిన వాడై ఉంటాడని ప్రాథమికంగా భావిస్తున్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు ఏలూరు రైల్వే కానిస్టేబుల్ ఎం.విజయ్‌చంద్ర, సెల్ నెంబర్ 94917 23918కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు. రైల్వే ఏఎస్‌ఐ పి.సైమన్ ఆధ్వర్యంలో హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.


మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

మహిళ మెడలో గొలుసు చోరీ

ఏలూరుక్రైం : రోడ్డుపై నడిచి వెళ్తున్న ఒక మహిళ మెడలో బంగారు గొలుసును గుర్తు తెలియని ఇద్దరు యువకులు అపహరించుకుపోయారని ఏలూరు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేశారు. ఏలూరు దక్షిణపువీధికి చెందిన యండమూరి నాగ జ్యోతి(38) గత నెల 31వ తేదీ రాత్రి ఏలూరువన్‌టౌన్‌లోని ఎన్‌ఎస్ కూరగాయల మార్కెట్ నుంచి తన ఇంటికి నడిచి వెళ్తుండగా గుర్తు తెలియని ఇద్దరు యువకులు మోటరు సైకిల్‌పై వచ్చి అకస్మాత్తుగా ఆమె మెడలోని రెండున్నర కాసుల బంగారు నల్లపూసల గొలుసును అపహరించుకుపోయారు. ఈ సంఘటనపై బాధితురాలు ఏలూరు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నగర సీఐ ఎన్.రాజశేఖర్ ఆధ్వర్యంలో వన్‌టౌన్ ఎస్‌ఐ కె.రామారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ తిరగబడి డ్రైవర్ మృతి

పెదవేగి : కృష్ణా జిల్లా ముసునూరు మండలం వేల్పుచర్లకు చెందిన గరికిముక్కు శ్రీరామచంద్రమూర్తి(31) వరి పొలం దమ్ము చేస్తూ ట్రాక్టర్ తిరగబడి మృతి చెందాడు. పెదవేగి మండలం బి.శింగవరంలో మేరుగు లక్ష్మయ్య అనే రైతు పొలంలో మంగళవారం సాయంత్రం శ్రీరామచంద్రమూర్తి దమ్ము చేస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతుడి తండ్రి చంద్రరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెదవేగి హెడ్‌కానిస్టేబుల్ మంగయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కాలంతో పాటు కిళ్లీ మారిపోయింది.. పూర్వం బెడ్‌రూమ్‌లో చిలకలతో ప్రారంభమైన తాంబాలం.. ఆ తరువాత మిఠాయి కిళ్లీగా రూపాంతరం చెందింది.. ప్రస్తుతం ఆ కిళ్లీల లెక్క చెప్పాలంటే కష్టమే.. ఎందుకంటే ఒక్కటి కాదు.. వందలయ్యాయి.. ఒక్కో కిళ్లీలో ఒక్కో టేస్ట్.. మత్తుగా..గమ్మత్తుగా ఉండేలా చేస్తున్నారు.. వినియోగదారులను ఆకర్షిస్తున్నారు.. అందుకే ఖాళీగా కూర్చుంటే చాలు ఒక పాన్ వేసి వద్దాం రా అంటూ మిత్రులను తీసుకెళ్లే పరిస్థితి వచ్చింది.. కాస్త కారంగా.. కాస్త స్వీట్‌గా నోరారా కాలక్షేపం చేసే స్థాయికి తెచ్చింది.. అంతే కాదండోయ్.. ఒక పెళ్లి జరిగినా.. పేరంటం జరిగినా ఆ విందులోనూ పాన్ ఉండాల్సిందే.. లేదంటే ఆకులో వెళితి కనిపిస్తుంది.. ప్రస్తుతం వాళ్లు వీళ్లు అని ఏముంది.. అంతా కిళ్లీ ప్రియులే.. ఈ నేపథ్యంలో మార్కెట్‌లో అగ్రతాంబూలం అందుకుంటున్నది.. - ఏలూరు సిటీ



అగ్రతాంబూలం

- పాన్‌కు పెరుగుతున్న ఆదరణ - ఏ ఫంక్షనైనా పాన్ ఉండాల్సిందే









ఏలూరుసిటీ : కాలం మారింది.. కాలంతో పాటు మనమూ మారిపోయాం.. ఒకనాడు బెడ్‌రూమ్‌లో భార్య చిలకలు చుట్టి భర్తకు తినిపిస్తుంటే ఆహా ఒహో అంటూ ఆరగిస్తూ కబుర్లతో కాలక్షేపం చేసేవారు..ఆ తరువాత అదే కిళ్లీగా రూపాంతరం చెందింది. తమలపాకు పంచిన వగరు.. సున్నం, వక్కతో వచ్చిన ఘాటు.. మధ్య మధ్యలో స్వీట్ పలుకులతో మిఠాయి కిళ్లీగా మారింది.. ప్రస్తుతం పాన్‌గా మారింది. కాస్త వగరు.. కాస్త తీపి.. ఇంకాస్త కారం.. రకరకాల వెరైటీలతో వినియోగదారులను ఆకర్షిస్తోంది.. ఏ పట్టణంలో చూసినా ఏదో ఒక మూల చిన్న చిన్న బడ్డీల్లో ఈ షాపులు కనిపిస్తూనే ఉంటాయి.. వీటికి ఉన్న డిమాండ్ అంతా ఇంతా కాదు.. ఉదయం సాయంత్రం అనీ లేదు.. షాపు తెరిచి ఉన్నంత సేపు కిటకిటలాడుతూనే ఉంటుంది.. ఎందుకంటే ఆధునికకాలంలో తాంబూల సేవనం రూటే సెపరేటుగా మారిపోయింది. పెళ్లి..పేరంటం తదితర ఫంక్షన్లలో భోజనం ఒక రకమైన హోదా అయితే.. అందులో వేసే పాన్ మరొక హోదాగా మారింది. అందుకే జిల్లా వ్యాప్తంగా చూసుకుంటే సుమారు 10 వేల షాపులు ఉన్నట్టు సమాచారం. ఏ షాపు వ్యాపారం చూసినా రోజు రూ. 2 వేలు పైమాటే.. ఎందుకంటే ప్రస్తుతం పాన్ ధర రూ. 20 పైమాటే.. రకాన్ని బట్టి ధర ఉంటుంది.. అయినా పాన్‌పై ఆసక్తి మాత్రం తగ్గడం లేదు.. ఒక వైపు ధర పెరుగుతున్నా.. మరో వైపు ఆసక్తి పెరుగుతూనే ఉంది.. ఇంత డిమాండ్ ఉన్న పాన్ సంగతి తెలుసుకోవాలనుందా.. అయితే మీ కోసం కొన్ని వెరైటీలు..

స్వీట్ పాన్..

ఈ స్వీట్‌పాన్‌లో రెండు రకాలున్నాయి. సాధారణంగా అందించే స్వీట్‌పాన్‌లో ఆకు, సుపారి, సోప్, యాలికులు, పుదీనా, గుల్‌కందా రకాలు ఉంటాయి. దీంతోనే ఈ స్వీట్ పాన్ తయారు చేస్తారు. రెండో రకం ప్రత్యేకం గా అనిపించే స్వీట్ పాన్ ఇందులో కర్జూరం, వక్క, స్వీట్ కోటెడ్‌సోప్, యాలికలు, జాపత్రి, కొబ్బరి, గుల్‌కందా, పాన్‌చెట్నీ, కిస్మిస్, జీడిపప్పులతో తయారు చేస్తారు. సాధారణ పాన్ ఖరీదు రూ.10 నుంచి రూ. 12 ఉండగా, ప్రత్యేకంగా రూపొందించే పాన్ ఖరీదు రూ. 20ల వరకు ధర పలుకుతుంది.

ఫ్లేవర్డ్ పాన్..

ఫ్లేవర్డ్ పాన్స్‌లో దాదాపు 11 రకాల పాన్‌లను తయారు చేస్తుంటారు. యాక్సి, పార్క్ ఎవెన్యూ, గ్రీన్‌యాపిల్, పైనాపిల్, స్ట్రాబెర్రీ, బ్లూబెర్రీ, బ్లాక్‌బెర్రీ, మ్యాంగో, వాటర్‌మిలన్, కుష్‌ఫ్లేవర్, రాత్‌కిరాణి అనే 11 రకాల ఫ్లేవర్స్‌తో స్వీట్ పాన్‌లను తయారు చేస్తారు.ఈ పాన్ ఖరీదు రూ.25 వరకు పలుకుతుంది.



చాక్లెట్ పాన్..

ఇది కూడా ఒకరకమైన ఫ్లేవర్డ్‌పానే అయినా చాక్లెట్ పాన్‌కు ఉన్న ప్రాధాన్యతే వేరు.ఈ పాన్ ఖరీదు రూ.30

స్పెషల్ డ్రైఫ్రూట్ పాన్..

స్పెషల్ డ్రైఫ్రూట్‌పాన్‌కు ప్రత్యేకత ఉంది. ఈ పాన్‌ను స్పెషల్ సుఫారీ (కర్జూరపు వక్క), మసాలా సోప్, కిస్మిస్, పిస్తా, బాదం, అంజీర్, పుచ్చపప్పు, గుల్‌కందాతో తయారు చేస్తారు. ఈ పాన్ హోదాకు నిదర్శనం. ఈ పాన్ ఖరీదు రూ. 35.

పిల్లలకు.. పెద్దలకు లడ్డూ పాన్..

ఆకు లేకుండా సున్నం లేకుండా ప్రత్యేకంగా పిల్లల కోసం తయారుచేసే పాన్ లడ్డుపాన్ అంటారు. వృద్ధులు, పళ్ళులేనివారు ఈ పాన్ ఎక్కువగా వినియోగిస్తారు. ఈ పాన్ ఖరీదు రూ.20.

విందులకు ఖర్జూర పాన్..

కర్జూరపండులో పాన్‌కు సంబంధించిన సరుకులను పెడతారు. ఈ పాన్‌ను ఇప్పుడు ఎక్కువగా పెళ్ళిల్లో వినియోగిస్తున్నారు. చౌకధరలో లభించే ఫ్లేవర్డ్‌పాన్‌గా దీనిని పిలుస్తారు.ఈ పాన్ ఖరీదు రూ. 15.



శ్రావణ మాసం వచ్చేసింది. పెళ్లిళ్ళ సీజన్ కావడంతో మాకు ఆర్డర్లు ఎక్కువగా ఉంటాయి.కర్జూర్ పాన్‌తో పాటు ప్రత్యేక స్వీట్‌పాన్, సాధారణ స్వీట్ పాన్ కొనుగోళ్ళు

పాన్‌లకు పెళ్లి కళ వచ్చేసింది..



ఎక్కువగా ఉంటున్నాయి. సీజన్‌లో అయితే అన్నిరకాల పాన్‌ల అమ్మకాలు ఎక్కువగా ఉంటాయి. మామూలుగా కూడా వ్యాపారం బాగానే ఉంటుంది. ఏలూరు అతిథి హోటల్ వద్ద మా పాన్‌షాపుకు ఆ హోటల్‌కు వచ్చే చాలా మంది వస్తారు. ప్రస్తుతం పాన్‌లకు జనం అలవాటుపడ్డారు.

- ఎం.రవితేజ, పాన్‌షాపు , ఏలూరు

కాలుష్యం రోడ్డెక్కింది!!

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత.. ఇది అధికారులైనా.. నాయకులైనా చెప్పే మాట.. ఇది నిజమే.. అయితే అధికారుల బాధ్యత అధికారులు నిర్వర్తిస్తున్నారా అంటే కాస్త ఆలోచించాల్సిందే.. జిల్లా వ్యాప్తంగా పర్యావరణ పరిరక్షణకు ఒక శాఖ ఉన్నా ఏనాడు దాడులు చేసిన దాఖలాలు లేవు.. మేం ఇది చేశామని చెప్పుకునే గొప్పపనీ లేదు.. అందుకే ఫ్యాక్టరీ యజమానుల ఇష్టారాజ్యంగా మారిపోయింది.. ఏ ఫ్యాక్టరీ నుంచి చూసినా వచ్చేది కలుషితమే. అయినా మనకేంటి పోయేది పరిసర ప్రాంత ప్రజలే కదా అన్నట్టు చూసీ చూడనట్టు వదిలేస్తున్నారు. దానికి ఈ సంఘటనే ప్రత్యక్ష నిదర్శనం.. ఇది జంగారెడ్డిగూడెం మండలంలోని ఉప్పలమెట్ట సమీపంలో జాతీయ రహదారిని ఆనుకుని ఒక ఫ్యాక్టరీ ఉంది. ఆ ఫ్యాక్టరీ నుంచి వచ్చే వ్యర్థ జలాలు యథేచ్ఛగా జాతీయ రహదారిపైకి వదిలేస్తున్నా ఇదేంటి అని అడిగిన నాథుడే లేరు. అంతా ఏదో మంచినీరు పోతున్నట్టు చోద్యం చూస్తున్నారు. ఈ రహదారిపై మంత్రులు ప్రయాణిస్తారు.. జిల్లా స్థాయి అధికారులు తిరుగుతూ ఉంటారు.. అయినా ఆ ఫ్యాక్టరీ వైపు కన్నెత్తి చూసే ధైర్యం చేయడంలేదు. దీంతో పరిసర గ్రామాల ప్రజలు కాలుష్యం బారిన పడి రోగాల పాలవుతున్నారు. అంతే కాకుండా ఈ కాలుష్యం నీరు పక్కనే ఉన్న మంచినీటి చెరువులోకి చేరుతోంది. ఇకనైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. - జంగారెడ్డిగూడెం



ఎవరికీ పట్టదా : జాతీయ రహదారిపై కాలువలా ప్రవహిస్తున్న ఫ్యాక్టరీ నుంచి వదిలేసిన కాలుష్యపు నీరు

శ్రావణ శుక్రవారం వస్తోందంటే అంతా ఇంతా సందడి కాదు.. రావమ్మా మహాలక్ష్మి రావమ్మా అంటూ మహిళలు పెద్ద ఎత్తున పూజలు చేస్తారు.. అమ్మవారిని అష్టయిశ్వర్యాలు ఇవ్వమని వేడుకుంటారు..అందుకే శ్రావణ శుక్రవారం వచ్చిందంటే ఖర్చుకు వెనకడుగు వేయరు.. కొత్త రూపు నుంచి చీర.. గాజులు.. ఇలా ఒకటేమిటి మహిళలకు అవసరమైన వన్నీ కొనుగోలు చేస్తారు.. సంప్రదాయం ప్రకారం పూజచేస్తారు.. దీనిలో భాగంగానే జిల్లా వ్యాప్తంగా వ్యాపారాలకు లక్ష్మీ కళొచ్చింది.. గతేడాది నవంబర్ తరువాత ఇంత పెద్ద ఎత్తున సందడి కనిపించడం ఇదే.దీంతో వ్యాపారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

లక్ష్మీ కళొచ్చింది!



నరసాపురంలో కొనుగోలుదారులతో కిక్కిరిసిన జ్యూయలరీ షాపులో

నరసాపురం : మార్కెట్‌లో శ్రావణ శుక్రవారం సందడి నెలకొంది. ఈ మాసంలో రెండో శుక్రవారం వరలక్ష్మి వత్రం రావడంతో జిల్లా వ్యాప్తంగా అన్ని పట్టణ, మండల కేంద్రాల్లోని మార్కెట్లు బీజీబీజీగా దర్శనమిచ్చాయి. పండుగకు ఇంకా రెండు రోజులు మాత్రమే మిగిలి ఉంది. సాధారణంగా మంగళ వారం సెంటిమెంట్‌గా మార్కెట్ చేయరు. దీంతో చాలా మంది మహిళలు సోమవారమే షాపింగ్ చేశారు. దీంతో పసిడి, వస్త్ర,కిరాణా, ఫ్యాన్సీ షాపులు కస్టమర్లతో కిటకిటలాడాయి. రాత్రి 10 గంటల వర కు రద్దీ తగ్గలేదు.అయితే ఈసారి పండుగ నెల మొదటి వారంలో రావడంతో వ్యాపారులు మార్కె ట్‌పై కోటి ఆశలు పెట్టుకున్నారు. దానికి అనుగుణంగానే వ్యాపారం సాగడంతో ఈసారి రికార్డు స్థాయిలో పండుగ బిజినెస్ జరగవచ్చని అంచన వేస్తున్నారు.

ఇంటికి రూ. 5 వేలు ఖర్చు..

వరలక్ష్మివత్రానికి మహిళలు ప్రధానంగా లక్ష్మీదేవి రూపు పూజలో వినియోగిస్తారు. స్తోమత ఉన్న వారు అర కాసు రూపు కొనుగోలు చేస్తారు. లేని వారు గ్రాము బంగారం కలిగిన రూపుతో సరిపెట్టుకుంటారు. ఇంకా ఆర్థిక స్తోమత ఉన్నవారు ఆభరణాలను సెంటిమెంట్‌గా కొనుగోలు చేసి పూజలో పెడుతుంటారు. మరికొందరు పూజకు వెండి వస్తువుల్ని కొనుగోలు చేస్తుంటారు. ఈ కారణంగా ఈ పండుగ పూజకు కనీసం రూ 3 వేలైనా బంగారం నిమిత్తం ఖర్చు అవుతుంది. ఇక కొత్త చీరతోనే అమ్మవారి పూజ చేయడం సంప్రదాయం.ఇక పూజలో పిండివంటలు మామూలే. మహిళలు గాజులతో పాటు ఫ్యాన్సీ వస్తువులు ఎక్కువగానే కొనుగోలు చేస్తుంటారు. దీంతో శ్రావణమాసం వచ్చిందంటే చాలు కనీసం ప్రతి ఇంట్లో రూ.5 వేలు ఖర్చు తప్పక ఉంటుంది.

వ్యాపారం రూ. 50 కోట్లు

ఈ సారి పండుగ నెల మొదటి వారంలో రావడంతో మార్కెట్‌లో సందడి నెలకొంది. ముఖ్యంగా పసిడి దుకాణాలు కళకళలాడుతున్నాయి. ఇక మిగిలిన రెండు రోజులు బుధ, గురువారాల్లో కూడా వ్యాపారం భారీగా ఉంటుందన్న ధీమాను జ్యూయలరీ వ్యాపారులు వ్యక్తం చేస్తున్నారు. ఈ సీజన్‌లో సుమారు రూ.30 కోట్లుపైనే వ్యాపారం సాగుతుందని అంచనా వేస్తున్నారు.ఇక వస్త్ర, కిరాణ, ఫ్యాన్సీ షాపుల్లోనూ ఇదే సందడి. ఖరీదైన చీరలను డిస్కౌంట్‌లతో విక్రయిస్తున్నారు. మ్యాచింగ్ సెంటర్లు, టైలరింగ్ షాపుల వద్ద కూడా సందడి కనిపిస్తోంది. పండుగను దృష్టిలో ఉంచుకుని కిరాణా వ్యాపారులు ముందుగానే స్టాక్ సిద్ధంగా ఉంచుకున్నారు.రానున్న రెండు రోజుల్లో కూడా బిజినెస్ ఇదే విధంగా కొనసాగుతున్న ధీమాను పలువురు వ్యాపారులు వ్యక్తం చేస్తున్నారు

భారీగా పెరిగిన వ్యాపారం

కిటకిటలాడుతున్న షాపులు

మార్కెట్‌లో శ్రావణ సందడి

జిల్లాలో వ్యాపారం రూ. 50 కోట్లు

ఇక మిగిలింది రెండు రోజులే

సర్కారు ట్యాబ్ పేలింది!

మీరు ఎక్కడైనా ప్రజలు పింఛన్లు ఇస్తున్నారా.. అయితే టెన్షన్ పడాల్సిందే.. లేదంటే ఏదైనా ప్రమాదం జరిగే అవకాశం ఉంది. పింఛన్లు ఇస్తుంటే ప్రమాదం ఏముంది...ఒక చోట కూర్చుని ట్యాబ్ పట్టుకుని ఇచ్చేస్తాం అంతే అంటారా.. అసలు విషయం అంతా ట్యాబ్‌లోనే ఉంది. ఏమో ట్యాబ్ పేలవచ్చు.. గాయాలు కానూవచ్చు. ఎందుకంటే ట్యాబ్ పగిలి ధ్వంసమైన ఘటన మంగళవారం ఏలూరురూరల్ మండలం కొమడవోలులో చోటు చేసుకుంది. ఉదయం పింఛన్లు తీసుకునేందుకు పంచాయతీ కార్యాలయానికి వృద్ధులు, వికలాంగులు, వితంతువులు చేరుకున్నారు. వీరు వేలి ముద్రలను తీసుకుని ట్యాబ్‌లో పేర్లు పరిశీలిస్తుండగా ఒక్కసారిగా ట్యాబ్ పేలింది. పేలిన శబ్దానికి వృద్ధులు బయటకు పరుగులుతీశారు. ట్యాబ్ మొత్తం పేలి పరికరాలు బయటకు వచ్చిపడ్డాయి. చాలా సేపు ఏం జరిగిందో తెలియ లేదు. నాసిరకం ట్యాబ్‌లను ప్రభుత్వం పంపిణీ చేయడం వల్లనే ఇటువంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో కార్యదర్శి ఉర్ల రత్నం మరో పంచాయతీకి సంబంధించిన ట్యాబ్‌ను తెచ్చి పింఛన్లు ఆపకుండా పంపిణీ చేశారు. ట్యాబ్ పగలడం వల్ల ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు.. కానీ ఆ ట్యాబ్‌ను టచ్ చేస్తున్న సమయంలో పేలడం జరిగి ఉంటే మాత్రం పెద్ద ప్రమాదమే జరిగి ఉండేది. అందుకే అంటుంటా పింఛన్లు ఇస్తున్నా టెన్షన్ పడాల్సిందేనని.. అధికారులు జాగ్రత్త సుమా.. ఒక్కసారి మీ ట్యాబ్‌లను సరిచూపించుకోండి.. లేదంటే ఏమో తరువాతే మీరే కావొచ్చు. - ఏలూరు రూరల్



పింఛను ఇస్తుండగా పేలిపోయిన సర్కారు ట్యాబ్

మహనీయుడు



మన పింగళి

నేడు జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య జయంతి

ప్రతీ రాజ్యానికి ఆ కాలపు రాజు యొక్క రాచరికపు చిహ్నంగా ఒక పతాకంఎగురవేసేవారు.భారతదేశానికి బ్రిటిషు వారు వచ్చిన తరువాత వారి జెండా ఎగురవేశారు. స్వాతంత్ర్య పోరాటం ప్రారంభమైన తరువాత భారతీయులకు ఒక జెండా ఉండాలనే ఆలోచన వచ్చి జెండా రూపొందించాల్సిందిగా ప్రకటించారు.అనేక మంది నమూనాలను రూపొందించారు.దీనిపై మహాత్మగాంధీ ఒక అధ్యయన కమిటీని వేశారు.వీటిలో తెలుగువాడైన పింగళి వెంకయ్య రూపొందించిన నమూనా జెండా గాంధీజీని ఆకర్షించింది. ఆ జెండాలో కొన్ని మార్పులు చేసి మన భారత జాతీయ పతాకగా నిర్ణయించారు. నేటికీ పింగళి వెంకయ్య రూపొందించిన జెండానే యావత్ భారతజాతి గౌరవించడం తెలుగువారిగా మనం గర్వించదగ్గ విషయం.ఆ తెలుగుతేజం పింగళి వెంకయ్య జయంతిని పురస్కరించుకుని ప్రత్యేక కథనం..

పింగలి వెంకయ్య కృష్ణా జిల్లాలోని భట్ల పెనుమర్రులో 1876 ఆగస్టు 2న హనుమంతరాయుడు, వెంకటరత్నమ్మ దంపతులకు జన్మించారు.ఈయన బందరులోని హిందూ ఉన్నత పాఠశాలలో ఉన్నత విద్యనభ్యసించారు.వెంకయ్య భాషాకోవిదుడు, తన 10వ ఏటనే బొంబాయిలో సైనిక శిక్షణ తీసుకున్నారు.తరువాత ఆఫ్రికాలో జరిగిన బోయరు యుద్ధంలో పాల్గొన్నారు.ఆఫ్రికాలో ఉండగా మహాత్మగాంధీతో పరిచయం ఏర్పడింది.గాంధీజీ స్ఫూర్తితో భారత స్వాతంత్ర్య సమరంలో పాల్గొని చురుకైన పాత్ర పోషించారు.1916లో "భారతదేశంనకు ఒక జాతీయ పతాకం" అనే గ్రంథాన్ని రచించారు. దీనిలో 30 రకాల పతాకాలను ప్రదర్శించారు. 1921లో బెజవాడలో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ మహా సభలో గాంధీజీ సూచన మేరకు త్రివర్ణ పతాకం రూపొందించారు. గాంధీజీ సలహా మేరకు జెండా మధ్యలో రాట్నం గుర్తును చేర్చారు.పింగళి రూపొందించిన జెండాలో రాట్నానికి బదులు సారనాథ్ స్థూపంలోని అశోకుడి ధర్మచక్రం చేర్చి భారత జాతీయ జెండాగా 1947 జూలై 22న ఆమోద ముద్ర వేశారు. దీనిని తొలిసారిగా జవహర్‌లాల్ నెహ్రూ అవిష్కరించారు.

జాతీయ పతాకంలోని రంగులు - సంకేతాలు

కాషాయం- .ధైర్యం, త్యాగం, దేశభక్తి
తెలుపు - శాంతి, సత్యం
ఆకుపచ్చ - నమ్మకం, సమృద్ధి, భూమి
24 ఆకులు కలిగిన నీలిరంగు ధర్మచక్రం - సూర్యబింబం,24 గంటలు, క్రమశిక్షణ, ధర్మం, న్యాయం

జాతీయ పతాకానికి నిబంధనలు :

జాతీయ పతాకం పొడవు వెడల్పులు 3:2 నిష్పత్తిలో ఉండాలి, వస్త్రం ఖాదీ,చేనేత వాడాలి,జాతీయ పతాకాన్ని సూర్యోదయం తర్వాత ఎగురవేసి సూర్యస్తమయం లోపల అవనతం చేయాలి. జెండా ను సంతాప దినాల్లో జెండా స్తంభానికి సగం ఎత్తులో మాత్రమే ఎగురవేయాలి.

- కొల్లాబత్తుల సూర్యకుమార్, ఉపాధ్యాయుడు, గుమ్మలూరు

ఆలోచన విధానం, సునిశిత దృష్టి.. ప్రధానం

పోలిక పరీక్ష

ఈ విభాగానికి సంబంధించిన ప్రశ్నల్లో పదం, దానికి ఒక సంబంధం ఇస్తారు. మరో పదం ఇచ్చి ఆ పదానికి కూడా అలాంటి సంబంధాన్నే తెలపమని అడుగుతారు. ఈ విభాగంలోని ప్రశ్నల్లో జనరల్ నాలెడ్జ్ ప్రశ్నలు కూడా ఉంటాయి. అభ్యర్థి ఆలోచన విధానం, విజ్ఞానం, సునిశిత దృష్టి, పరిశీలనాత్మకతను అంచనా వేయడమే ఈ పరీక్ష ముఖ్యోద్దేశం. ఇందులో మూడు రకాల ప్రశ్నలు ఉంటాయి. అవి..

1. పదాల పోలిక పరీక్ష
2. వర్ణమాల అక్షరాల పోలిక పరీక్ష
3. సంఖ్యలతో పోలిక పరీక్ష

మోడల్ - 1

1. **చాక్‌పీస్: నల్లబల్ల:: ---- : పలక**
ఎ) కలం బి) పెన్సిల్ సి) బలపం డి) ఏదీకాదు
సమాధానం: సి
వివరణ: నల్లబల్లపై చాక్ పీస్‌తో రాస్తారు. అదేవిధంగా పలకపై బలపంతో రాస్తారు.

2. **విటమిన్ ఎ : రేచీకటి :: ----- : రికెట్స్**
ఎ) విటమిన్ బి బి) విటమిన్ సి
సి) విటమిన్ డి డి) ఏదీకాదు
సమాధానం: సి
వివరణ: విటమిన్ ఎ లోపంతో వచ్చే వ్యాధి రేచీకటి. అదేవిధంగా విటమిన్ డి లోపంతో వచ్చే వ్యాధి రికెట్స్

3. **పత్రం: క్లోరోఫిల్ :: రక్తం : -----**
ఎ) కెరోటిన్ బి) జాంథోఫిల్
సి) హిమోగ్లోబిన్ డి) ఏదీకాదు
సమాధానం: సి
వివరణ: పత్రాల ఆకులు పచ్చగా ఉండటానికి కారణం క్లోరోఫిల్. అదేవిధంగా రక్తం ఎర్రగా ఉండడానికి కారణం హిమోగ్లోబిన్

4. **ధర్మామీటర్: ఉష్ణోగ్రత :: అమ్మీటర్ : -------**
ఎ) విద్యుత్ బి) ఉష్ణం సి) తేమ డి) వేగం
సమాధానం : ఎ
వివరణ: ఉష్ణోగ్రతను కొలిచే సాధనం ధర్మామీటర్. అలాగే విద్యుత్‌ను కొలిచేది అమ్మీటర్

5. **రైతు : పొలం :: శాస్త్రజ్ఞుడు: -------**
ఎ) కర్మాగారం బి) పాఠశాల
సి) ప్రయోగశాల డి) రంగస్థలం
సమాధానం: సి
వివరణ: రైతు పనిచేసే ప్రదేశం పొలం. అదేవిధంగా శాస్త్రవేత్త పనిచేసే ప్రదేశం ప్రయోగశాల

6. **పక్షులు : ఆర్నిథాలజీ::గుండె: ------**
ఎ) హెమటాలజీ బి) కార్డియాలజీ
సి) సెమన్‌టిక్స్ డి) ఏదీకాదు
సమాధానం: బి
వివరణ: పక్షులను గురించి వివరించే శాస్త్రం ఆర్నిథాలజీ. అదేవిధంగా హృదయ స్పందన గురించి వివరించే శాస్త్రం కార్డియాలజీ

7. **రైతు : నాగలి :: సైనికుడు: ---------**
ఎ) తుపాకి బి) కత్తి సి) సూది డి) ఏదీకాదు
సమాధానం: ఎ
వివరణ: నాగలిని ఉపయోగించే వ్యక్తి రైతు. అదేవిధంగా తుపాకిని ఉపయోగించే వ్యక్తి సైనికుడు

8. **పాల స్వచ్ఛత: లాక్టోమీటర్ :: భూకంపాలు: ---**
ఎ) బారోమీటర్ బి) అనిమోమీటర్
సి) ఆడో మీటర్ డి) సిస్మోగ్రాఫ్
సమాధానం: డి
వివరణ: పాల స్వచ్ఛతను కొలిచే పరికరం లాక్టోమీటర్. అలాగే భూకంప తీవ్రతను కొలిచే సాధనం సిస్మోగ్రాఫ్

9. **బలం: వాట్ :: విద్యుత్ : --------**
ఎ) జౌల్ బి) డిగ్రీ సి) ఆంపియర్ డి) సెకండ్స్
సమాధానం: సి
వివరణ: బలానికి ప్రమాణం వాట్ అలాగే విద్యుత్‌కు ప్రమాణం ఆంపియర్

10. **ముఖేష్: హాకీ :: చెస్ : -------**
ఎ) గగన్ నారంగ్ బి) హరి కృష్ణ
సి) లక్ష్మణ్ డి) ఎవరూకాదు
సమాధానం: బి



Panditi Meenakshi Pavan
Senior Faculty

Competitive Exams Special

వివరణ: ముఖేష్ హాకీ క్రీడాకారుడు. అలాగే హరికృష్ణ చెస్ క్రీడాకారుడు

11. **కొలంబో : శ్రీలంక :: ------ : ఆఫ్ఘనిస్తాన్**
ఎ) ఇస్లామాబాద్ బి) కాబూల్ సి) తింపు డి) ఏదీకాదు
సమాధానం: బి
వివరణ: శ్రీలంక రాజధాని కొలంబో. అలాగే ఆఫ్ఘనిస్తాన్ రాజధాని కాబూల్

12. **హస్తినాపురం : న్యూఢిల్లీ :: మద్రాస్ : -----**
ఎ) చెన్నై బి) పనాజి సి) కోల్‌కతా డి) ముంబై
సమాధానం: ఎ
వివరణ: హస్తినాపురానికి కొత్త పేరు న్యూఢిల్లీ, అలాగే మద్రాస్‌కు కొత్త పేరు చెన్నై

13. **భరతనాట్యం: తమిళనాడు :: యక్షగానం: -------**
ఎ) కేరళ బి) మహారాష్ట్ర సి) కర్ణాటక డి) ఏదీకాదు
సమాధానం: సి
వివరణ: తమిళనాడు శాస్త్రీయ నృత్యం భరత నాట్యం. కర్ణాటక శాస్త్రీయ నృత్యం యక్షగానం

14. **న్యూజిలాండ్ జాతీయ పక్షి : కివి :: మన జాతీయ పక్షి : --------**
ఎ) నెమలి బి) పావురం సి) చిలుక డి) ఏదీకాదు
సమాధానం: ఎ
వివరణ: న్యూజిలాండ్ జాతీయ పక్షి కివి అదేవిధంగా మన జాతీయ పక్షి నెమలి.

15. **చార్మినార్: హైదరాబాద్ :: తాజ్‌మహల్:-------**
ఎ) న్యూఢిల్లీ బి) ఆగ్రా సి) మీరట్ డి) ఔరంగాబాద్
సమాధానం: బి
వివరణ: చార్మినార్ హైదరాబాద్‌లో ఉంది. తాజ్‌మహల్ ఆగ్రాలో ఉంది.

16. **ఇండియా : రూపాయి :: జపాన్ : -------**
ఎ) డాలర్ బి) ఫ్రాంక్ సి) యన్ డి) దీనార్
సమాధానం: సి
వివరణ: ఇండియా కరెన్సీ రూపాయి. జపాన్ కరెన్సీ యన్

17. **గ్రహాలు : ఖగోళ శాస్త్రం :: నాణేలు : -----------**
ఎ) సిస్మోగ్రాఫ్ బి) పేలియోగ్రఫీ
సి) పాథాలజీ డి) న్యూమిస్‌మాటిక్స్
సమాధానం: డి
వివరణ: గ్రహాల గురించి వివరించే శాస్త్రం ఖగోళశాస్త్రం. అలాగే నాణేల గురించి వివరించే శాస్త్రం న్యూమిస్‌మాటిక్స్

18. **ఆర్య సమాజం: దయానంద సరస్వతి:: రామకృష్ణ మిషన్: ---------**
ఎ) అనిబిసెంట్ బి) స్వామి వివేకానంద
సి) నివేదిత డి) ఎవరూకాదు
సమాధానం: బి
వివరణ: ఆర్య సమాజ స్థాపకుడు దయానంద సరస్వతి. అదేవిధంగా రామకృష్ణ మిషన్ స్థాపకుడు స్వామి వివేకానంద

19. **స్వామి వివేకానంద: నరేంద్రదత్:: దయానంద సరస్వతి: -------**
ఎ) గదాధరుడు బి) మూల శంకర్
సి) రామచందర్ డి) ఏదీకాదు
సమాధానం: బి
వివరణ: స్వామి వివేకానంద అసలు పేరు నరేంద్ర దత్. దయానంద సరస్వతి అసలు పేరు మూల్ శంకర్

20. **మెగస్తనీస్: ఇండికా:: పాణిని: -----------**
ఎ) అష్టాధ్యాయి బి) హర్ష చరిత్ర
సి) చరక సంహిత డి) ఏదీకాదు
సమాధానం: ఎ
వివరణ: మెగస్తనీస్ రచించిన గ్రంథం ఇండికా, అదేవిధంగా పాణిని రచించిన గ్రంథం అష్టాధ్యాయి.

21. **పాస్కల్: ఒత్తిడి:: ఆంపియర్: -------**
ఎ) విద్యుత్ బి) బలం సి) శక్తి డి) స్వచ్ఛత
సమాధానం: ఎ
వివరణ: పాస్కల్ అనేది ఒత్తిడికి ప్రమాణం. అలాగే ఆంపియర్ అనేది విద్యుత్‌కు ప్రమాణం

22. **కన్నడం: కర్ణాటక:: మరాఠీ: -------**
ఎ) మధ్యప్రదేశ్ బి) మహారాష్ట్ర
సి) గుజరాత్ డి) రాజస్థాన్

23. **హాంకాంగ్: చైనా:: వాటికన్: --------**
ఎ) నార్వే బి) డెన్మార్క్
సి) నెదర్లాండ్ డి) రోమ్
సమాధానం: డి
వివరణ: చైనాలోని ఒక నగరం హాంకాంగ్. అలాగే రోమ్‌లోని నగరం వాటికన్ సిటీ

24. **ఇన్సులిన్: హార్మోన్::ట్రిప్సిన్: -------**
ఎ) ఎంజైమ్ బి) విటమిన్ సి) హార్మోన్ డి) గ్రంధి
సమాధానం: ఎ
వివరణ: ఇన్సులిన్ అనేది హార్మోన్. అలాగే ట్రిప్సిన్ అనేది ఒక ఎంజైమ్

25. **వినడం: చెముడు:: మాట్లాడడం: --------**
ఎ) నిశ్శబ్దం బి) మూగ సి) శాంతి డి) ఏదీకాదు
సమాధానం: బి
వివరణ: వినలేకపోవడం చెముడు అలాగే మాట్లాడలేకపోవడం మూగ

26. **భాక్రానంగల్: సట్లెజ్:: హీరాకుడ్ : -------**
ఎ) గోదావరి బి) కృష్ణ సి) కావేరి డి) మహానది
సమాధానం: డి
వివరణ: భాక్రానంగల్ డ్యామ్ సట్లెజ్ నదిపై ఉంది అలాగే హీరాకుడ్ డ్యామ్ మహానదిపై ఉంది.

27. **హరిత విప్లవం: మొక్కలు:: నీలి విప్లవం: ------**
ఎ) చేపలు బి) పాలు సి) నూనె గింజలు డి) ఏదీకాదు
సమాధానం: ఎ
వివరణ: మొక్కల అధికోత్పత్తికి చేపట్టిన కార్యక్రమం హరిత విప్లవం. అలాగే చేపల అధిక దిగుబడికి చేపట్టిన కార్యక్రమం నీలి విప్లవం

28. **తూర్పు: వాయవ్యం:: నైరుతి: ----**
ఎ) ఈశాన్యం బి) తూర్పు సి) ఆగ్నేయం డి) ఉత్తరం
సమాధానం: బి
వివరణ: తూర్పునకు 135 డిగ్రీల అపసవ్యదిశ వాయవ్యం. నైరుతికి 135 డిగ్రీల అపసవ్య దిశ తూర్పు

29. **సత్యజిత్ రే: సినిమా:: పికాసో: ------**
ఎ) రచయిత బి) నాటక కర్త
సి) చిత్రకారుడు డి) ఏదీకాదు
సమాధానం: సి
వివరణ: సినిమా రంగానికి చెందిన ప్రముఖుడు సత్యజిత్ రే. అలాగే సుప్రసిద్ధ చిత్రకారుడు పికాసో

30. **రెస్టారెంట్: మెను:: లైబ్రరీ: -----**
ఎ) చదువు బి) పుస్తకాలు సి) విద్య డి) క్యాటలాగ్
సమాధానం: డి
వివరణ: మెను అనేది ఐటమ్స్ లిస్ట్. కేటలాగ్ అనేది బుక్స్ లిస్ట్

31. **ఓనం: కేరళ:: బిహు: ------**
ఎ) కర్ణాటక బి) మిజోరాం సి) అస్సాం డి) ఒడిశా
సమాధానం: సి
వివరణ: కేరళ ప్రజలు చేసుకొనే పండుగ ఓనం. అస్సాం ప్రజలు చేసుకొనే పండుగ బిహు

32. **ప్రమాదం: అజాగ్రత:: వ్యాధులు: -------**
ఎ) అపరిశుభ్రత బి) వైద్యుడు
సి) మందులు డి) వైద్యం సమాధానం: ఎ
వివరణ: అజాగ్రత్తతో ప్రమాదం లభిస్తుంది. అలాగే అపరిశుభ్రత వల్ల వ్యాధులు ప్రబలుతాయి.

33. **శిల్పం: రూపం:: పాట ------**
ఎ) సంగీతం బి) గానం సి) చెప్పలేం డి) ఏదీకాదు
సమాధానం: బి
వివరణ: శిల్పానికి మంచి రూపం ఉండాలి. అలాగే పాటకు మంచి గానం ఉండాలి.

అడ్మిషన్స్

ఐఎన్ఎటి 2017

పుణెలోని ఇంటర్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రో ఫిజిక్స్ (ఐయుసిఏఏ), నేషనల్ సెంటర్ ఫర్ రేడియో ఆస్ట్రో ఫిజిక్స్ (ఎన్‌సిఆర్ఏ) సంస్థల్లో పిహెచ్‌డి చేసే వారికి ఉద్దేశించిన రీసెర్చ్ స్కాలర్‌షిప్‌నకు ప్రకటన విడుదలైంది.
విభాగాలు: ఆస్ట్రానమీ, ఆస్ట్రో ఫిజిక్స్, ఫిజిక్స్
అర్హత: ఆగస్టు నాటికి 55 శాతం మార్కులతో (బిఎస్సీ/ ఎమ్మెస్సీ/ ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ)(ఫిజిక్స్/ ఎలక్ట్రానిక్స్/ ఆస్ట్రానమీ/ అప్లయిడ్ మేథమెటిక్స్) లేదా బిఇ/ బిటెక్/ ఎంఇ/ ఎంటెక్ పూర్తి.
ఎంపిక: ఐయుసిఏఏ - ఎన్‌సిఆర్ఏ అడ్మిషన్ టెస్ట్(ఐఎన్ఎటి 2017), ఇంటర్వ్యూ ద్వారా
పరీక్ష కేంద్రం: ఐయుసిఏఏ, పుణె
ఇంటర్వ్యూ: డిసెంబరు 7, 8
వేదిక: ఎన్‌సిఆర్ఏ - టిఐఎఫ్ఆర్, పుణె
దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 15, 2017
వెబ్‌సైట్: http://inat.ncra.tifr.res.in/inat

పుణె పాలిటెక్నిక్

పుణెలోని గవర్నమెంట్ పాలిటెక్నిక్ - **అడ్వాన్స్‌డ్ డిప్లొమా(ఆటోమోటివ్ మెకట్రానిక్స్)** ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఈ స్కిల్ బేస్డ్ జాబ్ ఓరియంటెడ్ కోర్సును **'మెర్సిడెజ్ - బెంజ్'** సహకారంతో నిర్వహిస్తున్నారు.
కోర్సు వ్యవధి: ఏడాది
అర్హత: డిప్లొమా/ డిగ్రీ (ఇంజనీరింగ్)
ఎంపిక: ఎంట్రెన్స్ ఎగ్జామ్ ద్వారా
ఎంట్రెన్స్ ఎగ్జామ్: ఆగస్టు 18
పూర్తి వివరాలకు వెబ్‌సైట్ చూడవచ్చు.
వెబ్‌సైట్: www.gppuneamc.org

ఎయిమ్స్

న్యూఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్)- పిహెచ్‌డి ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి ఉద్దేశించిన **'ఆన్‌లైన్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్'**కు దరఖాస్తులు కోరుతోంది.
ఎగ్జామినేషన్ తేదీ: సెప్టెంబరు 8
పరీక్ష కేంద్రం: ఢిల్లీ/ ఎన్‌సిఆర్
ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభం: ఆగస్టు 3, 2017
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 17, 2017
వెబ్‌సైట్: www.aiimsexams.org

డిఎస్‌సి

ద ఢిల్లీ స్కూల్ ఆఫ్ కమ్యూనికేషన్(డిఎస్‌సి)- పీజీ(కమ్యూనికేషన్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.
అర్హత: డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. మ్యాట్/ క్యాట్ అర్హత పొంది ఉండాలి. లేదా డిఎస్‌సి ఇంటర్నల్ అడ్మిషన్ టెస్ట్‌లో అర్హత పొంది ఉండాలి.
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 7, 2017
వెబ్‌సైట్: www.dsc.edu.in/


డిఐఎంహెచ్

చెన్నైలోని డైరెక్టరేట్ ఆఫ్ ఇండియన్ మెడిసిన్ అండ్ హోమియోపతి (డిఐఎంహెచ్)- బిఎస్ఎంఎస్/ బిఏఎంఎస్/ బిఎన్‌వైఎస్/ బియుఎంఎస్/ బిహెచ్ఎంఎస్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.
అర్హత: హయ్యర్ సెకండరీ
క్యాంపస్‌లు: తిరునల్వేలి, చెన్నై, మదురై, కన్యాకుమారి **దరఖాస్తు ఫీజు:** రూ.500
అప్లికేషన్ డౌన్‌లోడింగ్‌కు చివరి తేదీ: ఆగస్టు 30, 2017
హార్డు కాపీ చేరేందుకు ఆఖరు తేదీ: ఆగస్టు 31, 2017
చిరునామా: The Secretary, Selection Committee, Directorate of Indian Medicine and Homoeopathy, Arignar Anna Govt.Hospital of Indian Medicine Campus, Arumbakkam, Chennai-600106
వెబ్‌సైట్: www.tnhealth.org

‘ద లైఫ్ డివైన్’ గ్రంథ రచయిత ఎవరు?

హోంరూల్ ఉద్యమం

1. భారతదేశం బ్రిటిష్ సామ్రాజ్యంలో అంతర్భాగంగా ఉంటూ స్వయంపాలన సాగించుకొనే స్థితిని సాధించే లక్ష్యంతో ప్రారంభమైన ఉద్యమం?
ఎ) సహాయనిరాకరణ ఉద్యమం
బి) హోంరూల్ ఉద్యమం
సి) క్విట్ ఇండియా ఉద్యమం డి) ఉప్పుసత్యాగ్రహం
2. హోంరూల్ లీగ్‌ను 1916 ఏప్రిల్‌లో స్థాపించింది?
ఎ) బాలగంగాధర్ తిలక్ బి) సుబ్రమణ్య అయ్యర్
సి) సి.పి.రామస్వామి అయ్యర్ డి) పి.కె.తెలాంగ్
3. హోంరూల్ అనే పదాన్ని ఏ ఉద్యమం నుంచి స్వీకరించారు?
ఎ) గ్రీక్ ఉద్యమం బి) లాటిన్ ఉద్యమం
సి) ఐరిష్ ఉద్యమం డి) గ్రీన్‌పీస్ ఉద్యమం
4. 1916 సెప్టెంబరులో హోంరూల్ లీగ్‌ను స్థాపించింది?
ఎ) మోతీలాల్ నెహ్రూ బి) అనిబిసెంట్
సి) పి.కె.తెలాంగ్ డి) ఎస్.సుబ్రమణ్య అయ్యర్
5. 1897లో హోంరూల్ లీగ్ అనే పదాన్ని మొట్టమొదట ఉపయోగించింది?
ఎ) శ్యాంజీ కృష్ణవర్మ బి) శ్రీకృష్ణ కార్వదే
సి) నరసింహచింతామన్ కేల్కర్
డి) మోతీలాల్ నెహ్రూ
6. ‘న్యూ ఇండియా’ పత్రికను స్థాపించింది?
ఎ) శ్యాంజీ కృష్ణవర్మ బి) బి.పి.వాడియా
సి) జె.ఎస్.అరుండేల్ డి) అనిబిసెంట్
7. ‘ఇండియన్ ఉమెన్స్ అసోసియేషన్’ అనే సంస్థను స్థాపించింది?
ఎ) మహమ్మద్ అలీ జిన్నా
బి) అంబికా చరణ్ మజుందర్
సి) అనిబిసెంట్ డి) సురేంద్రనాథ్ బెనర్జీ
8. 1885లో **Fabian society**లో చేరి **Fabian Essays** అనే పత్రికలో సోషలిజం మీద వ్యాసాలు రాసింది?
ఎ) అనిబిసెంట్ బి) భగవాన్‌దాస్
సి) బి.పి.వాడియా డి) జె.ఎస్.అరుండేల్
9. అనిబిసెంట్ దివ్యజ్ఞాన సమాజంలో ఎప్పుడు చేరారు?
ఎ) 1885 బి) 1889 సి) 1895 డి) 1899
10. బెనారస్‌లో ‘కేంద్రీయ హిందూ కళాశాల’ను స్థాపించింది?
ఎ) గాంధీ బి) రాస్‌బిహారి ఘోష్
సి) అనిబిసెంట్ డి) బాలగంగాధర్ తిలక్
11. ‘భగవద్గీత’ను అనిబిసెంట్ ఎవరి సహకారంతో ఆంగ్లంలోకి అనువదించారు?
ఎ) రాస్‌బిహారి ఘోష్ బి) బి.పి.వాడియా
సి) సురేంద్రనాథ్ బెనర్జీ డి) డాక్టర్ భగవాన్ దాస్
12. భారతీయులు పాశ్చాత్య సంప్రదాయాల పట్ల ఆకర్షితులు కావడాన్ని వ్యతిరేకించింది?
ఎ) సాండర్స్ బి) అనిబిసెంట్
సి) చెమ్స్‌ఫర్డ్ డి) మాంటేగ్
13. 1907లో కల్నల్ ఆల్కాట్ మరణం తరవాత దివ్యజ్ఞాన సమాజ బాధ్యతలు చేపట్టింది?
ఎ) అనిబిసెంట్ బి) బాలగంగాధర్ తిలక్
సి) సురేంద్రనాథ్ బెనర్జీ డి) జె.ఎస్.అరుండేల్
14. ‘ద లైఫ్ డివైన్’ అనే గ్రంథాన్ని రచించింది?
ఎ) అరవింద్‌ఘోష్ బి) తిలక్
సి) లాలాలజపతిరాయ్ డి) బిపిన్ చంద్రపాల్
15. 1895-1907 మధ్య బెనారస్ కేంద్రంగా హిందూ మతం గురించి ఉపన్యాసాలు చేసింది?
ఎ) పి.కె.తెలాంగ్ బి) ఎస్.సుబ్రమణ్య అయ్యర్
సి) సి.పి.రామస్వామి అయ్యర్ డి) అనిబిసెంట్
16. 1916 లక్నో సమావేశంలో అతివాదులు తిరిగి కాంగ్రెస్ చేరడంలో కీలక పాత్ర పోషించింది?
ఎ) అనిబిసెంట్ బి) సురేంద్రనాథ్ బెనర్జీ
సి) రాస్‌బిహారి ఘోష్
డి) బాలకృష్ణ శివరాం మోహన్‌జీ
17. **'Englands difficulty is Indian opportunity'** అనే నినాదాన్ని ఇచ్చింది?
ఎ) చాంబర్లీన్ బి) అనిబిసెంట్
సి) బి.పి.వాడియా డి) మహమ్మద్ అలీ జిన్నా
18. కాంగ్రెస్, ముస్లిం లీగ్ మధ్య 1916లో లక్నో ఒడంబడిక జరగడంలో కీలక పాత్ర పోషించింది?
ఎ) సి.పి.రామస్వామి అయ్యర్
బి) పి.కె.తెలాంగ్
సి) అనిబిసెంట్ డి) బి.పి.వాడియా
19. ‘న్యూ ఇండియా’ డైలీ ఎప్పుడు ధరావతును కోల్పోయింది?
ఎ) 1914 బి) 1912 సి) 1915 డి) 1916
20. హోంరూల్ ఉద్యమానికి ప్రతిస్పందిస్తూ ఆగస్టు ప్రకటన చేసింది?
ఎ) చాంబర్లీన్ బి) మాంటేగ్
సి) హర్డింజ్ డి) పాల్ రిచర్డ్
21. ఏ సంవత్సరంలో అనిబిసెంట్ రాజకీయ రంగప్రవేశం చేస్తూ భారతదేశానికి హోంరూల్ ఇవ్వాలని కోరారు?
ఎ) 1911 బి) 1912 సి) 1913 డి) 1914
22. 1917లో ఏ ఐఎన్‌సి సమావేశానికి అనిబిసెంట్ నాయకత్వం వహించారు?
ఎ) కలకత్తా బి) బొంబాయి సి) మద్రాసు డి) గౌహతి
23. ఐఎన్‌సికి అధ్యక్షత వహించిన తొలి మహిళ?
ఎ) దుర్గాబాయి దేశ్‌ముఖ్ బి) విజయలక్ష్మి పండిట్
సి) నిర్మలాదేశ్ పాండే డి) అనిబిసెంట్


కె. చెంచుకుమార్
సీనియర్ ఫ్యాకల్టీ

పోటీ పరీక్షల ప్రత్యేకం-ఇండియన్ హిస్టరీ


బాలగంగాధర్ తిలక్


అనిబిసెంట్

24. ‘బాయ్ స్కౌట్ అసోసియేషన్’ అనే సంస్థను స్థాపించింది?
ఎ) మహత్మాగాంధీ బి) అనిబిసెంట్
సి) మోతీలాల్ నెహ్రూ
డి) వినాయక దామోదర్ సావర్కర్
25. మద్రాసులోని అడయార్‌లో అనిబిసెంట్ స్థాపించిన జాతీయ విశ్వవిద్యాలయానికి చాన్సలర్‌గా వ్యవహరించింది?
ఎ) రవీంద్రనాథ్ ఠాగూర్ బి) శ్యాంజీ కృష్ణవర్మ
సి) విజయలక్ష్మి పండిట్ డి) బి.పి.వాడియా
26. 1916 మేలో చిత్తూరు జిల్లాలోని మదనపల్లిలో ‘థియోసాఫికల్ కళాశాల’ను స్థాపించింది?
ఎ) జె.ఎం.చటర్జీ బి) చాంబర్లీన్
సి) అనిబిసెంట్ డి) దుగ్గిరాల గోపాలకృష్ణయ్య
27. అనిబిసెంట్ ముఖ్య శిష్యుడు?
ఎ) కొండా వెంకటప్పయ్య
బి) పర్వతనేని వీరయ్య చౌదరి
సి) దుగ్గిరాల గోపాలకృష్ణయ్య డి) జిడ్డు కృష్ణమూర్తి
28. **'At the feet of master'** గ్రంథ రచయిత?
ఎ) జిడ్డు కృష్ణమూర్తి బి) నీలకంఠ బ్రహ్మచారి
సి) అనిబిసెంట్ డి) విజయలక్ష్మి పండిట్
29. బ్రిటిష్ సార్వభౌమత్వం కింద ఉంటూనే భారతీయులకు క్రమానుగతంగా స్వయం పరిపాలన ఇస్తామని ప్రకటన చేసిన భారత రాజ్య కార్యదర్శి?
ఎ) మింటో బి) మాంటేగ్ సి) మార్లే డి) హర్డింజ్
30. తిలక్ ఏర్పాటు చేసిన హోంరూల్ లీగ్‌లో ముఖ్యపాత్ర పోషించింది?
ఎ) గణేష్ శ్రీకృష్ణ కార్పదే
బి) నరసింహ చింతామన్ కేల్కర్
సి) బాలకృష్ణ శివరాం మోహన్‌జీ డి) పైవారందరూ
31. తిలక్ ఏర్పాటు చేసిన హోంరూల్ లీగ్‌కు అధ్యక్షుడిగా పని చేసింది?
ఎ) చాంబర్లీన్ బి) మార్లే
సి) జోసెఫ్ బాప్టిస్టా డి) పి.కె.తెలాంగ్
32. తిలక్ ఏర్పాటు చేసిన హోంరూల్ లీగ్‌కు కార్యదర్శి?
ఎ) పాల్ రిచర్డ్ బి) కేల్కర్
సి) మీరా రిచర్డ్ డి) ఎస్.పి.సిన్హా
33. తిలక్ ఏర్పాటు చేసిన హోంరూల్ ఉద్యమం ఏయే ప్రాంతాలకు పరిమితం అయింది?
ఎ) ఉత్తరప్రదేశ్ బి) మహారాష్ట్ర
సి) కర్ణాటక డి) బి, సి
34. అనిబిసెంట్ ఏర్పాటు చేసిన హోంరూల్ లీగ్‌కు గౌరవ అధ్యక్షుడిగా వ్యవహరించింది?
ఎ) సర్ ఎస్.సుబ్రమణ్య అయ్యర్
బి) కేల్కర్ సి) జోసెఫ్ బాప్టిస్టా
డి) బాలగంగాధర్ తిలక్
35. అనిబిసెంట్ ఏర్పాటు చేసిన హోంరూల్ లీగ్‌కు ప్రధాన కార్యదర్శులుగా వ్యవహరించింది?
ఎ) జోసెఫ్ బాప్టిస్టా బి) సి.పి.రామస్వామి అయ్యర్
సి) పి.కె.తెలాంగ్ డి) బి, సి
36. అనిబిసెంట్ ఏర్పాటు చేసిన హోంరూల్ ఉద్యమం ఏయే ప్రాంతాలకు విస్తరించింది?
ఎ) దక్షిణ భారతదేశం బి) బీహార్, బెంగాల్
సి) యునైటెడ్ ప్రావిన్స్, సింధు డి) పైవన్నీ
37. అనిబిసెంట్ కృషి ఫలితంగా ఏ ఐఎన్‌సి సమావేశంలో బాలగంగాధర్ తిలక్ కాంగ్రెస్‌లో చేరారు?
ఎ) కలకత్తా బి) బొంబాయి సి) లక్నో డి) పూనా
38. 1916లో జరిగిన లక్నో కాంగ్రెస్ సమావేశానికి అధ్యక్షత వహించింది?
ఎ) రాస్‌బిహారి ఘోష్
బి) అంబికా చరణ్ మజుందర్
సి) అరుండేల్ డి) వాడియా
39. భారతదేశానికి స్వపరిపాలన ఇవ్వాలని ఏ ఐఎన్‌సి సమావేశం తీర్మానించింది?
ఎ) లక్నో బి) భోపాల్ సి) అమృత్‌సర్ డి) లాహోర్
40. కాంగ్రెస్, ముస్లింలీగ్ మధ్య రాజ్యాంగ సంస్కరణల విషయమై కుదిరిన ఒడంబడిక ఎప్పుడు జరిగింది?
ఎ) 1915 బి) 1916 సి) 1917 డి) 1918
41. **Common Scheme**ను రూపొందించడంలో ముఖ్యపాత్ర వహించింది?
ఎ) మహత్మాగాంధీ బి) బాలగంగాధర్ తిలక్
సి) సురేంద్రనాథ్ బెనర్జీ డి) మోతీలాల్ నెహ్రూ
42. 1916 డిసెంబర్‌లో ఏ ప్రాంతంలో సమావేశమై కాంగ్రెస్, ముస్లింలీగ్‌లు ఒక సామాన్య ప్రణాళిక కోసం చెరొక కమిటీని నియమించాయి?
ఎ) మద్రాస్ బి) తిరువనంతపురం
సి) లక్నో డి) బెంగళూరు
43. హోంరూల్ ఉద్యమ కాలం?
ఎ) 1916-18 బి) 1920-22 సి) 1930-32 డి) 1940-42
44. భారతదేశ వైస్రాయిగా 1916లో నియమితులైనది?
ఎ) మార్లే బి) లార్డ్ చెమ్స్‌ఫర్డ్
సి) మింటో డి) లార్డ్ కర్జన్
45. శాడ్లర్ కమిషన్‌ను ఎప్పుడు ఏర్పాటు చేశారు?
ఎ) 1914 బి) 1915 సి) 1916 డి) 1917
46. ‘వందేమాతరం’ అనే పత్రికను నడిపిన అతివాద నాయకుడు?
ఎ) మహత్మాగాంధీ బి) అరవింద్ ఘోష్
సి) తిలక్ డి) లాలాలజపతి రాయ్
47. మితవాద రాజకీయాలను **Policy of prayer, petition and protest**గా అభివర్ణించింది?
ఎ) తిలక్ బి) లాలాలజపతిరాయ్
సి) అరవింద్ ఘోష్ డి) బిపిన్ చంద్రపాల్
48. ‘సావిత్రి’ అనే గ్రంథం రచించింది?
ఎ) మదన్ మోహన్ మాలవ్యా
బి) లాలాలజపతిరాయ్
సి) బాలగంగాధర్ తిలక్ డి) అరవింద్ ఘోష్
49. అరవింద్ ఘోష్ జన్మస్థలం?
ఎ) గౌహతి బి) కలకత్తా
సి) భువనేశ్వర్ డి) మద్రాసు

సమాధానాలు

		15) డి	24) బి	33) డి	42) సి
		16) ఎ	25) ఎ	34) ఎ	43) ఎ
1) బి	8) ఎ	17) బి	26) సి	35) డి	44) బి
2) ఎ	9) బి	18) సి	27) డి	36) డి	45) సి
3) సి	10) సి	19) డి	28) ఎ	37) సి	46) బి
4) బి	11) డి	20) బి	29) బి	38) బి	47) సి
5) ఎ	12) బి	21) సి	30) బి	39) ఎ	48) డి
6) డి	13) ఎ	22) ఎ	31) సి	40) బి	49) బి
7) సి	14) ఎ	23) డి	32) బి	41) డి	

JOBS ఉద్యోగాలు

నీతి ఆయోగ్

నేషనల్ ఇన్‌స్టిట్యూషన్ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా ఆయోగ్ (నీతి ఆయోగ్)- కింది పోస్టుల భర్తీకోసం దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 173
పోస్టులు - ఖాళీలు: అడ్వైజర్/ సీనియర్ అడ్వైజర్ 7, జాయింట్ అడ్వైజర్(ఫ్లెక్సీ పూల్) 19, డిప్యూటీ అడ్వైజర్(ఫ్లెక్సీ పూల్) 19, సీనియర్ రీసెర్చ్ ఆఫీసర్ 28, రీసెర్చ్ ఆఫీసర్(ఫ్లెక్సీ పూల్) 28, ఎకనామిక్ ఆఫీసర్ (ఫ్లెక్సీ పూల్)28, ఎకనామిక్ ఆఫీసర్ 44
అర్హత: పోస్టును అనుసరించి పీజీ/ ఎంబీబీఎస్
వయసు: 26 నుంచి 50 ఏళ్ల మధ్య ఉండాలి
ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 25, 2017
వెబ్‌సైట్: www.niti.gov.in

సఫ్దర్‌జంగ్ హాస్పిటల్

ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ హాస్పిటల్- జూనియర్ రెసిడెంట్ (నాన్ పీజీ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 58
కాంట్రాక్ట్ వ్యవధి: ఏడాది
అర్హత: ఎంబీబీఎస్ డిగ్రీ ఉత్తీర్ణత + ఢిల్లీ మెడికల్ కౌన్సిల్ గుర్తింపు పొంది ఉండాలి. అభ్యర్థులు 2015 జూలై 1 తరవాతనే ఇంటర్న్‌షిప్ పూర్తిచేసి ఉండాలి.
ఎంపిక: రాత పరీక్ష, కౌన్సెలింగ్ ద్వారా
దరఖాస్తు ఫీజు: రూ.500 (ఒబీసిలకు రూ.250 కాగా ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు మినహాయింపు వర్తిస్తుంది).
ఆసక్తిగల అభ్యర్థులు తమ దరఖాస్తును నిర్దేశిత చిరునామాకు పంపాలి
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 10, 2017
చిరునామా: The Medical Superintendent, Safdarjung Hospital & VMMC, New Delhi- 110029
వెబ్‌సైట్: www.vmmc.sjh.nic.in/


ఇండియన్ ఆర్మీ

ఇండియన్ ఆర్మీ కింది పోస్టుల భర్తీకోసం విడివిడిగా దరఖాస్తులు కోరుతోంది.
లా గ్రాడ్యుయేట్స్
ఖాళీలు: 14 (పురుషులకు 10, మహిళలకు 4 పోస్టులు కేటాయించారు)
అర్హత: 55 శాతం మార్కులతో లా డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు మూడేళ్ల అనుభవం ఉండాలి. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా/ స్టేట్‌లో రిజిస్ట్రేషన్‌కు అర్హత పొంది ఉండాలి.
వయసు: 21 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 23, 2017
ఎన్‌సిసి స్పెషల్ ఎంట్రీ (43 కోర్స్)
ఖాళీలు: 54 (పురుషులకు 50, మహిళలకు 4 పోస్టులు కేటాయించారు)
అర్హత: ఎన్‌సిసి సర్టిఫికెట్‌తోపాటు 50 శాతం మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. బ్యాటిల్ క్యాజువాలిటీస్/ ఆర్మీ పర్సనల్ పిల్లలైతే ఎన్‌సిసి సర్టిఫికెట్ అవసరం లేదు.
వయసు: 19 నుంచి 25 ఏళ్లు
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 23, 2017
కంబైన్డ్ రిక్రూట్‌మెంట్ ఖాళీలు: 142
ట్రేడ్ వారీ ఖాళీలు: మెటీరియల్ అసిస్టెంట్ 6, ఎల్‌డిసి 1, ఫార్మసిస్ట్ 1, టెలీ ఆపరేటర్ 1, ఫైర్‌మన్ 36, ట్రేడ్స్‌మన్(మేట్) 94, ఎంటీఎస్ 1, ధోబి 1, టైలర్ 1
అర్హత: పోస్టును అనుసరించి బిఇ/ బిటెక్/ డిఫార్మసీ/ డిప్లొమా / ఇంటర్/ 10వ తరగతి
వయసు: పోస్టును అనుసరించి 18 నుంచి 27 ఏళ్లు
ఎంపిక: ఫిజికల్ ఎండ్యూరెన్స్ టెస్ట్, స్కిల్ టెస్ట్, రాత పరీక్ష ఆధారంగా.
ఆసక్తిగల అభ్యర్థులు తమ దరఖాస్తును స్పీడ్ / రిజిస్టర్డ్/ ఆర్డినరీ పోస్టుద్వారా నిర్దేశిత చిరునామాకు పంపాలి.
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 16, 2017
చిరునామా: Commandant 21 Field Ammunition Depot - 909721
వెబ్‌సైట్: https://joinindianarmy.nic.in

మద్దాల మృతి నాటక రంగానికి తీరని లోటు

కామవరపుకోట : ప్రముఖ రంగస్థల నటుడు మద్దాల రామారావు మృతి నాటక రంగానికి తీరని లోటని ప్రజా నాట్య మండలి జిల్లా గౌరవాధ్యక్షుడు శబ్బి కనకారావు అన్నారు. మంగళవారం కామవరపుకోటలో ప్రజా నాట్యమండలి జిల్లా కార్యవర్గ సభ్యుడు టీవీఎస్ రాజు అధ్యక్షతన జరిగిన సంతాప సమావేశంలో మద్దాల మృతికి కొద్దిసేపు మౌనం పాటించారు. అనంతరం కళాకారులు మాట్లాడుతూ మద్దాల రామారావు 'రావణాశురుడు, దుర్యోధనుడు, కీచకుడు' వంటి పాత్రలతో కళాపోషకుల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. షేక్ ఇబ్రహీమ్, జానపద కళాకారులు వీరమళ్ళ సత్యనారాయణ, బ్రహ్మాచారి, కనకరాజు, జి.సత్యనారాయణ, బి.గణేష్, ప్రసాద్, యేసుపాదం పాల్గొన్నారు.

డాక్టర్ సలహా



కాచి చల్లార్చిన నీటినే తాగాలి

కొప్పిశెట్టి నాగాంజనేయులు
వైద్యులు, కామవరపుకోట

"వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. వర్షాల వల్ల ఊపిరితిత్తుల వైరల్ జబ్బులు విజృంభిస్తాయి. ఇవి నిర్లక్ష్యం చేస్తే ఊపిరితిత్తుల నుంచి కిందకు వ్యాపించి ఇబ్బంది పెడతాయి. ప్రతీ ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించడంతో పాటు ఆహార నియమాలు పాటిస్తే వ్యాధులకు దూరంగా ఉండవచ్చు. నిల్వ ఉంచిన మాంసం, నూనె పదార్థాలు, పిజ్జా, బర్గర్‌ల వంటి ఫాస్ట్‌ఫుడ్ తినడం మంచిదికాదు. కాచి చల్లాచర్చిన నీటినే తాగాలి. శీతల పానీయాలు తాగకూడదు."

● కామవరపుకోట



● గ్యాస్ సమాచారం

చింతలపూడి గాయత్రి (భారత్) గ్యాస్ ఏజెన్సీ బుధవారం గ్యాస్ సరఫరా చేసే ప్రాంతాలు..

వెలగలపల్లి, శంఖుచక్రపురం, పాతిమాపురం, ప్రగడవరం, దేశవరం, తెడ్లం, జీలకర్రగూడెం, అన్నపనేనివారిగూడెం, కంతమనేనవారిగూడెం, ఆసన్నగూడెం, కళ్ళచెరువు, ముడిచర్ల, బాదరాల, వీరిశెట్టిగూడెం, తడికలపూడి, కామవరపుకోట, కొత్తూరు

● గ్యాస్ బుకింగ్ కోసం ఫోన్ నెంబర్లు 08823 - 222340,223655,223440

ఆన్‌లైన్ బుకింగ్ కోసం : 9440156789

● చింతలపూడి

హలో.. ఆంధ్రజ్యోతి

మీ ప్రాంతంలో జరిగే సభలు, సమావేశాలు, సంఘటనలు, ఉత్సవాలు, స్థానిక సమస్యలపై మాకు సమాచారం ఇవ్వండి.

చింతలపూడి	: 98856 65001
కామవరపుకోట	: 98662 37516
లింగపాలెం	: 94413 89314

● సినిమాలు

చింతలపూడి :

శ్రీరత్నమినీ	ఏజెంట్ భైరవ
శ్రీరత్న	గౌతమ్‌నంద
గౌరి	స్పైడర్‌మాన్
శారదామినీ	వైరస్

26 నుంచి ఆర్టీసీ పూర్తిస్థాయి కొరియర్ సర్వీసులు

ఏపీఎస్ ఆర్టీసీ ఈడీ శశిధర్
చింతలపూడిలో 155వ బ్రాంచి ప్రారంభం

చింతలపూడి : ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీ నుంచి పూర్తిస్థాయి పార్శిల్ కొరియర్ సర్వీసులు నిర్వహిస్తున్నామని ఏపీఎస్ ఆర్టీసీ ఈడీ శశిధర్ అన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక మారుతీనగర్‌లో 155వ బ్రాంచిని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువత ముందుకు వస్తే ఇటువంటి సర్వీసుల నిర్వహణ వల్ల ఉపాధి లభిస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా త్వరలోనే మరిన్ని పార్శిల్ కొరియర్ సర్వీసు కేంద్రాలను ప్రారంభిస్తామని చెప్పారు. ఆర్ఎం ధనుంజయరావు మాట్లాడుతూ చింతలపూడిలో ప్రారంభించిన పార్శిల్ కొరియర్ సర్వీసులో ఆన్‌లైన్ రిజర్వేషన్, నవ్య, క్యాట్‌కార్డులు కూడా ఇక్కడే పొందవచ్చని చెప్పారు. కొందరు విద్యార్థులు బస్‌పాస్‌లు పొందేందుకు ఇబ్బందులు పడుతున్నట్టు చెప్పడంతో ప్రతీనెల రెండు రోజులపాటు ఈ సర్వీస్ సెంటర్‌లో విద్యార్థులకు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. చింతలపూడి సర్వీస్ పాయింట్ నిర్వాహకుడు ఎ.నాగరాజుకు అనుమతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఈడీ ఎన్.వెంకటేశ్వరరావు, డీఎం ఎ.సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.



చింతలపూడిలో ఆర్టీసీ పార్శిల్ కొరియర్‌ను ప్రారంభించి రశీదును అందజేస్తున్న ఈడీ శశిధర్

ముద్రగడ హౌస్ అరెస్టుకు నిరసనగా ర్యాలీ

చింతలపూడి : కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం హౌస్ అరెస్టుకు నిరసనగా చింతలపూడిలో కాపు నాయకులు, కార్యకర్తలు మోటార్‌సైకిల్ ర్యాలీ నిర్వహించారు. మంగళవారం స్థానిక మారుతినగర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు నల్లరిబ్బన్‌లు ధరించి నినాదాలు చేశారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద కొద్దిసేపు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు బొడ్డు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కాపులను బీసీల్లో చేర్చుతామని హామీ ఇచ్చి జాప్యం చేస్తున్నారని, తమ నాయకుడు శాంతియుతంగా పాదయాత్ర జరుపుతానంటే అనుమతి ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటివరకు చేసిన అక్రమ అరెస్టులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. అనంతరం రెవెన్యూ సూపరింటెంటెండ్ సాయిరాజుకు వినతిపత్రాన్ని అందజేశారు. ర్యాలీలో గంధం చంటి, తోట శివనాగరాజు, రావిపాటి రామారావు, టి.విజయ్ కుమార్, రాజేష్‌నాయుడు, చిక్కాల నాగేశ్వరరావు, తదితరులు నాయకత్వం వహించారు.



రెవెన్యూ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న కాపు నాయకులు, కార్యకర్తలు

సంస్థాగత ఎన్నికలు పూర్తి చేయాలి

కాంగ్రెస్ పార్టీ జిల్లా రిటర్నింగ్ అధికారి రంగదాసు



సమావేశంలో మాట్లాడుతున్నశివరామన్ రంగదాసు

చింతలపూడి : సంస్థాగత ఎన్నికలను బూత్‌స్థాయిలో పూర్తి చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా రిటర్నింగ్ అధికారి శివరామన్ రంగదాసు అన్నారు. మంగళవారం స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 5వ తేదీ లోపు బూత్ కమిటీలు, 15వ తేదీ లోపు జిల్లా కమిటీలు పూర్తికావాల్సి ఉందన్నారు. బూత్ లెవెల్‌లో 14 మంది ఒక టీమ్‌గా ఉంటారని, వీరిని నియమించడంలో నాయకులు త్వరితగతిన చర్యలు తీసుకోవాలన్నారు. సభ్యత్వం రూ.5 ఉన్నవారు అర్హులుగా గుర్తించాలన్నారు. జిల్లా కమిటీ పూర్తయితే రాష్ట్ర కమిటీ నియామకాలు జరుగుతాయని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రఫీఉల్లాబేగ్ మాట్లాడుతూ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం అవుతుందన్నారు. అనంతరం రంగదాసుకు నాయకులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ముస్లిం విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. రాష్ట్ర కార్యదర్శి మారుమూడి థామస్, మండలశాఖ అధ్యక్షుడు చీకటి జగపతిరావు, ముస్లిం నాయకులు అక్బర్ ఆలీ, మసీదు కమిటీ అధ్యక్షుడు రియాజ్‌పాషా, సంకు ప్రసాద్ పాల్గొన్నారు.

ఎంఆర్ టీకా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

చింతలపూడి : ఎంఆర్ టీకా కార్యక్రమాన్ని ఉద్యోగులు, ఆరోగ్యసిబ్బంది విజయవతంగా నిర్వహించాలని సర్పంచ్ మారిశెట్టి జగదీశ్వరరావు అన్నారు. మంగళవారం ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో టీకా కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. రాఘవాపురం వైద్యాధికారిణి హర్ష్యాఫిర్దోష్ మాట్లాడుతూ 9 నెలల నుంచి 15 ఏళ్ల లోపు ఉన్న పిల్లలందరికీ ఎంఆర్ టీకాను వేయించాలన్నారు. దీనివల్ల రానున్నకాలంలో ప్రమాదకరమైన వ్యాధుల నుంచి రక్షింపబడతారన్నారు. మండలంలో 15,500 మందికి టీకాల లక్ష్యాన్ని పూర్తిచేయాలని సిబ్బందికి సూచించారు.



టీకా కార్యక్రమంలో పాల్గొన్న చింతలపూడి సర్పంచ్ జగన్

డిజిటల్ లావాదేవీలపై అవగాహన సదస్సు

చింతలపూడి : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిజిటల్ లావాదేవీలపై అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక ఎస్‌బీఐ మేనేజర్ శ్రీరామ్ మాట్లాడుతూ ఎస్‌బీఐలో 'ఎనీవేర్' అనే అనువర్తనం ద్వారా ఇంటివద్ద నుంచే అన్నిరకాల సర్వీసులు పొందవచ్చన్నారు. బ్యాంకు లావాదేవీలు, రైల్వే, బస్సు రిజర్వేషన్లు, మొబైల్ రీచార్జి వంటి సదుపాయాలు ఉన్నాయన్నారు. ఫోన్‌లో ఇంటర్‌నెట్ సౌకర్యం లేకపోయినా ఎస్‌టీడీ కాల్ ద్వారా ఖాతాలో బ్యాలెన్స్ కూడా తెలుసుకోవచ్చన్నారు. సదస్సులో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఉదయ్‌శంకరం, ఫీల్డ్ ఆఫీసర్ రమేష్, టెక్నికల్ అధికారి మాధవ్, అధ్యాపకులు జె.నాగేశ్వరరావు, పరమేశ, గోపి, తదితరులు మాట్లాడారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ

కుటుంబ విభేదాలే కారణమన్న అధికారులు

లింగపాలెం : శింగగూడెం గ్రామానికి చెందిన ఉపాధి కూలీలు ఎస్. మేరిమ్మతో పాటు మరో ముగ్గురు మహిళలు పీల్డ్ అసిస్టెంట్ ఎస్. శ్రీనివాసరావు పనులు చేసేటప్పుడు అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని గంతలో మీ-కోసంలో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో పీల్డ్ అసిస్టెంట్‌ను కొద్ది రోజులుగా విధుల నుంచి దూరంగా ఉంచారు. మంగళవారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏపీడీ వైవీవీ వరప్రసాద్ శింగగూడెం పంచాయతీ కార్యాలయంలో గ్రామ అధికారుల సమక్షంలో విచారణ నిర్వహించారు. విచారణలో పీల్డ్ అసిస్టెంట్ వారి కుటుంభసభ్యుల మధ్య ఉన్న విభేదాల కారణంగా గ్రామానికి చెందిన నాలుగు గ్రూపులు వారు శ్రీనివాసరావు నిర్వహించే పనులుకు వెళ్లమని తెలిపారు. మిగిలిన 80 గ్రూపులకు చెందిన ఉపాధికూలీలు ఇతని పనితీరుపై అనుకూలంగా తెలిపారు. అనంతరం ఏపీడీ వరప్రసాదు మాట్లాడుతూ గ్రామంలో ఇటువంటి వ్యక్తిగత ఘర్షణలకు సంబంధించి మళ్లీ ఫిర్యాదుల వస్తే పనులు నిలిపివేస్తామని సర్పంచ్, అధికారులతో పాటు కూలీలకు హెచ్చరించారు. ఇకపై అందరిని కలుపుకుని పనులు చేయించాలని పీల్డ్ అసిస్టెంట్‌కు ఆయన సూచించారు. విచారణ నివేదికను కలెక్టర్‌కు నివేదిస్తామని ఏపీడీ ప్రసాదు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణకుమారి, ఏపీవో మోహినీకుమారి, కార్యదర్శి బుజ్జిబాబు, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

పేకాటపై దాడి : నలుగురు అరెస్టు

చింతలపూడి : స్థానిక సుప్రీంపేటలో మంగళవారం పోలీసులు దాడి జరిపి పేకాటాడుతున్న నలుగురిని అరెస్టుచేసినట్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాజేష్ తెలిపారు. వీరి నుండి 18 వేల 600 రూపాయల నగదు, మూడు మోటార్‌సైకిళ్ళను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సర్కిల్ పరిధిలో పేకాట ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అప్పారావు మృతికి సంతాపం

కామవరపుకోట : భారత కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకుడు సుందర అప్పారావు మృతికి మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో సంతాప కార్యక్రమం నిర్వహించారు. ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు టీవీఎస్ రాజు, మీనుగుల దుర్గారావు, పి.భాగ్యం, టి.రాములమ్మ, జి.సత్యనారాయణ, తదితరులు నివాళులర్పించారు.

లింగరాజు మృతి యూనియన్‌కు తీరని లోటు

చింతలపూడి : ట్రాలీ ఆటో యూనియన్ గౌరవాధ్యక్షుడు కందిపాము లింగరాజు అకస్మిక మృతి యూనియన్‌కు తీరని లోటని మండల అధ్యక్షుడు దేవరపల్లి వెంకట్రావు అన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో ట్రాలీ ఆటో ఓనర్స్ అండ్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంతాపసభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంతాపసభలో ఉపాధ్యక్షుడు ఎ.యేసురాజు, కార్యదర్శి బాషా, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక అధికారి పోస్టు భర్తీ చేయాలి

భవన నిర్మాణ కార్మికుల రాస్తారోకో

చింతలపూడి : చింతలపూడిలో ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్న కార్మిక అధికారి పోస్టును భర్తీచేసి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ భవన నిర్మాణ కార్మికులు రాస్తారోకో నిర్వహించారు. మంగళవారం ఏఎంసీ కార్యాలయం నుంచి మోటార్‌సైకిళ్ల ర్యాలీని నిర్వహించి, బోసు బొమ్మసెంటర్‌లో ధర్నా జరిపి వాహనాలు నిలిపివేశారు. సంగ అధ్యక్షుడు ముళ్ళగిరి ఇమ్మానియేల్ మాట్లాడుతూ రెండేళ్లుగా చింతలపూడి కార్యాలయం ఉన్నప్పటికీ అధికారిని నియమించడం లేదని, ఇన్‌చార్జిల పాలనే సాగుతోందని, వారు కూడా ఎప్పుడు వస్తారో తెలియని పరిస్థితి ఏర్పడిందన్నారు. కార్మికులకు అందుబాటులో ఉండేవిధంగా శాశ్వత అధికారిని నియమించాలన్నారు. రాస్తారోకోలో జె.వసంత, ఎస్‌కే జబీరుల్లా, సుభాని తదితరులు పాల్గొనగా, ఏఐటీయూసీ నాయకులు మద్దతు పలికారు. వారిలో శ్రీనివాసరావు, టి.బాబు, నాగేంద్ర, వి.రవికుమార్, బి.విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో అభయాంజనేయుడు

అప్పనవీడు (పెదపాడు) : కోరిన కోర్కెలు తీర్చే అభయాంజనేయస్వామికి మొక్కుబడిగా హనుమాన్ జంక్షన్‌కు చెందిన అడ్వకేట్ మంచినపల్లి శ్రీనివాస్ పూల దండలతో అలంకరిం చారని దేవాలయ ఆలయ చైర్మన్ పావులూరి రామారావు తెలిపారు. మొక్కుబడిలో భాగంగా వరుసగా ఆరు మంగళవారాల పాటు అభయాంజనేయస్వామి వారికి నిలువెత్తు పూలదండలతో అలంకరించామని చెప్పారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అభిషేకాలు నిర్వహించారు. ఆంజనేయస్వామికి ప్రీతికరమైన రోజు మం గళవారం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులతో ఆలయం కిటకిటలాడింది. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

డాక్టర్ సలహా



దంతాలు అపరిశుభ్రంతోనే అనారోగ్య సమస్యలు

డాక్టర్ పసుమర్తి మధు, దంత వైద్యుడు, జోగన్నపాలెం

దంతాలు పరిశుభ్రంగా లేకపోతే అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంది. ఉదయం, సాయంత్రం తప్పని సరిగా రెండుసార్లు దంతాలను శుభ్ర పరుచుకోవాలి. దీంతోపాటు ఏదైనా తిన్న వెంటనే పుక్కిలించి ఊయాలి. అతి చల్లటి పదార్థంగాని, వేడి ప దార్థంగాని తీసుకోకూడదు. కాఫీ, టీ, డ్రింక్స్, చాక్లెట్స్ వంటివి తీసుకుంటే పళ్లకు ఇన్‌ఫెక్షన్లు వచ్చే అవకాశం ఉంటుంది. ప్రతీ ఆరునెలలకు తప్పని సరిగా దంత వైద్యుడిని సంప్రదించి దంత పరీక్షలు చేయించుకోవాలి. డాక్టర్ సలహాలు పాటిస్తే చాలా వరకు దంతక్షయాన్ని అరికట్టవచ్చు.

● దెందులూరు

పెదవేగి మండలంలో అధికారుల ఫోన్ నంబర్లు

ఎండీ నజీముల్లాషా తహసీల్దారు 94910 41445
పి.శ్రీనివాస్ ఎంపీడీవో 94937 42448
ఎం.బలరామరాజు ఈవోపీఆర్డీ 99666 97475
బుధవాసు ఎంఈవో 95151 59409
కె.నళినీమోహన్ పీఆర్ఏఈ 9441249999
కేవీ.సత్యప్రసాద్ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ 91001 21259
రూపేష్‌వర్మ ఇరిగేషన్ ఏఈ 96423 54466
నాగరాజు ట్రాన్స్‌కో ఏఈ పెదవేగి 94408 12737
సురేష్‌కుమార్ వెలుగు ఏపీఎం 99497 78258
శ్రీనివాసరాజు వ్యవసాయాధికారి 88866 12954
ఎల్.సువర్ణ ఉద్యానశాఖాధికారిణి 83744 49128
జి.రామకృష్ణ గృహనిర్మాణశాఖ ఏఈ 70939 30615
డాక్టర్ మనోజ్‌కుమార్ వైద్యాధికారి 96422 29444
డాక్టర్ ఎం.హరికృష్ణ మండల పశువైద్యాధికారి 87909 96873
ఐ.కోటిలింగేశ్వరరావు సెరీకల్చర్ అధికారి 99497 33739
సందీప్ ఆర్‌అండ్‌బి ఏఈ 94408 18712
వి.రామకోటేశ్వరరావు ఎస్‌ఐ 94407 96638
పి.గిరిజ సీడీపీవో 94910 51579

● పెదవేగి

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి

సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి ఆనందబాబు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆనందబాబు

దెందులూరు : ప్రభుత్వపాఠశాలలు, అంగన్‌వాడీలు బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నక్కా ఆనందబాబు, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. మంగళవారం దెందులూరులోని బహిరంగసభలో మంత్రి ఆనందబాబు, చింతమనేనిలు మాట్లాడుతూ ప్రభుత్వపాఠశాలల్లో చదివే విద్యార్థులు శాస్త్రవేత్తలు, కలెక్టర్లుగా ఉన్నతస్థానాల్లో ఉన్నారని అన్నారు. దెందులూరు నియోజకవర్గంలో 2016 సంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన 18 మందికి ట్యాబ్‌లను మంత్రి ఆనందబాబు, ఎమ్మెల్యే చింతమనేని అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి ఆనందబాబు మాట్లాడుతూ రాష్ట్రంలోనే ఏ నియోజకవర్గంలో లేని విధంగా అధికారం, పార్టీతో సంబంధం లేకుండా నియోజకవర్గంలోని ప్రతీ పాఠశాలకు ఎనిమిది సంవత్సరాలుగా నోట్ పుస్తకాలు ఉచితంగా అందజేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్న ఎమ్మెల్యే చింతమనేనిని అభినందనీయులని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సుశీల, జడ్పీటీసీ సక్కుకుమారి, ఏఎంసీ చైర్మన్ సురేంద్రనాథ్ చౌదరి, టీడీపీ జిల్లా సమన్వయకమిటీ సభ్యుడు ధూళిపాల నాగేంద్రవరప్రసాద్, మండల విద్యాశాఖాధికారి సింహాద్రి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు చర్యలు

తెలుగుదేశం ప్రభుత్వం మౌలిక వసతుల కల్పనకు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నక్కా ఆనందబాబు, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. మంగళవారం దెందులూరు శివారు సత్యనారాయణపురం గ్రామంలో 52 లక్షల రూపాయలతో నిర్మించిన బీటీ రోడ్డును మంత్రి, ఎమ్మెల్యే, ప్రారంభించారు. అనంతరం దెందులూరు గ్రామంలో సర్పంచ్ నూతలపాటి అజయ్, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారుల ఆధ్వర్యంలో నాలుగు కోట్ల రూపాయలతో నిర్మించనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీకి మంత్రి ఆనందబాబు, ఎమ్మెల్యే చింతమనేని శంకుస్థాపన చేశారు.



విద్యార్థినికి ట్యాబ్‌ను అందజేస్తున్న మంత్రి ఆనందబాబు, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

మొక్కలతోనే మానవాళి మనుగడ

ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటడంతోపాటు వాటిని సంరక్షించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖామంత్రి నక్కా ఆనందబాబు అన్నారు. దెందులూరు మండలం జాతీయ రహదారి పక్కన ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఎంపీపీ సుశీల, జడ్పీటీసీ సక్కుకుమారి, ఏఎంసీ చైర్మన్ సురేంద్రనాథ్‌చౌదరిల ఆధ్వర్యంలో వనం-మనం కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటారు.



పెదవేగిలో ఎం.ఆర్ టీకాను వేస్తున్న ఏఎన్ఎం



పెదపాడులో టీకాలు వేస్తున్న ఆరోగ్య సిబ్బంది

ఎం.ఆర్ వ్యాక్సిన్‌తోనే వ్యాధి నిరోధకశక్తి పెరుగుదల

దెందులూరు : చిన్నారులు తట్టు-పొంగు వ్యాధి బారిన పడకుండా ఎం.ఆర్ వ్యాక్సిన్‌ను వేయించుకోవాలని పోతునూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ జ్యోతి అన్నారు. మంగళవారం మండలంలోని అన్ని గ్రామాల్లో ఆరోగ్యకార్యకర్త, అంగన్‌వాడీ, ఆశా, వాలంటీర్ టీమ్‌లతో ప్రభుత్వ, ప్రైవేటు, కమ్యూనిటీహాల్స్, అంగన్‌వాడీ కేంద్రాల్లో తట్టు, పొంగువ్యాధి రాకుండా వ్యాక్సిన్ వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పెదవేగిలో.....

పెదవేగి : చిన్నారుల ఆరోగ్యం సంరక్షణకు మీజిల్స్, రుబెల్లా(ఎంఆర్) టీకాలను వేస్తు న్నామని, దీనికి తల్లిదండ్రులు పూర్తి సహకారాన్ని అందించాలని పెదవేగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎస్.మనోజ్‌కుమార్ తెలిపారు. ఎం.ఆర్ టీకాలు వేసే కార్యక్రమాన్ని పెదవేగిలో మంగళవారం ప్రారంభించారు. మండలంలోని పాఠశాలల్లో వ్యాక్సినేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మనోజ్‌కుమార్ మాట్లాడుతూ మీజిల్స్, రుబెల్లా వ్యాధులు అత్యంత ప్రమాదకరమైనవని, వాటిని పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, దీనిలో భాగంగా ఆగస్టు 1వ తేదీనుంచి ఎం.ఆర్ టీకాలను వేయడానికి ప్రణాళికను సిద్ధం చేశామని అన్నారు. తొమ్మిది నెలల నుంచి 15 ఏళ్ల వయస్సు గల బాలబాలికలకు టీకాను వేయించాలని అన్నారు. దీని కోసం ప్రాంతాల వారీగా బృందాలను ఏర్పాటు చేశామని, నేటి నుంచి రెండు వారాలపాటు పాఠశాలల విద్యార్థులకు టీకాలు వేస్తామని తెలిపారు.

పెదపాడులో

పెదపాడు : తట్టు, రుబేలా వంటి వ్యాధుల బారిన పడకుండా తొమ్మిది నెలల నుంచి 15 సంవత్సరాల లోపు బాలబాలికలకు ఎం.ఆర్. టీకా వేయించాలని పెదపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది తెలిపారు. పెదపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టరు ప్రవీణ, డాక్టరు సుష్మల ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది పలు బృందలుగా ఏర్పడి చిన్నారులకు టీకాలు వేశారు. మండలం మొత్తం మీద 11,542 మంది చిన్నారులకు ఎం.ఆర్. టీకా మందును వేయాల్సి ఉండగా, మూడు వారాల వ్యవధిలో లక్ష్యం చేరుకోవడానికి వైద్య సిబ్బంది ప్రణాళికలను సిద్ధం చేశారు.



పూజలు నిర్వహిస్తున్న మంత్రి నక్కా ఆనందబాబు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

ఆంజనేయునికి ఎమ్మెల్యే, మంత్రి పూజలు

అప్పనవీడు(పెదపాడు): పెదపాడులో వెంచేసియున్న అభయాంజనేయస్వామి వారిని సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి నక్కా ఆనందబాబు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దెందులూరులో జరిగే నియోజకవర్గ స్థాయి సమావేశానికి వెళుతూ మార్గమధ్యలో ఆగి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన మంత్రి ఆనందబాబు, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌లకు పండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజా కార్యక్రమాల అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మోరు శ్రావణి, జడ్పీటీసీ సభ్యురాలు కూరపాటి మార్తమ్మ, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు గుత్తా అనిల్, ఆలయ చైర్మన్ పావులూరి రామారావు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ సాధనే ఎమ్మార్పీఎస్ లక్ష్యం

పెదవేగి : ఎస్సీ వర్గీకరణ సాధనే ఎమ్మార్పీఎస్ లక్ష్యమని నాయకులు పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం పెదవేగి తహసీల్దారు కార్యాలయం దగ్గర ఎమ్మార్పీఎస్ చేస్తున్న ఆందోళన మంగళవారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణతోనే మాదిగలకు న్యాయం జరుగుతుందన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందా కృష్ణ మాదిగ పిలుపు మేరకు తహసీల్దార్ కార్యాలయాల దగ్గర చేస్తున్న దీక్షలు ఈనెల 7వ తేదీ వరకు నిరవధికంగా కొనసాగిస్తామని ఆయన తెలిపారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ జరిగేలా చూడాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు స్టాలిన్, శౌరి, బాలస్వామి, విజయరాజు, వెంకటేశ్వరరావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



నిరవధిక దీక్షలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు



డ్రెయినేజీ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని

పారిశుధ్యం మెరుగుదలకు చర్యలు

అప్పనవీడు (పెదపాడు) : ప్రతీ గ్రామ పంచాయతీలో పారిశుధ్య పరిస్థితులు మెరుగుదలకు పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెదపాడు మండలం అప్పనవీడు గ్రామ పంచాయతీ పరిధిలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులు, డ్రెయిన్లలో సిల్ట్ తొలగింపు పనులను మంగళవారం ఆయన పరిశీలించారు.

సూక్తి

లక్ష్య సాధనలో ఎన్నిసార్లు ఓడినా సరే.. మరోసారి ప్రయత్నించు.



వావ్.. చార్లెస్ వంతెన



స్విట్జర్లాండ్‌లోని ఆల్ప్స్ పర్వతాల్లో పచ్చదనం పరుచుకున్న అందాలతో, ప్రకృతి శోభతో అలరారే రెండు కొండ ప్రాంత గ్రామాలే.. జెర్మట్, గ్రెచెన్. వాటి మధ్యలో లోతైన గ్రాబెంగూఫర్ లోయ. గ్రెచెన్ నుంచి జెర్మట్‌కు చేరుకోవాలంటే ఆ లోయతో పాటు, చిన్న చిన్న కొండలూ ఎక్కి దిగాల్సిందే. మొత్తంగా మూడు గంటల సమయం పడుతుంది. అక్కడి ప్రజలకు ఇప్పుడు ఆ సమస్య తీరిపోయింది. కేవలం పది నిముషాల్లోనే ఇరు గ్రామాలకు చకచకా వెళ్లిపోవచ్చు. ఎలానో తెలుసా? ప్రపంచంలోనే అతి పొడవైన పాదచారుల వంతెన అక్కడ ప్రారంభించారు.

ఆల్ప్‌పర్వతాల్లోని రెండు కొండల మధ్య ఓ పొడవాటి వంతెన నిర్మించారు. దాని పేరు "చార్లెస్ కువోనెన్'. గాలికి ఊగుతూ, తూగుతూ ఉండే ఆ వంతెనను చూస్తుంటే.. కొందరికి కొండల మధ్య వెండి ఊయల్లా తోస్తుంది. ఇంకొందరికి నడిచే రోలర్ కోస్టర్‌లా కనిపిస్తుంది. ఇది సస్పెన్షన్ మోడల్ బ్రిడ్జి. వంతెనపై నడుస్తుంటే కాస్త ఊగుతూ ఉంటుంది.

జూలై 29న ప్రారంభమైన ఈ వంతేన ప్రపంచంలోనే అతి పొడవైన పాదచారుల వంతెనగా రికార్డుల్లోకి ఎక్కింది. దీని పొడవు 494 మీటర్లు.

ఈ వంతెన భూ ఉపరితలానికి 85 మీటర్ల ఎత్తులో ఉంది.


ఇప్పటివరకు జర్మనీలోని 'టైటాన్-ఆర్‌టీ' వంతెనను అతి పొడవైనదిగా పేర్కొనేవారు.

ప్రపంచంలోనే అతి పొడవైన పాదచారుల వంతెనల్లో రష్యాలోని 'స్కైపార్క్ బ్రిడ్జ్' మూడో స్థానంలో ఉంది. 2016 సోచి ఒలింపిక్స్ సందర్భంగా దీన్ని నిర్మించారు.


ఎత్తయిన ప్రదేశాలను చూసి భయపడేవారు, 'చార్లెస్ కువోనెన్' వంతెన దాటాలంటే కళ్లు మూసుకోవాల్సిందేనని జెర్మట్ ట్రావెల్ బోర్డు ప్రతినిధి అంటున్నారు.

రోడ్డు మార్గంలో వంతెన కట్టాలంటేనే ఓ నెల రోజుల సమయం పడుతుంది. కానీ రెండు కొండల మధ్యలో నిర్మించిన ఈ బ్రిడ్జిని కేవలం 10 వారాల్లోనే పూర్తి చేయడం విశేషం.

రంగులు వేయండి



బొమ్మ గీయండి



టంగ్ ట్విస్టర్స్

1. I would if I could, and if I could-n't, how could I?You couldn't, unless you could, could you?
2. The crow flew over the river with a lump of raw liver.
3. National Sheepshire Sheep Association



ఒకే అక్షరం

1. TOTAL	మొ	
2. BUD	మొ	
3. PLANT	మొ	


చుక్కలు కలపండి



నవ్వుల్ నవ్వుల్

రాహుల్ : కుట్టేముందు దోమలు ఎందుకు శబ్దం చేస్తాయి?
రోహిత్ : దాడి చేయబోతున్నాను అని వర్తమానం ఇవ్వడం యుద్ధనీతిలో భాగం.

దారి కనుక్కోండి



చెప్ప గలరా?

జాలిలో ఉన్నా కానీ గాలిలో లేను
బిరుదులో ఉన్నా కానీ అరుదులో లేను
లిపిలో ఉన్నా కానీ తాపిలో లేను
అయితే ఇంతకీ నేనెవర్నో చెప్పగలరా?


ఔనా!



వందలో డెబ్బై శాతం మంది 'హైపనిక్ జెర్క్' ఎదుర్కొన్నవారే. ఇదేదో కొత్త వ్యాధి అని అనుకుంటున్నారా? అదేం కాదు. మాంచి నిద్రలో ఉన్నప్పుడు ఎక్కడ నుంచో కింద పడుతున్నట్లు అనిపించి చటుక్కున మెలకువ వస్తుంది. అదే 'హైపనిక్ జెర్క్'.

మీకుతెలుసా?

మీకు చెట్లతో కూడిన అరణ్యాలే తెలుసు.. మరి శిలలతో ఉన్న అడవి తెలుసా? చైనాలోని యునాన్ ప్రావిన్స్‌లో ఉన్న పొడవైన శిలల సముదాయాన్నే 'స్టోన్ ఫారెస్ట్' అని పిలుస్తారు.



జంతర్‌మంతర్

ఈ కింది పదాలను సరిచేయండి

1. ఐత్యంకమ ▸ ....
2. సందనపా ▸ ....
3. పిగూడుట్ట ▸ ....

- పత్తిపాక అంకిత, కోరుట్ల

జంబ్లింగ్ వర్డ్స్

ఈ కింది పదాలను సరిచేయండి

1. IRAN ▸ ....
2. IDWE ▸ ....
3. DMBU ▸ ....

- గుర్రాల సాయిసుధ, మెట్‌పల్లి

జవాబులు

ఒకే అక్షరం : 1. మొత్తం 2. మొగ్గ 3. మొక్క
చెప్పగలరా? : జాబిలి
జంతర్‌మంతర్ : 1. ఐకమత్యం 2. సంపాదన 3. పిట్టగూడు
జంబ్లింగ్ వర్డ్స్ : 1.RAIN 2.WIDE 3.DUMB

నీరు పారని తాడిపూడి

(1వ పేజీ తరువాయి)

చూపుతుంది. రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందడం లేదు. నల్లజర్ల, తాడేపల్లిగూడెం మండలాల్లోని కొద్ది గ్రామాలకు మాత్రమే సాగునీరు అందించే పరిస్థితి ఉంది. వాస్తవానికి తాడిపూడి ఎత్తిపోతల పథకం పూర్తిగా అందుబాటులోకి వస్తే పశ్చిమలో 1.75లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది.

అంచనా నిధులు ఇలా..

తాడిపూడి ఎత్తిపోతల పూర్తికావాలంటే భూసేకరణ, పిల్లకాలువలు, అవసరమైన చోట నిర్మాణాలు చేపట్టేందుకు అదనపు అంచనాలు రూపొందించారు. దాదాపు రూ.500కోట్లు అవసరం అవుతాయని అంచనా వేశారు. ప్రస్తుతం నిధుల లేమి వల్ల కొత్తవారు ఎవరూ పనులు చేపట్టేందుకు ముందుకు రావడం లేదు. పాత ఏజెన్సీతోనే కాలం వెళ్ళబుచ్చుతున్నారు. అదికూడా ప్రతీఏటా రూ.3లేదా4కోట్లకు మించి పనులు ముందుకు సాగడం లేదు. ఈ నేపథ్యంలో కాంట్రాక్ట్ ఏజెన్సీని మార్చేందుకు అధికారులు సిద్ధపడ్డారు. అయితే కొత్తవారు ఎవరూ ముందుకు రావడం లేదు. ప్రభుత్వం విడుదలచేసిన నిధుల తోనే కొత్త కాంట్రాక్ట్ ఆధారపడి ఉంటుంది. ఇప్పటిదాక తాడిపూడి ఎత్తిపోతల పథకంలో 72కిలోమీటర్ల మేర ప్రధానకాలువను తవ్వారు. అయితే కాలువ పరిధిలో 5 ఉప ఎత్తిపోతల పథకాలను నిర్మించాల్సి ఉంది. అందులో నాలుగు మాత్రమే పూర్తిచేశారు. ద్వారకాతిరుమల పరిధిలో మరో ఉప ఎత్తిపోతల పథకాన్ని నిర్మించాల్సి ఉంది. అయితే భూసేకరణ సమస్యగా మారింది. రైతులకు సొమ్ములు చెల్లించకపోవ డంతో భూమి ఇవ్వడం లేదంటూ అధికారులు చెప్పుకొస్తున్నారు. మరో వైపు పరిహారం అధికంగా ఇవ్వాలన్న వాదన రైతుల నుంచి వినపడు తుంది. అంతేకాకుండా రాజకీయ జోక్యాలు అధికమవుతున్నాయి.

రైతుల్లోను సమన్వయం లేదు

ఎత్తిపోతల పథకం పూర్తిగా సద్వినియోగం కావాలంటే పంట బోదె లను, పిల్లకాలువలను తవ్వాలి. పిల్లకాలువల తవ్వకం విషయంలో కొందరు రైతులు అవరోధం కల్పిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతు న్నాయి. ఓ బ్లాక్‌లో మూడుకిలోమీటర్ల మేర పిల్లకాలువ తవ్వా ల్సిఉంది. అందులో 2.8కిలో మీటర్ల మేర కాలువలు తవ్వారు. ఎగువ భాగంలో మరో 200 మీటర్లు తవ్వాల్సి ఉంది. దానివల్ల పిల్లకాలువ తవ్వినా సాగునీరు అందించే పరిస్థితి లేదు. ఇటువంటి సమస్యలు తాడిపూడి ఎత్తిపోతల పథకానికి వెంటాడుతూ వస్తున్నాయి. పంటబో దెల విషయానికి వచ్చేసరికి రైతులు ముందుకు రావడం లేదు. ఉపకాలువల్లో నీటి ప్రవాహ స్థాయిని నిలబెట్టేందుకు మధ్యలో నిర్మా ణాలు చేపట్టాలి. అప్పుడే పిల్లకాలువల్లోకి సాగునీరు మళ్లుతుంది. ఉపకాలువలో ఒక స్థాయిని మించిన తరువాతే రెగ్యులర్‌గా లేదా డ్రాప్స్ నుంచి కిందకు నీరు ప్రవహిస్తోంది. ఇటువంటి నిర్మాణాలు ముందు చేపడితేనే పంటబోదెలు తవ్వకుంటామంటూ రైతుల నుంచి వాదన వినిపిస్తోంది. లేదంటే పంట బోదెలు తవ్వినా ఫలితం ఉండదని రైతులు చెప్పుకొస్తున్నారు. మొత్తానికి సమన్వయ లేమి నిధుల కొరత కాంట్రాక్టర్ ఉదాసీనత ఇప్పుడు తాడిపూడి పథకానికి పెద్ద అవరోధంగా మారిపోయింది.

గ్యాస్ సబ్సిడీకి పొగ

(1వ పేజీ తరువాయి)

సబ్సిడీ ఎత్తివేతపై అందరిలోనూ అనుమానం ఉంది. తగ్గట్టుగానే కేంద్రం ఇప్పుడు దీనినే నిజం చేసింది. ఒక్కో కనెక్షన్‌పై సరాసరిన 90 నుంచి వంద రూపాయల వరకు సిలిండర్ తీసుకున్న ప్రతీసారి సబ్సిడీగా అందిస్తున్నారు. ఆధార్ కార్డును అనుసంధానం చేసి ఆ మేరకు ఇప్పటిదాకా సబ్సిడీని బ్యాంకుల్లో జమ చేస్తూ వచ్చారు. సిలిండర్ ధర పెరిగినా కనీసం సబ్సిడీ అయినా కొంతలో కొంత కలిసి వస్తుందనుకున్న చిన్న కుటుంబాలకు కేంద్రం పెద్ద షాక్ ఇచ్చినట్లైంది. ఒకవైపు సబ్సిడీ పోను ఇక నెలవారీ నాలుగు రూపాయలు చొప్పున అదనంగా నాలుగు రూపాయలు ఒక్కో సిలిండర్‌కు చెల్లించాల్సిందే. ఒకవైపు సబ్సిడీ మొత్తం, అదనంగా ఈ నాలుగు రూపాయలు కలిపితే ఒక్కో వినియోగదారుడికి సరాసరిన వంద రూపాయలకుపైబడే భారం పడనుంది. వాస్తవానికి గ్యాస్ కనెక్షన్ల వినియోగం ఈ మధ్యన మరింత పెరిగింది. ఈ జిల్లాను పరిగణనలోకి తీసుకుంటే తాజాగా పొగ రహిత జిల్లాగా ప్రకటించారు. అంటే ఇక కట్టె పొయ్యిలకు తావులేకుండా నేరుగా సుమారు లక్ష గ్యాస్ కనెక్షన్లను కొత్తగా అమర్చారు. దీంతో వీరు కూడా అదనపు భారం మోయాల్సి వస్తుంది. సాధారణంగా గ్యాస్ పొయ్యి అంటేనే పెట్టుబడితో కూడుకుంది. ఈ మధ్యకాలంలో పెరిగిన ధరలకుతోడు గ్యాస్ ధరలను క్రమేపీ పెంచుతూనే వచ్చారు. బడ్జెట్ అనంతరం పెట్రోలు, గ్యాస్ తరహా మాదిరిగానే ఎప్పటికప్పుడు ప్రపంచ విపణిని దృష్టిలో పెట్టుకుని ఇకముందు హెచ్చుతగ్గులు ఉంటాయనే ప్రచారం సాగింది. కాని ఒక్కసారిగా సబ్సిడీని పూర్తిగా ఎత్తివేయడం లక్షలాది కుటుంబాలను విలవిలలాడేలా చేయబోతుంది. కేంద్రం తాజాగా తీసుకున్న చర్యపై ఒకింత అసంతృప్తి, ఆగ్రహం కనిపిస్తుంది. పేద కుటుంబాలను పరిగణనలోకి తీసుకోకుండా సబ్సిడీ ఎత్తివేయడం దారుణమనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. 'కుటుంబాల సంక్షేమం కోసం అది చేస్తాం.. ఇది చేస్తాం' అని చెప్పిన ప్రభుత్వాలు ఈ రకంగా సబ్సిడీల భారం కూడా సామాన్యులపై మోపడం ఎంతవరకు సబబు. ప్రభుత్వం అంటే ఆదాయమే రావాలా. సంక్షేమం అవసరంలేదా. మధ్యతరగతి, సామాన్య వర్గాల బతుకుతెరువు అవసరంలేదా.. ఇప్పటికే రకరకాల ప్రయోగాలతో పిచ్చెక్కిపోతుంది. దానికితోడు ఇదొకటి' ఏలూరుకు చెందిన గృహిణి లావణ్య ప్రతిస్పందన ఇది. ప్రతీ ఇంట్లోనూ గ్యాస్ కనెక్షన్ ఉంటుంది. ఇంతకుముందు చాలా సార్లు సిలిండర్ ధర పెంచుతూ పోయారు. ఎవరెన్ని ఆందోళనలు చేసినా పట్టించుకున్నారా.. సబ్సిడీ తీసుకోవడానికి చాలా తిప్పలు పెట్టారు. ఈ పనేదో అప్పుడే చేస్తే పోయేదంటూ గృహిణి మహాలక్ష్మి ఆవేదన చెందారు. మీ రాజకీయాలకు కోట్లు ఖర్చు పెడతారుకాని, మా దగ్గరకు వచ్చేసరికి సబ్సిడీ కూడా భారమంటూ ఇప్పుడు ఆ భారాన్ని మీరు తగ్గించుకుని మా మీద మోపుతారా.. అంటూ సత్యవతి మండిపడ్డారు. ఇలా మధ్యతరగతి వర్గీయుల్లో భిన్న వాదనలు వినిపించాయి. అలాగే దీపం పథకం కింద 4 లక్షల 52 వేల 321 కనెక్షన్లు ఉన్నాయి.

సిఎస్ఆర్ పథకం కింద 13 వేల 373 కనెక్షన్లు ఉన్నాయి. ఈ కనెక్షన్లకు మాత్రం కేంద్రం పూర్తిగా సబ్సిడీ భరిస్తూ వచ్చింది. మరి వీటి సంగతి ఏమి చేయబోతున్నారనే దానిపై మాత్రం స్పష్టతలేదు. ఒకే సమయంలో ఒక సబ్సిడీని ఎత్తివేస్తున్నట్టు నిర్ణయిస్తే అన్ని కనెక్షన్లకు ఇది వర్తిస్తుందనేది కొందరి వాదన. ఒకటి, రెండు రోజుల్లోనే దీనిపై స్పష్టత వస్తుందని గ్యాస్ కంపెనీలు చెబుతున్నాయి. అలాగే ఉజ్వల కింద 15 వేలకుపైగా కనెక్షన్లు ఉన్నాయి. మొత్తం మీద ఇచ్చే సబ్సిడీని దాదాపు ప్రభుత్వం ఉపసంహరించుకున్నట్టే. ఇక పొయ్యి వెలిగించాలంటే వెనుకా ముందు చూడాల్సిందే.

కొత్త విధానాలు సామాన్యుడికి భారమే..



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొత్త విధానాలు అమలు చేయడం వల్ల సామాన్యుడికి భారం పెరుగుతుందే తప్ప తగ్గడం లేదు. ప్రస్తుతం ఉన్న గ్యాస్ సబ్సిడీని కూడా తీసేస్తూ రూ.4 లు అదనంగా పెంచడం సామాన్యుడిపై భారం మోప డమే. ప్రభుత్వాలు పునరాలోచించుకోవాల్సిన అవ సరం ఎంతైనా ఉంది.

- పైడిముక్కల గంగాభవాని

సబ్సిడీలు, రాయితీలు అందించాలి



ఇది సామాన్యుడి ప్రభుత్వం.. అని చెప్పుకునే ప్రభుత్వాలు, నిర్ణయాలు తీసుకునే ముందు సామాన్యుడిని దృష్టిలో ఉంచుకోవడం లేదు. ఉన్న ఫలంగా రాయితీలు కోసేసి, రేట్లు పెంచేస్తే సామాన్యుడిపై భారం పెరుగు తుంది. సామాన్యులకు సబ్సిడీలు, రాయితీలు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది.

- బొంకురి కుమారి, జంగారెడ్డిగూడెం టౌన్

రైతు లేని బజార్లు!

(1వ పేజీ తరువాయి)

యథావిధిగానే వ్యాపారుల హవా కొనసాగు తున్నది. బయట మార్కెట్‌కు, రైతుబజారుకు పెద్దగా ధరల్లో మార్పులు కనిపించకపోవడంతో బజారు ఉన్న ప్రాంత వినియోగదారులు మాత్రమే అక్కడికి వెళ్ళి కొనుగోలు చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని ఏలూరు వంటి రైతుబజార్లలో తనిఖీల కారణంగా కొంత రైతు విక్రయాలు కొనసాగుతున్నాయి. దాదాపు 15ఏళ్ళు కిందటే రైతుబజార్లను ఏర్పాటు చేశారు. కూరగాయలతో పాటు నిత్యవసరాలు, పండ్లు, మాంసం, చేపలు వంటివి కూడా ఈ బజార్లలో బాగా విక్రయించేవారు. రైతుబజార్ల నిర్వహణ, బాధ్యత, జాయింట్ కలెక్టర్ పర్యవేక్షణలో ఏఎంసీ కార్యదర్శి, పాలకవర్గాలు నిర్వహిస్తూ ఉంటారు. అయితే ప్రధాన సమస్య రైతులు నేరుగా వచ్చి ఇక్కడ అమ్మడానికి వారికి రవాణా సౌకర్యం వంటివి కల్పించడంలో విఫలం చెందడంతో క్రమంగా ఈ బజార్లలో రైతులు తగ్గి వ్యాపారులు పెరిగిపోయారు. దీనితో వాటి పట్ల వినియోగదారులు పెద్దగా దృష్టి సారించలేని పరిస్థితి నెలకొంది.

రైతుబజార్లలో ఇవీ పరిస్థితులు..

రాష్ట్రంలో నెంబర్‌వన్‌గా ఉండే భీమవరం రైతుబజారులో ఎన్నో సమస్యలు నెలకొన్నాయి. విద్యుత్ కొరత, దెబ్బతిన్న రేకుషెడ్లు, మురుగు బయటకు వెళ్ళే వసతి వంటి సమస్యలు కొట్టుమిట్టాడుతున్నాయి. ఇటీవలే విద్యుత్ సమస్యను పరిష్కరించారు. రేకుషెడ్లు అభివృద్ధి, డ్రెయినేజీ వ్యవస్థ కోసం మార్కెటింగ్ శాఖకు ప్రతిపాదనలు పంపించారు. ఇక్కడ కూడా సగం మంది పైగా వ్యాపారులే కూరగాయలు విక్రయిస్తున్నట్లు తెలిసింది. పాలకొల్లు రైతుబజారు కూడా చాలా కాలంగా ఉన్నప్పటికీ ఇక్కడ మరీ దారుణమైన పరిస్థితులు ఉన్నాయి. రైతులు గాని, వ్యాపారులు గాని ఈ బజార్లలో విక్రయాలకు అంతగా సుముఖత వ్యక్తం చేయడం లేదని సమాచారం. అందుకే ఒకటి, రెండు కూరగాయ బజార్లు, నిత్యావసర దుకాణం, కోడిగుడ్లు వంటివి మాత్రమే అక్కడ కనిపిస్తాయి. నరసాపురం రైతుబజారు కూడా చాలా కాలంగా నడుస్తోంది. ఇక్కడ కూడా ఓ మోస్తరుగా రైతులు విక్రయాలు చేస్తుంటారు. తీర ప్రాంతంలో కూరగాయల సాగు ఎక్కువగా ఉన్నప్పటికీ నేరుగా దళారులే వాటిని కొనుగోలు చేసి బయట మార్కెట్లో ఎక్కువ విక్రయాలు చేస్తుంటారు. దీనితో ఇక్కడ కూడా వ్యాపార లావాదేవీలు మోస్తరుగానే సాగుతున్నాయి. తణుకు రైతుబజారులో అతి తక్కువ షాపులు మాత్రమే ఉన్నాయి. ఇటీవలే ప్రారంభించిన ఈ రైతుబజారులో విద్యుత్, మరుగుదొడ్లు, మంచినీరు వసతులు ఏర్పాటు చేయలేదు. కొవ్వూరులో ఉన్న రైతుబజారు కూడా యథావిధిగానే అటూ.. ఇటుగా రైతులు, వ్యాపారులు విక్రయాలు సాగిస్తున్నారు. ప్రధానంగా వినియోగదారులు ధరలతో పోల్చుకోవడం వల్ల ఆయా సందర్భాల్లో ఎక్కడ ధర తక్కువ ఉంటే అక్కడికి వెళ్ళే పరిస్థితులు నడుస్తున్నాయి. ఏలూరు రైతుబజారులో కూడా చెదురుమదురుగా వ్యాపారుల జోక్యం ఉంటుంది. సౌకర్యాలు కూడా మెరుగుపరచాలని కోరుతున్నారు.

మూన్నాళ్ళ ముచ్చటగా

ఎత్తేసిన నిడదవోలు రైతుబజారు

నిడదవోలు పురపాలక సంఘంలో దీర్ఘకాలంగా వినియోగదారుల కోరిక మేరకు రైతుబజారు గత నెలలో ఏర్పాటు చేశారు. అయితే మూడు, నాలుగు రోజులు మించి బజారు నిల్వలేదు. ఒక షెడ్డు ఏర్పాటు చేసి అందులో బజారు ప్రారంభించారు. అయితే మార్కెట్ కమిటీ అధికారుల నిర్లక్ష్యమో.. పురపాలక సంఘంలో నెలకొన్న సమస్యలో గాని ఈ బజారును కొద్దిరోజుల్లోనే ఎత్తి వేయడంతో వినియోగదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

తాడేపల్లిగూడెం, జంగారెడ్డిగూడెంల్లో

కొత్త రైతుబజార్లు

తాడేపల్లిగూడెంలో రైతుబజారు లేదు. ఇటీవలే గూడెంలో మునిసిపాలిటీ ఒక ఎకరం స్థలాన్ని కేటాయించింది. ఇక్కడ రైతుబజారు ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. సుమారు రూ.2.50కోట్లను కూడా ఈ రైతుబజారుకు కేటాయించారు. జిల్లాలో కూరగాయలన్నీ తాడేపల్లిగూడెం కేంద్రంగానే ఇతర ప్రాంతాలకు ఎగుమతి అవుతుంటాయి. రైతుల నుంచి చౌకగానే కొనుగోలు చేస్తారు. కాబట్టి ఇక్కడ రైతుబజారు ఉంటే వినియోగదారులకు తక్కువ ధరకే కూరగాయలు లభించే అవకాశాలు ఉన్నాయి. అలాగే జంగారెడ్డిగూడెం పురపాలక సంఘంలో కూడా ఇటీవలే ఎకరం స్థలం కేటాయించారు. దీనికి నిధులు కూడా ప్రతిపాదనలు చేశారు. దీనితో త్వరలో ఈ పట్టణంలో కూడా రైతుబజారు ఏర్పాటు చేసే అవకాశం ఉంది. కాబట్టి ప్రస్తుతం ఉన్న రైతుబజార్లను జిల్లా యంత్రాంగం అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇప్పటికే మండలానికి ఒక మినీ రైతుబజారు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలు జారీ చేశారు. పలు ఏఎంసీల్లో కసరత్తు ఆరంభించారు.





తలకు గాయాలైన కుంజా జగదీష్, ప్రమాదంలో గాయపడ్డ కారం సత్యం

కారు ఢీకొని ఇద్దరికీ తీవ్రగాయాలు

అశ్వారావుపేట రూరల్: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనగా ఇద్దరికీ తీవ్రగాయాలైన సంఘటన అశ్వారావుపేటలో సోమవారం రాత్రి జరిగింది. ఆంధ్రలోని జీలుగుమిల్లి మండలం దాట్లవారి గూడెం గ్రామానికి చెందిన కుంజా జగదీష్, కారం సత్యం అనే వ్యక్తులు అశ్వారావుపేటలో గల పరిశ్రమలో పనిచేస్తున్నారు. విధుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై అశ్వారావుపేట వస్తున్నారు. రాత్రి 11గంటల సమయంలో రాజమండ్రి నుంచి అశ్వారావుపేటకు వస్తున్న కారు వెనుక నుంచి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో కుంజా జగదీష్, కారం సత్యం తలకు, శరీరంపై బలమైన గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను అశ్వారావుపేట ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. మెరుగైన చికిత్స కోసం మంగళవారం మధ్యాహ్నం ఏలూరు వైద్యశాలకు తరలించారు.

ట్రాక్టర్ తిరగబడి 11 మందికి గాయాలు

పోలవరం: ఏజెన్సీలో మంగళవారం రాత్రి ట్రాక్టర్ తిరగబడి 11 మందికి తీవ్ర గాయాలయ్యాయి. మెట్టప్పకోట గ్రామస్తులు మంగళవారం సాయంత్రం పోలవరం మండల కేంద్రంలో జరిగే వారపు సంతకు వచ్చి తిరిగి వెళుతుండగా మెట్టప్పకోట గ్రామ సమీపంలో కొండ ఎక్కుతుండగా ట్రాక్టర్ తిరగబడింది. క్షతగాత్రులను పోలవరం వైద్యశాలకు తరలించగా వైద్యులు అంకమ్మబాబ్, సుధాకర్ చికిత్స అందించారు. వారిలో ములెం నాగమ్మ, మూలెం రాధలకు తీవ్రగాయాలు కావడంతో 108 వాహనంలో రాజమండ్రికి తరలించారు.

కళారత్న 'మద్దాల'కు కన్నీటి వీడ్కోలు

తాడేపల్లిగూడెం టౌన్: ప్రముఖ రంగస్థల కళాకారుడు, కళారత్న మద్దాల రామారావు ఇకలేరు అనే విషయాన్ని తెలుసుకున్న పలువురు ప్రముఖులు ఆయన పార్థివదేహాన్ని కడసారి చూసేందుకు విచ్చేసి నివాళులర్పించారు. రామారావు సోమవారం సాయంత్రం వీకర్స్‌కాలనీలోని తన నివాసంలో అనారోగ్యంతో మృతి చెందిన విషయం విదితమే.

దేవాదాయ శాఖ మంత్రి పైడికొండల మాణిక్యాలరావు మంగళవారం ఉదయం మద్దాల పార్థివదేహం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పౌరాణిక నాటకాలలో మద్దాల అనితరసాధ్యమైన నటనను ప్రదర్శించి, అనేకమందికి మార్గదర్శకులుగా నిలిచారని కొనియాడారు. మద్దాల పార్థీవ దేహాన్ని సందర్శించిన వారిలో మునిసిపల్ ఛైర్మన్ బొలిశెట్టి శ్రీనివాస్, జిల్లా రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘాధ్యక్షుడు బొడ్డేపల్లి అప్పారావు, పలువురు కౌన్సిలర్లు ఉన్నారు. మంగళవారం మధ్యాహ్నం మద్దాల రామారావు పార్థివదేహాన్ని మానవత స్వచ్ఛంద సేవా సంస్థకు చెందిన వాహనంలో కొవ్వూరు గోష్పాద క్షేత్రానికి తరలించారు. అక్కడ మద్దాల కుమారులు, బంధువర్గం అంత్యక్రియలు నిర్వహించారు.

విజయవంతంగా.. ఎంఆర్ వ్యాక్సిన్లు

జిల్లా వ్యాప్తంగా ఎంఆర్ వాక్సినేషన్ కార్యక్రమాలను మంగళవారం మంత్రులు ప్రారంభించారు. పలు పాఠశాలల్లోని విద్యార్థులకు మంత్రులు వ్యాక్సిన్లు వేశారు. పట్టణ ప్రాంతాలు, మండల కేంద్రాలతోపాటు గ్రామాలు, మారుమూల పల్లెల్లోనూ, కాలనీలు, వాడల్లోని మెయిన్ సెంటర్లు, పాఠశాలలు, పంచాయతీ కార్యాలయాల వద్ద ఎంఆర్ వ్యాక్సిన్ కేంద్రాలను ఏర్పాటు చేసి తొమ్మిది నెలల నుంచి 15 సంవత్సరాల లోపు పిల్లలకు ప్రభుత్వ వైద్యులు, వైద్య సిబ్బంది వ్యాక్సిన్లు వేసి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



కొవ్వూరు పట్టణంలోని రాజీవ్ కాలనీలో ఎంఆర్ వ్యాక్సిన్ బాక్స్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి జవహర్



విద్యార్థులకు నిర్వహిస్తున్న వాక్సినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మాణిక్యాలరావు



టీకా వేయించుకున్న బాలికలకు సర్టిఫికెట్లు అందిస్తున్న మంత్రి, కలెక్టర్

ఎంఆర్ టీకా సామాజిక బాధ్యత

మంత్రి పితాని సత్యనారాయణ

ఏలూరు రూరల్: చిన్నారులకు మీజిల్స్, రుబెల్లా వ్యాధులు రాకుండా ప్రభుత్వం చేపట్టిన ఎంఆర్ టీకా కార్యక్రమాన్ని సామాజిక బాధ్యతగా తీసుకోవాలని మంత్రి పితాని సత్యనారాయణ చెప్పారు. స్థానిక కస్తూరిబా బాలికోన్నత పాఠశాలలో మంగళవారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఎంఆర్ టీకా కార్యక్రమాన్ని మంత్రి పితాని సత్యనారాయణ ప్రారంభించారు. ఒకే టీకాతో రెండువ్యాధులను నివారించేందుకు చేపట్టిన బృహత్తర కార్యక్రమంలో తల్లిదండ్రులతోపాటు ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సేవా సంస్థలు పాల్గొనాలన్నారు. పోలియో వ్యాధిని నిరోధించినట్లుగా భవిష్యత్‌లో తట్టు, రుబెల్లా వ్యాధులు లేకుండా ప్రయత్నం చేస్తున్నామన్నారు. ప్రపంచ ఆరోగ్యసంస్థ సూత్రాలు పాటించి ఆయా వ్యాధుల నివారణకు ముందస్తుగా చిన్నారులకు వ్యాక్సిన్ వేయించాలన్నారు. ఈ విషయంలో లయన్స్ క్లబ్ క్రియాశీలక పాత్ర వహించడం అభినందనీయమన్నారు. కలెక్టర్ కె.భాస్కర్ మాట్లాడుతూ జిల్లాలో 8,36,802 మంది పిల్లలకు తట్టు, పొంగు నిరోధక టీకాలను అందించాల్సిన బాధ్యత వైద్య, ఆరోగ్య, ఐసీడీఎస్, విద్యా శాఖాధికారులపై ఉందన్నారు. టీకా పొందే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఖాళీ కడుపుతో ఎంఆర్ టీకాలను వేసుకోకూడదని, తప్పనిసరిగా టీకా వేసుకునే ముందు అల్పాహారం లేదా భోజనం కచ్చితంగా చేయాలన్నారు. టీకా కారణంగా ఎటువంటి దుష్ప్రభావాలు ఉండవని, కొద్ది మందికి రియాక్షన్ కలగవచ్చని, ఈ విషయంలో ఎటువంటి కంగారు పడాల్సిన అవసరంలేదన్నారు. ఇందుకు తగిన మందు కూడా వెంటనే వైద్య సిబ్బంది అందిస్తారన్నారు. నగర మేయర్ షేక్ నూర్జహాన్, ఎఫ్‌డిసి చైర్మన్ అంబికా కృష్ణ, జిల్లా వైద్యాధికారికోటేశ్వరి, ఆర్డీవో చక్రధరరావు, నగరపాలక సంస్థ కమిషనర్ వై.సాయిశ్రీకాంత్, డిప్యూటీ మేయర్ నాయుడు పోతురాజు, లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ కిషోర్‌కుమార్, కో-ఆర్డినేటర్ రామారావు, తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే టీడీపీ ధ్యేయం

● సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నక్కా ఆనందబాబు



లబ్ధిదారులకు రుణాలు అందజేస్తున్న మంత్రి ఆనందబాబు, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

దెందులూరు : తెలుగుదేశం ప్రభుత్వం పేదల సంక్షేమానికి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతోందని, ఏ రుణం అయినా ప్రజాప్రతినిధుల ప్రమేయంతోనే లబ్ధిదారులకు అం దజేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి నక్కా ఆనందబాబు అన్నారు. దెందులూరులో మంగళవారం రుణమేళా కార్యక్రమాన్ని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రభుత్వం అందించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు రుణాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దెందులూరు నియోజకవర్గంలో 40 వేల 300 మందికి 46 కోట్ల రూపాయల రుణాలను అందజేస్తున్నామని, 2300 మందికి వివిధ రుణాల కింద 26 కోట్ల రూపాయలు అందజేశామని, స్వయం సంఘాలవారికి 6 కోట్ల రూపాయలు అందజేశామని అన్నారు. మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అపరభగీరథుడిలా పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను కృష్ణా ఆయకట్టుకు అం దించడం ద్వారా సుమారు 12 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో పోలవరంతోసహా అన్ని ప్రాజెక్టులు సకాలంలో పూర్తిచేసే విధంగా చంద్రబాబునాయుడు ముందుకు వెళుతున్నారని అన్నారు. జిల్లాలోనే అన్ని మండలాల కంటే ఎక్కువ సిమెంట్ రోడ్లు నిర్మించిన ఘనత ఎమ్మెల్యే చింతమనేనిదేనని అన్నారు. రాష్ట్రంలో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంలోను, ఉపాధిహామీ పథకంలోను దెందులూరు నియోజకవర్గంలో మొదటిస్థానంలో దూసుకుపోతోందని అన్నారు. నియోజకవర్గంలోని పేదప్రజలను ఆదుకునేందుకు మొదటిసారిగా 700 కుటుంబాలకు సబ్సిడీపై గేదెలను అందజేశామని, 90 మం దికి చేపల వ్యాపారం చేసుకునేందుకు మోటార్‌సైకిళ్లను పంపిణీ చేశామని, నూటికి 90 శాతం సబ్సిడీపై ఎనిమిది ఆటోలు, నాలుగుచక్రాల వాహనాలను రుణాల కింద మంజూరు చేశామని అన్నారు. అనంతరం లబ్ధిదారులకు రుణాలను అందజేశారు. కార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షుడు మాగంటి రాంజీ, ఎంపీపీ సుశీల, జడ్పీటీసీ సక్కుకుమారి, సర్పంచ్ అజయ్, ఏలూరు ఆర్డీవో చక్రధరరావు, నాలుగు మండలాలకు చెందిన ఎంపీపీలు, జడ్పీటీసీలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెన్నాంజనేయుడు



అశోక్‌నగర్‌లోని అభయాంజనేయస్వామి ఆలయంలో శ్రావణ మంగళవారం పురస్కరించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణ మంగళవారం సందర్భంగా స్వామివారిని వెన్నతో విశేషంగా అలంకరించారు. ఉదయం స్వామికి విశేష పూజలు, తమలపాకులతో అర్చనలు, గంధ సింధూరంతో పూజలు నిర్వహించారు. అశేష సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

- ఏలూరు రూరల్

భీమవరంలో రేపు చదరంగం పోటీలు

భీమవరం ఎడ్యుకేషన్: జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనసూయ చెస్ అకాడమీ సహకారంతో ఆగస్టు 3వ తేదీ ఉదయం 10 గంటల నుంచి భీమవరంలోని డీఎన్ఆర్ కాలేజీ రోడ్డులో ఉన్న కిడ్డీ ప్లేస్కూల్‌లో జిల్లా జూనియర్స్ (అండర్-19) బాలురు, బాలికల చదరంగం పోటీలు నిర్వహిస్తున్నామని జిల్లా అధ్యక్షుడు తోట భోగయ్య తెలిపారు. పోటీల్లో పాల్గొనేవారు 01-01-1998 లేదా ఆ తరువాత జన్మించిన వారై ఉండాలని, ప్రతీఒక్కరూ తమ ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీ తీసుకురావాలన్నారు. ఈ పోటీలో మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన బాలురు, బాలికలు ఆగస్టు 7,8,9 తేదీల్లో విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి జూనియర్స్ చదరంగం పోటీల్లో జిల్లా తరుపు ప్రాతినిధ్యం వహిస్తారని జిల్లా కార్యదర్శి మాదాసు కిషోర్ తెలిపారు. వివరాలకు సెల్ నెంబర్ 906322446లో సంప్రదించవచ్చునన్నారు.

తక్కువ ఖర్చుతో ఆర్టీసీ పార్శిల్ రవాణా

ఏలూరు రూరల్: ఆర్టీసీ పార్శిల్ రవాణాకు విశేష స్పందన లభిస్తుందని ఏపీఎస్ఆర్టీసీ సీ అండ్ పీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్.శశిధర్ అన్నారు. మండలంలోని తంగెళ్ళమూడిలో ఆర్టీసీ రవాణా పార్శిల్ సర్వీస్ సెంటర్ పాయింట్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అతి తక్కువ ధరకే ఆర్టీసీలో పార్శిల్ రవాణా సౌకర్యాన్ని ప్రవేశపెట్టిందని, ఈ సౌకర్యాన్ని ప్రజలు వినియోగించుకోవాల్సిందిగా కోరారు. పార్శిల్‌పై ఉచిత బీమా సౌకర్యం ఉంటుందన్నారు. ఆర్టీసీ ఆర్ఎం ఎస్.ధనుంజయరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విజయవాడ జోన్ ఎన్.వెంకటేశ్వర్లు, సీటీఎం డి.వెంకటరామం, డిపో మేనేజర్ ఎ.సుబ్రహ్మణ్యం, పార్శిల్ పాయింట్ నిర్వాహకులు వంగా శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఆర్టీసి రవాణా పార్శిల్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శశిధర్

బెల్ట్ షాపు నిర్వాహకులు అరెస్ట్

పాలకొల్లు: పాలకొల్లు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు పాలకొల్లు ఎక్సైజ్ సీఐ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. బెల్టుషాపులు నిర్వహణపై సిబ్బందితో సోమవారం రాత్రి దాడి చేయగా ఆచంట మండలం వల్లూరులో గుబ్బల వెంకటేశ్వరరావు, పోడూరు మండలం కుమ్మరగుంటలో అయి నంపూడి సంజీవరావు అనే ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశామన్నారు. వీరిలో వెంకటేశ్వరరావు వద్ద నుంచి ఆటోను, ఇరువురి వద్ద నుంచి మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

డాక్టర్ సలహా



డయేరియా రాకుండా అప్రమత్తంగా ఉండాలి

ఎ.దేవదాసు, పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పోడూరు

వర్షాకాల సీజన్‌లో డయేరియా రాకుండా కాచి వడపోసిన నీళ్లు తాగాలి. మంచినీటిని క్లోరినేషన్ చేయాలి. వర్షాకాలంలో వచ్చే వ్యాధులకు సం బంధించిన అన్ని రకాలు మందులు ప్రాధమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెం టర్లలో అందుబాటులో ఉన్నాయి. దోమలు లేకుండా పరిసరాలు పరి శుభ్రంగా ఉంచుకోవాలి. వీధులు, డ్రెయిన్‌లలో దోమలు మందు పిచికారి చేయాలి. తొమ్మిది నెలల నుంచి 15 ఏళ్ల లోపు పిల్లలకు ఎం.ఆర్ వాక్సిన్ వేయించాలి. దీని కోసం ఈనెల 1 నుంచి సెప్టెంబర్ 19 వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నాం.

● పెనుగొండ

డబ్బులు వసూలు చేస్తే చర్యలు తప్పవు

మంత్రి పితాని సత్యనారాయణ



పెనుగొండలో పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి పితాని

ఆచంట: ప్రభుత్వం పేద ప్రజలకు అందించే సంక్షేమ పథకాలు ఎంపిక విషయంలో లబ్ధిదారుల నుంచి కార్యకర్తలు, నాయకులు డబ్బులు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వస్తే చర్యలు తప్పవని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి పితాని సత్యనారా యణ హెచ్చరించారు. మండలానికి కొత్తగా మంజూరయిన 228 పింఛన్లను మంత్రి పితాని మంగళవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీపీ మేకా పద్మకుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి మంత్రి పితాని ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆచంటలో ఇల్లు కట్టుకోవాల్సిన లబ్ధిదారులు చాలా మంది ఉన్నారని, నాయకులు మధ్య సమన్వయ లోపంతో లబ్ధిదారులను నేటికీ ఎంపిక చేయకపోవడంపై మంత్రి పితాని అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టిందని వీటిని నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. త్వరలో చేపట్టే ఇంటింటికి టీడీపీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం కొత్తగా మంజూరయిన 228 పింఛన్లను మంత్రి పితాని లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఆచంట, పెనుగొండ, ఏఎంసీ చైర్మన్లు ఉప్పలపాటి సురేష్‌బాబు, సానబోయిన గోపాలకృష్ణ, ఎంపీపీ మేకా పద్మకుమారి, సర్పంచ్ బీరా తిరుపతమ్మ, జడ్పీటీసీ బండి రామారావు, వైస్ ఎంపీపీ గెద్దాడ సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండలో...

పెనుగొండ : అర్హులైన ప్రతీ ఒక్కరికీ పెన్షన్లు అందించడమే ధ్యేయంగా తెలుగుదేశం ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. పెనుగొండ మండలంలో కొత్తగా మంజూరైన 312 పెన్షన్లను మంగళవారం మండల పరిషత్ ఆవరణలో మంత్రి పితాని పంపిణీ చేశారు. గత ప్రభుత్వ హయాంలో 4160 పెన్షన్లు పంపిణీ చేయగా మూడేళ్ల కాలంలో అర్హులైన 2305 మందికి కొత్తగా పెన్షన్లు అందించామన్నారు. గతంలో రూ.10,6700 పంపిణీ చేయగా ప్రస్తుతం 62,14,000వేలు పంపిణీ చేస్తున్నామన్నారు. చంద్రన్న భీమా పథకంలో సహజ మరణాలకు ఇచ్చే బీమా పెంచడానికి ప్రభుత్వం ప్రయత్నింస్తోందని, గతేడాది చంద్రన్న బీమా చెల్లించిన వారందరూ రెన్యూవల్ చేయించుకోవాలని కోరారు. ఆగస్టు 15 నుంచి చంద్రన్న బీమా రెన్యూవల్ కార్యక్రమం జరుగుతుందన్నారు. నగదుకే రేషన్ ఇచ్చేలా ప్రభుత్వం అదేశాలు ఇచ్చిందని, నిధుల కొరత ఉన్నా సంక్షేమ కార్యక్రమాలు అమలులో ఎలాంటి ఆటంకాలు కలగకుండా చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్లు సానబోయిన గోపాలకృష్ణ, ఉప్పలపాటి సురేష్‌బాబు, జడ్పీటీసీ రొంగల రవికుమార్, ఎంపీపీ పల్లి జూలీసురేఖ పాల్గొన్నారు.



ఆచంటలో పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి పితాని

మతోన్మాద దాడులను తిప్పికొట్టాలి

పెనుమంచిలి(ఆచంట) : దేశంలో మతోన్మాద శక్తులు కులం, మతం, ప్రాంతాలు పేరుతో ప్రజల మధ్య చిచ్చుపెట్టి అల్లర్లు సృష్టిస్తున్నాయని ప్రజలందరూ ఐక్యంగా ఉండి అటువంటి దాడులను తిప్పికొట్టాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కేతా గోపాలన్ పిలుపునిచ్చారు. పీడిత ప్రజల హక్కులు కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన కామ్రేడ్ నార్గన నరసింహ మూర్తి వర్ధంతి సభ మంగళవారం పెనుమంచిలిలో సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నార్గన నరసింహ మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కామ్రేడ్ నార్గన నరసింహమూర్తి పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఇందుకూరి సూర్యనారాయణరాజు, నెక్కంటి కృష్ణమూర్తి, తోట పల్లి సత్యనారాయణ, కేవీఎన్ శర్మ, బండి రంగారావు, వద్దిపల్లి శ్రీను, అంజిబాబు, తలుపూరి బుల్లాబ్బాయి, కొండేటి సత్యనారాయణ, చదలవాడ చంటిబాబు, కామ్రేడ్ నరసింహమూర్తి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



నరసింహమూర్తి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



వేడంగిలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న కాపు సంఘం నాయకులు

ముద్రగడ అరెస్టు అన్యాయం

పోడూరు : కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభాన్ని పోలీసులు అరెస్టు చేయడాన్ని వ్యతిరేకిస్తూ వేడంగిలో అంబేద్కర్ విగ్రహం వద్ద కాపు సంక్షేమ సంఘం నాయకులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వేడంగి కాపు సంఘం అధ్యక్షుడు కొండేటి సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కాపులను బీసీల్లో చేర్చుతామని చెప్పి మోసం చేశారని, కాపులకు న్యాయం చేయాలని కోరుతూ పాదయాత్రకు శ్రీకారం చుట్టిన ముద్రగడను అరెస్టు చేయడం దారుణమని అన్నారు. కాపులకు న్యాయం చేసే వరకు కాపు ఉద్యమం ఆగదని సుభాస్ చంద్రబోస్ తెలియజేశారు. కార్యక్రమంలో మండల కాపు సంఘం అధ్యక్షుడు మైగా పుల రాంబాబు, కాపు సంఘం నాయకులు బొలిశెట్టి మంగయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు

కవిటంలో నేత్ర వైద్య శిబిరం

పోడూరు : మండలంలోని కవిటం గ్రామంలో రాజవల్లి రాధారమణి లయన్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించి 67 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. సర్పంచ్ అంబళ్ల అప్పాయమ్మ నేత్ర వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో దాతలు సాయంతో పేదలకు వైద్య సేవలందించడం అభినం దనీయమన్నారు. కవిటం అంతిమోక్ చర్చి పాస్టర్ జి.పాల్ సుధీర్ శిబిరం నిర్వహణకు ఆర్థిక సాయం అందజేశారు. కార్ర్యకమంలో ఎంపీటీసీలు పిల్లా యామిని, సవరు పుష్ప, పాస్టర్లు జివివి. సుబ్బారావు, జి. విశ్వం, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కొబ్బరి దింపు కార్మికులకు పింఛన్ ఇవ్వాలి

వేమవరం(ఆచంట): ఎన్టీఆర్ భరోసా పథకంలో 50 ఏళ్లు నిండిన కొబ్బరి దింపు, ఒలుపు కార్మికులకు పింఛన్లు ఇవ్వాలని రాష్ట్ర కొబ్బరి దింపు-ఒలుపు కార్మిక సంఘ అధ్యక్షుడు బండి ఆదికృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. వేమవరంలో చేనేత కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం కొబ్బరి దింపు-ఒలుపు కార్మికుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆదికృష్ణ మాట్లాడుతూ 10 వేల మంది గుర్తింపు పొందిన కార్మికులకు తక్షణం రుణాలు మంజూరు చేయాలని, కార్మికులకు సొసైటీ ఏర్పాటు చేసి ప్రభుత్వం 100 కోట్లు ప్యాకేజీ ఇవ్వాలని కోరారు.



త్రిమూర్తులు, వర్మలను సత్కరించిన డాక్టర్ కేఆర్‌రాజు, తదితరులు

ఆరోగ్యకరమైన జీవనం గడపాలి

పెనుగొండ : ఉద్యోగ విరమణ తర్వాత ఆరోగ్యకరమైన జీవితం గడపడానికి తగిన కార్యచరణ రూపొందించుకోవాలని ఎస్వీకేపీ విద్యాసంస్థల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ కే.రామచంద్రరాజు అన్నారు. కళాశాల సెమినార్ హాల్‌లో సీనియర్ అసిస్టెంట్ దామిశెట్టి త్రిమూర్తులు, జూనియర్ అసిస్టెంట్ పి.అర్జునవర్మల ఉద్యోగ విరమణ సత్కారసభ నిర్వహించారు. డాక్టర్ రాజు మాట్లాడుతూ త్రిమూర్తులు లాబ్‌లలో, పరీక్షల విభాగంలో, అకౌంట్స్ విభాగంలో, భవన నిర్మాణంలో విశేష సేవలు అందజేశారని కొనియాడారు. పదవీవిరమణ అనంతరం తగిన కార్యాచరణతో ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.సూర్యనారాయణరాజు మాట్లాడుతూ త్రిమూర్తులు, అర్జున్‌వర్మలకు తమకు అందుబాటులో ఉన్న మెడికల్, ఎర్న్ లీవులను ఉపయోగించుకోకుండా ప్రతి నిమిషం కళాశాల అభ్యున్నతి కోసమే పనిచేశారని అభినందించారు. పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ గుబ్బల తమ్మయ్య, కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు పితాని సూర్యనారాయణ, కోశాధికారి ఉద్దగిరి లవకుమార్, అధ్యాపకులు కేఎస్‌ఆర్పీ కుమార్‌జాన్, డాక్టర్ వైవీవీ అప్పారావు, ఆర్.రామ్మోహనరావు, ఎస్.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఆచంటలో విద్యార్థికి వ్యాక్సిన్ వేస్తున్న ఏఎన్‌ఎం



పోడూరు విద్యార్థికి వ్యాక్సిన్ వేస్తున్న ఏఎన్‌ఎం

చిన్నారులకు ఎం.ఆర్ వ్యాక్సిన్ వేయించాలి

ఆచంట : తొమ్మిది నెలలు నుంచి 15 ఏళ్లలోపు బాలబాలికలకు తట్టు, రుబెల్లా వ్యాక్సిన్‌ను అందేలా చూడాలని ఎంపీపీ మేకా పద్మకుమారి, ఎఎంసి చైర్మన్ ఉప్పలపాటి సురేష్‌బాబు అన్నారు. ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఎం.ఆర్ వ్యాక్సిన్‌ను వల్లూరు, వేమవరం పీహెచ్‌సీ పరిధిలో పాఠశాలల్లో విద్యార్థులకు మంగళవారం వేశారు. పీహెచ్‌సీ అధికారులు డాక్టర్ అనిల్‌కుమార్, డాక్టర్ డి.సంధ్యారాణిలు మాట్లాడుతూ ఈ వ్యాక్సిన్ సురక్షితమైనదని, తొమ్మిది నెలల నుంచి 15 సంవత్సరాల లోపు పిల్లలకు తప్పనిసరిగా వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బండి హామావతి, కనపాల స్వర్ణకుమారి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోడూరు : ఒకే ఒక్క టీకాతో తట్టు, రూబెల్లా రెండు వ్యాధులను నివారించవచ్చని జడ్పీటీసీ బొక్కా నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని పండిత విల్లూరు జడ్పీ హైస్కూల్‌లో పోడూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టీకా శిబిరాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ప్రభుత్వం టీకా కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని, తల్లిదండ్రులు చిన్నారులకు టీకాలు వేయించాలని కోరారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం జి.శ్రీనివాసరావు, పోడూరు పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎ.దేవదాసు, ఏఎన్ఎం స్వరాజ్యం, హెల్త్ అసిస్టెంట్ డి.రామకృష్ణ, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

పెనుగొండ : మీజిల్స్, రుబెల్లా వైరస్‌ల బారిన పడకుండా చిన్నారులందరికీ వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించాలని పెనుగొండ ఏఎంసీ చైర్మన్ సానబోయిన గోపాలకృష్ణ అన్నారు. ఎం.ఆర్ వ్యాక్సిన్ శిబిరాన్ని పెనుగొండ భాష్యం పబ్లిక్ స్కూల్‌లో మంగళవారం ప్రారంభించారు.



ఆర్టీసీ సమాచారం..

హైదరాబాద్ వెళ్ళే సర్వీసులు :
రాత్రి 8గంటలకు బీహెచ్ఈఎల్ వయా కలిదిండి, రాత్రి గం.8.30ని.లకు బీహెచ్ఈఎల్ వయా కైకలూరు, 9గంటలకు బీహెచ్ఈఎల్ వయా కలిదిండి), గం.9.30ని.లకు బీహెచ్ఈఎల్ వయా కలిదిండి, రాత్రి గం.8.15ని.లకు బీహెచ్ఈఎల్ (గరుడ, ఏపీ), జీడిమెట్ల రాత్రి గం.8.15ని.లకు, ఈసీఐఎల్, రాత్రి 9గంటలకు..

విజయవాడ : ప్రతీ 20నిమిషాలకు బస్ సర్వీస్ కలదు.

విశాఖపట్టణం : ఉదయం గం.6.30ని.లకు, ఉదయం గం.7.30ని.లకు, రాత్రి గం.8.45ని.లకు, గం.9.10ని.లకు, గం.10.10ని.లకు, గం.10.40ని.లకు. సాయంత్రం గం.5.45ని.లకు బత్తిలి(వయా విశాఖపట్టణం).

తిరుపతి : ఇంద్ర ఏసీ సాయంత్రం 6గంటలకు. ఉదయం గం.10.30ని.లకు.

ప్రతీ ఆదివారం తెల్లవారుజామున 5గంటలకు తూర్పు గోదావరి జిల్లా **'వెల్ల'**కు బస్సు ఉంది. ప్రతీ శనివారం ఉదయం గం.4.30ని.లకు ద్వారకాతిరుమలకు బస్సు ఉంది. డిపో మేనేజర్ గిరిధర్ కుమార్ సెల్ నెం : 9959225485, ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ ఎంక్వైరీ 08816239100, రిజర్వేషన్ కౌంటర్ నెంబరు 9666089036.



ఇస్కాన్ సభ్యులతో డీఎన్ఆర్ లాఫింగ్ క్లబ్ సభ్యులు

ఇస్కాన్ దేవాలయంలో సేవా కార్యక్రమాలు

భీమవరంటౌన్ : అలయన్స్‌క్లబ్, డీఎన్ఆర్ లాఫింగ్‌క్లబ్ ఆధ్వర్యంలో ఇస్కాన్ దేవాలయంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కృష్ణాష్టమి వేడుకల నిమిత్తం రూ.5,116 క్లబ్ తరుపున నిర్వాహకులకు అందచేశారు.అలయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ ఎంఎస్ సూర్యప్రకాషరావు,ఇస్కాన్ దేవాలయం నిర్వాహకుడు గౌరవ్ ప్రభు ఉన్నారు.

సినిమా గైడ్

అన్నపూర్ణ	గౌతమ్‌నంద
పద్మాలయ కాంప్లెక్స్ :	వైశాఖం, శమంతకమణి
నటరాజ్	దువ్వాడ జగన్నాథమ్
కిషోర్ హబ్	ఫిదా, గౌతమ్‌నంద
విజయలక్ష్మి కాంప్లెక్స్ :	నిన్నుకోరి, దండుపాళ్యం-2
గీతా మల్టీప్లెక్స్ :	గౌతమ్‌నంద ఫిదా, శమంతకమణి, వైశాఖం, నిన్నుకోరి, వార్ ఆఫ్ దిప్లానెట్ ఆఫ్ ది ఏప్స్, డన్‌కిర్క్

పిల్లలకు ఖచ్చితంగా వ్యాక్సిన్ వేయించాలి

ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు

భీమవరంటౌన్ : చిన్నపిల్లలకు వచ్చే తట్టు, పొంగు వంటి వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్త చర్యగా రుబెల్లా వ్యాక్సిన్‌ను వేస్తున్నారని, ప్రతీ తల్లిదండ్రులు వారి పిల్లలకు వ్యాక్సిన్ వేయించాలని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా రుబెల్లా వ్యాక్సిన్ ప్రారంభం సందర్భంగా మంగళవారం పీఎస్ఎం బాలికల పాఠశాలలో మునిసిపాలిటీ ఆధ్వర్యంలో విద్యార్థినీలకు వ్యాక్సిన్ వేసే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. 9 నెలల నుంచి 15 సంవత్సరాల్లోపు వారందరూ తప్పనిసరిగా వ్యాక్సిన్ వేయించుకోవాలన్నారు. మునిసిపల్ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు మాట్లాడుతూ పట్టణంలో 28,273మంది ఉన్నారని గుర్తించామన్నారు. వీరందరికీ వ్యాక్సిన్‌లు వేస్తామన్నారు. ఈ వ్యాక్సిన్‌లో భీమవరం హాస్పిటల్ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, మెడికల్, మెప్మాతో పాటు ఒకేషనల్ కళాశాల విద్యార్థులు సహకరిస్తున్నారని తెలిపారు. ఇందుకోసం 20 టీమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఇద్దరు సూపర్ వైజర్లు పర్యవేక్షిస్తున్నారన్నారు. వైద్యఆరోగ్యశాఖ జాయింట్ డైరెక్టర్ జయశ్రీ వ్యాక్సిన్ గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కోళ్ళ నాగేశ్వరరావు, కౌన్సిలర్లు అల్లాఉద్దీన్ (నౌషాద్), భూసారపు సాయిసత్యనారాయణ, వేలూరి సుబ్రహ్మణ్యశర్మ, డీఎంహెచ్‌వో పద్మజ రాణి, ఎస్ఎంవో తిరుమలరావు, డాక్టర్లు బి.దుర్గాప్రసాద్, శివరంజని, ప్రధానోపాధ్యాయుడు కె.వెంకట్రావు, చెరుకువాడ రంగసాయి, రామరాజు, ఆర్.ప్రసన్నకుమార్, కె.ప్రసాద్, సుధీర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



వ్యాక్సిన్ కార్యక్రమం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు



రోడ్డు పరిశీలిస్తున్న మునిసిపల్ కమిషనర్ నరసింహరావు

అభివృద్ధి పనులపై కమిషనర్ పరిశీలన

భీమవరంటౌన్ : పట్టణంలో పలు ప్రాంతాల్లో మునిసిపాలిటీ ఆధ్వర్యంలో అభివృద్ధి చేసిన అభివృద్ధి పనులను మునిసిపల్ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు పరిశీలించారు. అరుంధతిపేటలో అభివృద్ధి చేసిన రోడ్డును పరిశీలించారు. రోడ్డుకు డ్రైయిన్ సౌకర్యం లేకపోవడంతో మురుగు నీరు నిలిచిపోయి ఉండటంతో అక్కడి ఇబ్బం దులను వార్డు కౌన్సిలర్ పాలవెల్లి మంగ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్ళారు. ఈ ప్రాంతంలో మంచినీటి సమస్య ఎక్కువగా ఉందని పరిష్కరించాలని కోరారు.నర్సయ్యఅగ్రహారంలో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఒక అపార్ట్‌మెంట్ సభ్యులు చెత్తను బయట వేయడంతో వారిని పిలిపించి కమిషనర్ మాట్లాడారు. చెత్త బయట వేయవద్దని, ఒక డస్ట్‌బిన్‌ను ఏర్పాటు చేసుకుని అందులో వేస్తే తమ సిబ్బంది వచ్చి సేకరించుకుంటారని వివరించారు. పారిశుధ్య పనులపై ఆరా తీశారు.



మునిసిపాలిటీకి చేరిన ఫైబర్ ట్రీ గార్డ్స్

మొక్కల రక్షణకు ఫైబర్ ట్రీ గార్డ్స్

భీమవరం టౌన్ : మొక్కల పరిరక్షణ కోసం కొత్తగా ఫైబర్ ట్రీగార్డ్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా భీమవరం మునిసిపాలిటీకి 3,500 ట్రీగార్డ్స్‌ను తెలంగాణ ప్రాంతం నుంచి రప్పించారు. అర్బన్ గ్రీనరీ కార్పొరేషన్, మునిసిపాలిటీ ఇందుకు అయ్యే ఖర్చు భరిస్తుంది. ఒక్కొక్క ట్రీగార్డ్ రూ.200 ఖర్చు అవుతుందని చెబుతున్నారు. మునిసిపాలిటీ తరుపున రూ.3,500 చెల్లించాల్సి ఉంటుంది. సిమ్మెంట్‌తో తయారు చేసిన ట్రీగార్డ్స్‌ను ఏర్పాటు చేస్తే వాహనాలు లేదా ఇతర కారణాల వల్ల విరిగిపోవడంతో మొక్కల సంరక్షణకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. అది కూడా సిమ్మెంట్ ట్రీగార్డ్ ఖరీదు కూడా రూ.800 వరకు ఉండటంతో కొంత భారంగానే మారుతోంది. ఆధునిక టెక్నాలజీతో ఫైబర్ ట్రీగార్డ్స్ ఏర్పాటు చేయడం వల్ల ఖర్చు కలిసి రావడంతో పాటు ఏర్పాటు చేయడానికి కూడా వెసులు బాటు ఉండటంతో వీటిపై దృష్టి సారించారు. మొక్కను నాటిన తరువాత అడుగు లోతులో ట్రీగార్డ్స్‌ను ఏర్పాటు చేస్తారు. పట్టణంలో 39 వార్డుల్లోనూ వార్డుకు 100 మొక్కల చొప్పున రోడ్డు మార్జిన్‌లో ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రతీ వార్డుకు 100 మొక్కలు, 100 ట్రీగార్డ్‌లను అందించాలని నిర్ణయించారు. వార్డు కౌన్సిలర్ల పర్యవేక్షణలో వీటిని త్వరలో ఏర్పాటు చేయనున్నారు.



గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్న దృశ్యం

ప్రభుత్వాసుపత్రిలో తల్లిపాల వారోత్సవాలు

భీమవరంక్రైం : భీమవరం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల ప్రారంభ కార్యక్రమం, గర్భిణీలకు పౌష్టికాహారం పంపిణీ శ్రీవిజ్ఞానవేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ప్రభుత్వాసుపత్రి ప్రధాన వైద్యుడు డాక్టర్ వీరాస్వామి మాట్లాడుతూ తల్లిపాలలో పోషక పదార్థాలు అధికమని, తల్లిపాలు పట్టడం వలన విజ్ఞానంతో పాటు పిల్లల ఎదుగుదలలో ఎటువంటి లోపాలు ఉండవన్నారు. బాలింతరాళ్ళకు ఆకుకూరలు, పండ్లు,పిండి పదార్థాలతో వున్న ఆహారాన్ని అంది చడం చాలా మంచిదన్నారు. డీఎన్ఆర్ ఇంగ్లీషు మీడియం హైస్కూల్ హెచ్ఎం నిర్మలాదేవి మాట్లాడుతూ డబ్బాపాలతో పిల్లల ఆరోగ్యంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు. అనంతరం 60 మంది గర్భిణీలకు రొట్టెలు,పండ్లు అందించారు.ఆసుపత్రి కమిటీ అధ్యక్షుడు మామిడిశెట్టి ప్రసాద్, కౌన్సిలర్ ఏసుపాదం పాల్గొన్నారు

జగన్ హామీలను ప్రజల్లోకి తీసుకువెళ్ళాలి

భీమవరంఅర్బన్ : వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి ప్రకటించిన 9 హామీలను ప్రజల్లోకి తీసుకెళ్ళే బాధ్యత వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై ఉందని వైఎస్ జగన్ దళిత సేవా అధ్యక్షుడు గంటా సుందరకుమార్ అన్నారు. మంగళవారం ఆర్ఎస్ఎం చర్చ్ వద్ద వైఎస్ జగన్‌కు ఆరోగ్యాన్ని ప్రసాదించాలని, ఆయన చేసే పాదయాత్రను విజయవంతం చేయాలని వైఎస్ జగన్ దళిత సేవా నాయకులు ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. సుందరకుమార్ మాట్లాడుతూ జగన్ రాష్ట్ర ముఖ్యమంత్రి కావాలనే ఆకాంక్ష అన్ని వర్గాల ప్రజల్లోనూ ఉందన్నారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని, అదే ఆదరణ సంక్షేమ పథకాలు అందించి వైఎస్ జగన్ పొందుతారని అన్నారు. జగన్ ఇచ్చిన 9 హామీల పై అన్ని దళిత పేటల్లో కరపత్రాల ద్వారా ప్రచారం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్ రాజు, పాలపర్తి సాగర్, రత్నం, రొక్కల సుబ్బయ్య, రాజశేఖర్, మోజెస్, భాస్కరరావు, రత్నరాజు పాల్గొన్నారు.



మావుళ్ళమ్మ ఆలయంలో లలితాపారాయణం చేస్తున్న మహిళలు

సామూహిక లలితా పారాయణం

భీమవరం టౌన్ : శ్రావణమాసం సందర్భంగా మహిళలు మావుళ్ళమ్మ అమ్మవారి ఆలయంలో లలితా పారాయణం నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి దాదాపు రెండు గంటల పాటు పారాయణం చేశారు. పారాయణం జరుగుతున్నంతసేపు మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయం అమ్మవారి నామాలతో మారుమోగింది. పారాయణం ముగిసిన తరువాత ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక హారతులు ఇచ్చారు. మహిళలు అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలకు దేవస్థానం తరుపున ప్రసాదం అందజేశారు.



విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న దృశ్యం

విద్యార్థులకు పుస్తకాలు అందజేత

భీమవరంటౌన్ : ఆధ్యాత్మిక చింతనపరులు, గుప్త దాత నాయుడు ఆదిలక్ష్మి ద్వితీయ వర్ధంతి సందర్భంగా వారి కుటుంబసభ్యుల సౌజన్యంతో వేణుగోపాలస్వామి ఆలయం వద్ద విద్యార్థులకు విద్యాసామాగ్రి, పేదలకు అన్నదానం నిర్వహించారు. ఏఎంసీ చైర్మన్ కోళ్ళ నాగేశ్వరరావు, చెరుకువాడ రంగసాయి,పట్టణ టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు గంటా త్రిమూర్తులు, కార్యదర్శి ఈపి శేషు, తిప్పా ముత్యం, యలమంచిలి శ్రీనివాస్, ఆచార్యులు, అయ్యప్ప, నాగేంద్ర పాల్గొన్నారు.



మానవహారం నిర్వహిస్తున్న ఏఐటీయుసీ నాయకులు, కార్మికులు

హామీలిచ్చి మరవడం సిగ్గుచేటు

కార్మికసంఘాల ఆధ్వర్యంలో మానవహారం

భీమవరం అర్బన్ : మునిసిపల్ కార్మికుల కోసం అనేక హామీలు ఇచ్చి గెలిచిన అనంతరం ఆ హామీలను నెరవేర్చకుండా సాకులు చెబుతూ తప్పించుకోవడం సిగ్గుచేటని ఏఐటీయుసీ ఏరియా కార్యదర్శి చెల్లబోయిన రంగారావు ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. పట్టణంలోని ప్రకాశంచౌక్ సెంటర్‌లో మునిసిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ కార్మికులతో కలిసి ఏఐటీయుసీ, సీఐటీయు ఆధ్వర్యంలో మంగళవారం మానవహారం నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలి, జీవో నెంబరు 279ని రద్దు చేయాలి, నూతన టెండర్ల విధానాన్ని రద్దు, పాత టెండర్లనే అమలు చేయాలంటూ అలాగే సుప్రీంకోర్టు ఇచ్చిన జీవో 151ని సమాన పనికి సమానవేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించని పక్షంలో ఈనెల 3,4,5 తేదీల్లో దశల వారీగా ఉద్యమాలు చేపడతామన్నారు. ఆందోళనలో మునిసిపల్ కార్మికుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కిల్లారి మల్లేశ్వరరావు, సీఐటీయు నాయకులు ఆంజనేయులు, ఎంసీపీఐ కార్యదర్శి మహంకాళి, ఆకుల కొండాజీ, రెల్ల రాము, కార్మికులు పాల్గొన్నారు.

మెంటేపూడి (వీరవాసరం) : మెంటేపూడి, మడుగు పోలవరం గ్రామాలలో మంగళవారం వ్యవసాయశాఖ పొలం పిలుస్తోంది నిర్వహించింది. వరినాట్లు ముమ్మరంగా సాగుతున్న తరుణంలో రైతులకు వ్యవసాయ అధికారులు పలు సూచనలు చేశారు. వరినారుపై తాటాకు తెగులు సోకటాన్ని గమనించి రైతులకు సూచనలు ఇచ్చారు. ఈతెగులు వల్ల సంక్రమించే నష్టాన్ని వివ

వరినారుపై తాటాకు తెగులు

రించారు. నివారణకు ప్రొపెనోపాస్ లీటరు నీటికి రెండు ఎంఎల్ కలిపి పిచికారీ చేయాలని తెలియచేశారు. మెంటేపూడి ఉపసర్పంచ్ కొల్లా సీతారామాంజనేయులు, రైతులు కొల్లా భవన్నారాయణ, నడపన రాధాకృష్ణ వ్యవసాయశాఖ అధికారి రాజశేఖర్, ఎంపీఈవోలు మోహన, చంద్రిక తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ సలహా



పిల్లలకు ఎంఆర్ వ్యాక్సిన్ వేయించాలి

కె. కార్తీక్, వైద్యాధికారి, వీరవాసరం పీహెచ్‌సీ

మీజిల్స్(తట్టు), రుబెల్లా (ఎంఆర్ వ్యాక్సిన్) పిల్లలకు విధిగా వేయించాలి. ఈ రెండు వ్యాధులు ప్రాణాంతకమైనవి. మీజిల్స్ వల్ల చిన్నారులు న్యుమోనియా, విరేచనాలు. మెదడువాపు వంటి వ్యాధులకు, గర్భంతో ఉన్న మహిళకు రూబెల్లా సోకితే అది పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. వినికిడి లోపం, గుండె జబ్బులు, మెదడుకు సంబందించిన రుగ్మతలు ఏర్పడతాయి. వీటి నివారణ కోసం కేంద్రప్రభుత్వం ప్రత్యేకంగా ఎంఆర్ టీకా కార్యక్రమాన్ని నెలరోజుల పాటు నిర్వహిస్తున్నది. 9 నెలల నుంచి 15 సంవత్సరాల వయసు పిల్లలకు ప్రాధమిక పాఠశాలల్లోనే టీకా వేసే కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. పిల్లలకు విధిగా టీకా వేయించాలి.

● వీరవాసరం

పంచాయతీ భవన నిర్మాణంపై తలోమాట

బిజిపాలెంలో తేలని వివాదం


ప్రజా సమస్య

వీరవాసరం : బలుసుగొయ్యిపాలెం మైనర్ పంచాయతీ. అభివృద్ధిలో, ఐక్యతలో అందరిదీ ఒకటే మాట. అయితే పంచాయతీ నూతన భవన నిర్మాణంపై తలోమాట అయింది. శిథిళావస్థకు చేరిన పంచాయతీ కార్యాలయ భవనాన్ని ఎక్కడ నిర్మించాలన్నదే సమస్య. పాలకవర్గం గ్రామంలోని రామాలయం వద్ద ఉన్న స్థలంలో నిర్మించాలని నిర్ణయిస్తే... ప్రజలందరూ శిథిలావస్థకు చేరిన పంచాయతీ కార్యాలయ భవనాన్ని తొలగించి ఆ స్థానంలో నూతన భవన నిర్మాణాన్ని చేయాలని నిర్ణయించారు. కొద్దికాలంగా ఈసమస్య వివాదానికి దారితీసింది. చివరకు సమస్య తీవ్ర రూపం దాల్చింది. అధికారులకు ఫిర్యాదు చేసే వరకూ వెళ్ళింది.

బిజిపాలెం గ్రామం ప్రారంభంలో రహదారి పక్కన పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణం చేశారు. రెండు దశాబ్దాల కిందటే ఈ నిర్మాణం జరిగింది. ఇప్పటికే నాలుగు పాలకవర్గాలు ఆ భవనం మరమ్మతులకు లోనుకావటంతో భవనం నుంచి పంచాయతీ కార్యాలయాన్ని రామాలయంలోకి మార్చారు. తదుపరి పక్కనే ఉన్న కమ్యూనిటీహాలులో ప్రస్తుతం నిర్వహిస్తున్నారు.



భవన నిర్మాణ ప్రతిపాదిత స్థలం



శిథిలావస్థకు చేరిన పంచాయతీ భవనం

కొత్తగా భవన నిర్మాణానికి ప్రతిపాదనలు

శిథిలావస్థకు చేరిన పంచాయతీ కార్యాలయ భవనం నూతన భవనం నిర్మాణానికి పంపిన ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. రూ. 15 లక్షల వ్యయంతో భవన నిర్మాణానికి అనుమతి ఇచ్చారు. ఇక్కడ నుంచే సమస్య మెదలైంది. గ్రామం మధ్యలో ఉన్న రామాలయం వద్ద నిర్మించాలని పంచాయతీ పాలకవర్గం నిర్ణయించింది. ప్రజలు వ్యతిరేకించడంతో వివాదం ప్రారంభమైంది. దీంతో భవన నిర్మాణం వాయిదా పడింది. మీ కోసంలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ సమస్యను పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేస్తున్నారు.



పంటబోదెలోని గుర్రపుడెక్క తొలగిస్తున్న రైతు

పేరుకుపోయిన గుర్రపుడెక్క తూడు

సాగునీరు రాక మురుగునీరు పోక రైతుల ఇక్కట్లు

భీమవరంరూరల్ : పంట, మురుగుకాలువల చెత్త తొలగింపులో నిర్లక్ష్యం వల్ల రైతులకు సాగునీరు రాక, మురుగునీరు బయటకు వెళ్ళలేని పరిస్థితి నెలకొంది. వర్షాలతో చేలల్లో నీరు అధికంగా చేరినప్పుడు ఆ నీరు మురుగుకాలువల ద్వారా బయటకు వెళ్ళడం లేదు. దీంతో నాట్లు ముంపునకు గురవుతున్నాయన్నారు. దిగువ ప్రాంతాల్లోని బోదెల నుంచి సాగునీరు రావాలంటే గుర్రపుడెక్క వల్ల సరిగా రావడం లేదని చెబుతున్నారు. గుర్రపుడెక్క తొలగింపులో కాంట్రాక్టర్లు నిర్లక్ష్యధోరణి వ్యవహరించడంతో ఈ ఇబ్బంది వచ్చి పడిందని రైతులు వాపోతున్నారు. నిబంధనల ప్రకారం కాంట్రాక్టర్లు గుర్రపుడెక్క తొలగించనందున మండలంలో పలు పంట, మురుగుకాలువల్లో గుర్రపుడెక్క దట్టంగా పేరుకుపోయింది.గుర్రపుడెక్క తొలగింపు నిధులు మాత్రం కాంట్రాక్టర్లకు అందేశాయి. దీంతో వాటిని పట్టించుకోవడం లేదు. రైతులే స్వచ్ఛందంగా గుర్రపుడెక్క తొలగించుకుంటున్నారు.గుర్రపుడెక్క తొలగింపులో ప్రత్యేక శ్రద్ధ చూపిస్తే రానున్న రోజుల్లో ఇలాంటి ఇబ్బందులు రావని రైతులు అభి ప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

కార్యాచరణ మేరకు ఉద్యమిద్దాం

కాపు నేత చినిమిల్లి వెంకట్రాయుడు

వీరవాసరం : కాపులను బీసీల్లో చేర్చాలని ఉద్యమిస్తున్న కాపునేత ముద్రగడ పద్మనాభం పాదయాత్ర అడ్డుకోవటమేకాక, గృహనిర్బంధంలో ఉంచటంపై ప్రభుత్వానికి చిత్తశుద్దిలేదని జిల్లా కాపుసంఘం జిల్లా అధ్యక్షుడు చినిమిల్లి వెంకట్రాయుడు అన్నారు. మంగళవారం వీరవాసరంలో మండల కాపుసంఘం అధ్యక్షుడు మద్దాల సత్యనారాయణ మూర్తి ఇంటి వద్ద సమావేశం నిర్వహించారు. ముద్రగడ అమరావతి పాదయాత్రపై కార్యాచరణ మేరకు ఉద్యమించాలని పిలుపు ఇచ్చారు. ఇటీవల కాపు సామాజిక వర్గానికి సంబంధించి ఎదురైన సమస్యలపై సమావేశంలో చర్చించారు. అనంతరం జాతీయ రహదారి 216పై మద్దాల రామకృష్ణమ్మ పాలిటెక్నిక్ వద్ద కంచం, గరిటెలతో చప్పుడు చేస్తూ ఆకలి కేకలు నినాదాలు చేశారు. యిర్రింకి సుబ్రహ్మణ్యం చింతకోటిగరువు, నవుడూరు, రాయకుదురు, వీరవాసరం గ్రామాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ

కొణితివాడ (వీరవాసరం) : మండలానికి కొత్తగా మంజూరైన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల బట్వాడా మంగళవారం నుంచి ప్రారంభమైంది. నియోజకవర్గ స్థాయిలో వెయ్యి పింఛన్లు కొత్తగా మంజూరు కాగా వీరవాసరం మండలానికి 33 పింఛన్లు కేటాయించారు. ఎంపీడీవో కార్యాలయంలో ప్రతిపాదనల్లో ఉన్న జాబితాలను జన్మభూమి కమిటీలకు అందజేయగా వాటిలో నుంచి కమిటీ సభ్యులు అర్హులను ఎంపిక చేశారు. వీరందరికీ ఆగస్టు ఒకటి నుంచి పింఛన్ బట్వాడా ప్రారంభమైంది. కొణితివాడ గ్రామంలో సర్పంచ్ సుబ్రహ్మణ్యంరాజు గ్రామంలో మంజూరైన 39 మందికి మంగళవారం పింఛన్లు అందజేశారు.అదే విధంగా మండలంలోని 23 పంచాయతీలలోనూ నూతనంగా మంజూరైన పింఛన్లు లబ్దిదారులకు అందజేశారు. కొణితివాడలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ చినబాబుతో పాటు ఎంపీటీసీ సభ్యులు నాగరాజు సత్యరమ్య, చొల్లంగి రత్నకుమారి, జన్మభూమి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తోట భోగయ్య

పార్టీ కారక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళాలి

పట్టణ తెలుగు యువత కార్యవర్గ సమావేశం

భీమవరం : భీమవరం పట్టణ తెలుగు యువత కార్యవర్గ సమావేశం యువత అధ్యక్షుడు మద్దుల రాము అధ్యక్షతన మంగళవారం జరిగింది. ముఖ్యఅతిధిగా పట్టణ పార్టీ అధ్యక్షుడు తోట భోగయ్య, జిల్లా పార్టీ అధికార ప్రతినిధి మామిడిశెట్టి ప్రసాద్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తోట భోగయ్య మాట్లాడుతూ పట్టణంలో అమృత్ పథకం, 82 ఎకరాలలో గృహనిర్మాణ పథకానికి అత్యధిక నిధులు కేటాయించినందుకు ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు), మునిసిపల్ ఛైర్మన్ కొటికలపూడి గోవిందరావు(చినబాబు), ప్రభుత్వ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా పార్టీ అధికార ప్రతినిధి మామిడిశెట్టి ప్రసాద్ మాట్లాడుతూ రానున్న ఎన్నికలలో పార్టీ విజయానికి యువత కృషి చేయాలని కోరారు. యువత అధ్యక్షుడు మద్దుల రాము మాట్లాడుతూ అభివృద్ధిని అడ్డుకుంటూ ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టి వాస్తవాలను ప్రజలకు చెప్పాలని యువతను కోరారు. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, రావూరి కృష్ణఅప్పారావు, యువత ఉపాధ్యక్షుడు దాసరి శ్రీను, రెడ్డి సత్తిబాబు, బీసీ సెల్ అధ్యక్షుడు గంటా త్రిమూర్తులు, యలమంచిలి శ్రీనివాసు, మావుళ్ళయ్య, మెంటే మనోజ్, జీవదాస్, వీరవల్లి ఉమామహేశ్వరరావు, శ్రీరామదాసు తదితరులు పాల్గొన్నారు.



వెంపలో చిన్నారులకు రుబెల్లా వ్యాక్సిన్ వేస్తున్న హెల్త్ సిబ్బంది



వీరవాసరంలో పాఠశాలలో వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది

ఎంఆర్ వ్యాక్సిన్‌తో ప్రాణాంతక వ్యాధుల నివారణ

భీమవరం రూరల్ : ఒకే టీకాతో రెండు వ్యాధులు నివారించే వ్యాక్సిన్‌ను మండలంలోని గ్రామాల్లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మంగళవారం చిన్నారులకు వేశారు. ఆరోగ్యసిబ్బంది, అంగన్‌వాడీలు, ఆశ వర్కర్లు పాల్గొని 9 నెలల నుంచి 15 సంవత్సరాల్లోపు చిన్నారులకు తట్టు, రుబెల్లా వ్యాధులను అరికట్టే వ్యాక్సిన్‌ను వేశారు. వచ్చే నెల 8వ తేదీ వరకు కూడా వ్యాక్సిన్ వేయనున్నారు. మండలంలో 15,500 మంది చిన్నారులకు వ్యాక్సిన్ వేయాల్సి ఉండగా మొదటిరోజు మండలం మొత్తం మీద 2,708 మందికి వ్యాక్సిన్ వేసినట్లు గొల్లవానితిప్ప ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యుడు డాక్టర్ దుర్గాప్రసాద్ తెలిపారు. తట్టు, రుబెల్లా నివారణ టీకాలు తప్పనిసరిగా చిన్నారులకు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. తట్టు వ్యాధి వలన న్యూమోనియా, అతిసార, ఇతర ప్రాణాంతకమైన సమస్యలు వస్తాయని, అలాగే రుబెల్లా వల్ల గర్భిణీ కడుపులోని శిశువుకు అంధత్వం, వినికిడిలోపం, బుద్ధిమాంద్యం, పుట్టుకతోనే గుండెకు సంబంధించిన వ్యాధులు సంక్రమిస్తాయని, ఈ రెండు వ్యాధుల నివారణకై ఈ టీకాలను వేస్తున్నట్టు తెలిపారు. సిబ్బంది, హెల్త్ అసిస్టెంట్‌లు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

వీరవాసరంలో 1574 మంది పిల్లలకు వ్యాక్సిన్

వీరవాసరం: విద్యార్థులకు సాధారణ టీకాలతో పాటు తట్టు, రుబెల్లా టీకా వేయించాలని దీనివల్ల ప్రాణాంతవ్యాధులు అయిన మీజిల్స్, రుబెల్లాను నివారించ వచ్చునని వీరవాసరం సర్పంచ్ పీతల విక్టోరియా అన్నారు. మంగళవారం వీరవాసరం పాఠశాలల్లో విద్యార్థులకు ఎంఆర్ టీకాలు వేసే కార్యక్రమాన్ని సర్పంచ్ విక్టోరియా భారతి పబ్లిక్ స్కూల్‌లో ప్రారంబించారు. వీరవాసరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రపరిధిలో వీరవాసరం, దూసనపూడి, బాలేపల్లి, గ్రామాలలో వ్యాక్సిన్ వేశారు. 1574 మంది పిల్లలు లక్ష్యం కాగా 1498 మందికి టీకాలు వేశారు. డాక్టర్ కార్తీక్, సీహెచ్‌వో అచ్చారావు, సత్యనారాయణ పాఠశాలల సిబ్బంది పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి : ముగ్గురి అరెస్టు

భీమవరంక్రైం : పేకాట శిబిరంపై వన్‌టౌన్ పోలీసులు సోమవారం అర్ధరాత్రి దాడి చేశారు. బ్యాంక్‌కాలనీ కరారి నగర్‌లో కొంతమంది పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్‌ఐ సీహెచ్‌వి రమేష్ సిబ్బందితో అక్కడికి వెళ్ళి దాడిచేశారు. ఈ దాడిలో ముగ్గురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.10,160 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కట్నం వేధింపులపై ఫిర్యాదు

భీమవరంక్రైం : తన భర్త,అత్తమామలు, ఆడపడుచు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారంటూ శ్రీరాంపురానికి చెందిన యిందుకూరి జయలక్ష్మి టుటౌన్ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ సురేంద్రకుమార్ తెలిపారు. జయలక్ష్మికి శ్రీరాంపురానికి చెందిన కృష్ణంరాజుతో కొన్నేళ్ళ క్రితం వివాహమైంది. ఇద్దరికీ కూడా రెండో వివాహాలే. అయితే వివాహ సమయంలో జయలక్ష్మి కొంత బంగారం, నగదు కట్నంగా తీసుకువచ్చారు. కొద్దిరోజుల నుంచి భర్త, అత్త, మామ, ఆడపడుచులు అదనంగా కట్నం తీసుకురమ్మని వేధించడమే కాకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ ఆమె పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

హలో.. ఆంధ్రజ్యోతి

మీ ప్రాంతంలో జరిగే సభలు, సమావేశాలు, సంఘటనలు, ఉత్సవాలు, స్థానిక సమస్యలపై మాకు సమాచారం ఇవ్వండి.

భీమవరం	:	99854 11550
,, రూరల్	:	94414 48581
,, టౌన్	:	94406 25154
,, క్రైం	:	98665 93356
,, అర్బన్	:	99481 40404
వీరవాసరం	:	98667 41833

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి

ద్వారకా తిరుమల : పంగిడిగూడెం గ్రామానికి చెందిన కనకరాజు(35) ఉపాధి పనికి వెళ్లగా గుండెపోటుతో మృతి చెందాడు. మంగళవారం యథావిధిగా కనకరాజు ఉపాధి పనికి వెళ్లాడు.. పని చేస్తుండగా ఒళ్లంతా చెమటలు పట్టి ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు.. పక్కనే ఉన్న తోటి కూలీలు గమనించి వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.. భీమడోలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా కనకరాజు అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. వీరి వెంట ఏపీవో దశరథరాంజీ, ఫీల్డ్ అసిస్టెంట్ కె.అశోక్ ఉన్నారు.



డాక్టర్ సలహా



నేత్రాల పట్ల జాగ్రత్త వహించాలి

సి.హెచ్.చక్రవర్తి, నేత్ర వైద్య నిపుణుడు

40ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరికీ నేత్ర సమస్యలు వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం ఈ సీజన్‌లో కండ్ల కలక వస్తుంది.. కన్ను ఎరుపు, మంట, దురద, గరగరలాడటం వంటి లక్షణాలు ఉంటాయి.. ఇది అంటువ్యాధి. ఈ వ్యాధి భారిన పడిన ప్రతి ఒక్కరూ వైద్యుడిని సంప్రదించాలి. చిన్న పిల్లలకు స్మార్ట్ ఫోన్ దూరంగా పెట్టాలి. దీని ద్వారా చిన్నవయస్సులోనే దృష్టి లోపం వచ్చే అవకాశం ఉంది. కంప్యూటర్‌పై ఎక్కువగా పనిచేసిన వారు ప్రతీ 3 గంటలకోకసారి తప్పనిసరిగా ఐదు నిమిషాల పాటు కంటికి విశ్రాంతి ఇవ్వాలి. షుగర్ వ్యాధి గ్రస్థులు విధిగా ప్రతీ ఆరు నెలల కొక్కసారి కంటి పరీక్షలు చేయించుకోవాలి.

● గోపాలపురం



నిమ్మకాయల ధరలు : ద్వారకాతిరుమల

నిన్నటి ధర	కనిష్ఠం	గరిష్ఠం
ఒక కేజీ	10.00	16.00
50 కేజీల బస్తా..		
	500	800

హలో.. ఆంధ్రజ్యోతి

మీ ప్రాంతంలో జరిగే సభలు, సమావేశాలు, సంఘటనలు, ఉత్సవాలు, స్థానిక సమస్యలపై మాకు సమాచారం ఇవ్వండి.

నల్లజర్ల	: 98667 44751
గోపాలపురం	: 94410 52929
ద్వారకాతిరుమల	: 99511 78597
దేవరపల్లి	: 94404 02036

సినిమా గైడ్

దేవరపల్లి :

వెంకటేశ్వర	గౌతమనంద
త్రినాథ్	ఫిదా
రామనాథ్	గౌతమనంద

యర్నగూడెం :

నల్లజర్ల :

శ్రీనివాస	గౌతమనంద

అనంతపల్లి :

అన్నపూర్ణ	గౌతమనంద



చిన్నారులకు టీకా వేస్తున్న బాపిరాజు





టీకా వేసే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ ప్రసాద్, దేవరపల్లిలో టీకా వేస్తున్న దృశ్యం

ఎంఆర్ టీకా విధిగా వేయించాలి

ప్రారంభించిన జడ్పీ చైర్మన్ బాపిరాజు - ఆయా మండలాల్లోని విద్యార్థులకు వేసిన వైద్య సిబ్బంది

నల్లజర్ల : ఎంఆర్ టీకా వల్ల ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడుతుందని జడ్పీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం దూబచర్లలో పీహెచ్‌సీ సబ్ సెంటర్, అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించిన జడ్పీ చైర్మన్, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ 9 నెలల నుంచి 15 ఏళ్లలోపు బాలబాలికలకు విధిగా ఎంఆర్ టీకా వేయించుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రానికి స్థలం ఇచ్చిన రామకృష్ణను జడ్పీ చైర్మన్ బాపిరాజు అభినందించారు. అనంతరం ఎంఆర్ టీకా వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ జమ్ముల సతీష్, జడ్పీటీసీ కొఠారు అనంతలక్ష్మి, వైస్ ఎంపీపీ ఈడే శ్రీను, టీడీపీ జిల్లా కార్యదర్శి కూచిపూడి ఉదయ భాస్కర్, సర్పంచ్ గంటా సుందరావు, జి.సుధీర్‌కుమార్, సీడీపీవో పద్మావతి పాల్గొన్నారు. దూబచర్లకు చెందిన దివ్యాంగ మహిళ లక్ష్మికి ఉచితంగా ఇల్లు నిర్మించి ఇస్తానని జడ్పీ చైర్మన్ బాపిరాజు హామీ ఇచ్చారు.

దేవరపల్లి మండలంలో : విధిగా ప్రతి ఒక్కరూ బాల,బాలికలకు ఎంఆర్ టీకా వేయించాలని జడ్పీటీసీ కొయ్యలమూడి సుధారాణి కోరారు. మంగళవారం దేవరపల్లిలో విద్యార్థులకు వ్యాక్సిన్ వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆరోగ్యవంతమైన సమాజానికి టీకా తప్పనిసరి అని ఎంపీపీ శ్రీకాకుళపు వెంకట నర్సింహరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల కోసం అన్నిరకాలుగా ఆలోచించి పలు రకాల సహాయ సహకారాలు అందిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సభ్యులు నారాయణ విశ్వేశ్వరరావు, సౌజన్య, బి.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ద్వారకా తిరుమల మండలంలో : ఎంఆర్ టీకాతో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని ఎంపీపీ వడ్లపూడి ప్రసాద్ అన్నారు. మండలంలో తట్టు, రుబెల్లా టీకాను ద్వారకా తిరుమలలోని పాఠశాలల్లోని విద్యార్థులకు మంగళవారం వేశారు. ఎంపీపీ వడ్లపూడి ప్రసాద్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలని సీఎం చంద్రబాబు వైద్యరంగంలో బడుగు, బలహీన వర్గాల వారికి వైద్యసహాయాలు అందిస్తున్నారని తెలిపారు. విద్యార్థులు, చిన్నారులు విద్యార్థి దశ నుంచి ఎటువంటి రుగ్మతలకు లోనుకాకుండా ఆరోగ్యవంతంగా జీవించాలని, ముందుచూపుగా వ్యాక్సిన్లు వేసే కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో వెలుగు పాఠశాల ప్రిన్సిపాల్ సుధారాణి, వైద్యాధికారిణి ఎం.కేథరిన్, జి.కొత్తపల్లి ఎంపీటీసీ కస్సే చక్రధరరావు, తిమ్మాపురం టీడీపీ గ్రామాధ్యక్షుడు గంటా శ్రీనివాసరావు, ఏఎన్‌ఎం పొన్నారి, వైద్య సిబ్బంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'పింఛన్‌దారులు సీఎంను ఆశీర్వదించాలి'

నల్లజర్ల : రాష్ట్ర వ్యాప్తంగా పింఛన్ తీసుకునేవారు మళ్లీ చంద్రబాబు అధికారంలోకి వచ్చేలా ఆశీర్వదిస్తే వెయ్యి రూపాయల పింఛన్‌ను రూ.2వేలు అయ్యే అవకాశం ఉంటుందని జడ్పీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో మండలానికి నూతనంగా వచ్చిన 340 పింఛన్‌లను ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ జమ్ముల సతీష్ సమక్షంలో పంపిణీ చేశారు. మండలంలో పెండింగ్‌లో ఉన్న 110 రేషన్ కార్డులను త్వరలో అందిస్తామని, ప్రతి పింఛన్ దారుడు తమ కుటుంబంలో సభ్యుల క్షేమం కోరినట్టు సీఎం చంద్రబాబు క్షేమాన్ని కోరాలని బాపిరాజు పేర్కొన్నారు. ఎమ్మెల్యే ముప్పిడి మాట్లాడుతూ సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ చేరేలా కార్యకర్తలు పర్యవేక్షణ చేయాలన్నారు. పేదలందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తుందన్నారు.కార్యక్రమంలో ఎంపీపీ జమ్ముల సతీష్, జడ్పీటీసీ కొఠారు అనంతలక్ష్మి, సర్పంచ్‌ల చాంబర్ మండలాధ్యక్షుడు యలమాటి శ్రీనివాసరావు, ఎంపీడీవో సత్యనారాయణ పాల్గొన్నారు.



రోడ్లపై పొంగిపొర్లుతున్న వర్షపు నీరు

వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం

నల్లజర్ల : రెండ్రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు రోడ్లు, పంచాయతీ కార్యాలయాలు నీట మునిగాయి. ఎగువ ప్రాంతంలో భారీ వర్షం కురవడంతో వరద గ్రామాల్లోకి చేరుతోంది. రోడ్లు,ఇళ్ళు,భవనాలు నీట మునిగి ప్రజలకు ఇబ్బందిగా మారింది. అనంతపల్లి పంచాయతీ కార్యాలయంలోకి వరద చేరి పింఛన్ కోసం వృద్ధులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చీపురుగూడెం ప్రధాన రహదారి వరద నీటితో నిండిపోవడంతో వాహనదారులకు పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మంగళవారం ఉదయం కురిసిన భారీ వర్షానికి వరద ఇంకా పెరిగే అవకాశం ఉంది.

పొగాకు ఫీల్డ్‌మన్ సోమయ్యకు సన్మానం

గోపాలపురం : గోపాలపురం పొగాకు వేలం కేంద్రంలో సీనియర్ ఫీల్డ్‌మన్ సోమయ్య పదవి విరమణ సభను సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రతినిధులు మాట్లాడుతూ సోమయ్య ఉద్యోగ జీవితంలో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నారన్నారు. రైతులకు బోర్డుకు వారధిగా ఉన్న రైతు శ్రేయోభిలాషిగా నిరంతరం పాటుపడిన వ్యక్తి సోమయ్య అన్నారు. అనంతరం సోమయ్య దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో భద్రాచలం, గోపాలపురం, పొగాకు బోర్డు రైతులు, రిటైర్డ్ ఆర్‌ఎం.శ్రీరామమూర్తి, బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు గద్దే శేషగిరిరావు, రామకృష్ణ, బోర్డు సభ్యులు సత్యనారాయణ, కరాటం రెడ్డి నాయుడు, దేవరపల్లి, గోపాలపురం ఆక్షన్ సూపర్‌నెంట్‌లు శేషతల్పసాయి, హనుమంతరావు, రైతు తొర్లపాటి అన్నవరం పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ఏఎస్‌వో కె.ఎస్.తల్పసాయి

'పంట కుంటలు ఏర్పాటు చేయాలి'

దేవరపల్లి : రైతులు పంట కుంటలు తప్పకుండా ఏర్పాటు చేసుకోవాలని ఉపాధి ఏపీడీ నాగరాజు కోరారు. మంగళవారం దేవరపల్లి మండల కార్యాలయం వద్ద ఫీల్డ్ అసిస్టెంట్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఉపాధి హామీలో భాగంగా ఇరిగేషన్ కాల్వ, చెరువు గట్లు పటిష్టం చేసుకోవచ్చని, ప్రతి రోజూ ఫీల్డ్ అసిస్టెంట్లు మండలంలో 3 వేల పనిదినాలు లక్ష్యంగా పనిచేయాలని కోరారు. రోజుకు 20 పంట కుంటలు పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.కోటేశ్వరరావు, తహసీల్దార్ కె.రవి కుమార్, మండలంలోని కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

దుద్దుకూరు గ్రామాభివృద్ధికి నిధులు

దేవరపల్లి : దుద్దుకూరు గ్రామంలో వివిధ పనుల నిమిత్తం రూ.5లక్షలు కేటాయిస్తున్నట్టు ఎంపీపీ శ్రీకాకుళపు వెంకట నర్సింహారావు పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సర్పంచ్ సౌధామణి ఈ మేరకు తనకు ప్రతిపాదనలు ఇచ్చారని, త్వరలో జరిగే సమావేశంలో వీటిని ఆమోదిస్తామని ఆయన తెలిపారు. ప్రాథమిక పాఠశాలలో 2బోర్లు, మైనార్టీల శ్మశానవాటికలో షెడ్డు నిర్మాణానికి,దళితవాడలో శ్మశానవాటిక షెడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలిచ్చారన్నారు.కార్యక్రమంలో మండల దేశం పార్టీ సెక్రటరీ కె.రవి కుమార్, జిల్లా మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు అలీ పాల్గొన్నారు.

నేడు వ్యవసాయ కార్యాలయం ప్రారంభం

గోపాలపురం : నూతన వ్యవసాయ కార్యాలయాన్ని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు బుధవారం ఉదయం 9 గంటలకు ప్రారంభిస్తారని ఏవో కె.పవన్ కుమార్ తెలిపారు. కార్యాలయ ప్రారంభోత్సవానికి స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొనాల్సిందిగా ఆయన కోరారు.

పౌష్టికాహారంపై అవగాహన

ద్వారకా తిరుమల : చిరు వ్యాపారులు విక్రయించే పదార్థాలపై అవగాహన పెంపొందించుకోవాలని ఏపీఎం రాజేశ్వరి అన్నారు.మండల సమాఖ్య భవనంలో చిరుతిండ్ల తయారీ మహిళా వ్యాపారస్థులతో పౌష్టికాహారంపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సదస్సులో ఉత్సాహవంతులైన మహిళలకు అవగాహన కల్పించారు. రాగిపిండి అప్పాలు, రాగిసున్ని ఉండలు, చిరుధాన్యాల ప్రాధాన్యత, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఔత్సాహికులైన మహిళలకు(హోటళ్లు నిర్వహించేవారికి) రూ. 10 వేల నుంచి 20 వేల వరకు రుణాలు మంజూరు చేస్తామని తెలిపారు. అలాగే పశుగ్రాస క్షేత్రరైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డ్వాక్రా మహిళలు, మండల సమాఖ్య సిబ్బంది పాల్గొన్నారు.

రామశింగవరంలో పొలం పిలుస్తోంది

ద్వారకా తిరుమల : భూసార పరీక్షా ఫలితాల ఆధారంగా ఎరువులను వినియోగించాలని వ్యవసాయాధికారి కె.కమల్‌రాజ్ తెలిపారు. మండలంలోని రామశింగవరంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం పంటపొలాలను పరిశీలించారు. భూసార ఫలితాల్లో సూక్ష్మపోషకాల లోపాలు ఉంటే జింక్‌సల్ఫేట్ 100 శాతం రాయితీపై అందజేస్తున్నట్టు కమల్‌రాజ్ తెలిపారు. అలాగే వరినాట్లు ఆలస్యంగా నాటే రైతులు కొనలను తుంచి నాటాలన్నారు. దీని వల్ల ఆకుముడత, కాండంతొలిచే పురుగులు నివారించవచ్చని తెలిపారు. వరిగట్లపై కందులు వేయడానికి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో సిద్ధయ్య, ఎంపీఈవోలు పాల్గొన్నారు.

అనంతపల్లి ఎస్‌ఐ పాలకోడేరు బదిలీ

నల్లజర్ల : అనంతపల్లి ఎస్సైగా పని చేస్తున్న వి. వెంకటేశ్వరరావు పాలకోడేరుకు బదిలీ అయ్యారు. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. వీఆర్‌లో ఉన్న వి.చంద్రశేఖర్ అనంతపల్లి ఎస్‌ఐగా రానున్నారు. నల్లజర్ల మండలంలో సమర్థవంతంగా పనిచేసి గో అక్రమ రవాణాను అడ్డుకుని పలువురి మన్ననలు పొందారు.

సాగు యాజమాన్య పద్ధతులపై అవగాహన

జంగారెడ్డిగూడెం : సూక్ష్మధాతు లోపాలు కలిగిన నేల లో నవరణకు జింకు, బోరాన్, జిప్సం వంటి ఎరువులను వాడడం వల్ల మంచి దిగుబడిని సాధించవచ్చునని మండల వ్యవసాయ శాఖాధికారి చెన్నకేశవులు సూచించారు. మండలంలోని మంగిశెట్టిగూడెం, వేగవరం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నకేశవులు మాట్లాడుతూ యాజమాన్య పద్ధతులపై రైతులు అవగాహన కలిగి ఉండాలన్నారు. సూక్ష్మధాతు లోపాలు కల్గిన నేలల్లో ప్రతీ ఎకరాకు రూ.20 కేజీల చొప్పున బోరాన్, జిప్సంను వాడాలన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు వరి చేలల్లో ఎక్కువ నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు.

అడుగు దూరంలో రాజీనామాలు

● నియోజకవర్గంలో తెలుగు తమ్ముళ్ల అసంతృప్తి ● జంగారెడ్డిగూడెం పట్టణ, మండల నాయకుల సమావేశం
● త్వరలో నియోజకవర్గ స్థాయిలో భారీ సభ ● సభ సాక్షిగా సామూహిక రాజీనామాలు..? ● మేల్కొనకపోతే భారీ నష్టమే..

జంగారెడ్డిగూడెం : క్రమశిక్షణకు మారుపేరైన టీడీపీ తమ్ముళ్ళు పార్టీకి రాజీనామా చేయనున్నారా... ఎంతో కష్ట కాలంలో కూడా పదేళ్లపాటు పార్టీ జెండాను పట్టుకుని పోరాడారు... ఆ సమయంలోనే పార్టీ కార్యకర్తలు, నాయకులకు మంచి పేరు వచ్చింది... అదే క్రమంలో పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత మాత్రం తమ్ముళ్ళకు న్యాయం జరగలేదని పార్టీని నమ్ముకున్న కార్యకర్తలు, నాయకులను విస్మరించిందని జంగారెడ్డిగూడెం టీడీపీ సీనియర్ నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంత మంది స్వార్థపరుల కోసం పార్టీకి కొండంత బలమైన కార్యకర్తలు, నాయకుల మనోభావాలను దెబ్బ తీస్తూ తీవ్రస్థాయిలో పార్టీకి నష్టం చేకూర్చుతున్నారని ఇక తాడోపేడో తేల్చుకుంటామని నిర్ణయించుకున్నారు. మంగళవారం జంగారెడ్డిగూడెంలోని చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్, పార్టీ సీనియర్ నాయకుడు మండవ లక్ష్మణరావు ఇంటి వద్ద ఎమ్మెల్యే పీతల సుజాతపై అసంతృప్తి నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రతీ ఒక్కరూ తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే పీతల సుజాత ఏకపక్ష నిర్ణయాలతో స్వార్థపరుల వెంట పయనిస్తూ పార్టీని తీవ్రంగా నష్టపరుస్తున్నారని ఆరోపించారు. పార్టీని అంటిపెట్టుకుని ఇంతకాలం పని చేసిన తాము ఇక ఇదంతా చూస్తూ ఊరుకోబోమని... అవసరమైతే అధిష్టానం దృష్టికి తీసుకువెళ్తాం.. లేకుంటే పార్టీకి మూకుమ్మడి రాజీనామాలు చేస్తామని హెచ్చరించారు. ప్రధానంగా ఎమ్మెల్యే సుజాత వ్యవహార శైలిపై పలువురు నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మేల్కొనకపోతే పార్టీ తీవ్రంగా దెబ్బతింటుందని నిర్ణయించుకున్నారు. త్వరలో ఒక కమిటీని ఏర్పాటు చేయడం.. లేదంటే నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యే అసంతృప్తి వర్గంతో భారీ సభ




ఎమ్మెల్యే సుజాత అసంతృప్తి వర్గ సమావేశంలో పాల్గొన్న టీడీపీ నాయకులు... మాట్లాడుతున్న మండవ లక్ష్మణరావు

ఏర్పాటు చేసి అక్కడే తమ నిర్ణయాన్ని పార్టీ అధిష్టానానికి తెలుపుతామన్నారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ పట్టణ, గ్రామస్థాయిలో పార్టీ తీవ్రంగా నష్టపోయిందన్నారు. కాసుల కాదు... పార్టీయే ధ్యేయంగా పని చేసే నాయకులను ప్రక్కన పెట్టి ఏకపక్ష నిర్ణయాల కారణంగా జంగారెడ్డిగూడెం మెట్ట ప్రాంత టీడీపీకి గండి పడిందన్నారు. త్వరలోనే నియోజకవర్గ స్థాయిలో సమావేశం ఏర్పాటు చేసి అసంతృప్తి నాయకులు, కార్యకర్తలు ఒక కీలక నిర్ణయాన్ని తీసుకుంటామని హెచ్చరించారు. ఏది ఏమైనా నియోజవర్గంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే సుజాతపై మాత్రం తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. రానున్న రోజుల్లో ఈ పరిస్థితులు ఏ స్థాయికి తీసుకువెళ్తాయో అని కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో పెనుమర్తి రామ్‌కుమార్, జడ్పీటీసీ శీలం రామచంద్రరావు, ఆరుగొల్లు బజారు, అబ్బిన దత్తాత్రేయ, మద్దిపాటి నాగేశ్వరరావు, తడికమళ్ళ సుబ్బారావు, ముళ్ళపూడి శ్రీనివాస్, చింతల వెంకటేశ్వరరావు,లింగాల సత్యనారాయణ, జయరాజు, అట్లూరి రామ్మోహనరావు, చిట్టోజు తాతాజీతో పాటు పట్టణ, రూరల్ ప్రాంతాలకు చెందిన సుమారు 50 మంది నాయకులు పాల్గొన్నారు.

ఒకరిపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం టౌన్ : గతంలో పెట్టిన కేసులను విత్‌డ్రా చేసుకోవాలని ఒక మహిళను వ్యక్తి బలవంతం చేసిన సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణానికి చెందిన రెగ్గిపల్లి అనిత, బుద్దాల లక్ష్మణరావు గతంలో సహజీవనం చేశారు. అనంతరం వీరి మధ్య సఖ్యత చెడిపోవడంతో ఒక్కరిపై ఒకరు స్టేషన్‌ను ఆశ్రయించి కేసులు పెట్టుకున్నారు. అయితే ఇటీవల లక్ష్మణరావు గతంలో అనిత పెట్టిన కేసులను విత్‌డ్రా చేసుకోవాలని బలవంతం చేశాడని అనిత ఫిర్యాదుపై ఎస్‌ఐ ఎం.కేశవరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

13వ రోజుకు ఎంఆర్పీఎస్ దీక్షలు

జంగారెడ్డిగూడెం : ఎస్సీ వర్గీకరణ సాధన కోసం 13వ రోజు దీక్షలు విజయవంతమైనట్టు ఎంఆర్‌పీఎస్ రాష్ట్రనేత విస్సంపల్లి సిద్ధ మాదిగ తెలిపారు. ఎంఆర్‌పీఎస్ జిల్లా కార్యదర్శి ముప్పిడి చిన్నబాబు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలు వర్గీకరణ చేయకుండా ఎస్సీల్లో ఉన్న 59 కులాలకు అన్యాయం చేస్తున్నారన్నారు. జగన్ నుంచి మొదలుకొని ముఖ్యమంత్రి చంద్రబాబు వరకు దోబూచులాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 13వ రోజు దీక్షలో చదలవాడ రవి, పులపాకుల రామకృష్ణ, భద్రయ్య, రమేష్, దావీదు, దిద్దే రాంబాబు, కంకిపాటి చిరంజీవి, ప్రసాద్, చల్లయ్య, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జీవో 279 రద్దు చేయాలి

జంగారెడ్డిగూడెం : మునిసిపల్ కాంట్రాక్ట్ కార్మికుల పొట్ట కొట్టే జీవో.279ను రద్దు చేయాలని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి శుక్లబోయిన రాంబాబు డిమాండ్ చేశారు. మంగళవారం నగర పంచాయితీ కార్యాలయం వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద కార్మికులు మానవహారం, నిరసన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ జీవో రద్దు కోసం కార్మిక సంఘాలు 18 నెలలుగా పోరాటం చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. జూలై నెలలో సుమారు 50కి పైగా మున్సిపాలిటీల్లో టెండర్లు పిలిచారన్నారు. ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాన్ని నిరసిస్తూ జేఏసీ ఆధ్వర్యంలో గత నెలలో వివిధ దశలో సమ్మెలు చేశామన్నారు. అయినప్పటికీ మంత్రి వర్గం ఉప సంఘం జీవోను అమలు చేసి తీరుతామని మొండిగా వ్యవహరించిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆగష్టు 1నుంచి 22వ తేదీ వరకు దశల వారీగా ఆందోళనలు జరుగుతాయన్నారు. దీనిలో భాగంగా ఈనెల 4న నల్లరిబ్బన్లతో మౌన ప్రదర్శనలు, 5, 6తేదీల్లో ప్రజా సంఘాలతో సభలు, 7నుంచి 21వ తేదీ వరకు విజయవాడలో నిరాహార దీక్షలు, అలాగే 22వ ఛలో విజయవాడ కార్యక్రమంలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. అప్పటికి ప్రభుత్వం దిగిరాకపోతే నిరవధిగా సమ్మె చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జీవరత్నం, తదితరులు పాల్గొన్నారు.



నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తున్న కార్మికులు

కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తాం

జంగారెడ్డిగూడెం : బూత్‌స్థాయి నుంచి మండల, డీసీసీ, పీసీసీ, ఏసీసీ వరకు సంస్థాగత ఎన్నికలు నిర్వహించి పార్టీని బలోపేతం చేస్తామని జిల్లా పార్టీ సంస్థాగత ఎన్నికల ఇన్‌చార్జ్ శివరామన్ అన్నారు. మంగళవారం రాష్ట్ర కిసాన్ సెల్ అధ్యక్షుడు జెట్టి గురునాథరావు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శివరామన్‌తో పాటు డీసీసీ అధ్యక్షుడు రఫీ ఉల్లాబేగ్ ముఖ్య అతిథులుగా హాజరై పార్టీ బలోపేతానికి అందరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఆర్.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా

రెండు ట్రాక్టర్లను సీజ్ చేసిన పోలీసులు

కుక్కునూరు : మండలంలోని శివారు గ్రామం సీతారామనగరం నుంచి తెలంగాణకు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను మంగళవారం పోలీసులు సీజ్ చేసి కుక్కునూరు పోలీస్‌స్టేషన్‌కి తరలించారు. ఇసుక అక్రమ రవాణా జరుగుతున్న ప్రాంతం ఆంధ్రాకి సరిహద్దు నుంచి కేవలం రెండు కిలో మీటర్లు దాటితే తెలంగాణకు వెళ్లే అవకాశం ఉంది. దీంతో అక్రమార్కులు కన్నేశారు. కొన్ని నెలలుగా వెంకటాపురం, బూరుగువాయి, సీతారామనగరం నుంచి ఇసుక తెలంగాణలోని బూర్గంపాడు, సారపాక, తిమ్మాపేట పరిసర ప్రాంతాలకు తరలి వెళుతున్నట్టు తెలుస్తోంది. అయితే శివారు ప్రాంతం కావడంతో సరైన సమాచారం లేక అధికారులు దాడులు చేయకపోవడంతో ఈ ప్రాంతాల నుంచి ఇసుక రవాణా జరుగుతోంది. కాగా తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన కూపన్లతో ఆంధ్రాలోని ఇసుకను తరలిస్తున్నట్టు పోలీసుల విచారణలో వెల్లడైంది. దీంతో ట్రాక్టర్లను సీజ్ చేసినట్టు సీఐ చిరంజీవి తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్టు ఎస్‌ఐ పార్థసారధి తెలిపారు.





మద్యం షాపు నిర్మాణాన్ని ఆపాలని ఎస్‌ఐతో మాట్లాడుతున్న మహిళలు

మద్యం దుకాణం ఏర్పాటు చేయొద్దు

జంగారెడ్డిగూడెం : స్థానిక పద్మా థియేటర్ ప్రక్కన ఏర్పాటు చేస్తున్న మద్యం దుకాణ నిర్మాణాలను ఆ ప్రాంత మహిళలు మంగళవారం అడ్డుకున్నారు. జనవాసాల మధ్యలో మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేయవద్దని వారం రోజులుగా ఈ ప్రాంతానికి చెందిన మహిళలు నిరసన వ్యక్తం చేశారు. అలాగే ఆర్డీఓ, కమిషనర్, ఎక్సైజ్ శాఖాధికారులకు కూడా వినతి పత్రాలను అందజేశారు. అయినప్పటికీ మంగళవారం దుకాణానికి సంబంధించి గోడ కడుతుండగా ఆగ్రహించిన మహిళలు పనులను అడ్డుకున్నారు. దీంతో ఉద్రిక్త వాతావరణం ఏర్పడడంతో జంగారెడ్డిగూడెం ఎస్‌ఐ కేశవరావు సంఘటనా స్థలానికి చేరుకొని మహిళలతో మాట్లాడారు. వెంటనే నిర్మాణ పనులను ఆపాలని ఎస్‌ఐ ఆదేశించడంతో మహిళలు శాంతించారు.

ఆశ్రమానికి బియ్యం అందజేత

జంగారెడ్డిగూడెం : సమాజానికి సేవలందించే ప్రతీ ఒక్కరూ ఆదర్శనీయులేనని రోటరీ అధ్యక్షుడు చల్లారి మాణిక్యాలరావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక అమ్మానాన్న విభిన్న ప్రతిభావంతుల సేవా కేంద్రంలో కార్యదర్శి జవ్వాజి ఉమా వెంకటేష్ ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతులకు సేవా కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. కార్యక్రమంలో కోస్టల్ బ్యాంక్ ఉద్యోగి మేడిపూడి కిషోర్ ద్రవ్య సహాయంతో ఆశ్రమంలో నిత్య అన్నదానానికి 25 కేజీల బియ్యం రోటరీ అందించిందన్నారు.

ఎల్లారావు మృతికి సంతాపం

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం పట్టణ నాయీబ్రాహ్మణ సంఘం సమావేశం స్థానిక పేరంపేట రోడ్డులోని నాయీబ్రాహ్మణ కమ్యూనిటీ హాలులో ఉదయం 10గంటలకు పట్టణ అధ్యక్షుడు చిప్పాడ నరసింహారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జూలై 25న మృతి చెందిన మండల అధ్యక్షుడు భీమవరపు ఎల్లారావు సంతాప సభ నిర్వహించి సంతాపం తెలియజేశారు. ఆయన మృతి కుటుంబానికి, సంఘానికి తీవ్ర లోటని వక్తలు అన్నారు. కార్యక్రమంలో కంకిపాటి సత్యనారాయణ, ఎన్.సత్యనారాయణ, ఎస్.ఆనందరావు, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

జంగారెడ్డిగూడెం :

లక్ష్మి	ఫిదా
సౌభాగ్య	నిన్నుకోరి
,, స్క్రీన్-2	వైరస్
శ్రీ పద్మ	వాసుకి
శ్రీ రాజరాజేశ్వరి	గౌతమ్‌నంద

హలో.. ఆంధ్రజ్యోతి

మీ ప్రాంతంలో జరిగే సభలు, సమావేశాలు, సంఘటనలు, ఉత్సవాలు, స్థానిక సమస్యలపై మాకు సమాచారం ఇవ్వండి.

జంగారెడ్డిగూడెం	:9603519823
,, టౌన్	:9866666757
కుక్కునూరు	:9440255016
వేలేరుపాడు	:9440242054





కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న చినమిల్లి

కాపునాడు ఆధ్వర్యంలో
కొవ్వొత్తుల ప్రదర్శన

కొవ్వూరు టౌన్ : కాపులను ఉగ్రవాదులుగా చిత్రీకరించి నిర్బంధించడం అమానుషమని జిల్లా కాపు నాడు అధ్యక్షుడు చినమిల్లి వెంకటరాయుడు అన్నారు. మంగళవారం రాత్రి కొవ్వూరు మెరకవీధి సెంటర్‌లో ముద్రగడ పాదయాత్రకు మద్దతుగా కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ జులై 26న తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడి నుంచి ఛలో అమరావతి పాదయాత్రను చేపట్టిన ముద్రగడ పద్మనాభంను అడ్డుకుని గృహనిర్బంధం చేయడం అమానుషమన్నారు. ముద్రగడ పాదయాత్రకు అనుమతి ఇవ్వాలని లేనిపక్షంలో ఇంటికి ఒకరు తరుపున ఉద్యమంలో పాల్గొనే విధంగా మమేకం చేస్తామన్నారు. ఎన్నికల ముందు ఓటు బ్యాంక్‌గా వినియోగించుకుని అధికారం చేజిక్కిన తరువాత అణగదొక్కాలని చూడడంపై భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కొవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మక్కా శ్రీనివాసరావు, ఎన్.సోమేశ్వరరావు, కొత్తపల్లి సుబ్బలక్ష్మి, బుగడపాటి సత్యవతి, ఇ.వేణుగోపాలరావు, మారిశెట్టి వెంకటేశ్వరరావు, దొడ్డా విజయసారథి, గండ్రోతు కోదండ రామారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం..

- ఉదయం 8గంటలకు కొవ్వూరు-ఇచ్ఛాపురం(డీలక్స్ సర్వీసు వయా విశాఖ, టెక్కలి)
- రాత్రి 7-15కు కొవ్వూరు-హైదరాబాద్,(బీహెచ్ఈఎల్) రిజర్వేషన్ సౌకర్యం కలదు.
- ఉదయం 5-15కు, మధ్యాహ్నం 2-15కు కొవ్వూరు నుంచి విజయవాడ
- ఉదయం 7-20కు, కొవ్వూరు-భద్రాచలం
- ఉదయం 9-15, రాత్రి 9-15కు కొవ్వూరు నుంచి రాజమండ్రి, గుంటూరు మీదుగా మాచర్ల
- ఆర్టీసీ ఎంక్వయిరీ.. 08813-231514

హలో.. ఆంధ్రజ్యోతి

మీ ప్రాంతంలో జరిగే సభలు, సమావేశాలు, సంఘటనలు, ఉత్సవాలు, స్థానిక సమస్యలపై మాకు సమాచారం ఇవ్వండి.

కొవ్వూరు	: 94900 86600
తాళ్లపూడి	: 94410 87274
చాగల్లు	: 94404 15499

సినిమా గైడ్

కొవ్వూరు :

గాయత్రి	గౌతమ్ నంద
అనన్య	ఫిదా

చాగల్లు :

వెంకటకృష్ణ	గౌతమ్ నంద
వెంకట్రామా	ఫిదా

ఆరోగ్యాంధ్రగా తీర్చిదిద్దుతాం

కొవ్వూరులో ఎంఆర్ టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి కె.ఎస్.జవహర్

కొవ్వూరు టౌన్ : నవ్యాంధ్రప్రదేశ్‌ను ఆరోగ్య ఆనంద ప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కెఎస్.జవహర్ అన్నారు. నియోజక వర్గంలో మంగళవారం మీజిల్స్, రూబెల్లా వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. పట్టణంలోని 1వ వార్డు రాజీవ్ కాలనీ మండల పరిషత్ పాఠశాలలో పీపీ యూనిట్ వైద్యాధికారి ఎస్.ధర్మరాజు ఆధ్వర్యంలో ఎంఆర్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని మంత్రితోపాటు, మునిసిపల్ చైర్‌పర్సన్ జొన్నలగడ్డ రాధారాణి ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 9నెలల నుంచి 15 సంవత్సరాల మధ్య పిల్లలకు తప్పనిసరిగా ఈ టీకాలు వేయించాలన్నారు. 2020లోపు రూబెల్లా వ్యాధి లేకుండా చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. దానికనుగుణంగా విద్యా, వైద్యశాఖ అధికారులు ఎంఆర్ వ్యాక్సిన్‌పై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కౌన్సిలర్ బొండాడ సత్యనారాయణ, కమిషనర్ టి.నాగేంద్రకుమార్, సీడీపీవో వైబీటీ సుందరి, ఏఎన్ఎంలు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.





దొమ్మేరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఎంఆర్ వ్యాక్సిన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి జవహర్...ఎస్‌టీవీకేఆర్ హైస్కూల్‌లో వ్యాక్సిన్ వేస్తున్న దృశ్యం

దొమ్మేరులో..మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఆర్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని మంత్రి జవహర్ ప్రారంభించారు. సెప్టెంబర్ 8వ తేదీ వరకు జరిగే ఈ కార్యక్రమంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులు తప్పనిసరిగా నిర్దేశించిన తేదీల్లో పాఠశాలకు వచ్చే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ గారపాటి శ్రీదేవి, ఎంపీపీ వాడవెల్లి రాజ్యలక్ష్మి, ఎంఈవో జి.కెంపురత్నం, పీహెచ్‌సీ వైద్యాధికారి బళ్ల శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ వట్టికూటి తాతాజీ, ఆశా, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యాధులు వ్యాపించేదిలా.. మీజిల్స్, రూబెల్లా వ్యాధులు వైరస్ వల్ల వ్యాప్తి చెందుతాయి. అధికంగా 9నెలల నుంచి 15 సంవత్సరాల లోపు బాల బాలికల్లో ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. మీజిల్స్ వ్యాధి సోకినట్టయితే జ్వరం, చర్మంపై దద్దుర్లు, శ్వాస తీసుకోవడం కష్టంగా ఉండడంతోపాటు శ్వాసకోశ సంబంధిత వ్యాధులు వ్యాప్తి చెందుతాయి.

రూబెల్లా వ్యాధి లక్షణాలివీ.. జ్వరం, ఒంటిపై దద్దుర్లు, చిన్నపిల్లల్లో కంటి చూపు లోపం, అంగ వైకల్యం, మంద బుద్ధి, గర్భిణులకు ఈ వ్యాధి సోకితే గుండె సంబంధిత వ్యాధులతో బిడ్డలు పుడతారు. ఈ వ్యాధిని అరికట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 1 నుంచి సెప్టెంబర్ 8 వరకు ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉచితంగా ఎంఆర్ టీకా వేస్తున్నారు. 15 సంవత్సరాల లోపు పిల్లలందరికీ వేయించి తల్లిదండ్రులు సద్వినియోగించుకోవాలి.

150 మంది విద్యార్థులకు టీకాలు..

దొమ్మేరు ఎస్‌టీవీకేఆర్ ఉన్నత పాఠశాలలో దొమ్మేరు ప్రాథమిక వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఎంఆర్ టీకాలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. పాఠశాలలోని 15 సంవత్సరాలలోపు విద్యార్థులకు 150మందికి టీకాలు వేశారు. కార్యక్రమంలో హెచ్ఎం జి.ఆంజనేయశాస్త్రి కె.నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆయకట్టు స్థిరీకరణ నివేదికలివ్వండి

కొవ్వూరు : తాడిపూడి ఎత్తిపోతల పథకం పరిధిలోని భూములకు ఆయకట్టు స్థిరీకరణ చేసి నివేదికలు అందించాలని ఆర్డీవో బి.శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆర్డీవో కార్యాలయంలో తాడిపూడి ఎత్తిపోతల పథకం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ తాడిపూడి ఎత్తిపోతల పథకం ద్వారా తుపాకులగుడెం, రాగోలపల్లి, బయ్యారం, గజ్జరం, అన్నదేవరపేట గ్రామాల పరిధిలోని 3వేల 629.03 ఎకరాల ఆయకట్టు భూములకు తాడిపూడి ఎత్తిపోతల పథకం నుంచి సాగు నీరందిస్తున్నామన్నారు. దీనికి సంబంధించి ఆయకట్టు స్థిరీకరణ చేసి నివేదికలు అందజేయాలన్నారు. ఈ ఎత్తిపోతల పథకం ద్వారా రెవెన్యూ డివిజన్ పరిధిలో 26.800 కిలోమీటర్ల పరిధిలోని వ్యవసాయ భూములకు కాలువలు ద్వారా సాగునీరు సరఫరా చేస్తున్నామన్నారు. ఆయకట్టులో సాగు అవుతున్న భూములు స్థిరీకరించి జాబితా తయారు చేయడానికి ఇరిగేషన్, రెవెన్యూ వ్యవసాయ శాఖ అధికారులు గ్రామ, మండల స్థాయి కమిటీలు ఏర్పాటు చేసి భూములు సర్వే నెంబర్ ప్రకారం స్థిరీకరించాలన్నారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం సర్వే నెంబర్‌లను తహసీల్దార్‌లు అందజేయాలని ఆదేశించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.వెంకట్రావు, భాస్కర రామకృష్ణ, ధనుంజయరావు, కేపీ.శంకరరావు, తహసీల్దార్‌లు వై.రవికుమార్, పి.శ్రీనివాసరావు, వ్యవసాయాధికారులు జె.రత్నప్రభ, కృష్ణకిషోర్, ఆర్డీవో కార్యాలయ పరిపాలనాధికారి ఎల్.దేవికి దేవి, వీఆర్వోలు పాల్గొన్నారు. అనంతరం డివిజన్ పరిధిలోని సర్వేయర్లు, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో బి.శ్రీనివాసరావు

అర్బన్ బ్యాంక్ ఎన్నికలకు 15 నామినేషన్లు

కొవ్వూరు : కొవ్వూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ నూతన పాలకవర్గ ఎన్నికలకు సంబంధించి 15 మంది అభ్యర్థులు నామినేషన్‌లు దాఖలు చేసినట్టు ఎన్నికల అధికారి అసిస్టెంట్ రిజిస్ట్రార్ పీఎస్‌వీఎస్ శివనాగరాజు తెలిపారు. అర్బన్ బ్యాంక్ ప్రస్తుత పాలకవర్గం పదవీ కాలం ఆగస్టు 12వ తేదీతో పూర్తి కావస్తున్నందున నూతన పాలకవర్గ ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ జారీ చేశారు. దీనిలో భాగంగా మంగళవారం 11మంది పాలకవర్గ సభ్యుల ఎన్నికకు నామినేషన్‌లు స్వీకరించారు. గత 15 సంవత్సరాలుగా అర్బన్ బ్యాంక్ చైర్మన్‌గా కొనసాగుతున్న మద్దిపట్ల శివరామకృష్ణ నాలుగో సారి చైర్మన్ అభ్యర్థిగా తమ నామినేషన్‌లు దాఖలు చేశారు. పాలంపాటి చినబాబు, పెన్మత్స లక్ష్మిప్రసాదరావు, మద్దిపట్ల మురళీకృష్ణ, గ్రంధి వీరభద్రస్వామి, పుప్పాల ప్రసాద్, మురుకొండ రమేష్, ముక్కు శ్రీ వెంకట సత్యసుబ్రహ్మణ్య రంగ కృష్ణశాస్త్రి, దాయన రామకృష్ణ, మడిపల్లి రామకృష్ణ, యాగంటి వీర శ్రీనివాసరావు, వల్లిపల్లి హనుమంతరావు, గండి సత్యనారాయణ, మట్టే నారాయణమూర్తి, ఎస్.శివరామకృష్ణ నామినేషన్‌లు అందజేసినట్టు ఎన్నికల అధికారి తెలిపారు. 2వ తేదీన ఉదయం 11నుంచి నామినేషన్‌ల పరిశీలన, 3వ తేదీన నామినేషన్‌లు ఉపసంహరణ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ఎన్నికల్లో 2 వేల 916 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారని ఎన్నికల అధికారి తెలిపారు. ఈ నామినేషన్‌ల ప్రక్రియలో మంత్రి జవహర్, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంఠమణి రామకృష్ణారావు, వైస్ చైర్మన్ దుద్దుపూడి రాజారమేష్, ఆళ్ల హరిబాబు పాల్గొన్నారు.

● రేపు సుదర్శన మహా యాగం

కొవ్వూరు టౌన్ : గోష్పాద క్షేత్రంలో గురువారం వంద మంది దంపతులతో శ్రీ మహాలక్ష్మి సుదర్శన మహాయాగం నిర్వహిస్తున్నట్టు సంస్కృత పండితుడు దోర్భల ప్రభాకర శర్మ తెలిపారు. గోష్పాద క్షేత్రంలో గురువారం యనమాక వేణుగోపాలస్వామి ఆధ్వర్యంలో లోక కల్యాణార్థం ఈ యాగాలు నిర్వహిస్తామన్నారు.పట్టణ పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు యాగంలో పాల్గొనాలని కోరారు.

● ఇరువురికి ఏడు రోజుల జైలు

కొవ్వూరు : మద్యం సేవించి అర్ధరాత్రి గలాటా చేసిన ఇరువురు వ్యక్తులకు ఏడు రోజుల జైలు శిక్ష విధించినట్టు పట్టణ ఎస్ఐ సతీష్ జానా తెలిపారు.పట్టణ సీఐ పి.ప్రసాదరావు ఆధ్వర్యంలో జూలై 31న కొవ్వూరు రోడ్డు కమ్‌రైలు బ్రిడ్జి సమీపంలోని వెంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలో టి సెంటర్‌లో మద్యం సేవించి బ్రిడ్జిపేటకు చెందిన దండగల చిన్నరాజు, గంగుల ఆనందకుమార్ గలాటా చేస్తున్నారని సమాచారం రావడంతో పోలీసు సిబ్బంది పీవీ.సూర్యనారాయణ, దేవేంద్రుడు సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువురిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. మంగళవారం ప్రత్యే క రెండో అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ పట్నాకర్ ఇరువురికి ఏడు రోజులు జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారన్నారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న నారాయణ పాఠశాల విద్యార్థులు

పర్యావరణంపై అవగాహన ర్యాలీ

కొవ్వూరు : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఆర్ అండ్‌బీ డివిజనల్ కార్యాలయ మేనేజర్ మందేష్ అన్నారు. స్థానిక మూడు డాబాల వీధిలో ఉన్న నారాయణ పాఠశాల ప్రిన్సిపాల్ జేవీ ఆంజనేయులు ఆధ్వర్యంలో పుర వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాఠశాల నుంచి ఆర్అండ్‌బీ కార్యాలయానికి చేరుకుని ఉద్యోగులకు మొక్కలు పంపిణీ చేశారు. అనంతరం పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అంటూ మొక్కలను రక్షించు.. భవిష్యత్తును కాపాడు అంటూ నినాదాలు చేస్తూ పుర వీధుల్లో ర్యాలీ నిర్వహించారు.

దివ్యాంగులకు పౌష్టికాహారం అందజేత

చాగల్లు: మండలంలోని దివ్యాంగులకు విద్యను అందించే భవిత పాఠశాలతో మంగళవారం పౌష్టికాహారం అందజేసే కార్యక్రమాన్ని ఎంపీపీ కోడూరి రమామణి ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రత్యేక శ్రద్ధతో పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగ పూర్ణిమ, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

దాతల కృషి అభినందనీయం

వేగేశ్వరపురం(తాళ్ళపూడి): వేగేశ్వరపురం కేఎస్ఆర్ పాఠశాలకు ముందుగా ఉన్న చెరువు అభివృద్ధికి కైగాల సుబ్బారావు కృషి చేయడం అభినందనీయమని మంత్రి కేఎస్.జవహర్ కొనియాడారు. ప్రభుత్వం, దాతలు, పూర్వ విద్యార్థుల సహకారంతో రూ.1.80 కోట్ల వ్యయంతో అధునాతనమైన పాఠశాల భవనాన్ని నిర్మించడానికి పూనుకోవడంతో పాటు చెరువు అభివృద్ధికి పాటుపడటం గర్వకారణమన్నారు. మంగళవారం చెరువులో జరుగుతున్న పనులను పరిశీలించారు. చెరువు నాలుగు పక్కలా రివిట్‌మెంట్‌కు రూ.32 లక్షల వ్యయం తో నిర్మాణం జరుగుతోందన్నారు. గ్రామాల్లోను చెరువుల అభివృద్ధికి దాతలు ముందుకురావాలన్నారు.

బెల్టు షాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవ్

తాళ్ళపూడి: బెల్టు షాపుల ద్వారా మద్యం విక్రయాలు జరిపినా సేవించినా చర్యలు తప్పవని ఎక్సైజ్ ఎస్ఐ షేక్ మహమ్మద్‌ఖాన్ హెచ్చరించారు. మంగళవారం పలు బెల్టు దుకాణాలపై ఆయా గ్రామాల వీఆర్వోల సమన్వయంతో దాడులు చేశారు. తాళ్ళపూడిలో ఓ కిళ్ళీ కొట్టు యజమాని సారాయి, బ్రాందీ విక్రయిస్తున్నాడని ఫిర్యాదు అందిందన్నారు. వీఆర్వో యర్రంకి శ్రీనివాస్, ఎస్ఐ, సిబ్బందితో సహా షాపులో తనిఖీలు నిర్వహించారు. అయితే ఎటువంటి మద్యం దొరకలేదు.

కానిస్టేబుల్‌కు పదవీ విరమణ సత్కారం

పెరవలి రూరల్: పదవీ విరమణ పొందిన హెడ్‌కానిస్టేబుల్ భీమవరపు సాయిబాబాను పెరవలి పోలీసులు మంగళవారం స్టేషన్‌వద్ద ఘనంగా సత్కరించారు. సీఐ చింతా రాంబాబు కానిస్టేబుల్ సాయిబాబా అందించిన సేవలు కొనియాడారు. పెరవలి ఎస్ఐ నాగరాజు, తణుకు టౌన్ ఎస్ఐ శ్రీనివాసు, పోలీసులు పాల్గొన్నారు.

చెట్టును ఢీకొట్టిన కారు : ఐదుగురికి గాయాలు

పెరవలి రూరల్: మంగళవారం పెరవలి సమీపంలో నరసాపురం-నిడదవోలు ఆర్అండ్‌బీ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలయ్యాయి. ఖండవల్లి గ్రామానికి చెందిన శ్రీను, పావనిలు వివాహం అనంతరం ఇన్నోవా కారులో నిడదవోలు నుంచి ఖండవల్లి వస్తుండగా పెరవలి సమీపంలో కారు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టడంతో వీరిద్దరితో పాటు కారులో ప్రయాణిస్తున్న కుటుంబీకులు కిషోర్, అప్పారావు, తరుణ్‌కు గాయాలయ్యాయి. 108 వాహనంలో తణుకు ఆసుపత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

కాపు నాయకుల వినూత్న నిరసన

పెరవలి రూరల్: గత రెండు రోజుల నుంచి పెరవలి గ్రామంలో కాపులు చేస్తున్న రిలే నిరాహారదీక్ష కార్యక్రమంలోభాగంగా మంగళవారం నోటికి నల్లరిబ్బన్ కట్టుకుని నిరశన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాపు నాయకులు సీతారామప్రసాద్, కానూరు గ్రామానికి చెందిన కాపులు పాల్గొన్నారు.

కాపు నేతలతో చినమిల్లి భేటీ

వేగేశ్వరపురం(తాళ్ళపూడి): పాదయాత్రలు, దీక్షలను భగ్నం చేసినంత మాత్రాన ఉద్యమం ఆగిపోదని కాపునాడు జిల్లా అధ్యక్షుడు చినమిల్లి వెంకటరాయుడు అన్నారు. వేగేశ్వరపురంలో మంగళవారం రాత్రి కాపు సంఘం నాయకులతో భేటీ అయ్యారు. ప్రతీ కాపు బిడ్డ, మహిళలు చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని నెరవేర్చే వరకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

నడిపల్లిలో తల్లిపాల వారోత్సవాలు

పెరవలి రూరల్: మండలంలో గల నడిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం తల్లిపాల వారోత్సవం నిర్వహించా రు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సరోజిని మాట్లాడుతూ బిడ్డకు తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరిం చారు. సర్పంచ్. కె. అనంతలక్ష్మి రత్నకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.

భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు

రాగోలపల్లి(తాళ్ళపూడి): భర్త కనబడడంలేదని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ కే.అశోక్‌కుమార్ తెలిపారు. రాగోలపల్లి గ్రామానికి చెందిన నీరుకొండ నాగసురేష్‌బాబు మంగళవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్ళి తిరిగి రాకపోవడంతో భార్య భారతి ఫిర్యాదు చేసిందన్నారు.

అందరి సంక్షేమమే ధ్యేయం

పింఛన్లు పంపిణీ చేసిన మంత్రి జవహర్



కొత్తగా మంజూరైన పింఛన్లు అందజేస్తున్న మంత్రి జవహర్

చాగల్లు: అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ పథకా లు అందజేసేలా కృషి చేస్తున్నామని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కేఎస్.జవహర్ అన్నారు. మంగళవారం చాగల్లు మండల పరిషత్ కార్యాలయంలో కొత్తగా మంజూరైన పింఛన్లను మంత్రి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. మండలంలో 230 మందికి కొత్తగా పింఛన్లు మంజూరయ్యాయి. ఈ సంద ర్భంగా జరిగిన సమావే శంలో మాట్లాడుతూ ప్రతి పల్లెలోను పూర్తిస్థాయిలో సీసీ రోడ్ల నిర్మాణం చేస్తు న్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కోడూరి రమామణి, ఏఎంసీ చైర్మన్ ఆళ్ళ హరిబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు బొడ్డు రాజు, టీడీపీ జిల్లా కార్యదర్శులు పిల్లి శ్రీనివాసరావు, మద్దిపాటి వీరారాఘవులు, జన్మభూమి కమిటి సభ్యులు కోడూరి ప్రసాద్, ఎంపీడీవో కే.పురుషోత్తమరావు, తహసీల్దార్ ఎం.మె రికమ్మ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రుబెల్లా టీకాలను ప్రారంభించిన మంత్రి..

ఒక టీకాతో రెండు వ్యాధుల నుంచి రక్షణ కల్పించే టీకాలను పిల్లలకు తప్పనిసరిగా వేయించాలని మంత్రి జవహర్ అన్నారు. స్థానిక జూనియర్ బేసిక్ స్కూల్‌లో టీకాలు వేసే కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. అధికారులు, ఆరోగ్య సిబ్బంది బాధ్యతతో పని చేసి ప్రతి పిల్లవాడికి టీకాలు వేయించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు పి.దేశాయ్‌నాథ్‌వర్మ, మైఖేల్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

తాళ్ళపూడి: వృద్ధులు వికలాంగులు, వితంతవులను ఆదుకోవాలనే సదుద్దేశ్యంతో ఎన్టీఆర్ భరోసాతో ఐదు రెట్లు పెంచి అమలు చేస్తున్నామని మంత్రి కెఎస్.జవహర్ అన్నారు. మంగళవారం తాళ్ళపూడి మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీఓ జీ.జ్యోతిర్మయి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నాలుగో విడత జన్మభూమి పింఛను అమలు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సంక్షేమ పథకాల అమలుకు రూ.35 వేల కోట్లు ఖర్చు చేస్తున్న ఘనత చంద్రబాబుకే దక్కుతోందన్నారు. అనంతరం 322మందికి పింఛన్లు మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో పూర్తిస్థాయిలో అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గ పరిధిలో 20గ్రామాల్లో భూగర్భ డ్రెయినేజీలు నిర్మిస్తామన్నారు. జాతీయ గ్రామీణ సుజల తాగునీటి పథకానికి అదనంగా మరో రూ.8కోట్లు నిధులకు ప్రతిపాదనలు పంపించామన్నారు. మండల పరిధిలోని 16 ఆవాస గ్రామాలకు శుద్ధి చేసిన తాగునీటిని సరఫరా చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కాసాని అనంత లక్ష్మి, జడ్పీటీసీ కైగాల మంగాభవాని, ఎంపీటీసీలు నాయు డు నాగరాణి, గెడ్డం కృష్ణవేణి, శీలబోయిన కృష్ణ, చిక్కాల మహేష్, పసలపూడి కటాక్షం, సర్పంచ్‌లు మల్లిపూడి చినరాములు, శెట్టిమాలి భీమయ్య, కొడమంచిలి పాపారత్నం, కావూరి కుమారి, టీడీపీ ఉపా ధ్యక్షులు కొఠారు వెంకటరావు, గోపాలపురం ఏఎంసీ డైరెక్టరు ఇల్లూరి బాబ్జి, నామన పరమేశ్వరరావు, మద్దిపాటి ప్రకాశరావు, మద్దుకూరి విష్ణురావు, నామా సురేంద్ర, సిద్దా రాధాకృష్ణ, దండమూడి శేషు, చలపాటి ప్రకాష్, పలు శాఖల అదికారులు పాల్గొన్నారు.





వేగేశ్వరపురం పాఠశాలలో తట్టు రూబెల్లా వ్యాక్సిన్ అమలు కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి జవహర్, ఉండ్రాజవరంలో విద్యార్థులకు వ్యాక్సిన్ వేస్తున్న దృశ్యం

రుబెల్లా టీకా.. చిన్నారులకు ఆరోగ్యకరం

వేగేశ్వరపురం(తాళ్ళపూడి): రూబెల్లా టీకాను తీసుకుని చిన్నారులంతా ఆరోగ్యవంతంగా జీవించాలని మంత్రి కేఎస్.జవహర్ అన్నారు. మంగళవారం వేగేశ్వరపురం కేఎస్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డిప్యూటీ డీఎంహెచ్ఓ కే.సురేష్‌బాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈనెల 18వరకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో టీకాను వైద్యులు అమలుచేస్తారన్నారు. వ్యాక్సిన్‌ను తీసుకోవడం వల్ల ఎటువంటి ఇబ్బందులు తలెత్తవన్నారు. అశ్రద్ధ చేయకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలకు టీకా వేయించాలన్నారు. జొన్నలగడ్డ వెంకటసుబ్బరాయచౌదరి, వైద్యులు కే.చంద్రశేఖర్, ప్రధానోపాధ్యాయుడు శివప్రసాద్, కైగాల శ్రీనివాస్, జడ్పీటీసీ కైగాల మంగాభవాని, ఎంపీపీ కాసాని అనంతలక్ష్మి చిట్టిబాబు, సర్పంచ్ కావూరి కుమారి పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మీజిల్స్, రూబెల్లా వ్యాక్సిన్‌ల వల్ల పిల్లలు తట్టు, పొంగు వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చునని పీహెచ్‌సీ వైద్యాధికారి విజయకుమార్ తెలిపారు. మంగళవారం మండ లంలో పలు గ్రామాల్లో 9 నెలల నుంచి 15 సంవత్సరాల లోపు పిల్లలకు ఈ వ్యాక్సిన్‌ను వేసే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ వ్యాక్సిన్ అత్యంత సురక్షితమైనదని తెలిపారు. ప్రత్యేక శిక్షణ పొందిన ఏఎన్ఎంలు ద్వారా మాత్రమే ఈ టీకా వేస్తారని తెలిపారు. మండలంలో 36 పాఠశాలలు, 16 కాన్వెంట్‌లు, 56 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ వ్యాక్సిన్ వేస్తామన్నారు. మండల పరిధిలో 10,946 మందికి ఈ వ్యాక్సిన్ వేయాల్సి ఉండగా మొదటి రోజు మంగళవారం 1235 మంది పిల్లలకు వేశామన్నారు. ఈ నెలాఖరువరకు ఈ వ్యాక్సిన్ వేసే కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ప్రతీ బిడ్డకు ఈ వ్యాక్సిన్ వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో పీహెచ్ఎన్ ఏసుమేరీ, సీహెచ్‌వో కె.గంగాధరనాయుడు, సూపర్‌వైజర్ బృంగేశ్వరరావు, శ్రీనివాస్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



పెరవలి రెడ్‌రోజ్ స్కూలులో వ్యాక్సిన్ వేస్తున్న సిబ్బంది

1561 మందికి ఎంఆర్ వ్యాక్సిన్

పెరవలి రూరల్: మంగళవారం పెరవలి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు పెరవలి పీహెచ్‌సీ సిబ్బంది రూబెల్లా వ్యాక్సిన్ వేశారు. ఈనెల 1వ తేదీ నుంచి 18వ తేదీ వరకు పాఠశాలల విద్యార్థులకు ఈ వ్యాక్సిన్ వేయనున్నట్లు వైద్య సిబ్బంది తెలిపారు. పెరవలి పీహెచ్‌సీ పరిధిలోగల 11 గ్రామాలకు గాను 8 వేల 225 మంది పిల్లలు ఉండగా వారందరికి ఈ వ్యాక్సిన్ వేసే విధంగా చర్యలు చేపట్టినట్లు పెరవలి పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసాద్ తెలిపారు. మంగళవారం పెరవలిలో 1561 మంది ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఈ వ్యాక్సిన్ వేసినట్లు తెలిపారు. పెరవలిలో రెడ్‌రోజ్ స్కూల్‌లో వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సలాది శ్రీహరి, రవి బాబు, నారాయణకుమార్ పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యే ముళ్లపూడి వెంకట కృష్ణారావును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శేషారావు

మాజీ ఎమ్మెల్యే కృష్ణారావుకు పరామర్శ

ఉండ్రాజవరం: మాజీ ఎమ్మెల్యే ముళ్లపూడి వెంకట కృష్ణారావు అనారోగ్యానికి గురికావడంతో ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు మంగళవారం ఆయనను పరామర్శించారు. తణుకు రూరల్ మండ లం ముద్దాపురంలో కృష్ణారావును శేషారావు పరామర్శించి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

స్వచ్ఛభారత్ లక్ష్యంతో ప్రతీఒక్కరూ కృషి చేయాలి

ఉండ్రాజవరం: కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ కేంద్రం వారి సహకారంతో సత్యవాడ రామభద్ర రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సంస్థ అధ్యక్షురాలు నంబూరి సూర్యకుమారి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛభారత్ లక్ష్యంతో ప్రతీఒక్కరూ కృషి చేయాలన్నారు. గ్రామాలు సంపూరణ పారిశుధ్య గ్రామాలుగా ఉండాలన్నదే తమ లక్ష్యమన్నారు. ప్రతీఒక్కరూ సంవ త్సరంలో వంద గంటలు శ్రమదానం ద్వారా పరిశుభ్రతకు సమయం కేటాయిస్తే స్వచ్ఛ భారత్ సాధించవచ్చునన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక యూనియన్ కార్యదర్శి వి. వెంకట సుబ్బారావు,సంస్థ కోఆర్డినేటర్ బి.సీతారత్నం, కేదారేశ్వరరావు, మహిళలు పాల్గొన్నారు.



డాక్టర్ సలహా



ఎంఆర్ వ్యాక్సిన్ వేయించాలి

శ్రీకాంత్, తాడిమళ్ళ పీహెచ్‌సీ వైద్యుడు

"ఆగష్టు 1 నుంచి సెప్టెంబరు 8వరకు వైద్య ఆరోగ్యశాఖ మీజిల్స్ రూబెల్లా వ్యాక్సిన్ కార్యక్రమ నిర్వహిస్తున్నది. ఆరోగ్య , ఆశ, అంగన్‌వాడీ సిబ్బందికి వ్యాక్సిన్ వేసేందుకు శిక్షణ నిర్వహించాం.15 సంవత్సరాల లోపు బాల బాలికలందరికి వ్యాక్సిన్ వేసేందుకు చర్యలు చేపట్టాం. ప్రతీ ఒక్కరు తప్పకుండా వేయించుకోవాలి."

● నిడదవోలు రూరల్

అందుబాటులో ఫైబర్‌నెట్

నిడదవోలు : ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫైబర్ నెట్ లిమిటెడ్ ద్వారా ఒకే కనెక్షన్ ద్వారా ఫోను, నెట్, కేబుల్ అందిచనున్నామని మున్సిపల్ కమిషనర్ జి.కృష్ణమోహన్ అన్నారు. మంగళవారం నిడదవోలు పట్టణంలోని 4వ వార్డులో ప్రారంభించిన పనులను ఆయన పర్యవేక్షించారు. పట్టణంలో ఫైబర్ నెట్ కేబుల్ వేసేందుకు స్థానిక సిటీకేబుల్ వారికి మాత్రమే అనుమతులు ఉన్నాయన్నారు. కనెక్షన్ కావలసిన వారు మున్సిపల్ కార్యాలయంలోని పుర సేవాకేంద్రంలో పూర్తి వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. ఫోను, కేబుల్, నెట్ కనెక్షన్ నెలకు రూ.149, స్పెషల్ సెట్‌టాప్ బాక్స్‌కు రూ.50, జీఎస్టీ రూ.36 మొత్తం నెలకు రూ.235 చెల్లించవలసి ఉంటుందని తెలిపారు.

సినిమా గైడ్

నిడదవోలు :

వీరభద్ర	వాసుకి
గణపతి	గౌతమ్‌నంద
రాధాకృష్ణ	ఫిదా

తట్టు, రుబెల్లా వ్యాధిని తరిమికొడదాం

వ్యాక్సినేషన్ ప్రారంభించిన ఎమ్మెల్యే శేషారావు

సమిశ్రగూడెం (నిడదవోలు రూరల్) : ఎంఆర్ వ్యాక్సిన్ వేయించడం వల్ల పిల్లలు ప్రాణాంతకమైన వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చునని తద్వారా ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సృష్టించవచ్చునని ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు అన్నారు. తాడిమళ్ళ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం డాక్టర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో మండలంలోని సమిశ్రగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో మీజిల్స్, రుబెల్లా వ్యాక్సిన్ శిబిరాన్ని మంగళవారం శేషారావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పోలియో మహామ్మారిని దేశం నుంచి తరిమికొట్టినట్టుగానే మీజిల్స్, రుబెల్లా వ్యాధులను తరిమికొట్టాలన్నారు. రుబెల్లా ద్వారా పుట్టుకతో సంక్రమించే నీటికాసులు, శుక్లం, బుద్ధిమాంధ్యం, వినికిడి లోపం, గుండె సంబంధిత జబ్బులు కలిగిన పిల్లలు జన్మిస్తారన్నారు. రుబెల్లా సోకిన వ్యక్తి తుమ్మడం, దగ్గడం ద్వారా వేరేవ్యక్తికి సోకుతుందని శేషారావు వివరించారు. కాబట్టి వీటి నివారణకు ప్రభుత్వం నేటి నుంచి సెప్టెంబరు 8 వరకు నిర్వహిస్తున్న కార్యక్రమంలో 9 నెలల నుంచి 15 సంవత్సరాల వయసుగల ప్రతీఒక్కరూ వ్యాక్సిన్ వేయిం చుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ గజ్జరపు నాగరాధికాదేవి, ఎండీవో అబ్బిరి ఆంజనేయులు, మారిశెట్టి వీరవెంకట సత్యనారాయణ, కైకరపు రత్నం, గజ్జరపు శ్రీనివాసరావు, డీవీ శ్రీనివాసరావు, ఆరోగ్య, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమిశ్రగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో ఎంఆర్ వ్యాక్సిన్ ప్రారంభించిన ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు

నిడదవోలులో : ప్రభుత్వం చిన్నారుల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే బూరుగపల్లి శేషారావు అన్నారు.మంగళవారం నిడదవోలు పట్టణంలోని టక్కరిబాబా పేటలో ఉన్న మున్సిపల్ పాఠశాలలో మీజిల్స్, రుబెల్లా వ్యాధుల నివారణకు ఎమ్ఆర్ వ్యాక్సిన్ వేసే కార్యక్రమం శేషారావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ 5 నెలల నుంచి 15 సంవత్సరాల వయసు గల పిల్ల లందరికీ ఈ వ్యాక్సిన్ వేయించాలన్నారు. మున్సిపల్ చైర్మన్ బొబ్బా కృష్ణమూర్తి మాట్లాడుతూ ఆరోగ్యశాఖ అధికారుల పర్యవేక్షణలో చిన్నారులకు వ్యాక్సిన్ వేస్తారన్నారు. కార్యక్రమంలో కమిషనర్ జి.కృష్ణ మోహన్, డాక్టర్ శ్రీకాంత్, కౌన్సిలర్ కారింకి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న చర్చిపేట యూత్

సిటిజన్ రిసోర్స్ సెంటర్ కేటాయించాలని చర్చిపేట యూత్ వినతి

నిడదవోలు : నిడదవోలు పట్టణంలోని చర్చిపేటలో గల మున్సిపల్ సిటిజన్ రిసోర్స్ సెంటర్ నిరుపయోగంగా మారిందని మున్సిపల్ అధికారులు సిమ్మెంటు బస్తాలను, ఇతర సామగ్రి పెట్టుకోవడానికి ఉపయోగిస్తున్నారని దీనిని చర్చిపేట యూత్ సభ్యులకు అందుబాటులోకి తీసుకు రావాలని కోరుతూ మంగళవారం మున్సిపల్ కమిషనర్ జి.కృష్ణమోహన్‌కు వినతిపత్రం అందజేశారు. ఎన్నో ఏళ్ళుగా సిటిజన్ రిసోర్స్ సెంటర్ నిరుపయోగంగా దీనిని పెయింటింగ్ కార్మికులకు, చర్చిపేట యూత్ సభ్యులకు సభలు సమావేశాలు నిర్వహించుకునేందుకు కేటాయించాలని కోరారు. రమేష్, శ్రీను, అశోక్, డి.సన్ని, డి.భాను, ఎన్.దానయ్య పాల్గొన్నారు.



సమిశ్రగూడెం పంచాయతీ కార్యాలయంలో ఫించను లబ్ధిదార్లు

పింఛన్ పడిగాపులు

సమిశ్రగూడెం (నిడదవోలు రూరల్) : ప్రభుత్వం ప్రతీనెల 1న సామాజిక పింఛన్లను పంపిణీ చేస్తున్నది. పింఛన్ల పంపిణీకి ఉపయోగించే ట్యాబ్‌లలో కొత్త వెర్షన్ డౌన్‌లోడ్ చేసుకుని పంపిణీ చేయవలసి రావడంతో మంగళవారం లబ్ధిదారులు ఇబ్బందులకు గురయ్యారు. పంపిణీకోసం వచ్చిన ఫించనుదారులకు వెర్షన్ మారింది వేచి ఉండండి అంటూ పదేపదే అధికారులు తెలపడంతో లబ్ధిదారులు విసుగుచెందారు. కొత్త వెర్షన్ డౌన్‌లోడ్ కాకపోవడంతో పాటు సర్వర్ కూడా మొరాయించింది. దీంతో ఓపిక నశించడంతో ఫించను తీసుకోకుండానే కొంతమంది వెనుదిరిగారు. దాంతో లోపాన్ని అధిగమించేందుకు పాత వెర్షన్ ద్వారానే సామాజిక పింఛన్లు అందించి అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటాలకు సిద్ధం కావాలి : ఐఎఫ్‌టీయూ

నిడదవోలు : కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐఎఫ్‌టీయు ఆధ్వర్యంలో ఆందోళనకు కార్మికవర్గం సిద్ధంగా ఉండాలని ఐఎఫ్‌టీయు జిల్లా కమిటీ సభ్యులు ఈమని గ్రీష్మ కుమార్ అన్నారు. మంగళవారం నిడదవోలు పట్టణంలోని కార్మికశాఖ కార్యాలయం వద్ద కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ధర్నా నిర్వహించి, కార్మికశాఖ అధికారి రాజేశ్వరికి వినతిపత్రం అందజేశారు. గ్రీష్మకుమార్, తామాడ శ్రీనివాస్‌లు మాట్లాడుతూ కార్మికులకు గుర్తింపు కార్డులు మంజూరులో ఆలస్యం అవుతోందని, పరిహారాల పరి ష్కారంలో జాప్యం నివారించాలన్నారు. ఇందులో భాగంగా ఆగస్ట్ 8న చలో ఏలూరు నిర్వహిస్తున్నామన్నారు.లక్ష్మ ణరావు, వలి, ఆచార్యులు,ప్రకాశం, రామచంద్రరావు,దుర్గారావు పాల్గొన్నారు.



కార్మికశాఖ అధికారిణికి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

గోతులు పూడ్చారు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సమిశ్రగూడెం (నిడదవోలు రూరల్) : మండలంలోని గోతులు పడిన రోడ్లకు ఆర్అండ్‌బీ సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. ఆదివారం ఆంధ్రజ్యోతిలో మండలంలో శిథిలావస్థకు చేరి పెద్దపెద్ద గోతులు పడిన రోడ్లపై వాహనచోదకులు, పాదాచారుల ఇబ్బందులను తెలుపుతూ ఆదమరిస్తే ఇంతేసంగతులు అంటూ ఆదివారం కథనం ప్రచురించింది. అధికారులు స్పందించి రోడ్లపై పడిన గోతులను పూడ్చారు. స్థానికులు ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు.



సమిశ్రగూడెంలో రోడ్లకు మరమ్మతులు నిర్వహిస్తున్న దృశ్యం

సంక్షిప్తంగా..

పెయింటర్స్ అండ్ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ సమావేశం

నిడదవోలు : నిడదవోలు పట్టణంలో ఐఎఫ్‌టీయు కార్యాలయంలో మంగళవారం అభ్యుదయ పెయింటర్స్ అండ్ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తూరుగోపు వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిధిగా పాల్గొన్న ఐఎఫ్‌టీయు జిల్లా కమిటీ సభ్యుడు ఈమని గ్రీష్మకుమార్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మిక సంక్షేమ మండలి ద్వారా కార్మికులకు రావలసిన గుర్తింపు కార్డులు మంజూరులో కార్మికశాఖ అధికారులు అలసత్వం వహిస్తున్నారని కార్మికులకు రావలసిన వివిధ పరిహారాలు ఆలస్యం అవుతున్నాయని, కార్మికులకు రావలసిన పరిహారాలను, గుర్తింపు కార్డులను త్వరితగతిన మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏలూరి మదన్, తూరుగోపు సుధాకర్, అంజిబాబు, శేఖర్, చంటి, మధు, నూతంగి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

6న ఉచిత ధ్యానశిక్షణ, జ్ఞాన బోధ

నిడదవోలు : నిడదవోలు పట్టణంలోని సత్యసాయిబాబా సేవా సమితి మందిరంలో ఈ నెల 6వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉచిత ధ్యానశిక్షణ, జ్ఞాన బోధ కార్యక్రమం నిర్వహిస్తున్నామని నిడదవోలు స్పిరిట్యువల్ సొసైటీ ప్రతినిధి ఎమ్.ఎ.ప్రసాద్ తెలిపారు.కార్యక్రమానికి హైద్రాబాద్ నుంచి సీనియర్ పిరమిడ్ మాస్టర్ శ్రీకాంత్ హాజరు కానున్నారని తెలిపారు.

మహిళను వేధించిన కేసులో మూడేళ్ల జైలు

నిడదవోలు : కోర్టుకు వచ్చిన మహిళను వేధించిన కోర్టు గుమస్తాకు మూడేళ్ళ జైలు శిక్ష విధించినట్టు నిడదవోలు పోలీసులు తెలిపారు. చాగల్లు మండలం బ్రాహ్మణగూడెం గ్రామానికి చెందిన ఒక మహిళను అప్పటి కోర్టు గుమస్తా కె.త్యాగరాజు వేధించడంతో ఆ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై మంగళవారం ఏపీపీ గంగాధర్ వాదనలు విన్న జూనియర్ సివిల్ జడ్జి వై.శ్రీలక్ష్మి త్యాగరాజుకు మూడేళ్ళ జైలుశిక్ష,పదివేల రూపాయల అపరాధ రుసుం విధించినట్లు పోలీసులు తెలిపారు.

పోలీసు విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరి అరెస్టు

నిడదవోలు : నిడదవోలులోని రైల్వేస్టేషన్ సెంటర్‌లో పోలీసు విధులకు ఆటంకం కలిగించిన రాయిపేటకు చెందిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి కోర్టుకు పంపగా వారికి కోర్టు రిమాండ్ విధించినట్లు పట్టణ ఎస్సై జి.సతీష్ తెలిపారు.

ఇసుక డంప్ చేసిన వ్యక్తిపై కేసు నమోదు

సమిశ్రగూడెం (నిడదవోలు రూరల్) : ఇసుక గుట్టలుగా నిల్వచేసి అధికధరకు విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సమిశ్రగూడెం ఎస్సై నరేంద్ర తెలిపారు. నిడదవోలు మండలం పందలపర్రు ఏటిగట్టువద్ద ఇసుకను అక్రమంగా నిల్వచేసి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు గ్రామ రెవెన్యూ అధికారి చదల శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాధు మేరకు పినిశెట్టి వెంకట గంగాధర్‌పై కేసు నమోదు చేసి 25 యూనిట్ల ఇసుకను సీజ్ చేసినట్లు ఎస్సై నరేంద్ర తెలిపారు.

మొక్కలు నాటిన 'మానవత' సభ్యులు

నిడదవోలు : భవిష్యత్తు తరాలకు మంచి వాతావరణం అందించేందుకు పత్రిఒక్కరూ మొక్కలు నాటాలని మానవత అధ్యక్షులు నీలం రామారావు అన్నారు. మంగళవారం పట్టణంలోని మానవత కార్యాలయం రోడ్డులో మొక్కలు నాటారు.మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యత కూడా స్వీకరించాలన్నారు. బోసు, సత్య భాస్కర ప్రసాద్, ముళ్ళపూడి సత్యనారాయణ, కొండలరాయుడు, నందిగం సుబ్బారాయుడు, బేతిన ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులకు వీడ్కోలు

నిడదవోలు రూరల్ : పలు పాఠశాల్లోని ఉపాధ్యాయులు వేరే ప్రాంతాలకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా బదిలీ అయిన కాటకోటేశ్వరంలో వెంకటేశ్వరరావు, ధర్మయ్య, ప్రసాదు, భార్గవి, ప్రదీప్, ఠాగూర్‌లకు , కంసాలిపాలెంలో రాజేంద్రనాద్ , రామారావులకు సన్మానం నిర్వహించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాల సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.



డాక్టర్ సలహా



కాచి చల్లార్చిన నీటినే తాగాలి

డాక్టర్ మహేష్, ఎల్‌బీచర్ల

"సీజనల్ వ్యాధులపై వైద్య, ఆరోగ్య సిబ్బంది ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నాం. ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లతో సర్వే చేసి జ్వరాల బారినపడిన వారిని గుర్తిస్తున్నాం. ప్రస్తుతం ఎక్కువగా వర్షాలు కురవడంతో ప్రజలకు జ్వరాలు బారినపడే ప్రమాదం ఉంది. మురుగునీరు నిల్వ ఉండడం, పరిసరాలను పరిశుభ్రం చేసుకోకపోవడం వల్ల డయేరియా వంటి వ్యాధులు ప్రభలుతాయి. కాచి చల్లార్చిన నీటినే తాగాలి."

● నరసాపురం రూరల్

ఢిల్లీ వెళ్లిన ఎమ్మెల్యే

నరసాపురం టౌన్ : ఉప రాష్ట్రపతి ఎన్నికల నేపథ్యంలో ఓటు వేసేందుకు మంగళవారం ఎమ్మెల్యే మాధవనాయుడు ఢిల్లీ బయలుదేరినట్టు టీడీపీ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు రవి, ధర్మా తెలిపారు. మళ్లీ 4న పట్టణానికి విచ్చేస్తారన్నారు.

రుస్తుంబాద ఏరియా ఆస్పత్రి వైద్యుల నంబర్లు

కె.త్రిమూర్తులు, ఎంఎస్, ఈఎన్‌టీ	8008553505
కె.రాంబాబు, డెంటల్ సర్జన్,	9885406594
కె. సుచిత్ర, సివిల్ సర్జన్	9704929349
సి.గీతకుమారి, ఎంఎస్ జనరల్ సర్జన్,	9490433689
రత్నకుమారి, సివిల్ అసిస్టెంట్ సర్జన్	9912042513
సీహెచ్ పేర్రాజు, సివిల్ అసిస్టెంట్ సర్జన్,	9652744879
ఎం. తేజశ్రీ, ఎంబీబీఎస్, సీనియర్ రెసిడెంట్,	9052301131
ఆర్. అనూష, ఎండి, చిన్నపిల్లల వైద్యులు	9676464624
సీహెచ్ శ్రీహర్ష, మత్తు వైద్యులు	9985799325

హలో.. ఆంధ్రజ్యోతి

మీ ప్రాంతంలో జరిగే సభలు, సమావేశాలు, సంఘటనలు, ఉత్సవాలు, స్థానిక సమస్యలపై మాకు సమాచారం ఇవ్వండి.

నరసాపురం	: 99854 08990
,, రూరల్	: 80087 07494
నరసాపురం అర్బన్	: 9491018919
మొగల్తూరు	: 92474 93435

సినిమా గైడ్ :

నరసాపురం :

అన్నపూర్ణ	గౌతమ్‌నంద
రాజరాజేశ్వరి	మాయామాల్
కనకదుర్గ	ఫిదా

మొగల్తూరు :

శ్రీదేవి జానకి	ఫిదా
శ్రీదేవి జానకి మినీ	గౌతమ్‌నంద

కలగా.. మెరైన్ పోలీస్ స్టేషన్

ప్రతిపాదనలకు పదేళ్లు పూర్తి

సర్వేలకు పరిమితమైన స్టేషన్

తీరంలో మెరైన్ పోలీస్‌స్టేషన్ కలగా మిగిలింది. ముంబై తాజ్‌హోటల్‌పై ఉగ్రవాదుల దాడుల తరువాత అప్రమత్తమైన కేంద్రం దేశంలోని తీర ప్రాంతాల్లో పటిష్ఠ నిఘా ఏర్పాటు చేయాలని ప్రతిపాధించింది. దీనిలో భాగంగా జిల్లాలోని నరసాపురం, మొగల్తూరు తీరంలో మెరైన్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించింది. అయితే ఈ ప్రతిపాదనలకు పదేళ్లు పూర్తయింది. నేటికి స్టేషన్ కార్యరూపం దాల్చలేదు. సర్వేలకు పరిమితమైంది. దీంతో స్టేషన్ నిర్మాణం జరుగుతుందా అనే సందేహం తీర ప్రాంత వాసుల్లో నెలకొంది.

- నరసాపురం



సముద్రంలో నిఘా పెడుతున్న పోలీసులు

నరసాపురం తీరంలో సుమారు 19 కిలో మీటర్ల మేర సముద్ర తీరం ఉంది. నిత్యం వందలాది బోట్లు తీర ప్రాంతంలో వేట సాగిస్తుంటాయి. రాష్ట్రం నుంచే కాకుండా సరిహద్దునున్న చెన్నై నుంచి కూడా ఇక్కడకు వేటాడేందుకు బోట్లు వస్తుంటాయి. కొన్ని సమయాల్లో శ్రీలంక జాలర్లు కూడా దారితప్పి వచ్చిన దాఖలాలు ఉన్నాయి. వీటిన్నింటినీ పరిగణనలోకి తీసుకుని తీర ప్రాంతంలో మెరైన్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ముందుగా వేములదీవి ప్రాంతాన్ని ఎంపిక చేశారు. అక్కడ స్టేషన్ ఏర్పాటుకు, బోట్లు రాకపోకలకు సాధ్యసాధ్యాలపై సర్వే కూడా నిర్వహించారు. ఆ తరువాత పేరుపాలెం, మోళ్ళపర్రులో కూడా సర్వేలు జరిగాయి. అనేక మార్లు రాష్ట్ర పోలీస్ ఉన్నతాధికారులు ఈ ప్రాంతాలకు విచ్చేశారు. స్టేషన్‌కు ప్రతిపాధించిన స్థలాలను పరిశీలించారు. ఒకానొక సమయంలో నిధులు కూడా కేటాయిస్తున్నట్టు వెల్లడించారు. దీంతో తీరంలో మెరైన్‌స్టేషన్ ఏర్పాటు దాదాపు ఖరారయిందని అందరూ భావించారు. ఇదే సమయంలో సరిహద్దున ఉన్న అంతర్వేది, ఇటు మచిలీపట్నంలలో స్టేషన్ల ఏర్పాటు కూడా పూర్తయింది. కానీ ఏ అడ్డంకి వచ్చిందో గాని ఇంతవరకు తీరంలో ప్రతిపాదించిన స్టేషన్ మాత్రం శంకుస్థాపనకు కూడా నోచుకోలేదు. ప్రతిపాదించిన, సర్వే చేసిన మూడు ప్రదేశాలు కేవలం అలంకరణప్రాయంగా మిగిలిపోయాయి. రాష్ట్ర విభజన తరువాత తీరాన్ని సందర్శించిన రాష్ట్ర మెరైన్ ఐజీ త్వరలో నరసాపురం ప్రాంతంలో స్టేషన్ ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. కానీ ఇది కూడా కార్యరూపం దాల్చలేదు. దీంతో తీరంలో స్టేషన్ ఏర్పాటుపై నీలినీడలు అలుముకున్నాయి. ప్రస్తుతం తూర్పు, కృష్ణాలో స్టేషన్‌లు ఏర్పాటు చేసి మధ్యన ఉన్న పశ్చిమలో స్టేషన్ లేకపోవడంతో కొత్తవారు ఆ రెండు ప్రాంతాల గుండా కాకుండా ఈ నరసాపురం మీదుగా ప్రవేశించేందుకు అవకాశాలు ఉన్నాయన్న వాదనలు పోలీస్ వర్గాల్లో వినిపిస్తున్నాయి.

ఎంఆర్ టీకా పిల్లలకు విధిగా వేయించాలి

ఎమ్మెల్యే మాధవనాయుడు

నరసాపురం టౌన్ : ఎంఆర్ టీకా 15 ఏళ్ల లోపు పిల్లలందరికీ విధిగా వేయించాలని ఎమ్మెల్యే మాధవనాయుడు అన్నారు. మంగళవారం పట్టణంలోని చినమామిడిపల్లి నిప్పులేటి హైస్కూల్లో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తట్టు, రుబెల్లా వ్యాధులు సోకకుండా ముందస్తు జాగ్రత్తగా ప్రభుత్వం స్కూల్ విద్యార్థులందరికీ వేయాలని నిర్ణయించిందన్నారు. దీనివల్ల ఎటువంటి అనర్థాలు ఉండవన్నారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ, చైర్‌పర్సన్ రత్నమాల, డాక్టర్ చినమిల్లి సత్యనారాయణ, టీడీపీ నాయకులు కొప్పాడ రవి, గుగ్గిలపు ధర్మా, రెడ్డం శ్రీను, పలువురు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

మండలంలో.. లక్ష్మణేశ్వరం, ఎల్‌బీచర్ల, తూర్పుతాళ్ళు పీహెచ్‌సీ పరిధిలలో మంగళవారం ఎంఆర్ టీకాను విద్యార్థులకు చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణేశ్వరంలో జరిగిన కార్యక్రమానికి ఎంపీపీ వాతాడి కనకరాజు ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఎంపీటీసీ దండుబోయిన రత్నప్రసాద్, టీడీపీ నాయకులు కొట్టు పండు, డాక్టర్ మహేష్ పాల్గొన్నారు.



ఎంఆర్ టీకా అందిస్తున్న ఎమ్మెల్యే మాధవనాయుడు

279 జీవో రద్దు చేయాలి

మున్సిపల్ వర్కర్ల మానవహారం



మానవహారం చేస్తున్న మున్సిపల్ వర్కర్లు

నరసాపురం టౌన్ : పురపాలక, కార్పొరేషన్లలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ సిబ్బందిని తొలగించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన 279 జీవోను తక్షణం రద్దు చేయాలంటూ మునిసిపల్ వర్కర్లు మానవహారం చేపట్టారు. మంగళవారం స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో ఏఐటీయూసీ, సీఐటీయూల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేశారు. ముందుగా శివాలయం సెంటర్ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకులు నెక్కంటి సుబ్బారావు, సీఐటీయూ నాయకులు టి. సత్యనారాయణ మాట్లాడుతూ ఈ జీవోపై గతంలో రెండుసార్లు చర్చలు జరిపిన ప్రభుత్వం మళ్లీ మొండిగా వ్యవహరించడం సరికాదన్నారు. దీనిపై రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఆందోళనలో ఏఐటీయూసీ నాయకులు ఆరేటి మృత్యుంజయరావు, నెక్కంటి క్రాంతికుమార్, సీఐటీయూ నాయకులు కవురు పెద్దిరాజు, పి. రాము, వర్కర్లు రత్తయ్య, విజయసాగర్, నిర్మలమ్మ, అమరావతి పాల్గొన్నారు.

సత్యనారాయణకు ఘన సన్మానం

నరసాపురం టౌన్ : అంకితభావంతో పని చేసే ప్రభుత్వ ఉద్యోగులను ప్రతి ఉద్యోగి ఆదర్శంగా తీసుకోవాలని వ్యవసాయశాఖ ఏడీఈ డాక్టర్ రామ్మోహన్‌రావు అన్నారు. మంగళవారం వ్యవసాయశాఖలో 39 ఏళ్ల పాటు పని చేసిన సత్యనారాయణ పదవీ విరమణ సన్మాన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. నిత్యం రైతులతో మమేకమై పని చేసిన ఘనత సత్యనారాయణకే దక్కుతుందన్నారు. ఏవో డాక్టర్ రహీమ్, ఎంపీవోలు నారాయణ, తేజ, రిష్మి, లక్ష్మి, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.



సత్యనారాయణ దంపతులను సన్మానిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

సంక్షిప్త సమాచారం..



ధర్నా చేస్తున్న 26వ వార్డు ప్రజలు

మద్యం షాపు వద్దంటూ ధర్నా

నరసాపురం టౌన్ : జన నివాసాల మధ్య మద్యం షాపులకు అనుమతివ్వొద్దంటూ మంగళవారం 26వ వార్డుకు చెందిన మహిళలు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. గతంలో ఇదే పాతకోళ్లఫారం వద్ద షాపు ఏర్పాటుకు లెసెన్స్‌దారులు ప్రయత్నించారన్నారు. ప్రజలు అడ్డుకోవడంతో ఆ ప్రతిపాదనను విరమించుకున్నారన్నారు. మళ్లీ షాపు ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నారంటూ సబ్‌కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీకి ఫిర్యాదు చేశారు. దీనిపై ఆయన ఎక్సైజ్ సీఐ గోపాలకృష్ణతో ఫోన్‌లో మాట్లాడారు. నివాసాల మధ్య షాపులకు అనుమతివ్వొదంటూ ఆదేశించారు. ఎం. కుమారి, తోట పద్మజ, కె.లక్ష్మి, వై. దుర్గ, పెద్దింట్లు, కె.పద్మ, కుమారి, ధర్మరాజు, జ్యోతి, ఇందిర, రవీంద్ర, దుర్గాశంకర్ పాల్గొన్నారు.

'వైఎన్' ప్రిన్సిపాల్‌గా డాక్టర్ కుమార్

నరసాపురం : వైఎన్ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ ఎంఆర్‌ఎస్ కుమార్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ చినమిల్లి సత్యనారాయణ ఆయనకు బాధ్యతలు అప్పగించారు. కుమార్‌ను కళాశాల ఉపాధ్యక్షుడు జీవీకే రామారావు, కోశాధికారి డాక్టర్ గోపాలకృష్ణమూర్తి, బీఈడీ కరస్పాండెంట్ పోలిశెట్టి రఘురాం, పాలకవర్గ సభ్యులు కానూరి స్వామినాయుడు, అందే సతీష్, ధవేజీ తదితరులు అభినందించారు.

450 కొత్త పింఛన్లు

నరసాపురం టౌన్ : మండలానికి కొత్తగా 450 పింఛన్లు మంజూరయినట్టు ఎంపీడీవో కన్నమనాయుడు తెలిపారు. వీటిని త్వరలో ఎమ్మెల్యే మాధవనాయుడు చేతుల మీదుగా అందిస్తామన్నారు. ఎక్కువగా లక్ష్మణేశ్వరం, కొప్పర్రు గ్రామాలకు పింఛన్లు మంజూరయ్యాయన్నారు. ఇంకా పింఛన్లు కావాలని 80 మంది వరకు దరఖాస్తు చేసుకున్నారన్నారు. వీరి దరఖాస్తులను ఆన్‌లైన్ చేశామన్నారు. త్వరలో లబ్ధిదారులకు పింఛన్లు అందిస్తామన్నారు.

డాక్టర్ సలహా



జలుబు వల్ల పిల్లల్లో చెవి ఇన్‌ఫెక్షన్ వస్తుంది

డాక్టర్ బొబ్బా కమలేష్,
ఇఎన్‌టి స్పెషలిస్ట్, పాలకొల్లు

చిన్నపిల్లలను వర్షంలో తడవకుండా చూసుకోవాలి. ఫ్రిజ్ వాటర్, కూల్ డ్రింక్‌లు, ఐస్ క్రీములు తీసుకోకుండా చూడాలి. జలుబు వల్ల చెవిలో ఇన్‌ఫెక్షన్ వచ్చే అవకాశం ఉంది. తల స్నానం తరచుగా చేయడం మానుకోవాలి. డస్ట్ ఎలర్జీ ఉన్నవారు దుమ్ము, ధూళికి దూరంగా ఉండాలి. గొంతు, ముక్కు, చెవి సంబంధిత సమస్యలు ఉంటే తక్షణమే వైద్యులను సంప్రదించాలి. సున్నితమైన గొంతు, ముక్కు, చెవులను సంరక్షించుకోవడంలో ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

● పాలకొల్లు అర్బన్

నేడు అభివృద్ధి పనులు ప్రారంభం

పాలకొల్లు రూరల్: బుధవారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహిస్తున్నట్టు బుధవారం ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది ఒక ప్రకటనలో తెలిపింది. ఆరట్లకట్లలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన, సీసీ రోడ్డు ప్రారంభోత్సవం జరుగుతుందన్నారు. అలాగే కాపవరంలో పంచాయతీ భవనాన్ని, సీసీ రోడ్డు, అండర్ డ్రైనేజీ, పైపు లైన్లు పనులు ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు, ఎమ్మెల్యే నిమ్మల, విప్ అంగర తదితరులు పాల్గొంటారన్నారు.

హలో.. ఆంధ్రజ్యోతి

మీ ప్రాంతంలో జరిగే సభలు, సమావేశాలు, సంఘటనలు, ఉత్సవాలు, స్థానిక సమస్యలపై మాకు సమాచారం ఇవ్వండి.

పాలకొల్లు	: 99854 11548
పాలకొల్లు అర్బన్	: 97053 46813
పాలకొల్లు టౌన్	: 9966374187
పాలకొల్లు రూరల్	: 92485 25459
యలమంచిలి	: 94915 55894

సినిమా గైడ్ :

పాలకొల్లు :

శ్రీ అన్నపూర్ణ	ఫిదా
శ్రీనివాస	ఏజెంట్ భైరవ
శ్రీనివాస మినీ	పటేల్ సార్
శ్రీనివాసా డిజిటల్	దండుపాళ్యం 2
రంజని	డాక్టర్ చక్రవర్తి
దాసరి మినీ	వైశాఖం
మారుతి	నిన్ను కోరి



పూలపల్లిలో శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ



దొడ్డిపట్ల జడ్పీ పాఠశాలలో విద్యార్థులకు వ్యాక్సిన్ వేస్తున్న దృశ్యం

పిల్లల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి

ఎమ్మెల్యే నిమ్మల, ఎమ్మెల్సీ అంగర

పాలకొల్లు రూరల్: పిల్లల ఆరోగ్యం పట్ల వైద్యాధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే రామానాయుడు, ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ కోరారు. మంగళవారం పూలపల్లిలో శ్రీ గౌతమి పాఠశాల వద్ద ఏర్పాటుచేసిన మిజిల్స్, రూబెల్లా వ్యాక్సిన్ శిబిరాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పిల్లలు ఆరోగ్యంగా ఉంటేనే భవిష్యత్ సమాజం ఆరోగ్యంగా ఉంటుందని అన్నారు. ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ మాట్లాడుతూ మిజిల్స్, రూబెల్లా టీకాల వల్ల పిల్లలకు రోగాలు దరిచేరకుండా రక్షణ కవచంగా ఉంటుందని అందువలన తల్లిదండ్రులు తమ పిల్లలకు ఈ టీకాలును వేయించాలని అన్నారు. ఏఎంసీ చైర్మన్ గొట్టుముక్కల గాంధీభగవాన్‌రాజు తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో సర్పంచ్ నున్నబోయిన కళాజ్యోతి, ఎంపీటీసీ గుడిసె కళావతి, డాక్టర్ వర్మ, డాక్టర్ బి సువిద్య, డాక్టర్ సుజన, గుడాల హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్ వ్యాక్సిన్ సద్వినియోగం చేసుకోవాలి

యలమంచిలి: ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎంఆర్ వ్యాక్సిన్‌ను 9 నెలలు నుంచి 15 ఏళ్ళ వయస్సు కలిగిన పిల్లలందరూ వేయించుకునేలా వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలని సర్పంచ్ రవిశంకర్ కోరారు. దొడ్డిపట్ల జడ్పీ పాఠశాలలో మంగళవారం ఎంఆర్ వ్యాక్సిన్ పంపిణీని సర్పంచ్ రవిశంకర్ ప్రారంభించారు. జడ్పీటీసీ బోణం నాని మాట్లాడుతూ ఎంఆర్ వ్యాక్సిన్‌పై సిబ్బంది ప్రజలందరికీ అవగాహన కల్పించాలని, మండలంలో నూరుశాతం వ్యాక్సిన్ వేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా 15 ఏళ్ళలోపు విద్యార్థులకు ఎంఆర్ వ్యాక్సిన్ వేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సూర్యశ్రీనివాస్, డాక్టర్ సుగుణరాజు, హెల్త్ ఎడ్యుకేటర్ టి నాగరాజు, హెచ్‌వి గంటా రత్నకుమారి, ఏఎన్ఎం వసంత, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శిరిగినీడి రాజ్యలక్ష్మి

కొబ్బరి రైతుకు బాసట 'సంకల్పం'

యలమంచిలి: కొబ్బరి రైతులకు సంకల్పం సంస్థ బాసటగా నిలుస్తోందని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు డాక్టర్ శిరిగినీడి రాజ్యలక్ష్మి అన్నారు. రాహుల్ సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని మేడపాడులో సంకల్పం కోకోనట్ పార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ సర్వసభ్య సమావేశం సంస్థ అధ్యక్షుడు జోగాడ అధ్యక్షతన జరిగింది. డాక్టర్ రాజ్యలక్ష్మి ముఖ్య అతిథిగా మాట్లాడుతూ కొబ్బరి రైతులకు తమ ఉత్పత్తులు ఏవిధంగా మార్కెటింగ్ చేసుకోవాలి అనే అంశంపై సంకల్పం సంస్థ అవగాహన కల్పిస్తోందన్నారు. ఈ సందర్భంగా సంకల్పం సంస్థలో ఉన్న 50 మంది రైతులకు వారి అవసరాలు నిమిత్తం ఒక్కొక్కరికి రూ. 5 వేలు చొప్పున రుణాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మేడపాడు చైతన్య గ్రామీణ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరావు, సంస్థ డైరెక్టర్ వల్లభు నాగలక్ష్మి, కొబ్బరి రైతులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి సింధూర పూజలు

పాలకొల్లు అర్బన్: స్థానిక కెనాల్ రోడ్డులోని దాసాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం స్వామికి ప్రత్యేక, సింధూర, తమలపాకుల పూజలు నిర్వహించారు. హనుమాన్ చాలీసా పఠనం, సుందర కాండ పఠనం గావించారు. ఈ సందర్భంగా సుమారు 500 మందికి అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ అర్చకులు మరుదూరి శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో కార్యక్రమాలను నిర్వహించారు. అదే విధంగా పంచముఖాంజనేయ స్వామి ఆలయంలోనూ, లాకుల వద్ద, రైల్వే గేటు వద్ద గల స్వామివారి ఆలయాల్లోను ప్రత్యేక పూజలు నిర్వహించారు.



విద్యార్థి నాయకులను అభినందిస్తున్న సీఐ కృష్ణకుమార్

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

పాలకొల్లు: క్రమశిక్షణతోనే ఆదర్శవంతులుగా తయారవగలరని విద్యార్థులకు పట్టణ సీఐ బి. కృష్ణకుమార్ సూచించారు. మంగళవారం స్థానిక నాగరాజుపేటలోని గురుకుల్ విద్యాలయలో ప్రిన్సిపాల్ గణేశ్వర్ మహాపాత్ర ఆధ్వర్యంలో జరిగిన విద్యార్థి నాయకుల ఎంపికలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యాలయ హెడ్ బోయ్‌గా జి. హర్షవర్ధన్, హెడ్ గర్ల్‌గా జె షైనీ ఏంజిలినా, స్పోర్ట్స్ కెప్టెన్‌గా యు. సుజయనంద్, బి లిల్లీపుష్ప, కల్చరల్ కెప్టెన్‌గా ఎస్. సన్ని, ఎం. రోమినిలకు సిఐ కృష్ణకుమార్ బ్యాడ్జీలను పెట్టి అభినందించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి సీఐ కృష్ణకుమార్‌ను ఘనంగా సత్కరించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఎవెన్యూ ఎస్. ముత్యాలరావు పాల్గొన్నారు.

మద్దాల మృతికి సంతాపం

పాలకొల్లు టౌన్: రంగస్థల నటుడు మద్దాల రామారావు మృతి పట్ల పట్టణ నటీ నట సమాఖ్య, క్షీరపురి సినీ టీవీ జూనియర్ ఆర్టిస్ట్ అసోసియేషన్ తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. జలంధర, రావణ బ్రహ్మ వంటి విభిన్న పౌరాణిక పాత్రల ద్వారా కళాభిమానుల హృదయాలను రామారావు చొరగొన్నారని వారు ప్రకటనలో తెలిపారు. సంతాపం వ్యక్తం చేసిన వారిలో వంగా నరసింహారావు, విన్నకోట, గుడాల హరిబాబు, తాళాబత్తుల వెంకటేశ్వరరావు, కస్తూరి రావు, వైవెంకట రత్నం, మానాపురం సత్యనారాయణ, గండేటి వెంకటేశ్వరరావు, మేడికొండ శ్రీనివాస్, ఎస్ భాస్కరరాజు, ఎం. అప్పలరాజు, దుర్గేష్, జి గోపి, ఓవి రావు, వెంకటేశ్ వడయార్ తదితరులు ఉన్నారు.



ఆర్థిక సాయం అందిస్తున్న మున్సిపల్ కమిషనర్

'చంద్రన్న బీమాను సద్వినియోగం చేసుకోవాలి'

పాలకొల్లు అర్బన్: సంఘ సభ్యులు ఐకమత్యంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ ఎ. రామమోహన్‌రావు అన్నారు. స్థానిక ఆర్టిస్ట్ అండ్ పెయింటర్స్ సంఘ భవనంలో మంగళవారం సంఘ అధ్యక్షుడు పి. వెంకట రెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కమిషనర్ మాట్లాడుతూ సంఘ సభ్యులు చంద్రన్న బీమా సౌకర్యం వినియోగించుకోవాలని కోరారు. ఈసందర్భంగా ఇటీవల మృతి చెందిన సంఘ సభ్యులు పిన్ని హనుమంతు, ఎన్. నాగేశ్వరరావు కుటుంబాలకు సంఘం తరపున ఆర్థిక సహాయాన్ని కమిషనర్ అందించారు. అదే విధంగా సంఘ సభ్యుల గుర్తింపు కార్డులను అందించారు.



ఉపాధ్యాయుడు చిత్తరంజన్ దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

విద్యాభివృద్ధికి చిత్తరంజన్ ఎనలేని సేవలు

పాలకొల్లు అర్బన్: స్థానిక ఎంఎంకెఎన్ఎం హైస్కూల్లో ఉపాధ్యాయునిగా పనిచేసి, పదవీ విరమణ చేసిన జి. చిత్తరంజన్ విద్యాభివృద్ధికి ఎనలేని సేవలందించారని హైస్కూల్ హెచ్ఎం ఏఎన్‌వి సత్యనారాయణ అన్నారు. హైస్కూల్లో మంగళవారం చిత్తరంజన్ అభినందన సభ హెచ్ఎం సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. చిత్తరంజన్ విద్యార్థులకు ఆర్థిక సహకారం అందించారన్నారు. ఈ సందర్భంగా చిత్తరంజన్ దంపతులను ఘనంగా సత్కరించారు.



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న జెడ్పీటీసీ విజయలక్ష్మి

రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం

పాలకొల్లు రూరల్: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి, ముఖ్యంగా రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని జడ్పీటీసీ కోడి విజయలక్ష్మి అన్నారు. మండలంలోని గవరపేటలో జడ్పీ నిధులు రూ. 3 లక్షలతో నిర్మించన్ను సీసీ రోడ్డు పనులకు ఆమె మంగళవారం శంకుస్థాపనగావించారు. కార్యక్రమంలో సర్పంచ్ యల్లపు వెంకట రమణ, ఎంపీటీసీ బుంగా మణిమంజరి, టీడీపీ మండల కమిటీ అధ్యక్షుడు కోడి విజయభాస్కర్, గ్రామ కమిటీ అధ్యక్షుడు యల్లపు సత్యనారాయణ, మాజీ సర్పంచ్ మురళీ పాల్గొన్నారు.

వాటర్ ఫిల్టర్ వితరణ

యలమంచిలి: శిరగాలపల్లి ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు పాలకొల్లుకు చెందిన రసూల్ సేవా సంస్థ అధ్యక్షుడు షేక్ రసూల్ మంగళవారం పలకలు, పుస్తకాలు, వాటర్ ఫిల్టర్ అందించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సర్పంచ్ తమ్మినీడి కుమార్ రసూల్ సేవా సంస్థ అందిస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో తమ్మినీడి సీతారామ్, హెచ్ఎం బిఎస్‌బిఎస్ శ్రీనివాస్, సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.



మల్లవరం పంచాయతీ కార్యాలయ శంకుస్థాపన శిలాఫలకం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవనాయుడు

పంచాయతీ కార్యాలయాలన్నీ ఆధునికీకరిస్తాం

నరసాపురం ఎమ్మెల్యే మాధవనాయుడు

మల్లవరం (నరసాపురం అర్బన్): నియోజకవర్గంలోని పంచాయతీ కార్యాలయాలన్నీ ఆధునికీకరిస్తామని నరసాపురం ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు తెలిపారు. మంగళవారం మల్లవరం పంచాయతీ కార్యాలయ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఉపాధి హామీ, పంచాయతీ రాజ్ నిధులైన రూ. 15 లక్షలతో నిర్మించే ఈ కార్యాలయం త్వరితగతిన నిర్మిస్తామన్నారు. నరసాపురం, మొగల్తూరు మండలాల్లో ఉన్న గ్రామాలన్నింటిలో సొంత కార్యాలయాలు లేని చోట్ల నిర్మాణాలు పూర్తి చేస్తామన్నారు. పంచాయతీ సర్పంచ్ యేలూరి ప్రసాద్, రాయుడు శ్రీరాములు, సభ్యులు రూపవతి, సరోజని, శ్రీరామ్మూర్తి, వెంకట్రావు, గూడూరి వరలక్ష్మి, ఎంపీటీసీ పులఖండం వీరవెంకట సత్యనారాయణ, సొసైటీ అధ్యక్షుడు మల్లు శ్రీనివాస్, నాయకులు కొట్టు పండు, ఎంపీటీసీలు డీవీఆర్, సీహెచ్ కనకదుర్గ. ఐఎన్‌టీయూసీ జిల్లా నేత ఆకెన సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

నేడు ఆధార్ అప్‌గ్రేడేషన్ కార్యాలయం ప్రారంభం

పాలకొల్లు అర్బన్: స్థానిక హెడ్‌పోస్టాఫీస్ కార్యాలయంలో బుధవారం ఉదయం ఆధార్ కార్డు అప్‌గ్రేడేషన్ కార్యాలయాన్ని నరసాపురం సబ్ కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ పారంభించనున్నట్టు అసిస్టెంట్ సూపరింటెంటెంట్ ఆఫ్ పోస్టల్ (ఎఎస్‌పి) ఎస్ఆర్‌కెహెచ్ ప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఆధార్ కార్డుల్లో మార్పులు, చేర్పులు చేసుకునే వారికి వీలుగా ఉంటుందని, గతంలో ప్రైవేటు ఏజన్సీలు, మీసేవా కేంద్రల్లో ఈ మార్పు, చేర్పులు జరిగేవని, అంతే కాక ఆధార్ కార్డుల్లో చేసిన మార్పులు, చేర్పులు వెనువెంటనే అప్‌గ్రేడ్ అవుతాయని తెలిపారు. సోమవారం భీమవరంలో ప్రారంభం అయ్యిందని, అదే విధంగా పాలకొల్లు, తణుకు హెడ్ పోస్టాఫీసుల్లో ప్రారంభించడం జరుగుతుందని, దశల వారీగా బ్రాంచ్ పోస్టాపీసులకు విస్తరించి, ఈ సేవలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు.

బిఎస్‌ఎన్‌ఎల్ విశేష సేవలు

పాలకొల్లు అర్బన్: బిఎస్‌ఎన్‌ఎల్ ల్యాండ్ లైన్ వినియోగదారులకు విశేష సేవలందిస్తోందని, స్థానిక ఎస్‌డీఈ డి. రవీంద్రకుమార్ తెలిపారు. ఏలూరు జీఎంటీడీ కెఎస్ వరప్రసాద్ ఈమేరకు తమకు సమాచారం అందించారని మంగళవారం ఆయన విలేకర్లకు తెలిపారు. ఈ నెల 1వ తేదీ నుంచి రూ. 160లు నెలవారి అద్దె చెల్లించే వారికి 160 ఉచిత కాల్స్ (బిఎస్‌ఎన్‌ఎల్ కుమాత్రం), రూ. 180లు చెల్లించే వినియోగదారులకు 180 ఉచిత కాల్స్ (బిఎస్‌ఎన్‌ఎల్‌కు మాత్రం), రూ. 200లు చెల్లించే వారికి 200లు ఉచిత కాల్స్ (బిఎస్‌ఎన్‌ఎల్‌కు మాత్రం), రూ. 220లు చెల్లించే వారికి 220 కాల్స్ (బిఎస్‌ఎన్‌ఎల్‌కు మాత్రం), రూ. 240లు చెల్లించే వారికి 240 కాల్స్ (బిఎస్‌ఎన్‌ఎల్‌కు మాత్రం) ఉచితంగానూ, రూ. 355లు చెల్లించే వారికి 355 ఉచిత కాల్స్ అన్నినెట్ వర్క్‌లకు, రూ. 495లు చెల్లించే వారికి 500 ఉచిత కాల్స్ అన్ని నెట్ వర్క్‌లకు వినియోగించుకునే అవకాశం కల్పిస్తున్నట్టు తెలిపారు. తమ కార్యాలయాల్లో గానీ, కస్టమర్ సర్వీస్ సెంటర్లలో సంప్రదించవచ్చునన్నారు.

పిల్లలకు ఎంఆర్ టీకా వేయించండి

వైఎస్‌పాలెం సర్పంచ్ రంగారావు

వైఎస్‌పాలెం (నరసాపురం అర్బన్): పిల్లలందరికీ ఎంఆర్ టీకా వేయించాలని సర్పంచ్ కూనపరెడ్డి రంగారావు అన్నారు. మంగళవారం ఎర్రంశెట్టివారి పాలెం జడ్పీ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో ఎంఆర్ టీకా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. 9 నెలల నుంచి 15 ఏళ్ల లోపు పిల్లలందరికీ ఈ టీకా తప్పనిసరిగా వేయించాలన్నారు. రానున్న కాలంలో ఎటువంటి వ్యాధులు రాకుండా తోడ్పడతాయన్నారు. మంగళవారం 187 మందికి టీకాలు చేశారు. ఏఎన్‌ఎం చంద్రకుమారి, హెచ్‌ఎం అంజూరి సత్యనారాయణ, టీచర్లు తాళ్లూరి శ్రీనివాస్, ఆంధ్రేయ పాల్గొన్నారు.

పేదవాడిని లక్షలకు అధిపతిని చేస్తున్నాం

ఎమ్మెల్యే నిమ్మల

పాలకొల్లు టౌన్: పేదవాడికి ఎటువంటి శ్రమ లేకుండా లక్షలకు అధిపతిని చేస్తున్నామని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యే రామానాయుడు అన్నారు. మంగళవారం స్థానిక మన్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ. 500లు చెల్లిస్తే 300 చదరపు అడుగుల ఇంటితో ప్రతి పేదవాడిని సుమారు రూ. 10లక్షలకు యజమానిగా చేస్తున్నామన్నారు. రూ. 584 కోట్ల ప్రాజెక్టుతో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా టిడ్కో ఆధ్వర్యంలో 5179 ఇళ్లను ఎల్అండ్‌టి సంస్థ కేవలం 15 నెలల్లో నిర్మిస్తుందని తెలిపారు. లబ్ధిదారులకు బాసటగా ఉండేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి 215 కోట్లు సబ్సిడీగా చెల్లిస్తుందన్నారు. మిగిలిన మొత్తాన్ని బ్యాంక్ రుణాలు ద్వారా చెల్లించుకునే విధంగా లబ్ధిదారులకు అవకాశం లభిస్తుందన్నారు. ఈ విధానంలో ప్రైవేట్ వ్యక్తులు నిర్మాణం చేయలేరని, ప్రభుత్వం ఎల్ అండ్ టి సంస్థ ద్వారా ప్రత్యేక టెక్నాలజీతో ఇళ్లను నిర్మిస్తుందని, రోడ్లు, డ్రైయినేజీ, పార్కు, దేవాలయాలు, లైబ్రరీలు, పాఠశాలలు, ఆసుపత్రి, తాగునీరు, విద్యుత్ వంటి సదుపాయాలతోపాటు మురుగునీరు శుద్ధిచేసే ప్లాంట్‌లను ఏర్పాటు చేస్తుందన్నారు. ఇంతటి అభివృద్ధిని జీర్ణించుకోలేని వైసీపీ అసత్య ప్రచారాలకు దిగుతోందన్నారు. గతంలో రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ప్రక్కన రాజీవ్ స్వగృహ పేరుతో శిలాఫలకాన్ని ఆవిష్కరించి ఒక్కొక్కరినుంచి రూ. 3వేలు చొప్పున అధికారికంగా కట్టించుకున్నారని సొమ్ము చెల్లించిన వారికి ఇళ్లు ఇవ్వకపోగా వారి సొమ్ము కూడా తిరిగి ఇవ్వలేదన్నారు. రామయ్య హాలు వద్ద జి ప్లస్ వన్ విధానంలో ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చారని వారికి రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలకు ఇప్పటికీ దిక్కులేదన్నారు.

రామయ్య హాలు ప్రాంతం రూరల్ పంచాయతీ ఏరియాలో ఉన్నందున ఆ ప్రాంతాన్ని పట్టణంలో కలిపేందుకు సన్నాహాలు పూర్తి అయ్యాయని, త్వరలోనే వారికి కూడా మౌలిక సదుపాయాలు పురపాలక సంఘం నుంచే కల్పిస్తామని తెలిపారు. ప్రతి మంగళవారం నిర్వహించే పట్టణ అభివృద్ధి పనుల పరిశీలనలో భాగంగా రూ. 2.4 కోట్లతో నిర్మించిన అంబేద్కర్ భవనాన్ని, రూ. 6 కోట్లుతో నిర్మిస్తున్న ఓపెన్ ఎయిర్ థియేటర్ స్థానంలోని ఎన్టీఆర్ కళాక్షేత్రం, రూ. 7 కోట్లుతో నిర్మిస్తున్న రామగుండం, శంభునిచెరువు



మున్సిపల్ కార్యాలయంలో ఎన్టీఆర్ కాలనీ లబ్ధిదారులు కడుతున్న డిడిలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నిమ్మల

పార్కులను, రూ. 10 కోట్లుతో మున్సిపల్ అతిథి గృహాన్ని, హిందూ శ్మశాన వాటిక అభివృద్ధి పనులను పరిశీలించామన్నారు. 2018 జనవరి నాటికి పూర్తిచేయా లని ఆదేశించామన్నారు. తొలుత మున్సిపల్ కార్యా లయంలో అందరికి ఇళ్ళు పథకంలో లబ్దిదారులు చెల్లి స్తున్న డీడీలు, పత్రాలను పరిశీలించారు. ఈ సమా వేశంలో మున్సిపల్ చైర్మన్ వల్లభు నారాయణమూర్తి, టీడీపీ పట్టణ కార్యదర్శి గండేటి వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు పెచ్చెట్టి బాబు, ధనాని సూర్యప్రకాష్, టీడీపీ నాయకులు పొట్నూరి అప్పన్న, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసి సమయపాలన పాటించకుంటే ఊరుకోం..

దొడ్డిపట్లలో విద్యార్థులు ధర్నా

2 గంటలు పాటు బస్సుల నిలిపివేత

ఎస్సై జోక్యంతో ధర్నా విరమణ

యలమంచిలి: దొడ్డిపట్ల నుంచి పాలకొల్లుకు వచ్చే ఆర్టీసి బస్సులు సమయపాలన లేకుండా తిప్పడంతో తమ హాజరు నష్టపోతున్నామని, ఎక్కువ సమయం బస్సుల కోసమ నిరీక్షించాల్సి వస్తుందని ఆర్టీసి సమయపాలన పాటించకపోతే ఊరుకోబోమని మంగళవారం సుమారు 2 గంటల పాటు విద్యార్థులు ధర్నా నిర్వహించారు. గతంలో రెండుసార్లు సంబంధిత డిపో మేనేజర్‌కు లిఖిత పూర్వకంగా ఇచ్చినా చర్యలు తీసుకోలేదని విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సంఘటనతో ఎస్సై పి అప్పారావు జోక్యం చేసుకుని సంబంధిత నరసాపురం డిపోమేనేజర్ మూర్తితో



విద్యార్థులతో చర్చిస్తున్న ఎస్సై అప్పారావు

ఫోన్‌లో విషయాన్ని తెలియజేశారు. విద్యార్థులు సమయానికి విద్యాసంస్థలకు చేరుకునేలా ఆర్టీసి సర్వీసులు త్రిప్పుతామని, ఆర్టీసి కంట్రోలర్‌కు ఆదేశాలు జారీ చేస్తామని చెప్పడంతో విద్యార్థులు ధర్నాను విరమించారు.

జివో 279ని రద్దుచేయాలి

పారిశుద్ధ్య కార్మికుల ర్యాలీ, మానవహారం

పాలకొల్లు అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మున్సిపల్ పారిశుధ్య కార్మికుల హక్కులను పరిరక్షించాలని కోరుతూ ఏఐటీయూసీ, సీఐటీయు (జెఏసి) ఆధ్వర్యంలో మంగళవారం పారిశుధ్య కార్మికులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక గాంధీ బొమ్మల సెంటర్‌లో మానవ హారం నిర్మించారు. ఏఐటీయూసీ నాయకుడు నెక్కంటి సుబ్బారావు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల హక్కులకు భంగం కలిగించే జివో 279ని రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ నాయకులు వంగా జయ సూర్యనారాయణ, ధనాల శ్రీనివాస్, సీఐటీయూ నాయకులు జవ్వాది శ్రీనివాసరావు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



రూ. 1.85 కోట్లుతో అభివృద్ధి పనులు

ఎమ్మెల్యే నిమ్మల

యలమంచిలి: రూ.1.85 కోట్లు నిధులతో మండలం లో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని ఎమ్మెల్యే డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. మండలంలోని మేడపాడు సాకావారిపేట, కలెక్టర్‌వారిపేట, కట్టుపాలెం, నారిన మెరక, అబ్బిరాజుపాలెం, పేములపేట, దొడ్డిపట్ల, బూరుగుపల్లి గ్రామాల్లో నిర్మించనున్న సీసీ రోడ్లుకు ఎమ్మెల్యే డాక్టర్ నిమ్మల మంగళవారం శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వాడవాడలా చంద్రన్న రోడ్లు ఉండాలనే లక్ష్యంతో సిఎం చంద్రబాబు ఉన్నారన్నారు. అదేవిధంగా రైతులు పండించిన పంటలను తెచ్చుకునేందుకు వీలుగా పుంత రోడ్లను నిర్మిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బొప్పన సుజాత, జడ్పీటీసీ బోణం నాని, సర్పంచ్‌లు కుక్కల ధనరత్నకుమారి, చేగొండి రవిశంకర్, షేక్ మీరాసాహెబ్, బుంగా వెంకట్రావు, గోనమండ బాబురావు, వలవల బాబి, ఆంజనేయులు, యర్రంశెట్టి కృష్ణ, చేగొండి సూర్యశ్రీనివాస్, సోమిశెట్టి వరప్రసాద్, పీతల శ్రీనివాస్, మాతా రత్నంరాజు, బొప్పన కిషోర్, ఇంకా పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పలువురు అధికారులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న కాపు నాయకులు

కాపులను అణగదొక్కేస్తున్నారు..

పాలకొల్లు టౌన్: రిజర్వేషన్ కోరుతూ పాదయాత్ర చేయాల్సిన ముద్రగడను, తన నిరాహార దీక్షను భగ్నంచేసి కాపులను అణగదొక్కేస్తున్నారని జిల్లా కాపు సంఘ అధ్యక్షుడు చినిమిల్లి వెంకట్రాయుడు అన్నారు. మంగళవారం స్థానిక శ్రీరామ్ విశ్రాంతి గృహంలో స్థానిక కాపు నాయకులతో వెంకట్రాయుడు భేటీ అయ్యారు. తొలుత రాష్ట్ర కాపు ఉద్యమ నాయకుడు ముచ్చర్ల శ్రీరామ్ ఆధ్వర్యంలో కాపు నాయకులు రోడ్డుపై బైఠాయించి ఖాళీ పళ్లాలుపై గరిటెలతో శబ్దం చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. నియోజకవర్గ కాపు ఉద్యమ నాయకుడు వంగా నరసింహారావు, జక్కంపూడి కుమార్, అనిశెట్టి సుబ్బరాజు, ముద్దాల శ్రీను, వాస్కూరి మంజునాథ, చుండూరి రంగయ్యనాయుడు, కర్రా శ్రీనివాస్, పెట్టా త్రిమూర్తులు, నార్ని ఆంజనేయులు, మారెళ్ళ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

వైరస్‌తో మొరాయిస్తున్న బీఎస్ఎన్ఎల్ మోడెమ్‌లు

పాలకొల్లు అర్బన్: బీఎస్ఎన్ఎల్ సంస్థ ద్వారా నెట్‌వర్క్ కనెక్షన్ పొందిన వినియోగదారులు గత 4 రోజులుగా ఇబ్బం దులు పడుతున్నారు. పాలకొల్లు బీఎస్ఎన్ ఎల్ సంస్థ పరిధిలో సుమారుగా 1300 నెట్ కనెక్షన్లు ఉన్నాయి. అయితే వీటిలో సుమా రుగా 1100 వందలు నెట్ కనెక్షన్ ఉన్న వినియోగదారులు గత 4 రోజుల నుంచి వైరస్ ప్రభావంతో నెట్ పనిచేయక వ్యాపార లావాదేవీలు నిలిచి పోయాయి. మీ మోడెమ్ తీసుకువస్తే కొత్త సాఫ్ట్‌వేర్ అప్‌లోడ్ చేస్తామని చెప్పడంతో పెద్ద ఎత్తున వినియోగదారులు బీఎస్ఎన్ఎల్ కార్యాలయానికి చేరుకున్నారు.

అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తి అరెస్టు

టి.నర్సాపురం : టి.నర్సాపురం మెయిన్ సెంటర్‌లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తిని సోమవారం రాత్రి అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ కె. నాగేంద్రప్రసాద్ విలేకరులకు తెలిపారు. టి.నర్సాపురం మెయిన్ సెంటర్‌లో సోమవారం రాత్రి గస్తీ తిరుగుతుండగా లింగపాలెం మండలం కలరాయినిగూడెం గ్రామానికి చెందిన షేక్ ఇబ్రహీం అనుమానాస్పదంగా సంచరిస్తూ పోలీసులను చూసి పారిపోతుండగా పట్టుకుని తనిఖీ చేయగా అతని వద్ద నేరం చేయడానికి ఉపయోగించే వస్తువులు ఉండటంతో అరెస్టు చేశామని ఎస్.ఐ తెలిపారు.

డాక్టర్ సలహా



రుబెల్లా టీకాను ప్రతీ చిన్నారికి వేయించాలి

సుధాకర్, వైద్యాధికారి, పోలవరం

ప్రతీ చిన్నారికి రుబెల్లా టీకాను తప్పనిసరిగా వేయించి వారి భవిష్యత్‌ను ఆరోగ్యకరంగా తీర్చిదిద్దాలి. ప్రభుత్వం సరఫరా చేస్తున్న వ్యాక్సిన్‌ను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలి. వర్షాకాలం కావడంతో అంటువ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. గోదావరి వరదలు, కొండవాగుల కారణంగా తాగు నీరు కలుషితమవుతోంది. ప్రతీ ఒక్కరూ నీటిని కాచి వడపోసి తాగాలి. గృహాల చుట్టూ మురుగు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి.

● పోలవరం

ఉపాధి పనులతో మైదానాలు చిత్తు

● పనులపై కొరవడిన అధికారుల పర్యవేక్షణ
● గోతులమయంగా క్రీడా మైదానాలు



జీలుగుమిల్లి ఉన్నత పాఠశాలలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

జీలుగుమిల్లి : మండలంలో పలు ఉన్నత పాఠశాలల్లో ఇటీవల చేపట్టిన ఉపాధి పనులు పర్యవేక్షణ లేక పక్కదోవ పడుతున్నాయి. పాఠశాలల్లో ఉపాధి పనుల ద్వారా కబడ్డీ, కోకో, వాకింగ్ ట్రాక్‌ల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కాంట్రాక్టర్ల ద్వారా ఆయాకోర్టులలో సిమెంట్ పోల్స్ ఏర్పాటు, ఇసుకను వేయటం, గ్రౌండ్ అందంగా కన్పించేలా పాఠశాల ఆవరణలో వాకింగ్ ట్రాక్‌లను ఏర్పాటు వంటి పనులు జరగాల్సి ఉంది. అయితే క్షేత్ర స్థాయిలో పనులు సక్రమంగా చేయకపోవడంతో ఉపాధి కూలీలు తీసిన గోతుల్లో వర్షం నీరు చేరుతోంది. దీంతో విద్యార్థులకు క్రీడా మైదానాలు అసౌకర్యంగా మారాయి. గోతులు తీసి వదిలేసిన విషయంపై ములగలంపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వ్యతిరేకత రావడంతో గోతుల్ని పూడ్చారు. జీలుగుమిల్లి దర్భగూడెం, కామయ్యపాలెం ఉన్నత పాఠశాలల్లో సైతం ఇదే తరహాలో పనులు జరగటంతో పాఠశాలల యాజమాన్యంతోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. క్రీడా మైదానాల్ని ఉపాధి పనులు పేరుతో నిరుపయోగంగా మారుస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై ఏపీవో వై.శ్రీనివాసరావును వివరణ కోరగా పలు పాఠశాలల్లో క్రీడా మైదానాల్ని అందంగా తీర్చిదిద్దే బాధ్యత కాంట్రాక్టర్లదేనని, త్వరలో కోర్టుల నిర్మాణ పనులు పూర్తవుతాయని అన్నారు.



ములగలంపల్లి పాఠశాల ఆవరణలో ఉపాధి పనులు చేసిన చోట నిలిచిన వర్షం నీరు

ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్

జీలుగుమిల్లి : మండల కేంద్రంలో ఆటో డ్రైవర్లకు మంగళవారం ఎస్సై పి.చెన్నారావు కౌన్సిలింగ్ నిర్వహించారు. జీలుగుమిల్లి నాలుగు రోడ్ల ప్రధాన కూడలిలో ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగకుండా ఆటోలను ఉంచాలని, రోడ్డు నిబంధనల్ని పాటించాలని అన్నారు. ప్రతీ ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, మద్యం తాగి ఆటోలను నడపరాదని అన్నారు. యూనియన్ల పేరుతో గొడవలు సృష్టిస్తే చర్యలు తప్పవన్నారు. కౌన్సెలింగ్‌లో ఆటో యూనియన్ నాయకులు దేవుడు శ్రీను, జంగిలి సురేష్ 20మంది సభ్యులు పాల్గొన్నారు.

ఎం.ఆర్ వ్యాక్సిన్‌తోనే వ్యాధి నిరోధకశక్తి పెరుగుదల

జీలుగుమిల్లి : ఒకటో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు మీజిల్స్, రూబెల్లా వ్యాధి నివారణకు సోమవారం టీకాలు వేసే కార్యక్రమాన్ని జీలుగుమిల్లి ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రారంభించారు. జీలుగుమిల్లి ఎహెచ్‌సీ వైద్యాధికారి కె.ప్రియదర్శిని వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. తొమ్మిది నెలల నుంచి 15 సంవత్సరాల పిల్లలకు టీకా వేయించడం ద్వారా రెండు వ్యాధులను నయం చేయవచ్చన్నారు. జడ్పీటీసీ బి.రాజబాబు ఆధ్వర్యంలో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించి, ర్యాలీ నిర్వహించారు. దర్భగూడెం ఆర్‌సీఎం ఉన్నత పాఠశాల, ఎస్టీస్ ఫీటర్ ఆంగ్ల బోధన పాఠశాల, వంకవారిగూడెం వాల్మీకి విజ్ఞాన కేంద్రం, చీమలవారిగూడెం, పి.రాజవరం పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాక్సినేషన్ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో సత్యం నాయుడు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సరియం రామారావు, పీహెచ్‌ఎన్ సంజీవరాణి, సూపర్‌వైజర్ల ధీనకుమారి, హేమలత, హెచ్‌ఎస్ స్వామి, హెల్త్ అసిస్టెంట్ కె.ప్రసాద్, యు.రవీంద్ర, ఏఎన్‌ఎంలు సీత, సుబ్బలక్ష్మి, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కొయ్యలగూడెంలో...

కొయ్యలగూడెం : మీజిల్స్, రూబెల్లా టీకాలను మండలంలోని అన్ని పాఠశాలల్లో మంగళవారం ప్రారంభించారు. మండలంలో 14,664 మంది పిల్లలకు టీకాలు వేయాల్సి ఉంది. టీకాలు వేయడానికి ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేశారు. ఆరోగ్య, అంగన్‌వాడీ, రెవెన్యూ, పంచాయతీ శాఖల సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సిద్ధార్థ పాఠశాల ప్రిన్సిపాల్ ఐ. రాజ్‌కుమార్ పిల్లల తల్లిదండ్రులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేసి టీకా యొక్క ఆవశ్యకతను వివరించారు. పిల్లలకు తరుచుగా వచ్చే ఎన్నో వ్యాదులు ఎం.ఆర్ టీకా ద్వారా నిర్మూలించవచ్చని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు తప్పనిసరిగా టీకాను వేయించాలని ఆయన కోరారు. ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో ప్రత్యేక ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో డా. సుందర్‌కుమార్, డా.సౌజన్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



జీలుగుమిల్లిలో విద్యార్థులకు టీకాలు వేస్తున్న వైద్యాధికారిణి ప్రియదర్శిని

మండలానికి 125 పెన్షన్లు మంజూరు

బుట్టాయగూడెం : బుట్టాయగూడెం మండలానికి అదనంగా 125 కొత్త ఫించన్లు మంజూరయ్యాయని ఇన్‌ఛార్జి ఎంపీడీవో కిరణ్‌కుమార్ తెలిపారు. వీటిలో దివ్యాంగులు 12, వృద్ధులకు 25, వితంతువులు 88 ఉన్నాయన్నారు. ఇప్పటివరకు 4341 మందికి ఫించన్లు ఇస్తుండగా కొత్తవారితో కలిపి లబ్ధిదారుల సంఖ్య 4466కు చేరుకుందన్నారు.

ఉద్యోగుల జాబితా సిద్ధం

బుట్టాయగూడెం : ఏజెన్సీ ఐదు మండలాల్లో వైద్య, ఆరోగ్యశాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు అన్ని ప్రక్రియలను పూర్తిచేసి ఫైల్‌ను ఐటీడీఏ పీవో షణ్మోహన్‌కు పంపడానికి సిద్ధం చేశారు. మంగళవారం ఇంటర్వ్యూలకు హాజరైన అభ్యర్థుల సర్టిఫికెట్లను ఇన్‌ఛార్జి డీఎంవో డాక్టరు వంశీలాల్‌రాథోడ్ పరిశీలన చేశారు. అభ్యర్థుల మార్కుల ఆధారంగా మెరిట్‌ను సిద్ధం చేశారు. ఏఎన్‌ఎం-1 పోస్టులు ఆరు ఉండగా 206 మంది దరఖాస్తు చేశారు. ఫార్మాసిస్టు పోస్టులు 39, స్టాఫ్‌నర్స్ పోస్టులు ఆరు ఉండగా 188 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరందరి సర్టిఫికెట్లను పరిశీలించి మెరిట్ ప్రాతిపదికన ఉద్యోగాలు ఇస్తామని, మెరిట్ అభ్యర్థుల జాబితాపై పీవో సంతకం చేయాల్సి ఉందని వంశీలాల్‌రాథోడ్ అన్నారు.

వృద్ధురాలిని గాయపరిచిన వ్యక్తిపై కేసు

జీలుగుమిల్లి : ములగలంపల్లిలో కంచె సంబంధించిన తగువులో ఓ వృద్ధురాలని గాయపరిచిన వ్యక్తిపై మంగళవారం ఎస్సై పి.చెన్నారావు కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన తోట నారాయణమ్మ తన ఇంటి చుట్టూ ఉన్న కంచె పడిపోవడంతో సరిచేస్తుండగా పక్కింటికి చెందిన తోట రామాజంనేయులు వచ్చి గొడవపడ్డాడు. నారాయణమ్మను కొట్టి గాయపరిచాడు. స్థానికులు ఆమెను ఆస్పత్రికి తరలించారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

హలో 'ఆంధ్రజ్యోతి'

మీ ప్రాంతంలో జరిగే సభలు, సమావేశాలు, సంఘటనలు, ఉత్సవాలు, స్థానిక సమస్యలపై మాకు సమాచారం ఇవ్వండి.

బుట్టాయగూడెం	: 9948177877
టి నర్సాపురం	: 9912690499
కొయ్యలగూడెం	: 9948997745
జీలుగుమిల్లి	: 8985603329
పోలవరం	: 9491714898



నిర్వాసితులకు చెక్కులు అందజేస్తున్న హౌసింగ్ అధికారులు

నిర్వాసితులకు చెక్కులు అందజేత

పోలవరం : రామయ్యపేటలోని నిర్వాసితులు సొంతంగా గృహాలు నిర్మించుకు నేందుకు గృహ నిర్మాణ శాఖాధికారులు చెక్కులు అందజేశారు. పోలవరం ప్రాజెక్టులో ముందుగా ముంపుకు గురైన రామయ్యపేట నిర్వాసితులను తరలించి పునరావాస గ్రామంలో గృహాలు నిర్మించారు. గ్రామంలో 24 మందికి ఒక్కొక్కరికి రూ. 3.15 లక్షల చొప్పున చెక్కులను అందజేశారు. గతంలో వీరికి గృహాలు నిర్మించడానికి స్థలం అనుకూలంగా లేని కారణంగా నిర్మించలేదు. ప్రస్తుతం వారే సొంతంగా నిర్మించుకునే విధంగా ఒక్కొక్క గృహానికి రూ.3.15 లక్షల చొప్పున చెక్కులను హౌసింగ్ డీఈ బీవీ రమణ అందజేశారు.



రోడ్లపై సంచరిస్తున్న కుక్కలు గుంపు

కుక్కలు బాబోయ్...కుక్కలు

జీలుగుమిల్లి: జీలుగుమిల్లిలో కుక్కల బెడదతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. గ్రామంలో పలు వీధుల్లో సంచరిస్తున్న ఊర కుక్కలు గ్రామస్థులపై దాడి చేసి గాయాలపాలు చేస్తున్నాయి. ఇటీవల జీలుగుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అధిక శాతం రోగులకు కుక్కకాటుకు సంబంధించిన ఇంజక్షన్లు చేశామని ఆస్పత్రి సిబ్బంది చెబుతున్నారు. పంచాయతీలో రామన్నపాలెం, చిర్రవారిగూడెం గ్రామాల్లో సైతం కుక్కల్ని నిర్మూలించాలని ప్రజలు కోరుతున్నారు. జీలుగుమిల్లిలో ఇటీవల కుక్కల స్వైర విహారం అధికం కావటంతో గ్రామంలో సంచరిస్తూ చిన్న చిన్న వ్యాపారస్తులు సాగిస్తున్నవారు వీటి బారిన పడి గాయాలపాలవుతున్నారు.



రిలే దీక్షలో పాల్గొన్న కాపు నాయకులు

కొనసాగుతున్న రిలే దీక్షలు

పోలవరం : కాపు నాయకుడు ముద్రగడ పద్మనాభానికి మద్దతుగా పోలవరంలో రిలే దీక్షలు కొనసాగుతున్నాయి. మూడు రోజులుగా పోలవరంలో కాపు నాయకులు రిలే దీక్షలు చేస్తున్నారు. మంగళవారం పలువురు కాపు నాయకులు ఉదయమే రిలే దీక్షలో పాల్గొనగా వారికి గ్రామస్థులు మద్దతు తెలియజేశారు. సాయంత్రం కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నమిల్లి వెంకటరాయుడు, మారిశెట్టి వెంకటేశ్వరరావు వచ్చి రిలే దీక్షలో పాల్గొన్న వారికి మద్దతు తెలిపారు.

సినిమా గైడ్

పోలవరం :

గంగాభవాని	శమంతకమణి

కొయ్యలగూడెం :

మహాలక్ష్మి	డీజే
రామదుర్గ	మన్యం సూర్యుడు

డాక్టర్ వాయిస్



ఆన్‌లైన్ చేయించుకోండి..

డాక్టర్ సుంకవల్లి రామకృష్ణ, ఏఆర్‌టీ వైద్యుడు, తణుకు

ఏఆర్‌టీ సెంటర్ ద్వారా మందులు తీసుకునే పేషెంట్లు తక్షణమే బ్యాంక్ ఆధార్ జిరాక్సుతో రావాలి. సంబంధిత జిరాక్సులతో ఆన్‌లైన్ చేయాల్సి ఉంది. వీరికి ప్రభుత్వం పింఛన్‌లు అందించే అ వకాశం ఉంది. ఇప్పటి వరకు 1800 మందికి గాను 500 మందికి మాత్ర మే ఆన్‌లైన్ చేయడం జరిగింది. కాబట్టి ఎవరైతే ఆన్‌లైన్ చేయించు కోలేదో వారందరూ వెంటనే తమ ఆధార్, బ్యాంక్‌ఖాతా జిరాక్సులతో ఏఆర్‌టీ కార్యాలయానికి వచ్చి ఆన్‌లైన్ చేయడానికి వీలుగా ఇవ్వాలి.

● తణుకు

గ్యాస్ సమాచారం

■ సుబ్బారావు అండ్ కో హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీలో ఈ నెల 28,29 తేదీల్లో గ్యాస్ నమోదు చేసుకున్న వారికి ఈ నెల 2న డెలివరీ ఇస్తారు.. ఫోన్ః 222144, 222534

■దుర్గా ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీలో ఈ నెల 28,29 తేదీల్లో బుక్ చేసిన వారికి ఈ నెల 2న డెలివరీ ఇస్తారు. ఫోన్ : 224330

■ సందీప్ ఇండేన్ గ్యాస్ ఏజెన్సీలో ఈ నెల 27,28 తేదీల్లో గ్యాస్ నమోదు చేసుకున్న వారికి ఈ నెల 2న డెలివరీ ఇస్తారు. ఫోన్ : 229776. - తణుకు రూరల్

హలో.. ఆంధ్రజ్యోతి

మీ ప్రాంతంలో జరిగే సభలు, సమావేశాలు, సంఘటనలు, ఉత్సవాలు, సమస్యలపై మాకు సమాచారం ఇవ్వండి.

తణుకు	:	9985411556
తణుకు టౌన్	:	9652889592
తణుకు అర్బన్	:	9966228918
తణుకు రూరల్	:	9666662909
అత్తిలి	:	9848964821
ఇరగవరం	:	9652889592

సినిమా గైడ్

తణుకు :

లక్ష్మి	నిన్ను కోరి
మినీ లక్ష్మి	దండుపాళ్యం -2
నరేంద్ర	పటేల్ ఎస్ఐఆర్
మినీ నరేంద్ర	మాయామహల్
శ్రీచిత్ర	వైశాఖం
వెంకటేశ్వర	డీజే..దువ్వాడ జగన్నాథమ్
ప్రత్యూష	శమంతకమణి
ప్రత్యూష మినీ	ఫిదా

అత్తిలి :

వెంకట్రామ	శమంతకమణి
కనకదుర్గ	నిన్ను కోరి

465 రిజిస్ట్రేషన్లు

7 రోజుల్లో రికార్డు - భారీగా ఆదాయం



తణుకు : భూముల కొనుగోలుదారులు ఉరుకులు.. పరుగులు పెట్టారు. ప్రభుత్వం భూముల ధరలు పెంచడంతో జూలై నెల చివరి వారంలో భారీగా రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఒక్క తణుకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోనే పెద్ద ఎత్తున రిజిస్ట్రేషన్లు జరిగాయి. ధరలు పెరుగుతున్నాయనే ఉద్దేశంతో ఎవరికి వారు తమ లావాదేవీలు ముగించారు. గడచిన వారం రోజుల నుంచి చూస్తే 465 రిజిస్ట్రేషన్లు జరిగినట్టు సమాచారం. సుమారు కోటి రూపాయలు వరకు ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చారు. గత నెల 25వ తేదీ నుంచి 31వ తేదీ వరకు భారీగా రిజిస్ట్రేషన్లు జరిగాయి. 31వ తేదీ ఒక్కరోజులోనే 101 వరకు రిజిస్ట్రేషన్లు జరిగినట్టు సమాచారం. నోట్ల రద్దు తరువాత నెలకు 600 రిజిస్ట్రేషన్లు చేయడానికి పెద్ద గగనంగా ఉండేది. ఒక వేళ రిజిస్ట్రేషన్లు జరిగినా ప్రభుత్వానికి ఆదాయం అంతంతమాత్రంగానే ఉండేది. ఎందుకంటే ఎక్కువగా మార్ట్ గేజ్, చెల్లు రశీదులు , గిఫ్ట్‌డీడ్‌లు, సేల్ డీడ్‌లు వంటివి మాత్రమే జరిగేవి. దీని వల్ల ప్రభుత్వానికి స్వల్ప మొత్తంలోనే ఆదాయం వచ్చేది. కాని ధరలు పెరుగుతున్న నేపథ్యంలో రిజిస్ట్రేషన్‌దారులతో కార్యాలయం కిటకిటలాడింది. ఆ వారం రోజులు 60పైనే రిజిస్ట్రేషన్లు జరిగాయి. 25వ తేదీన 61, 26వ తేదీన 83, 27వ తేదీన 69, 28వ తేదీన 48, 29 తేదీన 73, 31వ తేదీన 101 చొప్పున మొత్తం కలిపి 465 రిజిస్ట్రేషన్లు వరకు జరిగాయి.

ఆదాయం బాగా వచ్చింది

ఒకటవ తేదీ నుంచి ధరలు పెరుగుతున్నాయని ఏకైక కారణంతో ఈ నెల 31వ తేదీన 101 లావాదేవీలు వరకు జరిగాయి. వారం రోజుల్లో కోటి రూపాయలు వరకు ప్రభుత్వానికి ఆదాయం సమకూరింది. నెల రోజుల్లో కూడా కనీసం 20 లక్షలు రూపాయలు కూడా ఆదాయం వచ్చిన సందర్భాలు లేవు.

- ఎ. వెంకటేశ్వరరావు, ఎస్ఆర్‌వో , తణుకు

ఎంఆర్ వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించాలి

మాజీ ఎమ్మెల్యే వైటీ రాజా

తణుకు : చిన్నారులకు ఎంఆర్ వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించాలని మాజీ ఎమ్మెల్యే వైటీ రాజా అన్నారు. స్థానిక నందమూరి తారక రామారావు ప్రాథమికోన్నత పాఠశాలలో తట్టు(మీజిల్స్), రూబెల్లా టీకాలు వేశారు. దీనిలో భాగంగా టీకా కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. పట్టణ పరిధిలో 21,501 మంది ఎంఆర్ టీకాలు వేయించుకోవాలని సర్వే ద్వారా నివేదికలు ఉన్నాయన్నారు. మునిసిపల్ ఛైర్మన్ పరిమి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సెప్టెంబర్ 8వ తేదీ వరకు 125 టీమ్‌లు ఉచితంగా వేస్తాయన్నారు. మాజీ ఛైర్మన్ దొమ్మేటి వెంకట సుధాకర్ మాట్లాడుతూ మీజిల్స్ ఇది ప్రాణాంతక వ్యాధి అని చిన్నారులు, న్యుమోనియా, విరేచనాలు, మెదడు వాపు వ్యాధికి గురికాకుండా టీకా వేయించుకోవాలన్నారు. రూబెల్లాతో పుట్టబోయే బిడ్డకు కంటిలోపం, వినికిడి లోపం, మెదడు, గుండె సంబంధిత లోపాలు ఉంటాయన్నారు.261 మందికి మంగళవారం టీకాలు వేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలగర వెంకట కృష్ణ, వైస్ ఛైర్మన్ మంత్రిరావు వెంకట రత్నం, కమిషనర్ జి. సాంబశివరావు, కౌన్సిలర్లు ఎలుబూడి ఈశ్వరరావు, తణుకు రేవతి, నాయుడు లావణ్య, తమరాపు రమణమ్మ, గంటి విజయ, తాతపూడి మారుతీరావు, సూరపల్లి శ్రీనివాస్, కంటిపూడి రాంబాబు, డాక్టర్ సుంకర రామకృష్ణ, డాక్టర్ బి.దుర్గ, డాక్టర్ చాముండేశ్వరి, ఫీల్డ్ మేనేజర్ సీహెచ్ శ్రీనివాసరావు, శానిటరీ ఇనస్పెక్టర్లు ఉమా మహేశ్వరి, ఎస్.గోవిందయ్య, మెటర్నటీ అసిస్టెంట్లు ఎం.సామ్రాజ్యం,పుష్పరాగం పాల్గొన్నారు.



ఎంఆర్ టీకా వేస్తున్న మునిసిపల్ మాజీ ఛైర్మన్ సుధాకర్ చిత్రంలో వైటీఆర్, పరిమి వెంకన్న బాబు తదితరులు



పారిశుధ్యంపై అవగాహన కల్పిస్తున్న కమిషనర్ సాంబశివరావు

పారిశుధ్యం మెరుగుపర్చండి : కమిషనర్

తణుకు: ప్రజలకు ఇబ్బంది లేకుండా పనిచేయాలని మునిసిపల్ కమిషనర్ జి.సాంబశివరావు అన్నారు.తణుకులో పలు వార్డుల్లో జరుగుతున్న అపారిశుధ్యంను మంగళ వారం పరిశీలించి పలు సూచనలు చేశారు. డ్రెయిన్ల లో ప్రజలు చెత్త వేయకూడదన్నారు. వీధులు శుభ్రం చేసిన తరువాత ఏర్పరిచిన పాయింట్ల వద్ద తడి, పొడి చెత్త వేయాలన్నారు. ఆక్రమణలు, లైటింగ్ అన్ని విభాగాలు సమస్యలు పరిష్కరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో శానిటరీ ఇనస్పెక్టర్ ఉమా మహేశ్వరి, డీఈఈ టి.చంద్రశేఖ రరావు,ఏఈ కె.ఈశ్వరరెడ్డి,సత్యనారాయణ మూర్తి పాల్గొన్నారు.

279 జీవోపై కార్మికుల ఆందోళన

తణుకు: జీవో 279ని తక్షణమే రద్దు చేయాలని మునిసిపల్ కాంట్రాక్టు కార్మికుల యూనియన్ తణుకు శాఖ అధ్యక్షుడు బొద్దాని నాగరాజు డిమాండ్ చేశారు. తణుకు నరేంద్ర కూడలిలో మంగళవారం మానవహారం నిర్వహించి మాట్లాడారు. జీవో 279 రద్దు చేయాలని కార్మిక సంఘాలు ఆందోళన చేస్తున్నప్పటికి ప్రభుత్వం ఏకపక్షంగా నూతన ఏజెన్సీలకు సర్వీసు కాంట్రాక్టు పేరుతో టెండర్లు పిలవడం తగదన్నారు.సీఐటీయు నాయకుడు పీవీ ప్రతాప్ మాట్లాడుతూ జీవో అమలుకు పూనుకోవడం కార్మిక వ్యతిరేక చర్య అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు గార రంగారావు, జి. వసంత, కె.సుజాత, యర్రంశెట్టి మంగ, కె.నాగరత్నం, మార్లపూడి బర్నా, పోలమూరి జ్యోతిబాబు, లోచర్ల పెద్దిరాజు, శ్రీరాములు, రాయిపండు,కొత్తపల్లి అయ్యప్ప పాల్గొన్నారు.



నరేంద్ర కూడలిలో నినాదాలు చేస్తున్న నాయకులు

● ఆరున శిఖామణికి తిలక్ పురస్కారం

తణుకు అర్బన్ : రామకృష్ణ సేవా సమితి భవనంలో 6వ తేదీన ప్రముఖ కవి డాక్టర్ సి. నారాయణరెడ్డి పురస్కార గ్రహీత, కవి శిఖామణికి తిలక్ పురస్కారం ప్రదానం చేయనున్నట్టు నన్నయ భట్టారకపీఠం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ జీఎస్‌వీ ప్రసాద్, సుశర్మ తెలిపారు. సాహితీ ప్రియులు ఈ కార్యక్రమానికి విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు.

● విజయవాడ సమావేశానికి హాజరుకండి

తణుకు అర్బన్: విజయవాడలో నిర్వహించబోయే రాష్ట్ర స్థాయి సమావేశానికి సభ్యులు విధిగా హాజరు కావాలని సంఘ గౌరవాధ్యక్షుడు కాట్రగడ్డ రాజబాబు అన్నారు. తణుకు వడ్రంగి పనివారల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళ వారం సమావేశాన్ని సంఘ కార్యాలయంలో వల్లూరి రామ కృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు సభ్యత్వం రెన్యువల్ సకాలంలో చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో శీలం వెంకటేశ్వరరావు, సరపు ఆదినారాయణ, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

● నారాయణరావు సేవలు అభినందనీయం

తణుకు: దువ్వ బీఎస్ఎన్ఎల్ టెలికాం టెక్నీషియన్ కోదాటి నారాయణరావు సేవలు అభినందనీయమని తణుకు బీఎస్ఎన్ఎల్ సబ్ డివిజనల్ ఇంజనీర్ ఏఎన్‌వీపీ ప్రభాకర రావు అన్నారు. మంగళవారం నారాయణరావు పదవీ విరమణ సందర్భంగా జూనియర్ టెలికాం అధికారి టి. సత్య నారాయణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకరరావు మాట్లాడుతూ బీఎస్ఎన్ఎల్‌లో 37 సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసుకుని పదవీ విరమణ పొందుతున్న నారాయణరావు వినియోగదారులకు అధికారుల మన్ననలు పొందారన్నారు. అధికారులు వి.హనుమారెడ్డి, బొడ్డు విక్టర్‌బాబు, కె.ప్రకాశరావు, వి.పోలురాజు, సీహెచ్ సత్య నారాయణ, ఎన్.రాంబాబు పాల్గొన్నారు.

● రామారావుకు సన్మానం

తణుకు: రామారావు పేద ప్రజలకు ఉచితంగా వైద్యం చేసి ఎంతో మందిని ఆదుకున్నారని గౌరవాధ్యక్షుడు వాతాడ వెంకటేశ్వరరావు అన్నారు. తణుకు మండల పీఎంపీ సంఘ భవనంలో మంగళవారం టీవీ రమణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 72 సంవత్సరాలుగా వైద్య సేవలందిస్తున్న అజ్జరపు రామారావును ఘనంగా సత్కరిం చారు. కార్యక్రమంలో కోశాధికారి శంబన వీరేశలింగం, కార్య దర్శి ఆల్తి నర్సింహమూర్తి, పలువురు సభ్యులు పాల్గొన్నారు.



రామారావును సత్కరిస్తున్న పీఎంపీ సభ్యులు

ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించడం అభినందనీయం

మండపాక సర్పంచ్ జానకి

మండపాక (తణుకు రూరల్) : గుండె సంబంధిత వ్యాధులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించడం అభినందనీయం అని మండపాక సర్పంచ్ ఉండవల్లి జానకి అన్నారు. మంగళవారం స్థానిక చర్చి ఆవరణలో ఉషా కార్డియాక్ విజయవాడ శాఖ ఆధ్వర్యంలో గుండె పోటుకు సంబంధించిన నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుండె సంబంధిత వ్యాధులను సకాలంలో గుర్తించడం ద్వారా ముందస్తు జాగ్రత్తలను తీసుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా 200 మంది వృద్ధులకు, మహిళలకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.


వేల్పూరులో ఎంఆర్ టీకా పంపిణీలో సర్పంచ్ వెంకటలక్ష్మి



రేలంగిలో ఎంఆర్ వ్యాక్సిన్ వేస్తున్న వైద్యులు, అత్తిలిలో టీకా కార్యక్రమం ప్రారంభిస్తున్న ఎంపీపీ సత్యనారాయణ, తదితరులు

పిల్లలకు ఎంఆర్ టీకా వేయించాలి

వేల్పూరు సర్పంచ్ వెంకటలక్ష్మి

సెప్టెంబరు 8 వరకు కార్యక్రమం అమలు

వేల్పూరు (తణుకు రూరల్) : ప్రాణాంతక వ్యాధుల నివారణ కోసం ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న ఎంఆర్ టీకా పిల్లలందరికీ వేయించాలని వేల్పూరు సర్పంచ్ పెనుమర్తి వెంకటలక్ష్మి అన్నారు. మంగళవారం స్థానిక నెం.1 ప్రాథమిక పాఠశాలలో టీకా కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. అనంతరం పీహెచ్‌సీ వైద్యాధికారిణి టీఎల్ఎస్ హరణి మాట్లాడుతూ పీహెచ్‌సీ పరిధిలోని ఆయా గ్రామాల్లో 8,848 మందిని చిన్నారులను గుర్తించామన్నారు. ఈనెల 3వ తేదీన వేల్పూరు, 7న తేతలి, 8న దువ్వ గ్రామాల్లోని పాఠశాలల్లో ఆరోగ్య సిబ్బంది టీకాలు వేస్తారని వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి.రమణ, ఉపసర్పంచ్ రెడ్డి నరేంద్రప్రసాద్, ఉపాధ్యక్షుడు వల్లూరి రామ్మోహన్, హెచ్ఎం బి.సరోజ, ఆరోగ్య సిబ్బంది సత్యవతి, శ్రీరామమూర్తి, శేఖర్, రామకృష్ణ పాల్గొన్నారు.

ఇరగవరం మండలంలో...

ఇరగవరం : చిన్న పిల్లలను వ్యాధులు, మరణాల నుంచి రక్షించేందుకు ఎంఆర్ టీకా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జడ్పీటీసీ చుక్కా సాయిబాబు అన్నారు. మంగళవారం రేలంగి గ్రామంలోని ఎంపీపీ స్కూలులో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె. బంగారు రవి మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ మైనం పాము, కమిటీ ఛైర్మన్ అడ్డాల మెంటారావు, సభ్యులు పట్నాల సతీష్, కామన హనుమంతరావు, ఎంపీటీసీలు కామన ఏడుకొండలు, చేబ్రోలు దానమ్మ, కడలి ఉమా మహేశ్వరరావు, జె. సత్యనారాయణ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇరగవరం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో...

స్థానిక ఎంపీపీ ఎలిమెంటరీ స్కూలులో టీకా వేసే కార్యక్రమం నిర్వహించారు. 96 మంది విద్యార్థులకు గాను 76 మంది చిన్నారులకు టీకాలు వేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్.రాకేష్, జడ్పీటీసీ సభ్యులు చుక్కా సాయిబాబు, కమిటీ ఛైర్మన్ కోటిపల్లి సత్యనారాయణ, సర్పంచ్ తానేటి దాసు, టీడీపీ ఉపాధ్యక్షుడు వేండ్ర నాగ రాజేశ్వరరావు, హెల్త్ ఆఫీసర్ జి. విజయలక్ష్మి, సభ్యులు, టీచర్లు, ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అత్తిలి మండలంలో...

అత్తిలి: తట్టు, రుబెల్లా వ్యాధులను నివారించడానికి తమ పిల్లలకు టీకాలు వేయించాలని ఎంపీపీ కేతా సత్యనారాయణ కోరారు. అత్తిలి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో చేపట్టే టీకాల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అత్తిలి పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్. అరుణకుమారి మాట్లాడుతూ 13 పాఠశాలలో 412 మందికి టీకాలు వేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మేడపాటి కృష్ణకుమారి, సర్పంచ్ కందుల కల్పన, ఎంపీటీసీలు పి.శ్రీనివాస్, డి.పార్వతి, పాల్గొన్నారు.

◆ మంచిలి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో మంగళవారం టీకా కార్యక్రమాన్ని ఎంపీపీ కేతా సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుచిత మాట్లాడుతూ 15 ఏళ్లలోపు పిల్లలందరూ టీకాలు వేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్. శ్రీరామమూర్తి, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో పూజలు

అత్తిలి : అత్తిలి గ్రామంలోని వల్లీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు అయిలూరి శ్రీరాములు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు సాయంతో అన్నదానం చేశారు.

వైసీపీ అభిమానులపై బెదిరింపుల ధోరణి విడనాడాలి

ఇరగవరం : వైసీపీ అభిమానులపై పోలీసుల బెదిరింపు ధోరణి విడనాడాలని మంగళవారం ఓ ప్రకటనలో పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బూసి వినీత డిమాండ్ చేశారు. రాపాక గ్రామంలో వైసీపీ జెండాలను తమ సొంత ఇళ్లపై కట్టుకున్న వ్యక్తులపై అధికారపక్ష నాయకులకు తలొగ్గి ప్రజలను రక్షించవలసిన పోలీసులు, టీడీపీ కార్యకర్తలు వ్యవహరిస్తున్న తీరు చాలా దారుణమన్నారు. పోలీసు వ్యవస్థపై వైసీపీ నాయకులకున్న గౌరవాన్ని కాపాడుకోవాలని ఆమె హితవు పలికారు.

భవన నిర్మాణ కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించాలి

తణుకు రూరల్ : భవన నిర్మాణ కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించాలని ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం గ్రామ కమిటీ గౌరవాధ్యక్షుడు బళ్ల చినవీరభద్రరావు అన్నారు. మంగళవారం వేల్పూరు ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం వద్ద సమావేశం నిర్వహించారు. మారిన చినగణేష్ అధ్యక్షతన నిర్వహించి సమావేశంలో వీరభద్రరావు మాట్లాడారు. కార్మికుల పట్ల కార్మిక శాఖ అధికారులు పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. 60 ఏళ్లు నిండిన ప్రతీ భవన నిర్మాణ కార్మికుడికి నెలకు రూ.3వేలు చొప్పున పింఛన్ చెల్లించాలన్నారు. వైద్యం కోసం ఈఎస్ఐ వంటి పథకాలను ప్రవేశపెట్టి అమలు చేయాలన్నారు. అర్హులైన వారందరికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కరెళ్ల అర్జున్, చొరపల్లి రామకృష్ణ, చుంద్రు బాలా నాగబాబు, యార్లగడ్డ పవన్, కె. దుర్గాపవన్,షేక్ ఇస్మాయేల్ పాల్గొన్నారు.


కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో రమణ

బ్యాంక్ ఖాతాలకు ఆధార్ అనుసంధానం చేయాలి

కోనాల (తణుకు రూరల్) : ఉపాధి కూలీలు బ్యాంక్ ఖాతాలకు ఆధార్ అనుసంధానం చేయించుకోవాలని ఎంపీడీవో జి.రమణ అన్నారు. మంగళవారం ఉపాధి కూలీల సమస్యల పరిష్కారం కోసం కోనాల గ్రామ పంచాయతీ వద్ద ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధి కూలీలతో మాట్లాడారు. కూలీలకు బ్యాంకు ఖాతాల్లో నగదు జమకాకపోవడానికి గల కారణాలను గుర్తించారు. ఇంకా సొమ్ము జమ కాని వారు ఆయా పంచాయతీ కార్యాలయాల వద్ద మధ్యాహ్నం 3 గంటలకు రావాలని కోరారు. అధికారులు అందు బాటులో ఉండి సమస్య పరిష్కరిస్తారని తెలిపారు. వచ్చేటప్పుడు జాబ్‌కార్డులు, ఆధార్, బ్యాంకు పుస్తకాలు తీసుకురావాలన్నారు.


'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో మాట్లాడుతున్న గంగాధర్

వ్యవసాయ శాఖ సూచనలు పాటించాలి

అత్తిలి : వరి సాగులో వ్యవసాయ శాఖ ఇచ్చే సలహాలు, సూచనలు పాటించి మంచి దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయాధికారి గంగాధర్ సూచించారు. మంగళవారం గుమ్మంపాడు గ్రామంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఊడ్చిన పది రోజులు లోపుగానే కాంప్లెక్స్ ఎరువులు వేయాలన్నారు. వరిమూన తిరిగే వరకు చేలల్లో 5 సెంటీమీటర్లు నీరు ఉండాలన్నారు. రైతులు తమ చేలగట్ల కంది పంటను సాగు చేయాలన్నారు. కంది విత్తనాలు వ్యవసాయశాఖ ద్వారా పంపిణీ చేస్తున్నామని రైతులు తీసుకెళ్లాలన్నారు. ఈ సందర్భంగా రైతులకు కంది విత్తనాలు అందజేశారు. సర్పంచ్ రామరాజు, రైతులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

తాడేపల్లిగూడెం టౌన్



డాక్టర్ సలహా



పిల్లలకు ఎక్కువగా తీపి పదార్థాలు తినిపించొద్దు

డాక్టర్ ఎన్.కె భూపతి, డెంటిస్ట్

" నేటి ఆహారపు అలవాట్ల ప్రకారం పందుపుల్లలతో ముఖం కడగడం మంచిదికాదు. ఇప్పుడు తీసుకునే ఆహారం పళ్ళకు, నోటికి అంటుకుని ఉంటుంది. అలాంటి సమయంలో పందుపుళ్ళలతో కడగడం వల్ల చిగుళ్ళలో దాగి ఉన్న ఆహార పదార్థాలను బయటకు తీసుకురాదు. పంటికి సంబంధించిన వ్యాధులపై అశ్రద్ధ తీసుకోవద్దు. పిల్లలకు తీపి పదార్థాలను ఎక్కువ తినిపించడం వల్ల పళ్ళు పాడయ్యే అవకాశం ఉంది. చాక్లెట్లు పళ్ళకు అంటుకుని ఉండిపోతాయి.దీని వల్ల దంతవ్యాధులు వచ్చే అవకాశం ఉంది. "

● తాడేపల్లిగూడెం అర్బన్

చైర్మన్ చొరవతో మహిళలకు వైద్యం

(తాడేపల్లిగూడెం-ఆంధ్రజ్యోతి)

తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రిలో ఉమ్మి సమస్యతో బాధపడుతున్న ఓ మహిళకు వైద్యం అందించకపోవడంతో మునిసిపల్ చైర్మన్ బొలిశెట్టి శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. చైర్మన్ తక్షణమే సహచర కౌన్సిలర్లతో కలిసి ఏరియా ఆసుపత్రికి చేరుకున్నారు. మహిళ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. అప్పటికే మరో ఇద్దరు మహిళలు కూడా వైద్యం అందక ఇబ్బంది పడుతున్నారు. వారు కూడా ఏరియా ఆసుపత్రికి విచ్చేసిన మునిసిపల్ చైర్మన్‌ను కలిసి తమ గోడును వెల్లబుచ్చుకున్నారు. దాంతో చైర్మన్ వైద్యులను పిలిపించి నిలదీశారు. ఇక్కడ వైద్యం రిస్క్‌తో కూడుకున్నది కావడంతో ఏలూరు ఆసుపత్రికి సిఫార్సు చేస్తున్నట్టు గైనకాలజిస్ట్ చైర్మన్ శ్రీనివాస్‌కు వివరించే ప్రయత్నం చేశారు. అయితే వైద్యం ఎక్కడైనా రిస్కే అంటూ స్థానికంగా సేవలు అందించాలని చైర్మన్ దిశానిర్దేశం చేశారు. అవసరమైన రక్తం బాటిల్స్‌కు సొమ్ములు చైర్మన్ శ్రీనివాస్ అందించడంతో ఆ ముగ్గురు మహిళలకు వైద్యసేవలు అందాయి. అనంతరం మార్చురీలో మూడు భౌతికకాయాలు ఉండటాన్ని గమనించారు. మునిసిపాలిటీ పారిశుధ్య సిబ్బందికి మూడు రోజుల క్రితం సమాచారం అందించినా భౌతికకాయాలను తరలించేందుకు చర్యలు తీసుకోలేదని చైర్మన్‌కు వైద్య సిబ్బంది తెలిపారు.దాంతో చైర్మన్ పారిశుధ్య ఇన్‌స్పెక్టర్‌ను రప్పించారు. అయితే మంగళవారమే తమకు సమాచారం అందిందని శానిటరీ ఇన్‌స్పెక్టర్ స్పష్టం చేశారు. ఏదైనా భౌతికకాయాన్ని తరలించి పూడ్చాలని చైర్మన్ ఆదేశాలు జారీచేసారు. మరో వైపు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ శివ ప్రసాద్‌తో ఫోన్‌లో సంప్రదించారు.

ఆరోగ్యవంతమైన సమాజాన్ని సృష్టించాలి

మంత్రి మాణిక్యాలరావు...ఎంఆర్ వ్యాక్సినేషన్ ప్రారంభం



వీకర్స్ కాలనీలో వ్యాక్సినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న మునిసిపల్ చైర్మన్ బొలిశెట్టి శ్రీనివాస్

తాడేపల్లిగూడెం అర్బన్ : ఆరోగ్యవంతమైన సమాజాన్ని సృష్టించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు సహకరించాలని దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి పైడికొండల మాణిక్యాలరావు కోరారు. స్థానిక ప్రభుత్వం బాలికోన్నత పాఠశాలలో మంగళవారం మీజిల్స్- రూబెల్లా వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజం వల్ల దేశ భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందన్నారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం ప్రతి ఆదివారం నిర్వహించడంలో ఇదే ఉద్దేశ్యం దాగుదన్నారు. తొమ్మిదినెలల నుంచి 15 సంవత్సరాల వయస్సు లోపు వారంతా విధిగా మీజిల్స్- రూబెల్లా వేక్సిన్ వేయించుకోవాలన్నారు. జ్వరాలతో ప్రస్తుతం బాధపడే వారు వేయించుకోవద్దని వీరి కోసం వచ్చే నెల 8వ తేదీ వరకు వాక్సినేషన్ కార్యక్రమం నిర్వహిస్తామని డీసీహెచ్ఎస్ తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ నిమ్మగడ్డ బాలాజీ, డాక్టర్లు కోసూరి రవికుమార్, ప్రియాంక, బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని నిమ్మగడ్డ రవీంద్ర భారతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంఆర్ వ్యాక్సిన్‌తో ఎంతో ప్రయోజనం

తాడేపల్లిగూడెం అర్బన్ : మీజిల్స్ రూబెల్లా వ్యాక్సిన్ తప్పని సరిగా 9నెలలు మొదలుకుని 15 సంవత్సరాల వయస్సు ఉన్న ప్రతి పిల్లలకు విధిగా వేయించాలని వైద్యులకు, సిబ్బందికి మునిసిపల్ చైర్మన్ బొలిశెట్టి శ్రీనివాస్ సూచించారు. వీకర్స్‌కాలనీలో ఉన్న యర్రానారాయణ స్వామి మునిసిపల్ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన వాక్సినేషన్ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా చైర్మన్ పాల్గొన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఆరోగ్యపరిరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతలో పాటు, ఏరియా ఆసుపత్రిల్లోను సెప్టెంబర్ 8వ తేదీ వరకు వ్యాక్సినేషన్ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. మునిసిపల్ కమిషనర్ నిమ్మగడ్డ బాలాజీ మాట్లాడుతూ పట్టణంలో వ్యాక్సినేషన్ కోసం ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ కిల్లాడి ప్రసాద్, కౌన్సిలర్లు, డాక్టర్లు కోసూరి రవికుమార్, ప్రియాంక పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్

మహిళలను కించపరచడం సిగ్గుచేటు

తాడేపల్లిగూడెం టౌన్ : చట్టాలను ఎంతగా పటిష్టంగా రూపొందిస్తున్నా మహిళలను కించపరిచే కార్యక్రమాలు నేటికీ జరుగుతుండడం విచారకరమని బీసీ చైతన్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు వీరవల్లి ఎనివాస్ పేర్కొన్నారు. స్థానిక రజక కమ్యూనిటీ హాలులో బీసీ చైతన్యవేదిక సమావేశం జిల్లా రజక సేవా జన సంఘం అధ్యక్షుడు ఆరుగొలను వెంకటేశ్వరరావు అధ్యక్షతన మంగళవారం నిర్వహిచారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వీరవల్లి మాట్లాడుతూ పాలకొల్లు పట్టణ సీఐ బీసీ మహిళలను కించపరిచే విధంగా అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నట్టు ఆరోపించారు. ఆయన బహిరంగంగా బీసీలకు క్షమాపణ చెప్పాలని, లేకుంటే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. రాష్ట్ర రజక వృత్తిదార్ల సంఘం అధ్యక్షుడు అడ్డాల నరసింహారావు మాట్లాడుతూ ఒక సామాజిక వర్గానికి కౌన్సెలింగ్ ఇవ్వాలని ఉన్నత అధికారులు సీఐకు సూచించినప్పటికీ, ఆయన దానిని నిర్వహించకుండా మహిళలను కించపరుస్తూ మాట్లాడారని దుయ్యబట్టారు. పాలకొల్లు పట్టణంలో ఈనెల నాలుగో తేదీన సీఐకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించనున్నట్టు జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు ఆకుల కిరణ్ పేర్కొన్నారు. సమావేశంలో పలువురు నాయకులు, పాల్గొన్నారు.

'భావాలు ప్రస్ఫుటంగా వెల్లడించాలి'

తాడేపల్లిగూడెం టౌన్ : మనలోని భావాలను ఇతరులకు విశదీకరించే సమయంలో ప్రస్ఫుటంగా చెప్పగలగాలని మానసిక శాస్త్రవేత్త, సీనియర్ పిరమిడ్ మాస్టర్ దాట్ల రాయజగపతి రాజు పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం పిరమిడ్ స్పిరిట్యువల్ సొసైటీస్ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో మాగంటి కల్యాణ మండపంలో వన్‌డే వర్క్‌షాప్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ముఖ్య వక్తగా జగపతిరాజు మాట్లాడుతూ ఎదుటి వ్యక్తుల పట్ల మన మనోభావాలు ఎలా ఉండాలి వంటి పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఉత్తమ సాహిత్యాన్ని చదవడం, తోటివారితో ప్రేమాను రాగాలతో ఉండాలన్నారు. కార్యక్రమంలో ధ్యానాభిలాషులు సుమారు 400 మందికి పైగా పాల్గొన్నారు. పిరమిడ్ సొసైటీ సభ్యులు అడ్డాల సత్యనారాయణ, వి.నారాయణరాజు, శానం గోవిందరావు, తటవర్తి సోమేశ్వర రావు, జిల్లా ప్రచార కార్యదర్శి మేకా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం..

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం అంటూ స్థానిక చైతన్య టెక్నో స్కూల్ విద్యార్థులు మంగళవారం ర్యాలీ నిర్వహించి తాలుకా ఫీసు వద్ద మానవహారం నిర్వహించారు. సీఐ ఎంఆర్ఎల్ఎస్ఎన్‌మూర్తి, ఎస్ఐ ఆంజనేయులు, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు. **- తాడేపల్లిగూడెం**



పోలీస్ ఐల్యాండ్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వామపక్ష నాయకులు

● కాంట్రాక్ట్ కార్మికులు ధర్నా

తాడేపల్లిగూడెం అర్బన్ : జీవో నెం.279ని రద్దు చేయాలని కోరుతూ మునిసిపల్ కాంట్రాక్ట్ కార్మికులు ఈనెల 11,12,13 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టే సమ్మెను జయప్రదం చేయాలని మునిసిపల్ కార్యాలయం వద్ద కాంట్రాక్ట్ కార్మికులు ధర్నా నిర్వహించారు. మునిసిపల్ కార్యాలయం నుంచి మంగళవారం భారీ ర్యాలీగా పోలీస్ ఐల్యాండ్ వరకు చేరి నిరసన వ్యక్తం చేశారు. వామపక్ష నాయకులు తాడికొండ వాసు, చీర్లపుల్లారెడ్డి, మండల నాగేశ్వరరావు మాట్లాడుతూ జీవో 279 కాంట్రాక్టర్ల దయాదక్షాణ్యాలపై కార్మికులు జీవనం సాగించే విధంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ జీవోను తక్షణమే రద్దు చేయకపోతే 11,12,13 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా సమ్మెను కొనసాగిస్తామన్నారు. సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, బీఎంఎస్, ఐఎఫ్‌టీయూ, వైఎస్సార్ టీయూ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

● పట్టణంలో బీజేపీ సబ్‌కా వికాస్

తాడేపల్లిగూడెం టౌన్ : స్థానిక సమస్యలను అధికారుల ముందుంచడమే ప్రధాన లక్ష్యంగా సబ్‌కా సాథ్- సబ్‌కా వికాస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు బీజేపీ పట్టణ అధ్యక్షుడు కర్రి ప్రభాకర బాలాజీ పేర్కొన్నారు. ప్రధాని మోదీ పరిపాలనపై ప్రజాభిప్రాయాన్ని తెలుసుకోవడం కోసం చేపట్టిన కార్యక్రమాల్లో భాగంగా ఎఫ్‌సీఐ కాలనీ, గణేష్‌నగర్ తదితర ప్రాంతాల్లో పాదయాత్ర కార్యక్రమాన్ని మంగళవారం 21వ రోజుగా నిర్వహించారు. మోదీ ప్రవేశపెట్టిన పలు సంక్షేమ కార్యక్రమాలపై కరపత్రాల పంపిణీ నిర్వహించారు.

వృద్ధుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : చైర్మన్



వృద్ధులకు పెన్షన్లను అందజేస్తున్న మునిసిపల్ చైర్మన్ శ్రీనివాస్

తాడేపల్లిగూడెం అర్బన్ : వృద్ధుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పనిచేస్తోందని మునిసిపల్ చైర్మన్ బొలిశెట్టి శ్రీనివాస్ స్పష్టం చేశారు. పట్టణంలో నూతనంగా జారీ చేసిన కొత్త పెన్షన్లను మంగళవారం పలు చోట్ల ఆయన లబ్ధిదార్లకు అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ 2013 నాటికి తాడేపల్లిగూడెంలో 5,200 పెన్షన్లు మాత్రమే ఉండేవని అప్పుడు పెన్షన్‌కు కేవల రూ.200 మాత్రమే ఉండేదన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పటి వరకు 6,859 పెన్షన్లు పట్టణ ప్రజలకు ఇస్తున్నామన్నారు. కొత్తగా పట్టణంలో 435 మందికి పెన్షన్లు ఇచ్చినట్లు తెలిపారు. మరో 200 మందికి పెన్షన్లు కోసం దరఖాస్తు చేసుకున్నారని వీరికి కూడా ప్రధాన్యతా క్రమంలో పెన్షన్లు అందిస్తామని చైర్మన్ స్పష్టం చేశారు. తెలుగుదేశం ప్రభుత్వం పేదల పక్షాన్న నిలబడి ఇచ్చిన హామీలన్నీ నిలబెట్టుకుందన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ వైస్‌చైర్మన్ కిల్లాడి ప్రసాద్, కమిషనర్ నిమ్మగడ్డ బాలాజీ, కౌన్సిలర్లు కొల్లి రమావతి, అడపా జమున, కాకర్ల సుభద్ర, ఎన్వీ సత్యనారాయణ, పట్నాల రాంపండు, బడుగు పెద్ద, రామిశెట్టి సురేష్, పల్లి విక్రమ్, మాదాసు ఇందు, నాయకులు బిరుదుకోట వెంకటేశ్వర రావు , శ్రీరాముల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్ల అందజేత

తాడేపల్లిగూడెం రూరల్ : బాలికా విద్యను ప్రోత్సహించే ఉద్దేశంతోనే ప్రభుత్వం 'బడికొస్తా' కార్యక్రమంలో విద్యార్థినులకు సైకిళ్లను అందిస్తోందని సర్పంచ్ రెడ్డి వెంకట లక్ష్మి పేర్కొన్నారు. కృష్ణాయపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థినులకు సైకిళ్లను మంగళవారం అందించారు. కార్యక్రమంలో ఎంపీ టీసీ గుణ్ణం మంగాయమ్మ, హెచ్‌ఎం డి.జయరాజులతో కలిసి యూనిఫాం అందించారు.



చెరువు వేలాన్ని అడ్డుకోవడం తగదు

సర్పంచ్ కౌలూరి పరిమళ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ పరిమళ

తాడేపల్లిగూడెం రూరల్ : గ్రామంలో ఊర చెరువు వేలం నిర్వహించవద్దని కొందరు గ్రామస్తులు అడ్డుకోవడం తగదని అదే గ్రామాభివృద్ధికి ప్రధాన ఆదాయవనరు అని సర్పంచ్ కౌలూరి పరిమళ పేర్కొన్నారు. మాధవరం పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ పెద్దలతో కలిసి మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. చెరువు చేపల వేలం ఇప్పుడు మొదలు పెట్టలేదని 1966 నుంచి వేలం నిర్వహిస్తున్నారన్నారు. గ్రామాభివృద్ధి దృష్ట్యా ఈచెరువు వేలం కొనసాగిస్తున్నామని ప్రజలకు ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. గ్రామస్తులకు మంచినీరు పుష్కలంగా అందుతోందని, దీనికి తోడు పూజలు నిర్వహించుకునే వారికి గోదావరి నీరు ప్రాజెక్టుకు వస్తుందని ఆ నీటిని స్నానాలకు అందించేందుకు షవర్స్ ఏర్పాటుకు ఇప్పటికే పంచాయతీలో తీర్మాణాలు చేశామన్నారు. చెరువు వేలంలో చెరువులో ఎలాంటి వ్యర్థాలు వేయరాదని షరతు ఉందని అలా వేసే వారిని పట్టుకుని పంచాయతీకి అప్పగిస్తే వారి అర్హత రద్దు చేస్తామన్నారు. టీడీపీ నాయ కుడు పసల కొండయ్య మాట్లాడుతూ ఈ చెరువు వేలం అడ్డుకునే అవసరం లేదని అభివృద్ధిని కోరుకునే వారు ఆ పనులు చేయరన్నారు. నీటి సంఘం అధ్యక్షుడు సూరిశెట్టి గంగరాజు మాట్లాడుతూ ప్రజలకు అన్ని రకాలుగా సౌకర్యాలు కల్పించేందుకే తమ ప్రభుత్వం చూస్తోందని దీనికి అంతా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యదర్శి బాలం కృష్ణ, మాజీ సర్పంచ్ తమ్మిశెట్టి చుక్కయ్య, కౌలూరి పెదనరసింహం, కుప్పాల శ్రీను(రఫ్), మాజీ సైనికోద్యోగులు ప్రత్తి కృష్ణ, గోపిశెట్టి వెంకటేశ్వరరావు, టీడీపి గ్రామ పార్టీ అధ్యక్షుడు బండ్రెడ్డి తాతాజీ, వార్డు సభ్యులు ప్రత్తి రాజబాబు, కె.నరసింహారావు, మామిడిపల్లి ధర్మ య్య, టీడీపీ నాయకుడు నార్పిరెడ్డి గణపతి పాల్గొన్నారు.

ర్యాగింగ్ భూతాన్ని తరిమికొడదాం : సీఐ

తాడేపల్లిగూడెం రూరల్ : ర్యాగింగ్ భూతాన్ని మన విద్యా వ్యవస్థ నుంచి తరిమికొడదామని రూరల్ ఇన్‌చార్జ్ సీఐ ఎంఆర్ఎల్ఎస్ఎన్ మూర్తి పేర్కొన్నారు. వెంకట్రామన్నగూడెం ఉద్యాన కళాశాలలో సీనియర్ విద్యార్థులకు ర్యాగింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ర్యాగింగ్ నిరోధక చట్టాల గురించి విద్యార్థులకు వివరించారు. ముందుగా డీన్ ఆఫ్ స్టూడెంట్ ఎఫైర్స్ డాక్టర్ ఎ.సుజాత, అసోసియేట్ డీన్ డాక్టర్ కె.ఉమాజ్యోతి, ఆఫీసర్ ఇన్‌చార్జి డాక్టర్ ఆర్‌వీ సుజాతలతో కలిసి సీనియర్ విద్యార్థులతో ర్యాగింగ్ వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు.



వ్యాక్సిన్ ప్రారంభిస్తున్న జువ్వల వెంకటేశ్వరరావు



దర్శిపర్రులో విద్యార్థులకు వ్యాక్సిన్‌లు వేస్తున్న దృశ్యం

ఎంఆర్ వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించాలి

ఏఎంసీ చైర్మన్ పాతూరి

పెంటపాడు : తొమ్మిది నెలల నుంచి 15 సంవత్సరాల్లోపు పిల్లలందరికి తప్పనిసరిగా మీజిల్స్-రుబెల్లా వ్యాక్సిన్ వేయించాలని ఏఎంసీ చైర్మన్ పాతూరి రాంప్రసాద్‌చౌదరి అన్నారు. దర్శిపర్రు జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎంఆర్ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని పాతూరి ప్రారంభించారు. పెంటపాడు పీహెచ్‌సీ వైద్యుడు తాడేపల్లి వంశీ మాట్లాడుతూ ఆగస్టు ఒకటో తేదీ నుంచి సెప్టెంబర్ 9వ తేదీ వరకు పాఠశాలలు, అంగన్‌వాడీ సెంటర్లలో ఈ వ్యాక్సిన్ వేస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌వోలు శామ్యూల్‌రాజు, సుబ్రహ్మణ్యం, సత్యనారాయణ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

1842 మంది విద్యార్థులకు వ్యాక్సిన్

తాడేపల్లిగూడెం రూరల్ : మండలంలో 24 పాఠశాలల్లో 1,842 మంది విద్యార్థులకు మీజిల్స్- రుబెల్లా వ్యాక్సిన్‌ను మంగళవారం వైద్య సిబ్బంది వేశారు. మాధవరం, వెంకట్రామన్నగూడెం పీహెచ్‌సీ పరిధిలో ఈ వ్యాక్సిన్‌ను అందించారు. వైద్యాధికారులు కె.రవికుమార్, కె.విజయకుమార్ పర్య వేక్షించారు. కుంచనపల్లిలో బీజేపీ మండల ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరావు వ్యాక్సిన్‌ను ప్రారంభించారు. సీహెచ్‌వో ఉదయలక్ష్మి, ఆరోగ్య విస్తరణాధికారులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



పెంటపాడు గ్రామ దేవత పెంట్లమ్మ అమ్మవారికి చలి నైవేద్యాలు సమర్పించిన భక్తులు

● పెంట్లమ్మ అమ్మవారికి చలి నైవేద్యాలు

పెంటపాడు : పెంటపాడు గ్రామ దేవత పెంట్లమ్మతల్లి, కొర్లపాటి వెంకమ్మ అమ్మవార్లకు మంగళవారం గ్రామస్తులు చలినైవేద్యాలు సమర్పించారు. శ్రావణమాసంలో వచ్చే మంగళవారం అమ్మవారికి చలినైవేద్యాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఉపసర్పంచ్ నల్లమిల్లి చినగోపీరెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షుడు సత్తి నర్సారెడ్డి, కార్యదర్శి చామన వీరన్న, సహాయ కార్యదర్శి శీలంశెట్టి రావు, కోశాధికారి కొవ్వూరి భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

● వాసవి క్లబ్ సేవలు అభినందనీయం

పెంటపాడు : నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు వాసవి క్లబ్ చేస్తున్న సేవలు అభినందనీయమని తాడేపల్లిగూడెం మునిసిపల్ చైర్మన్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. తాడేపల్లిగూడెం వాసవిక్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం పెంటపాడు ప్రభుత్వ పోస్టుబేసిక్ పాఠశాలలో 600 మంది విద్యార్థులకు సుమారు రూ.లక్ష విలువైన నోట్‌పుస్తకాలు, పెన్నులు, చాక్లెట్లను అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశానికి మండల తెలుగుయువత అధ్యక్షుడు కొనకళ్ళ హరినాథ్ అధ్యక్షత వహించగా వాసవిక్లబ్ అధ్యక్షుడు నున్నా చైతన్య మాట్లాడుతూ నియోజకవర్గంలో రూ.5 లక్షలు విలువైన నోట్‌పుస్తకాలను అందించినట్టు తెలిపారు. మునిసిపల్ వైస్ చైర్మన్ కిల్లాడిప్రసాద్, కోఆప్షన్‌సభ్యుడు బడుగు వెంకటేశ్వరరావు(పెద్ద), హెచ్‌ఎం జి. విలియం, కౌన్సిలర్ పల్లె విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు అండగా నిలవండి

మునిసిపల్ చైర్మన్ శ్రీనివాస్

పెంటపాడు : ప్రభుత్వపాఠశాలల్లో విద్యార్థులకు అండగా నిలవడానికి దాతలు మరింతగా ముందుకు రావాలని మునిసిపల్ చైర్మన్ బొలిశెట్టి శ్రీనివాస్ ఆకాంక్షించారు. వాసవీక్లబ్ నిర్వహిస్తున్న సరస్వతి పథకంలో భాగంగా మంగళవారం పెంటపాడు పోస్టుబేసిక్‌స్కూల్, రామన్నగూడెం గ్రామాల్లోని విద్యార్థులకు చైర్మన్ చేతులమీదుగా పాఠ్యపుస్తకాలు అందించారు. వాసవీ క్లబ్ సేవలను ఈసందర్భంగా చైర్మన్ కొనియాడారు.ఈకార్యక్రమంలో వైస్‌చైర్మన్‌కిలాడి ప్రసాద్, వాసవీక్లబ్ అధ్యక్షులు నున్నా చైతన్య, ఉపాధ్యక్షులు పాబోలు వెంకటేశ్వరరావు, సెక్రటరీ మానేపల్లిసుబ్రహ్మణ్యం, బొచ్చువిశ్వనాధంలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధికదిగుబడులు



జింక్ ఎరువును అందిస్తున్న జేడీఏ గౌషియాబేగం

తాడేపల్లిగూడెం రూరల్ : రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు ఆలోచించి ఆ దిశగా మంచి దిగుబడులు సాధించాలని జిల్లా సంయుక్త వ్యవసాయ సంచాలకులు (జేడీఏ) గౌషియా బేగం పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం మండలంలో వీరంపాలెం, చినతాడేపల్లి గ్రామాల్లోని చంద్రన్న వ్యవసాయ క్షేత్రాలను మార్టేరు వ్యవసాయ శాస్త్రవేత్తలతో కలిసి మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రన్న రైతు క్షేత్రాల ద్వారా నూతన పద్ధతుల్లో సాగు చేయించి రైతులకు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి ఎలా సాధించవచ్చో ప్రయోగాత్మకంగా ప్రదర్శన ద్వారా సూచిస్తారని వివరించారు. జింక్ లోపం సమస్య ఉన్న రైతులకు ప్రభుత్వం ఉచితంగా జింక్‌ను అందిస్తున్నామన్నారు. వాటితోపాటు చేలగట్లపై వేసుకునేందుకు కంది విత్తనాలను ఉచితంగా సరఫరా చేస్తున్నామని వివరించారు. ఏలూరు ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త ఎంఎస్‌వీ చలం, తెగుళ్ల విభాగ శాస్త్రవేత్త కె.కృష్ణంరాజు, ఏడీఏ మురళీకృష్ణ, ఏవో రాజారావు, శాస్త్రవేత్తలు ఎన్ మల్లికార్జునరావు, ఎం.గిరాజారాణి, జేరాధాకృష్ణ, ఎంపీఈవో దివ్య, ఆత్మ బీఐఎం సాగర్, తదితరులు పాల్గొన్నారు.

పెంటపాడు మండలంలో..

పెంటపాడు : రైతులందరూ సేంద్రియ ఎరువులతో సాగు చేయడం అలవర్చుకోవాలని వ్యవసాయశాఖ జేడీఏ గౌసియా బేగం అన్నారు. పరిమెళ్ళలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయాధికారి జి.మోహన్ రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. సర్పంచ్ యాతం ధనలక్ష్మి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా హాజరైన జేడీఏ గౌసియాబేగం మాట్లాడుతూ వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటించి అవసరం మేరకు మాత్రమే రైతులు ఎరువులు, పురుగుల మందులు వాడాలన్నారు. ఏడీఏ మురళికృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న వ్యవసాయ పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏలూరు ఏరువాక శాస్త్రవేత్త ఎంఎస్‌వీ చలం, మార్టేరు వరిపరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు కృష్ణంరాజు, మల్లికార్జునరావు, రాధాకృష్ణ తదితరులు రైతులకు సాగులో సూచనలు , సలహాలు అందజేశారు. అనంతరం భూసారపరిక్షలలో జింక్ లోపం గుర్తించిన పొలాల రైతులకు ఉచితంగా జింక్‌ను, చేల్ల గట్లపై ఖాళీ ప్రదేశాలలో వేసుకునేందుకు కందులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గొర్రెల కోటేశ్వరరావు, ఏఎంసీ డైరక్టర్ అచ్యుత సత్యనారాయణ, ఏఈవోలు సుబ్బారావు, గణేష్, ఎంపీఈవోలు , రైతులు పాల్గొన్నారు.

● బ్యాంకర్లు సహకరించాలి : ఎంపీపీ

పెంటపాడు : ప్రభుత్వ ఆశయాలకు బ్యాంకర్లందరూ సహకారం అందించాలని ఎంపీపీ పెదపోలు వెంకటేశ్వర్లు అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో 2017-18 సంవత్సరానికి సంబంధించిన రుణాలపై బ్యాంకర్లతో సమావేశాన్ని మంగళవారం ఎంపీపీ వెంకటేశ్వర్లు అధ్యక్షనత నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ కిలపర్తి వెంకట్రావు మాట్లాడుతూ రుణాల విషయంలో లబ్ధిదారులను ఇబ్బందులకు గురిచేయవద్దని కోరారు. కార్యక్రమంలో జిల్లా టీడీపీ మహిళా కార్యదర్శి దాసరి కృష్ణవేణి, ఎంపీడీవో మల్లికార్జునరావు, బీజేపి మండలకార్యదర్శి దత్తు ప్రసాద్, ఎంపీటీసీ వీర్ల సత్యవతి, ఈ వోపీఆర్‌డీ ఎస్‌వీ రమణారావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పెదపోలు వెంకటేశ్వర్లు

సినిమాలు

తాడేపల్లిగూడెం :

రంగమహల్	ఫిదా
లక్ష్మీనారాయణ-1	వాసుకీ
లక్ష్మీనారాయణ-2	దువ్వాడ జగన్నాథం
శేషమహల్	నిన్నుకోరి
చలపతి	మాయామాల్
వెంకట్రామా	గౌతమ్‌నంద
శ్రీపద్మజ	దండుపాళ్యం-2




ఉండిలో ఎంఆర్ వ్యాక్సిన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే శివ, ఎమ్మెల్సీ పాందువ్వ శ్రీను తదితరులు


మాదివాడ ప్రాథమిక పాఠశాలలో పిల్లలకు తట్టు-రుబెల్లా టీకా చేస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి రవికిరణ్‌రెడ్డి


కాళ్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో విద్యార్థులకు రుబెల్లా వ్యాక్సిన్ అందిస్తున్న వైద్యసిబ్బంది

ఎంఆర్ టీకాలకు 35 వేల మంది గుర్తింపు

ఎమ్మెల్యే శివరామరాజు టీకాల పంపిణీ ప్రారంభం

ఉండి: ఉండి నియోజకవర్గంలో మీజిల్స్, రుబెల్లా టీకాను వేయడానికి వైద్య శాఖ 35 వేల మంది పిల్లలను గుర్తించిందని ఉండి ఎమ్మెల్యే శివరామరాజు తెలిపారు. మంగళవారం ఉండి జడ్పీహైస్కూల్‌లో టీకాను ఎమ్మెల్యే శివ, ఎమ్మెల్సీ పాందువ్వ శ్రీను ప్రారంభించారు. పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ కట్టా రాంబాబు అధ్యక్షత వహించారు. వైద్య అధికారి నివేదిత విద్యార్థులకు ఎంఆర్ ఇంజక్షన్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శివ మాట్లాడుతూ ప్రభుత్వం ముందుచూపుతో చిన్నారులకు మంచి ఆరోగ్యంను అందించాలనే ఉద్దేశంతో ఇటువంటి కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం హర్షణీయమన్నారు. ప్రతీ తల్లిదండ్రులు తమ చిన్నారులకు ఈ టీకాను వేయించాలని సూచించారు. ఎమ్మెల్సీ పాందువ్వ శ్రీను మాట్లాడుతూ ప్రభుత్వం ఆరోగ్యవంతమైన భావితరాన్ని దేశానికి అందించాలనే ఉద్దేశ్యంతో ఈ టీకాను ఇస్తోందని, వైద్య శాఖ తగు సూచనలతో దీనిని అందించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు జుత్తిగ శ్రీను, ఏఎంసీ చైర్మన్ సాగిరాజు సాంబశివరాజు, వైస్‌చైర్మన్ నాగరాజు, టీడీపీ ప్రదాన కార్యదర్శి మోపిదేవి శ్రీను, సర్పంచ్ విజయ, ఎంపీపీ లక్ష్మి, జడ్పీటీసీ తులసి, ఉపాధ్యక్షురాలు మంతెన కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్ టీకా తప్పనిసరిగా వేయించాలి...

ఆకివీడు: మీజిల్స్, రుబెల్లాను తరిమికొట్టేందుకు ప్రభుత్వం ఎంఆర్ టీకాను ప్రవేశపెట్టిందని, దీనిని తొమ్మిది నెలల నుంచి పదిహేను ఏళ్లలోపు పిల్లలకు వేయించాలని సర్పంచ్ గొంట్లా గణపతి, సీహెచ్‌సీ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ చుండూరి సత్యనారాయణ అన్నారు. మంగళవారం మాదివాడ ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు పీహెచ్‌సీ వైద్యుడు రవికిరణ్‌రెడ్డి, పెదపేట చర్చిలో ఏఎన్‌ఎం ఎం. వెంకటలక్ష్మి తట్టు-రుబెల్లా టీకా వేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ, రవికిరణ్‌రెడ్డి మాట్లాడుతూ మీజిల్స్ (తట్టు) ఒక ప్రాణాంతక వ్యాధి అన్నారు. దీనివల్ల చిన్నారులకు న్యూమోనియా, విరేచనాలు, మెదడువాపునకు గురై మరణానికి దారితీయవచ్చునన్నారు. దగ్గడం-తుమ్మడం ద్వారా ఒకరి నుంచి మరొకరికి ఈ వ్యాధి సోకుతుందన్నారు. తీవ్రమైన జర్వం, చర్మంపై దద్దుర్లు, దగ్గు, జలుబు, కళ్ళు ఎర్రబడడం తట్టువ్యాధి లక్షణాలన్నారు. గర్భంతో ఉన్న మహిళలకు రుబెల్లా సోకితే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందన్నారు. పిల్లలకు అంధత్వం, వినికిడి లోపం, బుద్ధిమాంద్యం, గుండె సంబంధ వ్యాధులు వస్తాయన్నారు. మండలంలో ప్రభుత్వ, ప్రైవేటుకు సంబంధించి 74 పాఠశాలల్లో 15 వేల మంది విద్యార్థులున్నారన్నారు. వీరందరికీ ఎంఆర్ వ్యాక్సిన్ ఇస్తామన్నారు. ఇళ్ళల్లో ఈ వయస్సుకు చెందిన వారుంటే తమ ఏఎన్‌ఎంలు టీకా వేస్తారన్నారు. సెప్టెంబర్ రెండు వరకు ఈ టీకాలు వేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బొల్లా వెంకట్రావు, పుప్పాల పండు, పీహెచ్‌సీ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరక్టర్ బొబ్బిలి బంగారయ్య, సూపరవైజర్ భాస్కరరావు, ఉపాధ్యాయుడు జోసఫ్‌రాజు తదితరులు ఉన్నారు.

కాళ్ల పీహెచ్‌సీలో ప్రారంభం...

కాళ్ళ: ప్రతి గ్రామంలో తట్టు, రుబెల్లా వ్యాధుల నియంత్రణకు ఈ వ్యాక్సిన్ ఎంతో ఉపయోగపడుతుందని వైద్యాధికారి డాక్టర్ సీహెచ్‌వి రంగంనాయుడు అన్నారు. కాళ్ళ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మంగళవారం నాడు ఎంఆర్ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కాళ్ళ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం అభివృద్ధి కమిటీ ఛైర్మన్ గోకరాజు వెంకటశివరామరాజు ప్రారంభించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి వెంకటేశ్వరరావు, ఆరోగ్యసిబ్బంది మాట్లాడుతూ ఈ వ్యాక్సిన్ కార్యక్రమం మండలంలో 19 టీమ్‌లు ఈనెల 24వ తేదీ వరకు ప్రతి గ్రామంలో రుబెల్లా వ్యాక్సిన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. 13,901మందికి ఈ వ్యాక్సిన్‌లు చేస్తామన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

వ్యాక్సిన్‌ను సద్వినియోగం చేసుకోండి

పాలకోడేరు: ప్రభుత్వం ప్రజల సౌకర్యార్థం ప్రవేశపెట్టిన మీజిల్స్, రుబెల్లా వ్యాక్సిన్‌ను ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పీహెచ్‌సీ వైద్యుడు గులాబ్ రాజ్‌కుమార్ అన్నారు. పాలకోడేరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యులు మంగళవారం వివిధ పాఠశాలల్లో మీజిల్స్, రుబెల్లా వ్యాక్సిన్‌ను విద్యార్థులకు టీకాల రూపంలో వేశారు. ఈ వ్యాక్సిన్‌ను 9 నెలల నిండిన చిన్నారుల నుంచి 15సంవత్సరాల్లోపు పిల్లలకు వేయడం ద్వారా ఎన్నో ప్రయోజనాలు ఉంటాయన్నారు. ప్రతీఒక్కరూ ఈ వ్యాక్సిన్‌ను వేయించుకోవాలని కోరారు.


పెదకాపవరం గ్రామంలోని గంటలరాయుడుపేటలో ఎంఆర్ వ్యాక్సినేషన్‌లో నిర్వహిస్తున్న డాక్టర్ కీర్తి కిరణ్ తదితరులు

ఎంఆర్ వ్యాక్సినేషన్‌కు మంచి స్పందన

పెదకాపవరం (ఆకివీడు రూరల్): ఎంఆర్ వ్యాక్సినేషన్‌కు మంచి స్పందన వచ్చిందని పెదకాపవరం పీహెచ్‌సీ వైద్యురాలు కీర్తికిరణ్ అన్నారు. ఎంపీపీ పాఠశాలల్లో విద్యార్థులకు ఎంఆర్ ఇంజక్షన్‌లు చేశారు. తట్టు, రుబెల్లా వ్యాధులు రాకుండా ఈ వ్యాకినేషన్ వేస్తారు. మండలంలోని 18 చోట్ల ఈ వ్యాక్సినేషన్ అందజేశారు. మండలంలోని ఎంపీపీ పాఠశాలల్లోని 6 నుంచి 10 సంవత్సరాల వయస్సు కలిగిన 671 విద్యార్థులకు గాను 580 మందికి అందజేశారు. పెద కాపవరంలోని గంటలరాయుడు పేటలోని 34 మందికిగాను 30 మందికి, మందపాడులోని పెద ఉప్పరగూడెంలో 29 మందికి గాను 29 మందికి, దుంపగడప గ్రామంలోని పల్లిపాలెంలోని 39కి గాను 36, అజ్జమూరులోని 26 మందికి 21, చెరుకుమిల్లి గ్రామంలోని 38 మందికి 30, కమతవానిగూడెం 36 మందికి 33, గుమ్ములూరు గ్రామంలోని 38 మందికి 31, చినకాపవరం గ్రామంలోని జానకిరామరాజపురంలోని 28 మందికి 24, అప్పారావుపేటలోని 21 మందికి 19, నందమిల్లిపాడు గ్రామంలోని 16 మందికి 15 మంది, కొత్తచెరువులోని 17 మందికిగాను 10 మందికి వ్యాక్సిన్ ఇచ్చారు. హెల్త్ అసిస్టెంట్లు దుర్గా ప్రసాదు, సూపర్‌వైజర్‌లు భాస్కరరావు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

డాక్టర్ సలహా



వర్షాకాలంలో జాగ్రత్తలు పాటించండి

డాక్టర్ గులాబ్ రాజ్‌కుమార్
పాలకోడేరు మండల వైద్యాధికారి

"వర్షాకాలంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలి. సురక్షిత మంచినీరు తాగాలి. నూటికి 90 శాతం కలుషితమైన నీరు తాగడం వల్లే రోగాలు సోకుతాయి. వర్షాకాలంలో మరీ జాగ్రత్తలు తీసుకోవాలి. కాచి చల్లార్చిన నీటినే తీసుకోవాలి. అదే విధంగా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగ్యూ, గున్యా, టైఫాయిడ్ తదితర జ్వరాలు వచ్చే అవకాశాలు ఎక్కువ. వాటిని నివారించే విధంగా ఎప్పటికప్పుడు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన మీజిల్స్, రుబెల్లా వ్యాక్సిన్‌ను 9 నెలలు నిండిన చిన్నారుల నుంచి 15 సంవత్సరాల లోపు విద్యార్థులకు ఈ వ్యాక్సిన్‌ను తప్పనిసరిగా వేయించాలి. ఈ వ్యాక్సిన్ వేయించడం ద్వారా తట్టు, రుబెల్లా నుంచి రక్షణ"

● పాలకోడేరు

హలో... ఆంధ్రజ్యోతి

మీ ప్రాంతంలో జరిగే సభలు, సమావేశాలు, సంఘటనలు, ఉత్సవాలు, స్థానిక సమస్యలపై మాకు సమాచారం ఇవ్వండి.

కాళ్ళ :	9397139966
పాలకోడేరు :	9866283848
ఉండి :	9493476701
ఆకివీడు :	9440364437
,, రూరల్ :	9030966667

సినిమాలు

ఆకివీడు :

విజయ ఏసీ	ఫిదా
విజయ మినీ ఏసీ	గౌతమ్ నంద
వెంకటలక్ష్మి	వాసుకి
సంగీత	మండే సూర్యుడు
శ్రీవెంకట గంగారత్నం	-----

17 మంది ఉపాధ్యాయులు విధుల్లో చేరిక

అభినందించిన ఎంఈవో సూర్యనారాయణమూర్తి


ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులను అభినందిస్తున్న మండల విద్యాశాఖాదికారి సూర్యనారాయణమూర్తి

ఉండి: ఉపాధ్యాయుల బదిలీలు పూర్తి అయ్యాయి. దాంతో ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మంగళవారం వివిధ ప్రాంతాలు నుంచి 17 మంది ఉపాధ్యాయులు బదిలీపై వచ్చి విధులకు హాజరయ్యారు. అదే విధంగా ఇక్కడ పనిచేసిన 17 మంది ఉపాధ్యాయులు బదిలీపై ఆయా ప్రాంతాలకు వెళ్లారు. వివిధ ప్రాంతాలు నుంచి ఉపాధ్యాయులు సత్యనారాయణ (తెలుగు), సుజ్ఞానకుమారి, బాలాజీ, విమలాబాయమ్మ, నాగలక్ష్మి, రాధాకృష్ణ, ఉమారాణి, వెంకటేశ్వరరావు, కృష్ణ, స్వర్ణలత, రంగరాజు, పద్మావతి, గౌస్ మొహిద్దిన్, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, గంగాధరరావు, విజయకుమారి బదిలీపై వచ్చి విధులలో చేరారు. వీరిని ఎంఈవో సూర్యనారాయణమూర్తి, ప్రదానోపాధ్యాయుడు ముదునూరి శివరామరాజు అభినందించారు. ఇతర ఉపాధ్యాయులు స్వాగతం పలికారు.


అన్నం పేకట్లు, నగదు అందజేస్తున్న లయన్స్ సభ్యులు

పేదలకు అన్నదానం

ఆకివీడు: మానవసేవే మాధవసేవని ఆకివీడు, ఆదర్శ లయన్స్ సభ్యులు అన్నారు. మంగళవారం స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మందిరంలో వందమంది పేదలకు పింఛన్‌తో పాటు అన్నం పేకెట్లు అందచేశారు. గొంట్లా కృష్ణమూర్తి, నేరెళ్ళ రామ చెంచయ్య, రాకుర్తి హరనాధ్, అహ్మద్, గుర్రం లక్ష్మణరావు, ఎండీ సిరాజుద్దీన్, డీఆర్‌కేరాజు, నందిగామ ఫణి, వోలేటి కిషోర్ మాట్లాడుతూ ఆకలన్న వారికి ఆకలి తీర్చినప్పుడే మానవజన్మకు పరమార్ధమన్నారు. కార్యక్రమంలో నేరెళ్ళ రమణయ్య, షాకీర్ తదితరులు ఉన్నారు.

గరగపర్రు దళితులకు ఇచ్చిన హామీలు అమలుచేయాలి

కాళ్ళ: గరగపర్రు దళితులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని మాజీ ఎమ్మెల్యే దిగుబాటి రాజగోపాల్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గొర్ల రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ నెల 4న భీమవరం లూథరన్ హైస్కూల్‌లో చేపడుతున్న సదస్సును విజయవంతం చేయాలన్నారు. హామీలిచ్చి వారం రోజులు అవుతున్నా ఏ ఒక్క సమస్య పరిష్కారం చేయలేదన్నారు. మంత్రులు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సదస్సుకు రాజకీయ పక్షాలు, దళిత అంబేద్కర్ ప్రజా సంఘాల రాష్ట్ర, జిల్లా నాయకులు విచ్చేస్తారన్నారు.

రైల్వే సమాచారం

ఆకివీడు నుంచి నుంచి గుడివాడ వైపు

నెంబర్ రైలు పేరు సమయం

17016 విశాఖ ఎక్స్‌ప్రెస్- రాత్రి 10.05నిలకు,
17209 శేషాద్రి ఎక్స్‌ప్రెస్- రాత్రి 8.46నిలకు
-17644 సర్కార్ ఎక్స్‌ప్రెస్‌రాత్రి 6.07నిలకు,
ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్-18519 ఉదయం 3.59నిలకు,
17255 నర్సాపురం ఎక్స్‌ప్రెస్- రాత్రి 8.17నిలకు
17407 తిరుపతి-నర్సాపురం ఎక్స్‌ప్రెస్- రాత్రి 6.46నిలకు,
17231నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్- ఆదివారం-శుక్రవారం (వయా గుంటూరు మీదుగా), మిగతా రోజుల్లో-17213 రైలు వయా ఖమ్మం-వరంగల్ మీదుగా ఉదయం 11.34నిలకు,
17479 హౌరా ఎక్స్‌ప్రెస్ (పూరి-తిరుపతి) బిలాస్‌పూర్ నుంచి ఆదివారం-బుధవారం 17481, మిగతా రోజుల్లో-ఉదయం 5.30నిలకు,

ఆకివీడు నుంచి భీమవరం వైపు

ఆకివీడు స్టేషన్ నుంచి భీమవరం వైపు వెళ్ళేవి
విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలు- 17015 ఉదయం 00.59నిలకు,
శేషాద్రి ఎక్స్‌ప్రెస్ రైలు- 17210 ఉదయం 2.55నిలకు,
సర్కార్ ఎక్స్‌ప్రెస్ రైలు- 17643 ఉదయం 5.28నిలకు,
ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ రైలు- 18520 ఉదయం 5.57నిలకు,
నర్సాపురం ఎక్స్‌ప్రెస్ రైలు- 17256 ఉదయం 6.27నిలకు,
తిరుపతి-నర్సాపురం- రైలు- 17403 ఉదయం 4.39నిలకు,
నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్ రైలు- 17232 మంగళవారం-ఆదివారం (వయా గుంటూరు మీదగా), మిగతా రోజుల్లో-17214 వయా ఖమ్మం-వరంగల్ మీదుగా ఉదయం 7.52నిలకు,
హౌరా ఎక్స్‌ప్రెస్ (పూరి-తిరుపతి) బిలాసపూర్‌కు ఆదివారం-గురువారం 17482, మిగతా రోజుల్లో -17480 ఉదయం 8.54,
కోకినాడ ఎక్స్‌ప్రెస్ ఏసీ వారానికి రెండు రోజులు ఆదివారం-బుధవారం 12775 ఉదయం 3.51నిలకు
గుడివాడ పాసింజర్ రైలు-77202 ఉదయం 5.46నిలకు,
నర్సాపురం పాసింజర్ రైలు-77231 ఉదయం 10.17నిలకు,
గుంటూరు పాసింజర్ (మాచర్ల) రైలు-57318 మధ్యాహ్నం 1.57నిలకు,
నర్సాపురం పాసింజర్ రైలు-77204 సాయంత్రం 5.03నిలకు,
గుడివాడ పాసింజర్ రైలు-77264 రాత్రి 7.51నిలకు,
మచిలీపట్నం పాసింజర్ రైలు-57229 రాత్రి 11.35నిలకు,
పాస్ట్ పాసింజర్ రైలు-57381 రాత్రి 8.42నిలకు.

ఆక్వా ధరలు





కట్లా-బొచ్చె	రూ.104=00	**వనామి రొయ్య ధర కేజీలో**	
శీలావతి	రూ.102=00	30 కౌంట్	రూ.430=00
పండుగప్ప	రూ.350=00	40 కౌంట్	రూ.350=00
గడ్డిచేప	రూ. 90=00	50 కౌంట్	రూ.310=00
రూప్‌చంద్	రూ. 85=00	60 కౌంట్	రూ.260=00
బంగారుతీగ	రూ. 90=00	70 కౌంట్	రూ.240=00
వాలుగ	రూ.140=00	80 కౌంట్	రూ.230=00
కొరమీను	రూ.330=00	90 కౌంట్	రూ.220=00
ఫంగస్	రూ. 59-00	100 కౌంట్	రూ.210=00

అధికారుల ఫోన్ నెంబర్లు

ఉండి తహసీల్దార్- దుర్గాకిశోర్ 9491041459
ఎండీవో (ఇన్‌చార్జి)- రెడ్డియ్య 9493742460
ఎంఈవో - సూర్యనారాయణమూర్తి 9515159454
వ్యవసాయాధికారి- రాజేష్ 8886612983
ఏపీఎంవో - రాజేష్ 9959442246
ఎస్ఐ - రవివర్మ 9440796648
ఇరిగేషన్ డీఈ - వెంకటేశ్వరరావు 9848855557
ఆర్‌అండ్‌బీ ఏఈ - రామరాజు 9440818719

మాతా శిశు మరణాల తగ్గింపే లక్ష్యం

వైద్యుల పోస్టులు భర్తీ
డీసీహెచ్‌ఎస్ డాక్టర్ కె.శంకర రావు



మాట్లాడుతున్న డీసీహెచ్‌ఎస్ డాక్టర్ శంకరరావు

ఆకివీడు: మాతా-శిశు మరణాల శాతం తగ్గించడమే ప్రధాన లక్ష్యంగా వైద్యులు పనిచేయాలని జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి (డీసీహెచ్‌ఎస్) డాక్టర్ కె.శంకర్రావు అన్నారు. మంగళవారం స్థానిక సీహెచ్‌సీ ఆస్పత్రిలో అభివృద్ధి కమిటీ ఛైర్మన్ చుండూరి సత్యనారాయణ, వైద్యులు రాంబాబు, ప్రసాద్, మాధవీకళ్యాణి, రంగారావు, ఏఎన్ఎంలు తదితరులతో సమావేశమై మీడియాతో ఆయన మాట్లాడారు. జిల్లాలోని 18 ఆస్పత్రుల్లో మాతా-శిశు మరణాలు తగ్గించడానికి ఏసీ వార్డులు ఏర్పాటు చేశామన్నారు. వైద్యులకు డ్రెస్ కోడ్ కూడా కేటాయించడం జరిగిందన్నారు. జిల్లాలో ప్రసూతి వైద్యనిపుణులు-13, పిల్లల వైద్యనిపుణులు-12, మత్తు వైద్యులు-11 పోస్టులు ఖాళీగా ఉన్నాయని వాటికి సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేశామని వారం రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. జననీ శిశు సురక్ష కార్యక్రమం ద్వారా ఆస్పత్రుల్లో డెలివరీ, రక్తం, మందులు, రవాణా ఉచితమన్నారు. జననీ సురక్ష యోజన పథకం ద్వారా రూ.1000లు అందజేస్తారన్నారు. పుట్టిన శిశువులకు విటమిన్-కె ఇంజక్షన్‌తో పాటు కామెర్లు, పోలియోకు సంబంధించి వ్యాక్సిన్ ఇస్తారన్నారు.

ఆకివీడు సీహెచ్‌సీలో త్వరలో లీగల్ కేసుల సెంటర్ ప్రారంభిస్తున్నామన్నారు. దీని వల్ల తగువులు, యాక్సిడెంట్, రేప్, పోలీసులకు సంబంధించిన కేసులకు ఇక ఇతర గ్రామాలకు వెళ్ళనక్కర్లేదన్నారు. ఆస్పత్రుల ద్వారా మెరుగైన వైద్యసేవలందించేందుకు పారిశుధ్య సిబ్బందిని నియమిస్తామన్నారు. ఫిర్యాదు పెట్టెలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు 4450 పాఠశాలలకు సంబంధించి 8.32 లక్షల విద్యార్థులకు 8 లక్షల మీజిల్స్-రుబెల్లా డోస్‌లు అవసరమవుతాయన్నారు. సెప్టెంబర్ 8వ తేదీ వరకూ మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ఆయా ఆస్పత్రుల్లో ఈ వేక్సిన్ ఇస్తామన్నారు. జిల్లాలోని ఏజీన్సీ ప్రాంతంలో మలేరియా, చింతలపూడిలో టైఫాయిడ్ ఉన్నాయన్నారు. బయట, నిల్వ ఉన్న ఆహారం తీసుకోరాదన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈగలు-దోమలు వాలిన ఆహారాలు తినరాదన్నారు.

ప్రతి గ్రామంలో మినీ రైతు బజార్

ఎమ్మెల్యే శివరామరాజు



సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివరామరాజు

ఉండి: ప్రతి గ్రామంలో మినీ రైతు బజార్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఉండి ఎమ్మెల్యే శివరామరాజు తెలిపారు. మంగళవారం ఉండి మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయిలో గ్రామాలలో జరిగిన అభివృద్ధిపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం రైతుబజార్‌తోపాటు, గ్రామాలలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ప్రజలకు పూర్తిస్థాయిలో మంచినీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. అన్ని పంచాయతీలకు సొంత భవనాలు ఉండాలనేది తన ధ్యేయమన్నారు. గ్రామాలలో విద్యుత్ సమస్యలు వున్నాయని పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. 70 గ్రామాలలో డంపింగ్‌యార్డులు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పుంతరోడ్లను తక్షణమే అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాలకు పంచాయతీలు స్థలాలు కేటాయించాలని, నిధులు మంజూరు చేసి భవనాలను నిర్మిస్తామన్నారు. మహిళలకు మండల సమాఖ్య భవనాలు, గ్రామ సమాఖ్య భవనాలు ఏర్పాటుచేస్తామని, ఆర్గానిక్ కూరగాయలను మహిళలు గ్రామ సమాఖ్య భవనాలలో ఏర్పాటుచేసుకుని విక్రయించుకోవచ్చునన్నారు. ప్రతి పాఠశాలకు ప్రహరీగోడ ఉండాలన్నారు. పాఠశాలలో ఫర్నిచర్ తదితర సౌకర్యాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానన్నారు. జనవరి 1 నాటికి ఉండి నియోజకవర్గంలో చాలావరకు అభివృద్ధి పనులు పూర్తవుతాయన్నారు.

రాష్ట్రానికే ఆదర్శం ఉండి: ఎమ్మెల్సీ పాందువ్వ

రాష్ట్రానికే ఉండి నియోజకవర్గం ఆదర్శమని ఎమ్మెల్సీ పాందువ్వ శ్రీను అన్నారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయ, మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు జుత్తిగ శ్రీను, ఏఎంసీ ఛైర్మన్ సాంబశివరాజు, వైస్‌ఛైర్మన్ నాగరాజు, ఎంపీపీ లక్ష్మీ, జడ్పీటీసీ కరిమెరక తులసి, వైస్ ఎంపీపీ కృష్ణకుమారి, జడ్పీటీసీలు మన్నె లలితాదేవి, బర్రె వెంకటరమణ, డ్వామా పీడీ వెంకట రమణ, ఉండి, ఆకివీడు, కాళ్ళ, పాలకోడేరు తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, యంపీటీసీలు, ఏఎంసీ డైరక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

12 పింఛన్లు మంజూరు

చినమిల్లిపాడు (ఆకివీడురూరల్): పేదల పాలిటి పెన్నిధి టీడీపీ ప్రభుత్వమని రూరల్ బ్యాంకు ఉపాధ్యక్షుడు గురువెల్లి రఘుప్రసాద్ అన్నారు. ప్రభుత్వం నూతనంగా 12 పెన్షన్‌లు మంజూరు చేసిందన్నారు. దీనితో మొత్తం 268 పెన్షన్‌లు అవుతాయని తెలిపారు. రూ.1000లు పెన్షన్ ఇచ్చిన ఘనత టీడీపీదేనన్నారు. ఎమ్మెల్యే శివ, ఏఎంసీ ఛైర్మన్ మోటుపల్లి రామవరప్రసాద్ సహకారంతో నూతన పెన్షన్‌లు అందచేశామన్నారు. ఈ కార్యక్రమంలో పూజారి వరప్రసాద్, ఘంటసాల వెంకటేశ్వరరావు, సెక్రటరీ స్వామి తదితరులు పాల్గొన్నారు.

నియామక పత్రాలు అందక ఉపాధ్యాయుల్లో ఆందోళన

ఆకివీడు: ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ పూర్తయినా నియామక పత్రాలు అందక ఇబ్బందులు పడ్డారు. ఇతర మండలాల నుంచి ఆకివీడు మండలంలో విధుల్లో చేరేందుకు వచ్చిన ఉపాధ్యాయులకు నిరాశ ఎదురైంది. దీనిపై ఎంఈవో రవీంద్రను ప్రశ్నించగా ఆన్‌లైన్‌లో సాంకేతిక లోపం కారణంగా కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ జనరేట్ అవ్వడంలేదన్నారు. మండలంలో కుప్పనపూడి, కోళ్ళపర్రు, దుంపగడప గ్రామాల్లోని యూపీ పాఠశాలల్లో మూడు లెక్కల సబ్జెక్టుల సహాయకులు వచ్చారన్నారు. అయి-భీమవరం గ్రామంలో ఎస్‌జీటీ పూర్తి కావల్సి ఉందన్నారు. అయితే సాయంత్రం 4.30లకు జనరేట్ అవుతున్నాయన్నారు.



మాలవానితిప్పలో అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం

తల్లిపాలు బిడ్డకు అమృతం

కాళ్ళ: తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని, శిశువు ఆరోగ్యంగా ఉండేందుకు దోహదం చేయడంతో పాటు రోగనిరోధక శక్తి పెంచుతుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పార్వతి అన్నారు. మంగళవారం నాడు పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. తల్లిపాల విశిష్టతను వివరించారు. మాలవానితిప్పలో అంగన్‌వాడీ టీచర్లు వేగేశ్న పద్మ, ఆయాలు, వైద్యసిబ్బంది, గర్భిణులు పాల్గొన్నారు.



చంద్రన్న బీమా చెక్కును పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

చంద్రన్న బీమా చెక్కు పంపిణీ

పాలకోడేరు: శృంగవృక్షం గ్రామంలో అభివృద్ధి పనులపై అధికారుల సమక్షంలో ప్రత్యేక సమావేశాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏయే అవసరాలు ప్రజలకు అవసరమో వాటిపై నాయకులు చర్చించారు. అదే విధంగా రహదారులు ఎన్ని వేయాలి, నీటి సమస్యలు ఉన్నాయా, డ్రైయినేజీ సమస్యలున్నాయా, ఎవరికి పింఛన్లు అందాలి. ఇంకా ఎవరికి ఉపాధి పనులు కావాలి తదితర వాటిపై ఆరా తీశారు. ఈ సమస్యలన్నింటిని ఎమ్మెల్యే శివరామరాజు ప్రత్యేకంగా గుర్తించమనడంతో అధికారుల ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశామని టీడీపీ మండల అధ్యక్షుడు కొత్తపల్లి గోపాలకృష్ణంరాజు తెలిపారు. అనంతరం శృంగవృక్షం గ్రామంలో ఇటీవల ప్రమాదంలో మృతి చెందిన కందివలస సూర్యారావు భార్య చిన్నమ్ములుకు చంద్రన్న బీమా నుంచి రూ.4 లక్షల రూ.25వేలు చెక్కును గోపాలకృష్ణంరాజు, కలిదిండి కృష్ణంరాజు, ప్రసాద్‌రాజు, ఏడుకొండలు, బిందెల మౌనిక, ఎంపీడీవో వెంకటరత్నం లు అందించారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

విద్యార్థులకు ఆర్థిక సాయం

కుప్పనపూడి (ఆకివీడు రూరల్): చదువుకునే వారికి చేయూతనిస్తున్న ఫర్ స్టడీస్ ఎడ్యుకేషన్ సొసైటీ వారు అభినందనీయులని ఎంపీడీవో శ్రీనాథ్ నాయిని అన్నారు. మంగళవారం కుప్పనపూడి గ్రామంలోని ఎంపీ యూపీ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. 2017-18 ఆర్థిక సంవత్సరానికి 20 మంది విద్యార్థులకు రూ. 3 లక్షలు ఆర్థిక సహాయం అందించడానికి నిర్ణయించడం అభినందనీయమన్నారు. మొదటి విడతగా 20 మందికి రూ. లక్ష అందజేశారు. వ్యాపారవేత్త గొట్టుముక్కల వెంకట సత్యనారాయణరాజు మాట్లాడుతూ పేద విద్యార్థుల కోసం పాటు పడుతున్న ఫర్ ఎడ్యుకేషన్ సొసైటీకి తన వంతు సహాయం అందిస్తానన్నారు. పేద విద్యార్థులను చదివించడం తనకు ఎంతో సంతోషంగా ఉందని ఎన్‌ఆర్ఐ కిషోర్ అన్నారు. ఐదుగురితో ప్రారంభించి ప్రస్తుతం 100 మందిని చదివిస్తున్నందుకు ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ఆనంద్, ఉపాధ్యాయుడు చందన ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

రాధాకృష్ణుల కల్యాణం

ఉంగుటూరు : ఉంగుటూరు మండలం కైకరంలో షిరిడీ సాయి ఆలయంలో పెద్దిరెడ్డి శేషవేణి, వేణు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం రాధాకృష్ణుడి కల్యాణం జరిగింది. ఆలయ వార్షికోత్సవంలో భాగంగా రాధాకృష్ణుడి కల్యాణం నిర్వహించినట్టు ఆలయ కమిటీ తెలిపింది. ఈ సందర్భంగా విష్ణుసహస్ర నామ పారాయణం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం రథోత్సవం నిర్వహించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు

డాక్టర్ సలహా



శుభ్రత పాటించాలి

కె.సుభాకర్, పిప్పర, ప్రభుత్వ వైద్య అధికారి

"వర్షాకాలంలో కురుస్తున్న వర్షాల వల్ల అంటువ్యాధులు సోకే ప్రమాదం ఉంది. ముఖ్యంగా ఇంటి పరిసరాల్లో నిల్వ నీరు ఉండకుండా బాధ్యతలు తీసుకోవాలి. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉంటే దోమలు విజృంభిస్తాయి. డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులకు దోమలే ప్రధాన కారణమవుతాయి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడమే శ్రేయస్కరం. అందుకు దోమల నివారణకు తెరలు వాడడం ఆరోగ్యకరం. దోమల నివారణకు జెట్ కాయిల్స్ వాడడం వల్ల పిల్లల ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదం ఉంది."

● గణపవరం

కాలువలో పడి ఒకరి మృతి

భీమడోలు : చెట్టున్నపాడులో ప్రమాదవశాత్తు కాలువలో పడి ఒకరు మృతి చెందారు. సోమవారం రాత్రి మల్లవరంలో నిత్యావసర సరుకులు కొనుగోలు చేసి తిరిగి వస్తూ చెట్టున్నపాడు సమీపంలో చేరుకున్న కుచ్చర్లపాటి నాగరాజు(49) ప్రమాదవశాత్తు కాలువలో పడి మునిగిపోయాడు. మంగళవారం ఉదయం గ్రామస్థులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారమందించారు. భీమడోలు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హలో.. ఆంధ్రజ్యోతి

మీ ప్రాంతంలో జరిగే సభలు, సమావేశాలు, సంఘటనలు, ఉత్సవాలు, స్థానిక సమస్యలపై మాకు సమాచారం ఇవ్వండి.

ఉంగుటూరు	: 9848050089
భీమడోలు	: 9440396818
గణపవరం	: 9949396998
నిడమర్రు	: 8341412277

సినిమా గైడ్

గణపవరం :	
మహాలక్ష్మి	ఫిదా
కుమారి	గౌతమ్ నంద
భీమడోలు :	
శ్రీనివాస	గౌతమ్ నంద
శ్రీ వెంకటేశ్వర	---





భీమడోలులో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గన్ని....గణపవరంలో టీకా వేస్తున్న నంద్యాల మదన్‌మోహన్‌లచ్చిరాజు

ఎంఆర్ టీకాలను సద్వినియోగించుకోండి: గన్ని

భీమడోలు : ప్రాణాంతక వ్యాధుల నివారణకు ప్రభుత్వం అమలు చేస్తున్న మీజిల్స్, రూబెల్లా (ఎంఆర్) టీకాలను సద్వినియోగపరుచుకోవాలని ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు అన్నారు. భీమడోలు మండలం కురెళ్లగూడెంలో ఎంఆర్ టీకాల కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. స్థానిక జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు వైద్య సిబ్బంది టీకాలు వేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ మీజిల్స్, రుబెల్లా వ్యాధి నిరోధక టీకాలను సద్వినియోగించుకోవాలన్నారు.

55 మందికి కొత్త పింఛన్ల మంజూరు..

ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులందరికీ సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని ఎమ్మెల్యే వీరాంజనేయులు అన్నారు. భీమడోలులో కొత్తగా మంజూరైన 55 మంది లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ రామతులసమ్మ, జడ్పీటీసీ కరణం పెద్దిరాజు, సర్పంచ్ పైడిమాల శిరీషయుగంధర్, ఎంపీటీసీలు శేషపు గిరి, సత్యనారాయణ, జన్మభూమి కమిటీ సభ్యులు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

గణపవరం మండలంలో.. ప్రభుత్వం పిల్లల ఆరోగ్య పరిరక్షణకు ఏర్పాటు చేసిన ఎంఆర్ టీకాలను 9నెలల నుంచి 15సంవత్సరాల్లోపు పిల్లలందరికి వేసి వ్యాధి నివారణకు సహకరించాలని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నంద్యాల మదన్‌మోహన్‌లచ్చిరాజు కోరారు. మంగళవారం గణపవరంలో ఎంఆర్ టీకా వేసే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. డాక్టర్ ఎస్.రవికుమార్‌తోపాటు టీడీపీ పట్టణాధ్యక్షుడు ఎల్ కె.శ్రీనివాసరాజు, వైస్ ఎంపీపీ సరిపల్లె శ్రీనివాసరాజు, ఎంపీటీసీ ఉన్నమట్ల సునీత, టీడీపీ మండల ప్రచార కార్యదర్శి తోట శ్రీనివాసరావు, మండల బీసీ నాయకులు రొంగల శ్రీనివాసరావు, సిహెచ్‌వో ధర్మారావు, ఎంపీహెచ్ఈవో హరి, విజయావతి పాల్గొన్నారు. పిప్పర ప్రభుత్వ వైద్య అధికారి కె.సుభాకర్ ఆధ్వర్యంలో పీహెచ్‌సీలో ఎంఆర్ టీకాలు వేశారు.

నిడమర్రు మండలంలో.. కొల్లేటి గ్రామాల్లో విద్యార్థులకు ఎంఆర్ టీకాలు వేసి వ్యాధుల నివారణకు అందరూ సహకరించాలని పెదనింద్రకొలను వైద్యాధికారి కెఎన్‌వి.హరీష్ అన్నారు. తోకలపల్లిలో ఎంఆర్ టీకాల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.కార్యక్రమంలో పి.పాండురంగారావు, యం.రత్నరాజు, సత్యనారాయణ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

గణపవరం : ఖరీఫ్‌లో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు (జేడీ) గౌసియా బేగమ్ అన్నారు. మంగళవారం గణపవరం మండలం అగ్రహార గోపవరంలో వరి పొలాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని సాగుపట్ల రైతులకు సూచనలు, సలహాలు అందించారు. నాట్లు వేసిన తరువాత తీసుకునే జాగ్రత్తలను గౌసియాబేగమ్ రైతులకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పాటంశెట్టి శ్రీనివాసరావు, ఏడీఏ మురళీకృష్ణ, శాస్త్రవేత్తలు ఎన్.మల్లిఖార్జునరావు, ఎం.గిరిజారావు, చలం, ఏరువాక కేంద్రం ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ కృష్ణంరాజు, మండల ఏవో పార్థసారథి, ఏఈవో మాధవవర్మ పాల్గొన్నారు.



గోపవరంలో రైతులతో మాట్లాడుతున్న జేడీ

నిడమర్రు : కొల్లేటి ప్రాంతాల్లో దెబ్బతిన్న వరి నాట్లను అధికారుల సూచనల మేరకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయశాఖ జేడీ గౌసీయాబేగమ్ సూచించారు. నిడమర్రు మండలం పెదనింద్రకొలనులో ఇటీవల వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు.

637 మంది కొత్త ఓటర్ల నమోదు

భీమడోలు : మండలంలో 637 మంది కొత్త ఓటర్లను నమోదు చేసినట్టు తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. జూలై 30వరకు జరిగిన ఓటర్ల నమోదు ప్రక్రియలో గుండుగొలను గ్రామంలో అత్యధికంగా 135మంది ఓటర్లు, రెండో స్థానంలో పూళ్ళ గ్రామంలో 123 మంది ఓటర్ల నమోదు చేశామని, అలాగే అత్యల్పంగా చెట్టున్నపాడులో 25మంది ఓటర్ల తమ ఓటు హక్కును నమోదు చేయించుకున్నట్టు తహసీల్దార్ తెలిపారు. నమోదు ప్రక్రియలో 637 మంది ఓటర్లలో 305 మంది పురుషులు కాగా, 332 మంది మహిళలు ఉన్నారని, 18 నుండి 21 వయస్సు గల యువ ఓటర్లు 573 మంది నమోదు చేయించుకున్నట్టు ఆయన తెలిపారు. గత ఎన్నికల లెక్కల ప్రకారం మండలవ్యాప్తంగా 46 వేల 963 మంది ఉండగా, ప్రస్తుతం ఓటర్ల నమోదుతో మండలంలో ఓటర్ల సంఖ్యలో 47 వేల 600 మంది ఓటర్లు చేరినట్టు తహసీల్దార్ తెలిపారు.

47 మంది ఉపాధ్యాయులు బదిలీలు

భీమడోలు : ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియలో మండల వ్యాప్తంగా 47 మంది ఉపాధ్యాయులు బదిలీ అయ్యారని ఎంఈవో జయలక్ష్మి తెలిపారు. ఇందులో ఎస్‌జీటీలు 43 మంది, లాంగ్వేజ్ పండిట్‌లు ఇద్దరు, ఎస్ఏ ఉపాధ్యాయులు ఇద్దరు కాగా, వీరి స్థానంలో కొత్తగా ఉపాధ్యాయుల కౌన్సెలింగ్ ప్రక్రియ ముగిసిందని, వీరంతా ప్రభుత్వ ఉత్తర్వులు అందిన వెంటనే విధుల్లో చేరతారన్నారు. బదిలీలపై వెళ్ళే ఉపాధ్యాయులను ప్రస్తుతం 50 శాతం మేరకే విధుల్లో చేరే విధంగా ఆదేశాలు పంపామన్నారు. మండలంలో రేషనలైజేషన్‌లో భాగంగా ఎంఎంపురం, పోలసానిపల్లి నెంబరు-3, భీమడోలు-4, 1 పాఠశాలల నుండి నాలుగు ఉపాధ్యాయుల పోస్టులు తొలగించినట్టు ఎంఈవో జయలక్ష్మి తెలిపారు. మంగళవారం నుంచి 90 రోజులపాటు మండలంలో రెమిడియల్ టీచింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు.


చేబ్రోలు ఎస్ఐ చావా సురేష్ బదిలీ

ఉంగుటూరు : చేబ్రోలు ఎస్ఐ చావా సురేష్ బదిలీ అయ్యారు. 14నెలల 15రోజుల పాటు చేబ్రోలు స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహించిన ఆయనను వీఆర్‌కు పంపారు. సురేష్ బదిలీ వ్యవహారమై ఆరు నెలలుగా ఊహాగానాలు కొనసాగుతుండగా ఆయనను వీఆర్‌లో పెట్టడం చర్చనీయాంశమైంది. కాగా వీఆర్‌లో ఉన్న పి.నాగవెంకట్రాజును చేబ్రోలు ఎస్ఐగా బదిలీ చేసినట్టు ఉత్తర్వులు వెలువడ్డాయి. జిల్లాలో 18మంది ఎస్ఐలను బదిలీ చేయగా అందులో ఆరుగురిని వీఆర్‌లో ఉంచారు. అలాగే వీఆర్‌లో ఉన్న నలుగురు ఎస్ఐలను వివిధ స్టేషన్లలో పోస్టులు ఇచ్చారు.

రాయితీపై కంది విత్తనాలు

ఉంగుటూరు : మెట్ట ప్రాంతంలో రైతులకు పొలం గట్లపై కందుల పంట వేసుకునేందుకు నూరు శాతం రాయితీతో ప్రభుత్వం విత్తనాలు అందిస్తోందని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉంగుటూరు మండల వ్యవసాయ అధికారి ఆర్ఎస్ ప్రసాద్ అన్నారు. మంగళవారం ఉంగుటూరు మండలం నీలాద్రిపురంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా సార్వా పంటకు సంబంధించి రైతులకు వ్యవసాయ శాఖ పలు సూచనలు చేసింది. ఈ సందర్భంగా కలుపు నివారణ, ఎరువుల మోతాదును తగ్గించడం సాధ్యమైనంత వరకు సేంద్రియ విధానానికి మెట్ట ప్రాంతంలో రైతులు మొగ్గు చూపాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో గోతం సుబ్బారావు, తాతారావు, ఎంపీఈవోలు పాల్గొన్నారు.

నేటి నుంచి పవిత్రోత్సవాలు



భీమడోలు : గుండుగొలను గ్రామంలో ఉన్న శ్రీసీతారామస్వామి వారి దేవాలయంలో బుధవారం నుంచి 5వ తేదీ వరకు వార్షిక పవిత్రోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్టీ చైర్మన్ కొండా గంగారాజుకుమార్ తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా 2వ తేదీన అంకురార్పణ, 3న పవిత్రప్రతిష్ఠ, 4న పవిత్ర సమర్పణ, 5న మహాపూర్ణాహుతి నిర్వహిస్తున్నట్టు గంగరాజుకుమార్ తెలిపారు.

చెత్త నుంచి సంపద తయారీపై అవగాహన

ఉంగుటూరు : గ్రామాలను చెత్త లేని గ్రామాలుగా తీర్చిదిద్దుతామని సంఘమిత్ర స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకురాలు, డైరెక్టర్ చోడామణి అన్నారు. మంగళవారం ఉంగుటూరులో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో వలంటీర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ గంటా శ్రీలక్ష్మీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ చోడామణి మాట్లాడుతూ తమ సంస్థ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాగస్వామ్యంతో చెత్త నుంచి సంపద కేంద్రాలను, వర్మికంపోస్టు తయారీని అభివృద్ధి చేస్తామన్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని వివిధ మండలాలకు సంబంధించి వలం టీర్లు ఆయా గ్రామాల్లోని వీధుల్లో చెత్త సేకరణపై అవగాహన కల్పిస్తారన్నారు. కేం ద్రంలో చెత్తను తడి,పొడి చెత్తలుగా విభజించి దానిని ఏ అవసరాలకు ఉపయోగించాలో వలంటీర్లకు అవగాహన కల్పిస్తామన్నారు. ఉంగుటూరు మండలంలో ఉంగుటూరు, సీతారామపురం, కైకరం, రావులపర్రు గ్రామాల్లో ఈ చెత్త నుంచి సంపద కేంద్రాల నిర్మాణం పూర్తయిందని ఇళ్ళలోని చెత్త కాకుండా రహదారుల వెంబడి ఉన్న చెత్త నుంచి కూడా సంపద కేంద్రాల నిర్మాణం పూర్తి చేశామన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి సురేష్‌కుమార్, వివిధ జిల్లాల నుంచి వచ్చిన వలంటీర్లు పాల్గొన్నారు.